లేచి కరాకరిం బెనఁగ • లీలగ, వారిటు పోర నల్కకున్
నేచి స్రవించె ఘర్మజల • బృందము నెత్తురు గ్రమ్మె మేనులన్. ౨౦

అర్థములు. పుట్ట చెండువలె=పుట్టము+చెండు=చెండువలె గుండ్రముగా లోపల గ్రచ్చకాయపెట్టి గుడ్డలతోఁ గుట్టినది. ఉడుఁబోక=వెనుదీయక, కరాకరిన్=చేయిచేయికలిసి చేయు యుద్ధము, కరాకరి వ్యతీహార బహువ్రీహి. గోపురమందున్న వాఁడును. యుద్ధప్రయత్నమున లేనివాఁడు నగుట నాయుధములు రావణుఁడు ధరించినవాఁడు కాఁడు, ఏచి=అతిశయించి. ఘర్మజలబృందము=చెమట నీళ్ళసమూహము

తాత్పర్యము

ఇట్లు విసరివేయఁగా సుగ్రీవుఁడు పుట్టచెండువలెపై కెగిరి చేతులతో వాని నేలఁ బడఁద్రోచెను. ఇట్లు త్రోచినమాత్రమున వెనుదీయక రావణుఁడు త్వరగా లేచి చేతులతో యుద్ధముచేయ నారంభించెను. వారిట్లు కోపముతో యుద్ధము చేయఁగా చెమట నీళ్ళు కాఱెను. దేహములందు నెత్తురుకొట్టెను.

ఉ. ఒండొరుమేను మేనొరయ • నుగ్రత నిల్చుచు వీతచేష్టులై
యొండొరుఁ బాసి దవ్వు చని • హుమ్మని తాఁకుచు మీఁద దూఁకుచున్
గండున ముష్టిఘాతముల • గాఢకరోగ్రతలంబులన్ నము
ద్దండతఁ బోరి రిద్దఱును • దర్ప మెలర్ప ననల్పధీరతన్ ౨౧

అర్థములు. మేను మేనొరయన్ = దేహము దేహము రాచుకొనునట్లు, వీత చేష్టులై=చేష్టలు మానినవారై, ముష్టిఘాతములన్ = పిడికిలి పోటుల, తలంబులన్=అరచేతులన్, అనల్ప=గొప్పదగు, ధీరతన్=ధైర్యముతో.

తాత్పర్యము

ఒకరిదేహ మొకరికి రాచుకొనునట్టు లేమియుఁ జేయక నిలబడుచు కొంచెము దూరము వెనుకకుఁబోయిహుమ్మని మరలఁబైబడుచుమీఁదదూఁకుచు పౌరుషమున పిడికిలిపోటుల, అఱచేతి దెబ్బలఁ జేనిద్దఱు గొప్పధైర్యము గలవారై యుద్ధముచేసిరి.

ఉ. నెత్తురు కాఱుమేనుల వ • నేచర రాత్రిచరాధిపుల్మదిన్
హత్తినరోష వేగముల • నల్లల నాడఁగ గోపురాగ్రము
న్నెత్తుగ నొండొరు న్విసరి • యేయుచు వీచుచు నెత్తివేయుచున్
దత్తఱ లేక యొండొరుఁ • దాఁచుచుఁ ద్రోచుచుఁ బెన్గులాడుచున్. ౨౨

అర్థములు. వనేచరాధిపుఁడు రాత్రిచరాధిపుఁడు = సుగ్రీవుఁడు రావణుఁడు, ద్వంద్వాంతమందలి యధిపశబ్దము రెండు శబ్దములతో నన్వయించును. ఉన్నెత్తుగ=అడుగునుండి, ఉన్ను+ఎత్తు=ఉన్నెత్తైనదని తోఁచెడిని.

తాత్పర్యము

దేహములనుండి నెత్తురు కాఱుచుండఁగా సుగ్రీవ రావణులు కోపాతిశయమున గోపుర మూఁగునట్టు లెదుటివాని నంతయు నెత్తి దబాలున విసరివైచుచును,

ఎత్తివేయుచు, తడఁబడక యొకరి నొకరు కొట్టుచుఁ బడఁద్రోయుచు, పెనఁగు లాడుచు.

కం. ఒక్కం డొక్కనిఁ జుట్టుచు, నొక్కం డొక్కరునిఁ దిగిచి ♦ యొడికంబుగఁ బై
నెక్కుచు మేనులు వంచుచు, నుక్కున నొండొకరు గదియ♦నొడిసియు గ్రన్.

అర్థములు. తిగిచి=ఈడ్చి, ఒడికంబుగ=నేర్పున, ఒడిసి=పట్టి.

తాత్పర్యము

ఒక్కని మఱియొకరుచుట్టి తిరుగుచు ఒక్కఁడు మఱియొకనిలాగి క్రిందఁ ద్రోచి నేర్పునఁ బై నెక్కుచు, దేహములు వంచుచు బలముగ నొకరి నొకరు పట్టుకొని యిరువురు ప్రక్కనుండు వగ ర్తయుండు.

కం. డొల్లిరి; వారిరువురు ధరఁ, ద్రెళ్ళక మింటికిని నెగిరి ♦ ధృతి చెడక యొకిం
తల్లన నిలిచి పెనంగిరి, మల్లాహవకుశలు లసుర ♦ మర్కటనాథుల్. ౪౧౩

అర్థములు. డొల్లిరి = పడిరి, మల్లాహవకుశలులు = మల్లయుద్ధమునందు నేర్పరులు.

తాత్పర్యము

అగడ్తలోఁ బడియు నేలఁ దగులక ముందే యిరువురు పైకి మరల గోపురము మీఁదికి నెగసి ధైర్యముతోఁ గొంచెము గాసిదీర నిలిచి, ద్వంద్వయుద్ధమున నేర్పరులైన యిరువురు మరల యుద్ధము చేసిరి.

ఉ. ఒండొరు బాహురజ్జువుల ♦ నుక్కిరి బిక్కిరిగా బిగించుచున్
దండిమగంటిమిం బులుల ♦ దారిని సింహము లట్లు మత్త వే
దండములో యనంగఁ దెగి ♦ తాఁకుచు బొమ్మున బొమ్మఁ దాఁచి యా
గండరగండ లిద్దఱును ♦ క్ష్మాయుగపత్క్రియ వ్రాలి లేచుచున్. ౪౧౪,

అర్థములు. ఉక్కిరి బిక్కిరి = ఊపిరాడ కుండునట్లు, తాఁచి = కొట్టి గండర గండలు=శూరులలో శూరులు, క్ష్మాన్=భూమియందు, యుగపత్క్రియ= ఒక్కసారిగ.

తాత్పర్యము

ఒకరి నొకరు పగ్గములవలెఁ చేతులతో నూపిరి యాడకుండ బిగించుచు, పులులవలె సింహములవలె మదపు టేనుఁగులవలెఁ దెగఁబడి తగులుచు, బొమ్మతో బొమ్మ కొట్టుచు శూరాతిశూరు లిరువురు నొక్కసారిగ నేలఁబడి లేచుచు బొమ్మతో బొమ్మ కొట్టుకొనిన వేగమునకు నిరువు రొక రటు మఱి యొకరిటు వెల్లకిలఁబడినారని భావము.

సీ. పూచిన మోదుగు ♦ బూరుగువడువున, రంజిల్లు మేనుల ♦ శ్రమము లేక
చక్రాకృతులు గాఁగ ♦ సంచరించుచు దాటి, యట్టె పై కెగిరి య♦న్యోన్యమెదిరి

భక్ష్యార్థమై పొంచు♦బావురుఁబిల్లుల, మాడ్కిని నిల్చుచు ♦ మఱియు మఱియు
సవ్యాపసవ్యాప ♦ సవ్యసవ్యంబులు, లోనుగాఁగల పెక్కు ♦ స్థానములను
తే. దిరుగుచును ముందఱకుఁబోయి♦మరలివచ్చి, వక్రగమనంబులను లఘు♦విక్రమంబు
వెలయఁబట్టుచుఁ గొట్టుచు♦విడివడుచును, బోరి రిద్దఱు సరిగాఁగ♦భూరిబలులు.

అర్థములు. చక్రాకృతులుగా = గుండ్రముగా, దీనికి మండల మని పేరు. ఇది మల్లయుద్ధ గమనములందలి భేదము. 'ఏకపాదప్రచారో యస్సచారీత్యభిధీయతే ద్విపాదక్రమణం యత్తు కరణం నామ తద్భవేత్, కరణానాం సమాయోగా త్ఖండ మిత్యభిధీయతే♦ ఖండై స్త్రిభి శ్చతుర్భిర్వా, సంయుక్తం మండలం భవే' త్తని భరత వాక్యము. ఈ గమనము లన్నియు నేఁటికిని జెట్టులు పోరునపుడు చూడవచ్చును. కుస్తీయుద్ధము ప్రబలమగుటచే మగతనము పౌరుషము దెలుపు నీ మల్లవిద్య యొండొక వినోద ప్రదర్శనమునకై వినియోగింపఁ బడుచున్నది. భక్ష్యార్థము=అప్పచ్చికొఱకు, బావురుఁబిల్లులు=గండుపిల్లులు, సవ్య+అపసవ్య+సవ్యాపసవ్యంబులు=కుడులు, ఎడమలు, కుడి యెడమలు.

## తాత్పర్యము

నెత్తురు కాఱుటచే పూచిన మోదుగుల వలె బూరుఁగుల వలెఁ గాన వచ్చుచు, అట్లున్నను గాసిలేక మండలాకారముగఁ దిరుగుచు దాఁటి పై కెగిరి పడుచు,-ఒకరినొకరెదిరించుచు తిండి పదార్థమునకై పొంచుచున్న పిల్లులవలె పొంచుచు, నిలుచుచు కుడివైపుగాఁ గొంతసేపు, ఎడమవైపుగా-కుడి యెడమ లుగాఁ గొంతసేపు తిరుగుచు, ఇట్లు నానాస్థానకముల నుండుచుఁ, దిరుగుచుఁ ముందఱికిఁ బోయి వెనుక వెనుకకు వచ్చి వంకరగాఁ బోవుచు, చులుకఁదనము పరాక్రమములు వెలయునట్లుగు పట్టుచుఁ గొట్టుచు, విడిపించుకొనుచు బలవంతు లిరువురు సమానముగ యుద్ధము చేసిరి.

కం. తిట్టుచు ధరణిం ద్రోపడ, నెట్టుచుఁ గుప్పించి మీఁద ♦ నెగయుచు ముష్టిం
గొట్టుచుఁ గికురించుచు బిగఁబట్టుచు లంఘించి లోఁగి ♦ పడుచుం బిఱుకన్.

అర్థములు. ద్రోపడన్=ద్రోవు+పడన్ =ద్రోసినట్లు, కికురించుచున్ — వంచించుచు.

## తాత్పర్యము

ఒకరి నొకరు దూషించుచు, నొకరి నొకరు నేలఁ బడఁద్రోయుచు, నెట్టుచు, కుప్పించి మీఁది కెగయుచు, నొకరినొకరు పిడికిటఁ గొట్టుచు, వంచించుచుఁ గదల కుండఁ బట్టుచు నెగిరి మరల వెనుకకుఁ బడుచు.

మ. ఇటు లన్యోన్యముఁ గీశరాక్షసధరా♦ధీశు ల్సమానోద్ధతిన్
స్ఫుటబాహాబలవృత్తిఁ బోరు నెడలన్ ♦ సుగ్రీవుఁ బౌలస్త్యుఁడు

త్కటమాయం గొని పట్టఁగాఁ దలఁపఁ ద•ద్వ్యాపాద మూహించి తాఁ
జిటికెన్ వ్రేసెడు నంతలోనఁ బ్లవగ•శ్రేష్ఠుండు దాఁటెన్ దివిన్. ౧౧౭

అర్థములు. అన్యోన్యము=పరస్పరము, ఉత్కట మాయఁగొని = గొప్ప మాయ నాశ్రయించి, తద్వ్యాపాద = ఆ ద్రోహబుద్ధి 'వ్యాపాదో ద్రోహచింతన' మ్మని యమరము.

తాత్పర్యము

ఇట్లు సుగ్రీవ రావణులు పరస్పరము సమాన బలాతిశయముచే నధికమైన భుజబల వ్యాపారముచే యుద్ధము చేయునపుడు రావణుఁడు న్యాయ్యయుద్ధంబున వీని గెలువరాదు, మాయచేసి గెలువ వలయును. అనేక రావణాకారములు చూపితినా, యెవనితో యుద్ధము చేయునది తెలిసికొనలేక తికమకలాడును అప్పుడు పట్టుకొన వచ్చు నని యాలోచింపఁగా సుగ్రీవుఁడు వాని ద్రోహబుద్ధి యూహించి తెలిసికొని యున్నట్టులే చిటాలున చిటిక వ్రేసెడు నంతలో నాకాశమున కెగసెను,

క. జితరాశి జితక్లముఁడయి, ద్రుతగతిఁ జన దాన వంచి•తుం డై రక్షః
పతి యొక్కఁడ యటఁ బ్రాసా,దతలంబున నిలిచెఁ బెంచెఁ• దప్పె నటంచున్.

అర్థములు. జితకాశి = జితేన కాశతే ఇతి జితకాశి యని వ్యుత్పత్తి. జయముచేఁ బ్రకాశించువాఁడు, ఎప్పుడు న్యాయ్యయుద్ధమందు గెలువలేక రావణుఁడు మాయచేయఁ దలఁచెనో యప్పుడే యోడిపోయె నని భావము, జితక్లముఁడు = శ్రమము లేనివాఁడు, ఇంత యుద్ధము చేయుచున్నను శ్రమము దోఁచినది కాదు. రావణునకు శ్రమము దోఁచుటచే మాయ పన్న నాలోచించెను. సుగ్రీవు నొద్ద వాలి యిచ్చిన మాలిక కలదు. దాని వలన నెంతకాలము యుద్ధము చేసినను బడలిక తోఁపదు. బలము తగ్గదు. ఇఁకఁ గొంతసేపు న్యాయ్యయుద్ధము జరిగియుండిన యెడల సుగ్రీవుఁడు రావణుని చావఁదన్ని యుండును. దానవంచితుండై = రావణుఁడు మోసగింపఁబోయి తానే మోసపోయె నని భావము.

తాత్పర్యము

జయించిన వాఁడును, బడలిక లేనివాఁడు నగు సుగ్రీవుఁడు వేగముగ రాము నొద్దకుఁబోఁగా, మోసగింపఁబోయి తానే మోసపోయి రావణాసురుఁ డొక్కఁడే మేడమీఁద కార్యము మించెను, చేసినయాలోచన తప్పిపోయెనని తలఁచుచుండెను.

చ. హరిచయనాథుఁ డీకరణి • నాహవకీర్తి గడించి యామినీ
చరపతి గాసిపెట్టి సువి • శాలనభోంగణమున్ మహాజవో
ద్ధురగతి దాఁటి వచ్చి నవ • తోయజనేత్రుని రాముపక్కఁ దా
హరివర సంఘమధ్యమున • నల్లన నిల్చె శ్రమంబు దీఱఁగన్. ౧౧౮

అర్థములు. హరిచయ నాథుఁడు=వానర సమూహమునకు రాజు, వానర ప్రభువు గావున వానరులతోఁ జెప్పిపట్టి తెండనిన వారా పని చేసియుందురు,అట్లుం

డియుఁ దానే రావణునిమీఁదికిఁబోవుట రామకైంకర్యము స్వయముగఁ జేయవలయు నను తలంపుతోనే. ఆహవకీర్తిని= యుద్ధమునందలి కీర్తిని, రావణుని జంపుటకు సుగ్రీవుఁ డొకఁడే చాలును. రామవాక్యగౌరవము వలన నూరకుండినాఁ డను కీర్తి గడించి = సంపాదించి యామినీచరపతిన్ = రాక్షసులకు రాజగు వానిని, ఇట్లు చెప్పుటచేనచ్చట యామినీచరులు మఱికొందఱుండినను సుగ్రీవుఁడు వారిని లక్ష్యము పెట్టలేదు. వారిచయనాథుఁడు కావున తనకు సమానుఁడైన ప్రభువుతో యుద్ధము చేయుట కీర్తిగాని క్షుద్రుల జయించినఁ గీర్తియేమిగలదని తలఁచెనని భావము. గాసి పెట్టి=బాధపెట్టి, రావణుని దాను జంపెదనని రామచంద్రమూర్తి ప్రతిజ్ఞ చేయుటచే దాను జంపనొల్లక బాధమాత్రము పెట్టెనని భావము. హరి=సూర్యుఁడు, యామినీ చర=రాత్రులందుఁ దిరుగు గూబలకు దొంగలకు తక్కినవారికి బాధకరుఁడే కదా! గాసిపెట్టి=న్యాయమువదలి మాయచే శత్రువును జయింపవలెనను సంకష్టస్థితికి వచ్చినవాఁడు, ఎన్నఁడెఱుఁగని శ్రమ మీనాఁడీ యుద్ధములోఁ గలిగెనని భావము. సువిశాల నభోంగణమున్=మిక్కిలి విశాలమైన యాకాశప్రదేశమున సూర్యుని వలె, ఇతఁడు హరియే కదా! మహాజవోద్ధురగతిన్ = మిక్కిలి వేగముచే నిలుకడ లైన గమనముతో, భయపడి పరువెత్తినవాఁడు తొట్రుపడుచు నానాముఖములఁ బరువెత్తును, అట్లు కాదని భావము. నవతోయజనేత్రుని=క్రొత్తగా వికసించిన తామరలవంటి కన్నులు గల వానిని, ఇట్లు చెప్పుటచే శత్రుబాహుళ్యమున్న చోటికి నొక్కఁడే పోయెనే యని ప్రేమాతిశయమునఁ గలిగిన ఆవేగముతోఁ గన్నులు విచ్చి చూచుచుండెనని భావము. ప్రక్కనిలిచెన్=రావణుని శిరస్సును తేక, పట్టుకొనిరాక, యుత్తచేతుల వచ్చి యేమి ఘనకార్యము చేసితి నని రాము నెదుట నిలఁబడుదునని సిగ్గుపడి ముఖము చూపక ప్రక్కగుంపులో నిలఁబడెను. అల్లనిల్చెన్=తా నింతపని చేసితి నని గర్వపడక ఠీవి వదలి వినయముతో, వచ్చి నది తెలియకుండు నట్లు మెల్లన కపులముందును గాదు, హరివరసంఘ మధ్యమున-వానరులఁ గుంపునడుమ నిలిచెను. హనుమంతుఁడు రావణుని యుద్ధ మునకీడ్చి తన్నవలయునని యాలోచించెను. కాని యది నెఱవేఱినది కాదు. ఇతరులఁ దన్నిన వాని కెట్లు బుద్ధివచ్చును? వానినే తన్నవలెనని తలఁచి యుండిన వాఁడు. ఈ విషయము సుగ్రీవుఁ డెఱుఁగును గావున నతనికోరిక, బమ్మెరపోతన కోరిక వాసు దాసుఁడు నెఱవేర్చినట్లు తాను నెఱవేర్చెను. మహాత్ముల సంకల్పములు వ్యర్థములు గావు. సంకల్పించిన వారా కార్యములఁ జేయఁ గారణాంతరముల వలనుపడకుండె నేని భగవంతుఁడు మఱియొకరి మూలమున దానిని నెఱవేర్చును. మహాత్ములకు సత్కార్యనిర్వహణము ప్రధానముగాని స్వకీర్త్యభినివేశము ప్రధానముగాదు.

కం. ఇయ్యనువున రావణుతోఁ, గయ్యం బొనరించి తన్నుఁ • గపులర్చింపన్
నెయ్యంబున రాఘవులకుఁ, గయ్యపుటుబ్బొనరఁ జేసెఁ•గపినాథుండున్.౧౨౦

అర్థములు. ఇయ్యనువునన్ = ఈవిధముగ, రాఘవులకును = రామలక్ష్మణులకును, కయ్యపుటుబ్బు = యుద్ధమునందు ఉత్సాహము; కపినాథుండున్ = రావణుఁ డెంత బలవంతుఁడో యేమో యను సందేహము రామలక్ష్మణుల బాధించుచుండినది. వానరనాథుఁడే వాని జయించి వచ్చినప్పుడు నరనాథులమైన మనము జయించుట కష్టమా యను ధైర్యము-ఉత్సాహము రామలక్ష్మణులకుఁ గలిగెనని భావము. రాఘవులకును గలిగించె ననుటచే వానరులకును గలిగించెనని సముచ్చయార్థము. ఒంటరిగ మన ప్రభువే యింత సాహసము పరాక్రమము చూపెనే, మనమూరకుండ వచ్చునా? అంతకు మించి, మనము చేయకుండిన మన మేటి యోధుల మని కపులకుఁ దోఁచెనని భావము. అర్చింపన్ = పూజింపఁగా, మెచ్చుకొనఁగా, నెయ్యంబునన్ = ఇంత కార్యము స్నేహభావముచేఁ జేసెను. గాని స్వప్రతిష్ఠకై కాదని భావము.

తాత్పర్యము

ఈవిధముగ రావణునితో యుద్ధము చేసి సుగ్రీవుఁడు వానరులు తన్ను మెచ్చుకొనుచుండ స్నేహభావముచే రామలక్ష్మణులకు యుద్ధమునందు ఉత్సాహముఁ గలిగించెను.

• ౧౯-వ సర్గము. శ్రీరాముఁడు సాహసము చేయవలదని సుగ్రీవునకు బోధించుట •

కం. శ్రీరామచంద్రుఁ డంతట, నా రవిసుతు మేన నున్న • యాహవచిహ్నాల్
తీరు గని యతనిఁ గౌఁగిట, నార ముదంబునను గ్రుచ్చి•యనె నిట్లంగిన్.౧౨౧

అర్థములు. ఆహవచిహ్నాల్ = యుద్ధపు గుఱుతులయొక్క-, గాయములయొక్క—తీరు = విధము—అరముదంబునను = సంపూర్ణ సంతోషముతో.

తాత్పర్యము

ఆ సుగ్రీవుని దేహమునందుఁ గానవచ్చు యుద్ధపు గుఱుతులు చూచి శ్రీరామచంద్రమూర్తి యతని నిండు సంతోషముతోఁ గౌఁగిలించుకొని యిట్లనెను.

కం. నాతో నాలోచింపక, యీ తెంపుం జేయఁ జెల్లు • నే కపినాథా!
భూతలభర్తలు స్వయముగఁ, జేతాఁకున నిట్టి పనులు•చేయఁగఁ జను నే.౧౨౨

అర్థములు. భూతలభర్తలు = రాజులు— చేతాఁకునన్ = సాహసమున— "చేతాఁకున దెప్పరంబు నేసితి గంటే" భార. ద్రో. ౨ ఆ.

తాత్పర్యము

నే నీ ప్రకారము చేయఁదలఁచితిని చేయుదునా! వలదా? యని నాతో నాలోచింపక కపిరాజా? నీ విట్టి సాహసము చేయవచ్చునా? రాజులగువారు సాహసమున నిట్టి పనులు స్వయముగఁ జేయవచ్చునా?

రాజనీతిని బట్టి సుగ్రీవుఁడు చేసినది యవివేక కార్యమే. రాజు ముందుగఁ దా నెప్పటికి యుద్ధమునకుఁ బోరాదు. ఏ కొంచెము నపాయము కలిగినను సర్వము మునిఁగి పోవును. అంగదుఁడు తాను సముద్రము దాఁటెద నన్నపుడు, రావణుఁ డింద్రజిత్తును యుద్ధమునకు బంపునపుడు, నీ నీతినే యవలంబించిరి. దీనికి సమాధానము ౯ ౫౯ పద్యంబునఁగలదు.

సీ. ఎంతటిసాహసం • బీ వొనరించితి, సాహసప్రియ! నీవు•సల్పినట్టి
కార్యంబు నన్నును • గపిసేనను విభీషణుని సందియంబున•మునుగఁ జేసెఁ
గటకట యెంతటి • కష్టకార్యం! బిట్లు, చేయకు మింక యో • జించుకొనక
యొండు నీ కేదేని • యొదవినచో సీత,తో నేమి పని భర • తుండు నేల

తే. యేల సౌమిత్రి శత్రుఘ్నుఁ•డేల యింత, యేల నా దేహ మైన నా•కేటి కయ్య
నీవు రాకకు ముందిట్లు•విశ్చయించి, నాఁడ నెఱిఁగియు నీ శక్తి•వాఁడిమగఁడ.

అర్థములు. వాఁడి మగఁడ = శూరుఁడ.-నీ వెంతటి శూరుఁడ వైనను అనాలోచిత కార్యము చేయరాదని భావము.

తాత్పర్యము

సుగ్రీవా! యేరా నీ వెంతటి సాహసము చేసితివి? సాహసమందున్న ప్రీతి కార్యాలోచనమందు లేదా యేఁగదా! యుద్ధమునకై మనము వచ్చితిమి, యుద్ధము నేను జేసితిని, ఇందేమి సాహసము గలదందువా? నీవక్కడఁ జిక్కుకొని యుండిన యెడల సీతగతి యేమి? నాగతి యేమి? ఎటుగాక శత్రుముఖమున నిలిచియున్న వారము గదా! నాగతి యెట్లయిన నగునుగాక, యీ వానరులగతి యేమి? వీరికి నాయకుఁడెవరు? నాయకుఁడు లేక వారెట్టు యుద్ధము చేయగలరు? వారందఱు మరలిపోనా? ఉండనా? మనలను నమ్మివచ్చిన విభీషణుని గతియేమి? మన మతని నుభయభ్రష్టునిఁ జేసిన వారమే కదా! నీ యొక్కని యనాలోచిత కార్యము వలన నెందఱ కెంతకీడు సంభవించి యుండునో చూడు. ఇఁక మీఁద నాతో నాలోచింపక యిటువంటి యితరులకుఁ గష్టము దెచ్చు కార్యములు చేయకుము. అక్కడ నీకేదైన నపాయము సంభవించిన నాకు సీతతో నేమి పని? భరతునితో నేమిపని? లక్ష్మణ శత్రుఘ్నులతో నేమిపని? తుదకు నా దేహమైన నాకేల? మిత్రుని శత్రుల పాలుచేసి నే నేమని జీవింతును. ప్రాణమంత తీపా? నీవు శూరుఁడవని నీ శక్తి తెలిసియు శత్రుబాహుళ్యమున నీ కపాయము కలుగునేమో యని భయపడి నీవు రాకముందిట్లు లాలోచించితిని. 'నాక్లిష్టం కీర్తయేన్నర' యను నీతి ననుసరించి నీవు వచ్చిన యెడల నని చెప్పుటకు మాట యొండు నీకేదేని యని చెప్పెను. ఏమయ్యా! నానిమిత్తమై నీ భార్యను తమ్ములను విడిచెదనంటివి. ప్రాణమే విడిచెద నంటివి. ఇది నీకుఁ దగునా? యనిన, భార్యలు కోరినంత మంది గ్రామ గ్రామంబున దొరుకుదురు. నిజమైన మిత్రుఁ డెందు దొరకును?

స్థాన బలము, దేహ బలము, సహాయ బలము, సాధన బలము గల వానితో దేహబలముతప్ప మఱి యే బలము లేనివాఁడు మిత్రుని నిమిత్తమై యుద్ధమునకుఁ బోవుట యెంత మైత్రిగలవాఁడు చేయవలసిన కార్యము? అట్టివాఁడు తన నిమిత్తమై ప్రాణము విడిచెనేని తన కెట్లాహారనిద్రాదులు సుఖమిూయఁగలవు. వాని మీఁద రుచిలేనివానికి భార్యతోడ నేమిపని? కావున భార్యయుండినను లేనిదే. భర్తలో సగముమాత్రమే భార్య. మిత్రులకుఁ బరస్పర భేద మే విషయంబునను లేదు. అట్టి యైక్యమునకే మైత్రియని పేరు. భార్య పోయినవాఁడు విధురుఁ డగుచున్నాఁడు. విధురుఁడనఁగా రక్షాభారము తొలఁగినవాఁడు, మిత్రుఁడు పోయినవాఁడు రక్షకుఁడు పోయినవాఁడు కావున, భార్యనైన వదలవచ్చునుగాని మిత్రుని వదలరాదు. భార్యలు గ్రామగ్రామమందు దొరకుదురు,తమ్ములు దొరకరు గదా! వారిని విడువవచ్చునా? "భ్రాతా స్వామూర్తి రాత్మనః" యని కలదే యనిన పుట్టఁగా భ్రాతలు, పెరుగఁగా జ్ఞాతులు, పెద్దవాఁడు సమర్థుఁడై గుణవంతుఁడై తమ యిష్టానుసారము వర్తించు చుండినయెడలఁ బిన్నలు గౌరవింతురు. అటుకాదేని విడనాడుదురు. మిత్రుఁడో యెంతటి కష్టదశయందును మిత్రుని విడనాడఁడు. కావున మిత్రుఁడే భ్రాతలకంటె శ్రేష్ఠుఁడు. అందఱు విడిచిన పిమ్మటఁ బిడిచెడు కూటి నిమిత్తమా యీ దేహరక్షణము, మిత్రుని వదలినవాఁడు మరణించినవానితో సముఁడే. కావున నీ విధముగ నాలోచించితి నని భావము.

ఉ. ఎట్టన యుద్ధభూమి నసు ♦ రేశ్వరు సాత్మజబంధుసైన్యుఁగాఁ
  బట్టి వధించి లంకకును ♦ బట్టము గట్ట విభీషణున్, మదిన్
  నెట్టన కైకయీతనయు ♦ నిల్పి స్వరాజ్యమునందు మేదిఁ బోఁ
  గొట్టఁ దలంచి యుంటిఁ గపి ♦ కుంజర యన్న హరీంద్రుఁ డిట్లనున్. ౭-౮

అర్థములు. ఎట్టన=ఏమి యాలోచించితి వనిన-సాత్మజ బంధు సైన్యుగాన్=తన కొడుకులతోను బంధువులతోను సేనలతోను గూడినవానిగా-నెట్టన = అనివార్యముగ -రూ-నెట్టనము - ఇది ద్రుతప్రకృతికము గాదు. భరతుని బలవంతపఱిచియైనను.

### తాత్పర్యము

ఏమి యాలోచించితి వందువా? వినుము. తనకుఁ దన మిత్రునకు ద్రోహము చేసినవానిని క్షమింపరాదు. కావున యుద్ధమందు రావణుని కొడుకులతో బంధువులతో సేనలతోఁ దొలుత జంపుదును. నామాట యసత్యము గాకుండునట్లు విభీషణుని లంకారాజ్యమున నభిషిక్తుఁ జేయుదును. బలవంత పెట్టియైన నాపెంత రాజ్యమున భరతుని నిలుపుదును. ఈ రెండు కార్యములు చేసి నాప్రాణములను విడువఁదలఁచితిని. అనిన సుగ్రీవుఁ డిట్లనియె. రామచంద్రమూర్తి యిట్లు చెప్పుటకు వాత్సల్యాతిశయము కారణ మని యెఱుఁగునది. నూతన శిశువును గల తల్లి దొడబిడ్డను గొంచెము దూరముగానే యుంచును గదా.

తే. అనఘ నీ భార్య దొంగిలి • వట్టి ముచ్చు, నెదుటఁ గనుఁగొని నాశక్తి • నెద నెఱింగి
యూరకయ యుండ నా మన • సొప్పునెట్లు, లనిన మెచ్చుచు లక్ష్మణు • ననియె నిట్లు.

అర్థములు. ముచ్చున్ = దొంగను—నా శక్తి = నాకు గల బలము — వాలిచే దెబ్బతిని రావణుఁడు కిష్కింధలో నెల దినము లుండెను. వాని బల మే మాత్రమో సుగ్రీవుఁ డెఱుఁగును. అది గాక యింద్రదత్తహారబలము గలదు.

### తాత్పర్యము

పుణ్యాత్మా! నీ వంటి వాని భార్యను దొంగిలించిన దొంగను, నెదుట కీళితో సంకట చూచి నాశక్తి యే మాత్రమో తెలిసి పరాభవము లేదని నిశ్చయము గలఁవాడ నయ్యు నెట్లూరక చూచుచుండగలను? అనిన నతని నిష్కపట స్నేహ భావమునకు సంతోషించినవాఁడై శ్రీరామచంద్రమూర్తి లక్ష్మణునితో నిట్లనియె.

### —• శ్రీరాముఁడు లక్ష్మణునకు శకునంబులఁ దెలుపుట •—

క. ఫలవంతము లగు వనముల, కలిమియు శీతోదకమును • గలతావులలో
బలముల నిలుపుచు మొగ్గర,ములు పన్నఁగ వలయుఁ జుమ్ము • మునుకొని యనుజా.

అర్థములు. ఫలవంతములు = పండ్లు విశేషించిన, ప్రాచుర్యార్థంబున మతుప్పు. శీతోదకమును = చల్లనీళ్ళు, బలములను = సేనలను, మొగ్గరములు = వ్యూహములు, మునుకొని=ముందుగా, అనుజా=తమ్ముఁడా!

### తాత్పర్యము

మన సేనల వారికిఁ దిన నాహారము పండ్లు, గడ్డలులోనైనవి దండిగాఁ గల వనములందు దప్పితీరఁ ద్రావుటకుఁ జల్లని నీళ్ళుగల ప్రదేశములందు వారిని నిలిపి మనము వ్యూహము లేర్పాటు చేయవలయును.

చ. బలిముఖ ఋక్ష రాక్షస ని • బర్హణమున్ భృశభీతిదంబు నా
ప్రలయము లోకనాశక • రంబుగఁ దారసిలెం బరాగముల్
బలియఁగ వాయువుల్ విసరెఁ • బర్వతశృంగములున్ వణంకె నీ
యిల చలియించె నేలపయి • వృక్షచయంబులు వ్రాలెఁ గంటివే. ర. ౧౨

అర్థములు. బలిముఖ= వానరులయు, ఋక్ష = ఎలుగులయు, రాక్షస = రాక్షసులయు, నిబర్హణమున్ = మరణము కలిగించునది, భృశ = మిగుల, భీతిదంబు = భయము గలిగించునది. ప్రలయము = అపాయసూచకమైనది, లోకనాశకరంబుగన్=విశేషజన నాశనము సూచించునదై, తారసిలెన్=తటస్థించెను, పరాగముల్=ధూళులు, బలియఁగన్=అతిశయింపఁగా.

### తాత్పర్యము

వానరులకు ఎలుఁగులకు, రాక్షసులకు నాశము దెలుపుచు మిగుల భయము గలిగించు ప్రలయచిహ్నములు కానవచ్చుచున్నవి చూచితివా? అవి యేమందువా?

విస్తారముగ దుమ్ముల రేఁచుచు వాయువు విసరెను. కొండల శిఖరములు వణఁకెను, భూమి కంపించెను, చెట్ల సమూహములు నేల విఱిఁగి పడెను.

తే. భయదమాంసాదనిభములఁ ♦ బరుషములును
బరుషరవములఁ గ్రూరముల్ ♦ వారివాహ
నిచయములు ఘోరభంగిని ♦ నెత్రుతోడి
వృష్టిఁ గురియించె నుత్పాత ♦ హేతుకముగ. ౪-౨౮

అర్థములు. భయద = భయంకరములైన, మాంసాద = మాంసము దిను మృగ పక్షులతో, నిభములు = సమానములైన యాకారములు గలవి, పరుష ముల్ = క్రూరములైన యాకారములు గలవి, పరుషరవములు = వినుటకుఁగటువు లైన ధ్వనులు గలవి, క్రూరముల్ = క్రూరకార్యముల సూచించునవి, వారివాహ = మేఘములయొక్క - నిచయములు = సమూహములు - ఘోరభంగిని = భయంకరరీతిగా - నెత్రుతోడి వృష్టిన్ = నెత్తురు నీళ్ళు కలిసిన వానను - ఉత్పాతహేతుకముగన్ = అశుభసూచకముగ.

తాత్పర్యము

భయంకరములైన మాంసములనుఁదిను గ్రద్దలేగ మొదలైనవానిరూపములు గలవియు, క్రూరములైన యాకారములు గలవియు, కఠోరధ్వనులు గలవియుఁ గ్రూరకార్యముల సూచించునవియు నగు మబ్బుల గుంపులు రక్తముతోఁ గలసిన నీళ్ళ వాన గురియించి మిక్కిలి యశుభమును సూచించుచున్నవి.

సీ. కుంకుముడాలున ♦ ఘోరమయ్యెను సంధ్య, సూర్యునం దొకనల్ల ♦ చుక్కదోఁచె
మార్తండునందుండి ♦ మండుచు నొక యగ్ని, మండలం బిల వ్రాలె ♦ దండి తార!
మృగములుఁ బక్షులు ♦ నెల్లెడ దీనస్వరముల ఘోషించెను ♦ రవిని జూచి
నిజతేజ మిడియుంగ ♦ నిశలందుఁ జంద్రుఁడు, నలుపును నెఱుపును ♦ గలయఁ గొనను

తే. విలయకాలంబునను బోలె ♦ వికటముగను,
దాపమును గూర్చుచున్నాఁడు ♦ ధరణికెల్ల
గుడుసు హ్రస్వంబు రూక్షంబు ♦ ఘోరమగుచు
వెలయుచున్నది యర్ధాని ♦ విధముఁ గంటె. ౪-౨౯

తాత్పర్యము

౪౧౧ వ పద్యము చూచునది.

చ. మలినములౌచుఁ దారకలు ♦ మానవ లోకవినాశ మియ్యెడన్
దెలిపెడిఁ, గాక గృధ్రములు ♦ దేఁకువ గల్గిన డేగ లెంతయో
నలుపపుఁబక్షులుం దఱుమ ♦ నారట మందెడి, నక్క లెయ్యెడన్
గలయఁగఁ బర్వి భీకరము ♦ గా రొదసేసెడిఁ గీడు దెల్పుచున్. ౪౩౦

తాత్పర్యము ౪౧-౨ వ పద్యము చూచునది.

## —• శ్రీరాముఁడు సువేలాద్రి డిగి లంక ముట్టడించుట •—

సీ. లక్ష్మణ! యిప్పుడ • లంకను బలముతోఁ, జని ముట్టడించుట • చను నటంచు
నగము తూర్ణము డిగి•నగచరవరు లెల్లఁ, గన వారి కుత్సాహ•కారణముగఁ
బౌరుష వాక్యము • ల్పలికి కాలజ్ఞుండు, కౌసలేయుఁడు కీశ • గణముతోడ
లంకాభిముఖుఁ డయి•శంక లేక రుగంగ, వానర రాక్షస • వల్లభులును
తే. పావమానిసుమిత్రాత్మ•భవుఁడు నలుఁడు, జాంబవంతుండు నీలుండుఁ•జనిరితోడ
వారి వెంట ధరారుహ•ధారిణీధ్ర,తతులు ధరియించి కప్యచ్ఛ•దళములరిగె. ౪౩౧

అర్థములు. ఇప్పుడ=రాక్షసులకు నాశము సూచించు నీ సమయమందే-నగము = కొండ = సువేలాద్రి, తూర్ణము = వెంటనే - కాలజ్ఞుండు = ఏకాలమున నెటు ప్రవర్తింపవలయునో తెలిసినవాఁడు-శకునములఁ దెలిసినవాఁడు, ధరారుహా=చెట్లయొక్కయు-ధారిణీధ్ర=పర్వతములయు, తతులు = సమూహములు - కపి+అచ్ఛ+దళములు=వానరులయు భల్లూకములయు సేనలు.

### తాత్పర్యము

లక్ష్మణా! రాక్షసుల కనిష్టసూచకములు కానవచ్చు సమయమునందే మనము సేనలతోఁ బోయి లంకను ముట్టడింపవలెను, అని వెంటనే వానరులందఱు చూచుచుండ వేగముగఁ గొండ దిగి వానరులారా! యివి రాక్షసులకు నపజయము కలిగించు శకునములు కానవచ్చుచున్నవి. ఈ సమయమునందే పోయి లంకను ముట్టడించితిమా యల్పకాలములో రాక్షసులను లంకను నుగ్గునూచము చేయవచ్చును. మీకు రాఁగల యపాయము లేదు. మీ కపాయము రాకుండ నేను గాపాడెదను. రండు లంకను ముట్టడి వేయుదము. ఏమగవాఁడు మనయెదుట వచ్చి నిలచి ప్రాణముతోఁ బోవఁ గలఁడో చూతమని వారి కుత్సాహము గలుగ సమయోచితముగఁ బౌరుష వాక్యములు పలికి రామచంద్రమూర్తి వానర సమూహముతో లంక కెదురు ముఖమై మనము పోవునది యుద్ధమునకే, యెట్లగునో యను విచారము లేక స్వగ్రామమునకు బోవువానివలె బోవుచుండ సుగ్రీవ విభీషణ లక్ష్మణ హనుమంతులు నల నీల జాంబవంతులు వెంటనంటి పోయిరి. వారి వెనుక వానరసేనలు కొండలు చెట్లు ధరించి పోయెను.

ఆ. దీర్ఘకాల మరిగి • ధీరులు భ్రాతలు, వనవిరాజితంబు•ధ్వజయుతంబు
యోధదుర్జయంబు • నున్నత ప్రాకార, తోరణంబు త్రిదశ•దుర్గమంబు. ౪౩౨

అర్థములు. దీర్ఘకాలము=చాలా సేపు, కొండమీఁదినుండి కొండమీఁదికి గంతు వేయుటకు నెక్కువకాలము పట్టదు. కొండదిగి నేలనడచి మరల గొండ యెక్కి-పోవుటకు నంతకంటె నెక్కువకాలము పట్టునుగదా, వనవిరాజితంబు=వనములచే, ప్రకాశించునది, ధ్వజయుతంబు=ధ్వజములతోఁ గూడినది, యోధదుర్జయము =

యుద్ధమున వీరులకు కష్టసాధ్యమైనది. ఉన్నత =ఎత్తైన, ప్రాకారతోరణంబు = కోట గోడలు, ద్వారములు గలది, త్రిదశదుర్గమంబు=దేవతలకు నణఁపరానిది.

తా త్ప ర్య ము

ఈ ప్రకారము ధీరులగు రామలక్ష్మణులు కాలినడకన దీర్ఘకాలము పోయి వనములచేఁ బ్రకాశించునదియు ఒక్కొ-ము లెగురుచుండునదియు యోధులు కష్టమునఁగాని జయింపరానిదియు, నెత్తైన కోటగోడలు ద్వారములు గలదియు దేవతలకు నణఁపరానిదియు.

ఆ. చేరిముట్టడింపఁ♦జేసి వానరసేనఁ, బురముచుట్టు నిలుప♦భూరిబలులు
ప్లవగవరులు రామ♦వాక్య చోదితులయి, నియతదేశములను♦నిలిచియుండ.

తా త్ప ర్య ము

అగు లంకాపురమును సమీపించి దానిని వానరసేన లోపలివారు వెలుపలికి రాకుండునట్లు చుట్టుకొనునట్లు నియమింపఁగా రాముని యాజ్ఞప్రకారము వారివారి ప్రదేశములందు వారువారు నిలిచియుండఁగా; ఏ యే గవని వాకిండ్ల కెదురుగా నెవరెవరు నిలువవలయునని ముందేర్పాటు చేసెనో యాప్రకారమని భావము.

తే. శైలకూటంబు పోల్కి-ను♦చ్చంబునైన, యుత్తరద్వారమును♦భ్రాతృ
యుతుఁడగుచు
రాముఁ డరికట్టె నచ్చట♦రావణుండు, తత్పురీరక్షణాసక్తిఁ♦దగవసించె. ౪౩౪

అర్థములు. శైలకూటము = కొండశిఖరము, ఉచ్చంబు=ఎత్తైనది, అరికట్టెన్=అడ్డగించెను.

కొండశిఖరమువలె నెత్తైన యుత్తర ద్వారమును రామచంద్రమూర్తి లక్ష్మణునితోడ నడ్డగించెను. ఆ ద్వారమునందే రావణుఁడు, పురరక్షణము నిమిత్తము కాపుండెను.

చం. వరుణుఁడు కాచు సాగరము♦భంగిని రాక్షసనేత యున్న యు
త్తరదిశ ద్వారమాఁగుటకు♦దాశరథుం డొకరుండు దక్క-నె
వ్వారు వలఁతు? ల్భయంకరులు♦వాలుమగల్ దృఢవిక్రమాఢ్యులా
శరవరు లోలిఁ గావ బలి♦సద్మము దానవులట్టు లుగ్రులై. ౪౩౫

అర్థములు. సాగరము=సముద్రము, రాక్షసనేత = రాక్షసరాజు, ఆఁగుటకున్ = అడ్డగించుటకు, దాశరథుండు = రామచంద్రమూర్తి, ఇది సంబంధార్థకాణ్ప్రత్యయాంతము. తస్యేయం; వలతుల్=సమర్థులు, వాలుమగల్=శూరులు, ఆశరవరులు=రాక్షస శ్రేష్ఠులు, బలిసద్మము=రసాతలము.

తా త్ప ర్య ము

వరుణుఁడు సముద్రమును రక్షించు నట్లు రావణుఁడు కాచుచున్న యుత్తర ద్వారమును నడ్డగింప రామచంద్రమూర్తి తప్ప మరి యెవ్వరు సమర్థులు గారు

ఏలన నా ప్రక్కనే భయంకరులైన శూరులు దృఢమైన పరాక్రమముగల రాక్షసులు చక్కఁగా రసాతలమును బలివలెఁ గాపాడుచున్నారు.

తే. ద్వారనికటస్థ వేదికా • తతులమీఁద, యుద్ధసక్త భటాళుల • కుపకరింప
వివిధకవచాయుధంబులు•విపులముగను,నించియుండఁగ రాముఁడుగాంచెనపుడు.

అర్థములు. ద్వారనికటస్థ = ద్వారమునకు సమీపమందున్న - వేదికా తతుల మీఁదన్=అరుఁగుల సమూహముల మీఁద - యుద్ధసక్తభటాళులకున్ = యుద్ధముచేయు భటులకు-ఉపకరింపన్=ఉపయోగపడుటకై.

తాత్పర్యము

గోపురద్వారమునకు సమీపమందున్న తిన్నెలమీఁద యుద్ధముచేయు భటులకు చెడిపోయినవాని బదులు మరల ధరించుకొనుటకుగా నుపయోగపడుటకై నానావిధములైన కవచములు-ఆయుధములు దండిగ నించియుండఁగా శ్రీరామచంద్రమూర్తి చూచెను.

క. ప్లవగచమూపతి నీలుఁడు, ద్వివిదుఁడు మైందుండు నరుగు • దేరఁగఁ దోడై
దివిజేంద్రాశాద్వారం, బవిరళసైన్యంబుతోడ • నరికట్టె వెసన్. ౪౩౮

ప్లవగచమూపతి = వానరసేనానాయకుఁడు, దివిజేంద్రాశాద్వారంబు = తూర్పుదిక్కు-ద్వారమును, అవిరళసైన్యంబుతోడన్=దట్టమైన సేనతో.

తాత్పర్యము

వానర సేనానాయకుఁ డగు నీలుఁడు తనకు మైందద్వివిదులు తోడుగా రాగా లంకాపురము తూర్పుద్వారమును నడ్డగించెను.

క. దక్షిణపుగవని నాఁగెగ, వాక్షర్షభ గవయ గజస • మన్వితుఁడై హ
ర్యక్షపరాక్రముఁ డంగదుఁ,డక్షీణబలుండు నిజబ • లావళితోడన్. ౪౩౯

అర్థములు. హర్యక్షపరాక్రముఁడు=సింహము పరాక్రమమువంటి పరాక్రమము గలవాఁడు.

తాత్పర్యము

గజగవయగవాక్ష ఋషభులు తనకు సహాయులుగా రాఁగా సింహవిక్రముఁడై గొప్ప బలము గల యంగదుఁడు తన సేనతో దక్షిణపు గవని నడ్డగించెను.

సీ. ప్రఘసప్రమాథులన్•పటువిక్రములఁ గూడి, పశ్చిమద్వారంబు•పవనసూతి
కాచె సుగ్రీవుండు • గరుడానిలోపము, వేగులతో గుల్మ•వీధి నిలిచెఁ
ధరణిసుతుం డున్న • తావున ముప్పది, యాఱుకోట్లగచరు • లమరి రంత
గవని కొక్కొంటికి • గవివరు లొక్కొక్క, కోటి నిల్చిరి లంక•కోటఁ జుట్టి

తే. ఋక్షనాయకు యుక్తుఁడై • యనతితనయుఁడు
మధ్యమున రామునకుఁ బడ • మటను నిల్చె
యుద్ధకాంక్షను వానర • యోధులెల్ల
వివిధ సన్నాహములతోడ • వేచి రపుడు. ౪౪౦

### తాత్పర్యము

ప్రఘసుఁడు ప్రమాథి యను వారలు సహాయులుగా నాంజనేయుఁడు పశ్చిమ ద్వారము నడ్డగించెను. గరుడ వేగముతోను వాయువేగముతోను సమానమైన వేగము గలవారిని సహాయులుగాఁ దీసికొని సుగ్రీవుఁడు మధ్యమందుండెను. సుగ్రీవుఁ డున్నచోట ముప్పది యాఱుకోట్ల వానరు లుండిరి. ఒక్కొక్కనికి నొక్కొక్క కోటి వానరులు నిలిచిరి. జాంబవంతునితోడ సుగ్రీవుఁడు రామచంద్రమూర్తికిఁ బడమటవైపు, అనగా కుడిప్రక్క నిలిచెను. ఇట్లు నిలుచుటచేత పడమటివైపు ఉత్తరపువైపు సుగ్రీవునకుఁ గానవచ్చుచుండును. హనుమంతున కెదురుగ నింద్రజిత్తు రామచంద్రమూర్తి కెదురుగ రావణుఁ డుండుటచేసి రెండువైపులఁ దాఁకు డెక్కువగా నుండునని యిరువురకు నడుమ సుగ్రీవుఁడు నిలిచెను. ఎప్పుడెపుడు యుద్ధమున కారంభింతుమా యని తగిన సాధనములతో వానరులు కాచియుండిరి.

సీ. వికృతలాంగూలురు • వికటదంష్ట్రాయుధుల్, వికృతచిత్రాంగులు • వికృతముఖులు
దశనాగసత్త్వులు • దశగుణోత్తర బలుల్, బదినూర్ల గజముల • బలమువారు
నోఘసత్త్వులును శ • తౌఘసత్త్వులు నప్ర, మేయబలాఢ్యు ల • జేయబలులు
గాఁ బెక్కువిధములఁ • గపివీరు లొప్పిరి వారి సేనలు మూఁగు • తీరు చూడ
ఆ. శలభసమితి కవియు • చందంబుగా దోఁచె మిన్ను మన్ను ఛేద • మెన్న రాక
కోట్లకొలది కపులు • కోటవాకిలి దాయఁ గోట్లకొలది వెనుక • గూడియుండ్రు.

అర్థములు. వికృతలాంగూలురు = పైకెత్తిన తోఁకలుగలవారు. వికటదంష్ట్రాయుధుల్ = మిట్టపల్లములైన కోఱ లాయుధములుగఁ గలవారు. వికృతచిత్ర + అంగులు = వికృత = కోపముచే నెఱ్ఱనైన ముఖములు కన్నులు గలవారు, గనుక నే- చిత్ర = చిత్రవర్ణమైన, అంగులు = అవయవములు గలవారు - వికృత ముఖులు- రాక్షసులకు భయము గలిగింప వికారముగఁ జేసికొన్న ముఖములు గలవారు- దశ నాగ సత్త్వులు = పదియేనుఁగుల బలముగలవారు- దశగుణోత్తరబలుల్ = నూఱేనుఁ గుల బలముగలవారు- ఓఘసత్త్వులును = ఓఘసంఖ్యగల యేనుఁగుల బలము గల వారు. శతౌఘసత్త్వులు = నూఱు ఓఘముల యేనుఁగుల బలము గలవారు. అప్రమేయ బలాఢ్యులు = ఇంతని పరిమాణము చెప్పరాని బలము గలవారు. అజేయబలులు = జయింపరాని బలముగలవారు- శక్యార్థమున జేయ శబ్దము భారతంబునఁ బ్రయోగింపఁబడినది. మూఁగుతీరు = గుంపుగూడువిధము - శలభసమితి = మిడుతల గుంపు.

### తాత్పర్యము

తోఁక లెత్తుకొనినవారు మిట్టపల్లముల కోఱలవారు కోపముచే నెఱ్ఱనైన ముఖము కన్నులు నవయవములు గలవారు, పది, నూఱు, వేయి యేనుఁగుల బలము గలవారు, ఓఘము సంఖ్యగల యేనుఁగులఁ బలము గలవారు, అంతకు నూఱంతలు

బలముగలవారు, కొలఁది చెప్పరాని బలముగలవారు, జయింపరాని బలముగలవారు, ఈవిధముగ ననేక విధములు గల వానరు లొప్పిరి. వారి గుంపుచేరు విధము చూడఁగా భూమి యాకాశములు తెలియరాకుండ మిడుతల దండు ముసరునట్లుం డెను. కోట వాకిలి బ్రద్దలుగొట్టి లోపలఁ దూఁకుటకై కోట్లకొలఁది కపులు వాకిటి సమీపమునకు రాఁగా వారికి వెనుక కోట్లకొలఁది కపులు సిద్ధముగా నుండిరి.

కం. కరువలికైనియు లంకం, జొరరాకుండగ వనాట • శూరతతి గిరుల్
  ధరణీరుహములు కేలన్, ధరియించి పురంబుజుట్టి • దర్ప మెలర్పన్. ౧౪౧

అర్థములు. కరువలి = గాలి-వనాట = క్రోఁతుల - ధరణీరుహములు = చెట్లు.

తాత్పర్యము

గాలికైనను లంకలోనికిఁ బోవుటకు సందులేకుండునట్లు వానరవీరుల గుంపులు చేతులందుఁ గొండలు చెట్లు ధరించి బలగర్వముచే లంకను జుట్టు ముట్టడించి యుండెను.

సీ. శక్రసికాశప • రాక్రమయుక్తమై, మేఘసంకాశ మై • మెఱయు చున్న
  వృక్షాటసైన్యంబు • వీక్షించి రాక్షసు, లబ్బురపాటున నదరి • రెదల
  వేల విరిసిన కంధి • వెల్లి పాఱెడునట్లు, వారలు ఐడ కేర • భూరిరవము
  పురమునం దంతయు • బోరుకొనెన్ లంకఁ, బ్రాకారతోరణ • రాజితోఁడ
తే. సావనీధరవన మయి • జలదరించె, రామలక్ష్మణసుగ్రీవ • రక్షితాగ
  చరచమూసంఘమది సురా • సురులకైనఁ దేరిచూడఁగ రాకుండఁ • దేజరిల్లె.

అర్థములు. శక్రసికాశ = ఇంద్రుని పరాక్రమముతో సమానమైన- 'నిభ సంకాశ నీకాశ ప్రతీకాశోపమాదయ' యని యమరము. పరాక్రమ యుక్తమై = పరాక్రమముతోఁ గూడినదై-వృక్షాట సైన్యంబు = వానరసేన, వేల = చెలియలికట్ట - వెల్లి = ప్రవాహము - బోరుకొనెన్ = ధ్వనించెను - స + అవనీధర + వనము = పర్వతములతో వనములతోఁ గూడినది - జలదరించెన్ = వణఁకెను. రక్షిత = కాపాడఁబడుచున్న - అగచర + చమూ సంఘము = వానర సేనా సమూహము.

తాత్పర్యము

ఇంద్రుని పరాక్రమము గలదై మేఘములవలె సర్వత్ర యావరించినదై యున్న వానరసేనను జూచి రాక్షసులు నబ్బురపోయి గుండె లదర తబ్బిబ్బైరి. చెలియలికట్టను విఱుగఁదీసికొని సముద్రము ప్రవాహముగాఁ బాఱినపుడు పుట్టెడు ధ్వనివలె వానరులు నడచి వచ్చు గొప్పధ్వని లంకానగరమునందంతయు ధ్వని పుట్టఁజేసెను. కోట గోడలతోను వాకిండ్లతోను లంక కొండలతో వనములతో

గడగడలాడెను. రామలక్ష్మణ సుగ్రీవులచే రక్షింపఁబడు వానరసేన దేవతలకు నసురులకైనఁ గన్నెత్తి చూడరాకుండఁ బ్రకాశించుచుండెను.

ఉ. ఈ విధి నాత్మసైన్యములు • నెల్ల సమర్థములైన తావులన్
దా విడియించి మంత్రిజన • తాసహితుండయి మంత్ర ముండి నీ
తావిభు దర్హకృత్యము వి • ధంబు దలంచి సునీతివేదిర
క్షోవిభు సమ్మతిం బడసి • శుద్ధమతి న్నృపధర్మ మెంచుచున్. ౧౪౩

అర్థములు. మంత్రిజనతా = మంత్రిజనసమూహము — సునీతివేది = మంచి నీతిపద్ధతి తెలిసినవాఁ డగు - రక్షోవిభు = విభీషణుని యొక్క - నృప ధర్మము = రాజధర్మము — మంత్రముండి = ఆలోచన చేసి — ఇప్పుడు చేయఁదగిన యాలోచన యేమన: దండెత్తివచ్చిన రాజు తన శత్రురాజునకు "ఇదిగో నేనీనిమిత్తముగ నీమీఁదికి దండెత్తి వచ్చితిని, సంధికి వచ్చెదవా? రా! యుద్ధమునకు వచ్చెదవా? రా! యని చెప్పి పంపుట. ఇది రాయబారము. ముందు చెప్పక యుద్ధమారంభించిన నేమఱించి నట్లగును. అది ధర్మయుద్ధము కాదు. ఈ రాయబారమున కెవరిని పంపుదమా యని యొక యాలోచన—శత్రుబల జ్ఞానము లేకున్నప్పుడు ధీరుఁడుగానుండినను శత్రుబాహుళ్యముచూచి యుద్ధ మనర్థకరమని తలఁచి శరణాగతుఁడయ్యెనేని లంకారాజ్యము రావణునకియ్యవలెనా? విభీషణున కియ్యవలెనా? యని రెండవ యాలోచన.

### తాత్పర్యము

ఈ ప్రకారముగఁ దన సేనలనెల్లఁ దగిన స్థలములందు నిలువఁజేసి మంత్రి జనములఁగూడి యిఁకఁ జేయవలసిన కార్యముల నాలోచించి రాజనీతి యెఱింగిన రామచంద్రమూర్తి నీతివేత్తయగు విభీషణు నంగీకారముదీసికొనినిర్మలమనస్కుఁడై.

## —• అంగదు రాయబారము •—

క. వీరుని వాలిసుతుం గని, శూరా! లంఘించి లంకఁ • జొచ్చి దశాస్యుం
జేరి మదుక్తిగ ననుమీ, భీరహితుఁడ వగుచు నీదు • పేరిమి వెలయన్. ౧౪౪

అర్థములు. మదుక్తిగన్ = నేను చెప్పినట్లుగ, భీరహితుఁడవు = భయము లేనివాఁడవు, నేను చిన్నవాఁడనే, శత్రువులలోనికి నొంటిగ నెట్లుపోదును? రావణుఁ డేమి చేయునో యని భయపడక, పేరిమి=గొప్పతనము, ఆలోచన పర్యవసానము చెప్పఁబడుచున్నది.

### తాత్పర్యము

వీరుఁడగు నంగదునిఁజూచి హనుమంతుఁడు మరలఁ బోవుట సరిగాదు. అతనికి రెండవవాఁడితఁడేయని యాలోచించి రామచంద్రమూర్తి యిట్లనియె. శూరుఁడా! కోట గోడ దాఁటి లంకఁ బ్రవేశించి రావణు సమీపించి వాని భయము విడిచి నీ గొప్పతనమునకుఁ దగినట్లు నేను చెప్పితినని నా మాటలుగా నిట్లనుము.

సీ. ఓరి భ్రష్టశ్రీక • యోరి గతైశ్వర్య, యో నష్టచేతన • యో ముమూర్షు,
గర్వమోహంబులఁ • గావించితివి ద్రోహ, మప్సరోగంధర్వ • యక్షనాగ
నిర్జర ఋషి రాజ • నిచయంబులకు నీవు, బ్రహ్మవరంబు కా • వరము దీఱు
కాలంబు ఘటియిల్లెఁ • గాంతాహరణకర్శి, తుండను దండధ•రుండువోలె

ఆ. నీకు శాస్తి సేయ • నీ లంక వాకిట, నిలచియున్న వాఁడ • నిశిచరేంద్ర!
యేమిబలము నమ్మి•యింతి మాయ హరించి, తట్టి బలముఁజూప•నరుగుదెమ్ము.

అర్థములు. భ్రష్టశ్రీక = రాజ్యలక్ష్మినుండి భ్రష్టుఁడవైన వాఁడా! సమీప భవిష్యత్తునకు భూతము, గత+ఐశ్వర్య=ఐశ్వర్యము తొలఁగినవాఁడా! రాజ్యసంపదపోయినను ధనధాన్య సంపత్తి యుయిన నుండుట గలదు. నీకదియు లేదు, నష్టచేతన=ప్రభుత్వము లేకపోయినను ధనము లేకపోయినను బుద్ధియైన నుండవచ్చును, అదియు లేనివాఁడా! ముమూర్షు = చావనున్నవాఁడా! తెలివి లేకపోయినను ప్రాణముతోనైన నుండవచ్చును. నీకదియు లేదు. గర్వమోహంబులన్=బ్రహ్మవరము కల దను పొగరుచేతను, పొగరువలన యథార్థజ్ఞానము నాశమగుటను, బ్రహ్మవరము కావరము=బ్రహ్మవరముగల దను పొగరు, తీరు = క్షయించు, కాంతాహరణ కర్శితుఁడను=భార్య యపహరింపఁబడుటచే కృశించిన వాఁడను, దండధరుఁడువోలెన్=యమునివలె, శాస్తి=శిక్ష.

తాత్పర్యము

ఓరి రాజ్యలక్ష్మి భ్రష్టుఁడా! ఓరి యైశ్వర్య భ్రష్టుఁడా! ఓరి బుద్ధిహీనుఁడా! ఓరి యాసన్న మరణుఁడా! బ్రహ్మవరము కలదను పొగరుచే జ్ఞానహీనుఁడవై అప్సరసలకు, గంధర్వులకు యక్షులకు, నాగులకు, ఋషులకు, రాజసమూహమునకు ద్రోహముచేసితివి. నీ కా బ్రహ్మవరము పొగరు నశించుకాలము ప్రాప్తించినది. వారికి నేను ద్రోహముచేసినవారు నన్ను దండింపవలె, నీ వేలవచ్చితివందువా? నీవు నా భార్యను హరియించుటచే నా శోకమున బాధపెట్టితివి. కావున నిన్ను దండించుటకై నీ లంకవాకిట యమునివలె వచ్చియున్నాఁడను, ఓరి రాక్షస రాజా! యాఁడుదానిని నేమి బలము నమ్మి మోసగించి తెచ్చితివో యా బలముఁ జూప రారమ్ము.

కం. ఆశరనాయక దురమున, నా శరముల నీల్గి నీవు • నాకుల రాజ
ర్షిశమహర్షుల పదవి ని, వేశంబుగఁ గొనక పోవు•వీరుఁడ వేనిన్. ౭౨

అర్థములు. ఆశరనాయక = రాక్షసరాజా! దురమునన్ = యుద్ధమందు, శరములన్=బాణములచే, నీల్గి = చచ్చి, నాకుల = దేవతలయు, రాజర్షి శ, మహర్షుల=రాజఋషి శ్రేష్ఠులయు, మహర్షులయు, నివేశంబుగన్=స్థానముగ.

తాత్పర్యము

రాక్షసరాజా! నీవు వీరుఁడవై యుద్ధమునకు వచ్చితివా రమ్ము, నా బాణ

ములచేఁ జచ్చి పూతపాపుఁడవై దేవతలు రాజర్షులు మహర్షులుండు లోకమునకుఁ బోఁగలవు.

కం. కావేని సీత మరలం, గావర మఱ నిచ్చి శరణుఁ • గాంచుము, కాదేన్
నే వెస లోక మరాక్షస, మై వెలయఁగ జేయువాఁడ • నాశుగ తతులన్. ౨౨౭

తాత్పర్యము

అటు చేయుట నీకు సమ్మతిముగాదేని గర్వము వదలుకొని సీతను మరల నిచ్చి నా శరణు చొరుము. ఈ రెంటిలో నేదో యొకటి చేయక పోయితివా నా బాణములచే లోకమున రాక్షసులను వారు లేకుండఁ జేయుదును. నీ వొక్కఁడవు నెపముగా రాక్షసవంశమే నాశమగును. నీవు శరణాగతుఁడవైతివా బ్రదుకుదువు. రాక్షసులందఱు బ్రదుకుదురు.

తే. ధర్మచిత్తుండు రాక్షస • తతికరిష్ఠుఁ, డగు విభీషణుఁ డిల నన్ను • నాశ్రయించె
నితఁడు శ్రీమంతుఁ డొందెలం • కేశ్వరత్వ, మసుర! నిష్కంటకముగ ని • త్యంబుగాఁగ.

తాత్పర్యము

నీవు శరణాగతుఁడవు కాకపోయితివా నీకు లంకా రాజ్యముగూడ దక్కఁదు. అది యేల యందువా? ధర్మచిత్తుండు=ఇది మొదటి కారణము. రాజ్యము ధర్మాత్ముఁడు పాలింపవలయును గాని యధర్మచిత్తుఁడు పాలింపరాదు. నీ వధర్మ చిత్తుఁడవు కావున నీవు రాజుగానుండఁదగవు. విభీషణుఁడు ధర్మాత్ముఁడు కావున రాజుగా నుండఁదగినవాఁడు. రెండవ కారణ మేమన:- విభీషణుఁడు రాక్షససమూహమందు గొప్పవాఁడు, జ్ఞానసహితుఁడు. అజ్ఞానరహితుఁడెవ్వఁడో వాఁడు గొప్పవాఁడు కాని యేండ్లు విశేషించియుండఁగానే గొప్పతనము రాదు. కాకులు, పాములు నూర్లకొలఁది సంవత్సరములు బ్రతుకుటలేదా? ఇది పాపము, ఇది పుణ్యమని తెలియని కారణముచేఁ గదా నీవు దేవ గంధర్వ యక్షాదుల నెల్లర బాధించితివి. కావున నీవు రాజుగానుండఁదగవు. విభీషణుఁడే రాజుగా నుండఁదగినవాఁడు. ఇఁక మూఁడవ కారణ మేమంటివా ? నన్ను నాశ్రయించినవాఁడు విభీషణుఁడు. నాయందు ద్రోహబుద్ధి గలవాఁడవు నీవు. నా యాశ్రితుని యోగక్షేమ భారము నాయందున్నది కావున నిన్నుఁ జంపియో రాజ్యమునుండి తొలగించియో రాక్షస రాజ్యాధిపత్య మతనికిచ్చెదనుగాని నీకీయను. నిన్నాశ్రయించిన కారణముచే విభీషణునికి రాజ్యమియ్యఁ బూనితివేని నేను నిన్నాశ్రయించిన నేమిచేసెదవు అందువేమో? అతనికి నా యయోధ్యరాజ్య మిచ్చెద నని భావము. నాలుగవ కారణ మేమన అతఁడు శ్రీమంతుఁడు, ఐశ్వర్యప్రాప్తికి వలయు సమస్త సద్గుణములు గలవాఁడు. (౨) శ్రీదేవియగు సీతాదేవి కరుణకుఁ బాత్రుఁడైనవాఁడు. నీవో శ్రీమంతుఁడవు కావు. శ్రీదేవి విషయమున అపరాధము చేసినవాఁడవు. "ఆగోపరాధో మంతుశ్చ" అని యమరము. ఆమెకు ద్రోహమొంచి బాధించువాఁడవు. ఆమె యనుగ్రహము సంపాదించక నీవు నాశరణుచొచ్చినను నేను నిన్ను

అనుగ్రహింపను. ఆమె విషయమున అపరాధివి. కావున ముందు నీ వామె కాళ్ళపైఁబడి యామెను బ్రసన్నురాలిని జేసితివేని నిన్ను రక్షింతును. అజ్ఞులు నావిషయమై చేయు నపరాధముల నేను లెక్కింపను. నా యాశ్రితులకుఁ జేసిన యపరాధములకుఁ గోపింతును. దండింతును. భగవంతుఁడు దుర్వాసునితో నీ వంబరీషుని విషయమున నపరాధము చేసితివి, అతని కాళ్ళపైఁ బడుమని కదా బోధించెను. ఇచ్చట నట్టులే. వారి యనుగ్రహమే నాయనుగ్రహము. వారి నిగ్రహమే నా నిగ్రహము. ఈ నాలుగు కారణములచే నోరీ లంకాధిపత్యమును శత్రువుల వలని భయములేక పాలింప విభీషణుఁ డొందెను. నీవలె నల్పకాలము మాత్రముకాదు. శాశ్వతముగ నొందఁగలిగెను. విభీషణుఁడు లంకారాజ్యము పొందె నంటివే. నేను రాజనై సింహాసనముపైఁ గూర్చుండి యున్నానుగదా యందువేమో! నియోగము జరిగినది. సింహాసనము మీఁద కూర్చుండఁబెట్టుటకే వచ్చియున్నాను. నీవు మంచితనముగా సింహాసనము విడిచి పోవేని నిన్నుఁ జంపి యతనిని గూర్చుండఁ బెట్టెదను. సింహాసన మతనిది కాని నీది కాదు. విభీషణుఁడు చిరంజీవులలోఁ జేరినవాఁడు. కావున శాశ్వతముగ నని చెప్పఁబడెను. ఈవిషయ ముత్తరకాండమునఁ గలదు.

మ. వినరా మూర్ఖసహాయ! ధర్మపథమున్ వీడ్కొల్పి పాపైకగ
  ర్ధనచిత్తుండవు నస్వతంత్రమతి వై రాజ్యంబు పాలింప నో
  కానిమేషంబు నశక్య మింక ధృతి చిక్కంబట్టి శౌర్యంబుమైఁ
  జనుదే పోరికి బూతుఁడవ్వెదవు మచ్ఛాస్త్రశాంతుండవై. ౮౪౯

అర్థములు. మూర్ఖసహాయ=మూర్ఖుఁడవు నీ వొకఁడవే కావు. నీకు సహాయులు మూర్ఖులే. వివేకముగల విభీషణునివంటివారు నీకు సహాయులు గాఁజాలరు. కావున నీవలెనీ సహాయులు నన్యులే ధర్మపథమున్ వీడ్కొల్పి = ధర్మమార్గము వదలి, పాపైకగర్ధన చిత్తుండవు = పాపమే ప్రధానముగా నపేక్షించు మనస్సుగలవాఁడవు. అస్వతంత్రమతివి = బుద్ధిస్వాధీనత లేనివాఁడవు. నీ బుద్ధి కామము వశమున నున్నది. చనుదే = చనుదెమ్ము-ఇఁక = ఈమీఁది కాలమున - చిక్కబట్టి = చెదరకుండఁ బట్టుకొని - మత్ + శాస్త్రశాంతుండవై = నా వాఁడి బాణములచే జచ్చినవాఁడవై, పూతుఁడవయ్యెదవు=పరిశుద్ధుఁడ వయ్యెదవు- రణమందు వెనుదీయక చచ్చితివేని వీరస్వర్గము లభించు నని భావము.

తాత్పర్యము

మూర్ఖులను సహాయులుగాఁ గలవాఁడా! వినరా! ధర్మమార్గమును వదలి పాపము నందే యాసక్తిగలవాఁడవై కామవశుఁడవై యిఁక రాజ్యమును నొక నిముషమైనఁ బాలింపఁజాలవు. కావున ధైర్యము చెదరనీక బిగఁబట్టి శౌర్యముగలవాఁడవై యుద్ధమునకు రమ్ము. నీవు చేసిన పాపములకు శిక్ష నా వాఁడిబాణముల వలనఁ గలుగు బాధచే ననుభవించి చచ్చి వీరస్వర్గమును బొందెదవు.

చ. పొవరు దొలంగి కన్మొఱంగి • పోవఁ దలంచి శకుంతమై మనో
జవమున మూఁడులోకములు • జాల్మఁడ! చొచ్చితివేనియున్ శ్రమం
బవు జుమ యంతమాత్రము మ • దక్షి పథంబును బొంది ఘోర మృ
త్యువు వదనంబునం బడక • ద్రోహి! ధరన్ మనఁ జాల వేమిటన్. ౮౫౦

అర్థములు. పొవరు = పొగరు, కన్మొఱంగి = కనుచాటై, శకుంతమై = పక్షివై, జాల్మఁడ = నీచుఁడ, యుద్ధమునకు రాక, సంధిఁగోరక పిటికివై మాఱు వేషమునఁ బరుగెత్తిపోవుట నీచలక్షణముగదా? మదక్షిపథంబు=నాదృష్టిమార్గము, మనఁజాలవు=బ్రతుకలేవు.

తాత్పర్యము

కండగర్వము వదలి పక్షివేషమునఁ గనుచాటు మనోవేగముతో మూఁడు లోకములందు నెందుఁబోవఁ జూచినను నీచుఁడా! శ్రమ యొక్కటియే ఫలముగాని వేఱుఫలము లేదు. ఇంత శ్రమపడి కడపట నా కాకాసురునివలె నాకాళ్ళపైఁ బడవలసిన వాఁడవే, లేదా చావవలసిన వాఁడవే. నిన్ను రక్షింపఁగలవాఁడు మూఁడు లోకములందు లేఁడు. ద్రోహీ! నా కనులకు కగపడి చావక నీ వటరా బ్రతుకఁగలవు. అది యసాధ్యము.

కం. కావున హితమాలింపుము, జీవశ్రాద్ధంబు నిపుడ • చేసికొని పురిన్
నీ వలచినయవి కను నీ, జీవము నా చేతిలోనఁ • జిక్కెం గుమతీ. ౮౫౧

అర్థములు. జీవశ్రాద్ధము=మరణానంతరము తన కుత్తరక్రియలు చేయఁ గలవారు లేనివాఁడు తనకుఁ దానే జేసికొను శ్రాద్ధము జీవశ్రాద్ధము. నీకు నీళ్ళు విడుచువారుండరు. అందఱు చత్తురు కావున నీవిపుడే శ్రాద్ధము పెట్టుకొనుము.

తాత్పర్యము

నీవు చచ్చుట నిజము కాఁబట్టి నీకంటె ముందు నీవారందఱు చత్తురు కావున నీకు శ్రాద్ధము పెట్టువాఁడుండఁడు. కనుక నీ శ్రాద్ధము నీవే పెట్టుకొని నీ నగరమున నీకుఁ బ్రియమైన వాని నెల్లఁ గడపట నొకసారి చూచి రమ్ము. నీ ప్రాణము నాచేతిలో నున్నది కాని నీ దేహమునందు లేదు.

కం. అని రాముఁడు వచియించిన, ఘనపథమున కెగిరి రూపు • గాంచిన యనలుం
డనఁ దారేయుఁడు రావణు, ఘనసౌధమునందు వ్రాలి • కడిమి దలిర్పన్.

అర్థములు. ఘనపథమునకున్=ఆకాశమార్గమునకు, రూపుగాంచిన యనలుఁడు=వానరాకారము గొన్న యగ్నిహోత్రుఁడు, పంచమహాభూతములు, తన్మాత్రలు, మహత్తు, అవ్యక్తము, ఇవి యన్నియు నిరాకారములు. అనఁగా మనుష్య పశు పక్ష్యాదులకువలె నిర్దిష్టమైన యొక యాకారము లేదు. కావున నిచట నగ్ని రూపవంతుఁ డనఁబడెను. ఈ కారణముచేతనే భగవంతుఁడు నిరాకారుఁడనఁబడును. 'అన్ని రూపములున్ తన రూపమైనవాని రూప మేరూపమని చెప్ప సాధ్యపడును.'

'అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణః స్థితః' అన్నట్లు భగవంతుఁడు ప్రపంచమునందంతట లోపల వెలుపల వ్యాపించి యున్నాఁడు. కావున నేరూపము నందు నిండియున్నాఁడో యదే యాయన యాకారము. ఆకారములేని నిశ్చిత మదియుండు పాత్రాకారమే.

అగ్నిర్యథైకో భువనం ప్రవిష్టో, రూపంరూపం ప్రతిరూపో బభూవ
ఏకస్తథా సర్వభూతాంతరాత్మా, రూపం రూపం ప్రతిరూపో బహిశ్చ
వాయుర్యథైకో భువనం ప్రవిష్టో, రూపం రూపం ప్రతిరూపో బభూవ
ఏకస్తథా సర్వభూతాంతరాత్మా, రూపం రూపం ప్రతిరూపో బహిశ్చ॥

అగ్ని, వాయువు నొక వస్తువునందుఁ ప్రవేశించి యా వస్తువు నాకారము పొందునట్లు భగవంతుఁడును. కావున నన్నిభూతములు భగవత్స్వరూపములే. ఇట్టులే రామకృష్ణ నరసింహాది విగ్రహములందుండు భగవంతుఁ డొక్కఁడే యైనను వెలుపల రూపమును బట్టి యాయన రామమూర్తియని, యాయన కృష్ణమూర్తియని, యాయన నరసింహుఁ డని యందుము.

తాత్పర్యము

ఈ ప్రకారము రామచంద్రమూర్తి చెప్పఁగా నంగదుఁడు నగ్నిహోత్రము వలె మండుచు ఆకాశమున కెగిరి కోట దాటిపోయి రావణుఁడు మేడమీఁద నుండఁగా నచ్చట దిగి పరాక్రమ మతిశయింపఁగా.

కం. సామాత్యుం డగు రావణు, మోముం గని చేరఁబోయి ♦ మూర్తిమదగ్ని
ద్ధామతఁ వెలుఁగుచు మాచా, యేమి విడక రాముసూక్తి ♦ యెల్లను వినిచెన్. ౮౫౩

అర్థములు. సామాత్యుఁడు = మంత్రులతోఁ గూడినవాఁడు - మూర్తిమత్ = రూపముగల - అగ్ని + ఉద్ధామతన్ = అగ్నిహోత్రుని వంటి తేజోతిశయము చే-దీనిచే రాక్షసులు వీని సమీపించుటకును భయపడి రని భావము. తూవా యేమి విడవక=రామచంద్రమూర్తి చెప్పిన మాటలలో నొక యక్షర మైన వదలి పెట్టక.

"తుహిచస్మహవై పాదపూరణే" యని యమరము. తు-చ-ఇవి పాదపూరణమందు ప్రయోగింపఁబడును. "తుహ్యాద్యేదేఽవధారణే" ఇట్టివి యర్థవిశేషమందును ప్రయోగింపఁబడును. కావున వీనిని విడిచినఁ గొన్ని చోట్ల వాస్తవార్థమునకే హాని కలుగును. కావున నే యర్థమున నేయక్షరమును రామచంద్రమూర్తి ప్రయోగించెనో యని యొక యక్షరమైన విడువలేకని యర్థము-వినిచెన్ = ఇది ప్రేరణార్థకరూపము. వర్ణనిర్దేశ విధానంబులందు హ్రస్వము దీర్ఘముగాఁ జెప్పఁబడును. పావన పాఘా బాధా మూవాయును నాఖ లిపులు-తాకు మావ త్రిచ్చిన త్మయగును. ఈ కారణముచే హ్రస్వములు దీర్ఘములుగాఁ జెప్పఁబడెను.

తాత్పర్యము

మంత్రులతోఁగూడి యుండిన రావణునిఁజూచి సమీపమునకుఁబోయి యగ్ని

హోత్రునివలె వెలుఁగుచు రామచంద్రమూర్తి చెప్పిన మాటలలో నొక యక్షరమైన విడక సర్వము వినిపించెను.

కం. ఖ్యాతుఁ డగు కోసలేంద్రుఁడు, పూతచరిత్రుఁడైన రామ●భూవరమణికిన్
దూతను వాలితనూజుఁడ, నే తఱి నా పేరు వింటి●వే యంగదుఁడన్. ౭౫

అర్థములు. ఖ్యాతుఁడు = ప్రసిద్ధుఁడు - పూతచరిత్రుఁడు = పవిత్రమైన నడవడి గలవాఁడు-ఏతఱిన్=ఏసమయమందైనను.

తాత్పర్యము

ప్రసిద్ధికెక్కిన వాఁడును, కోసలదేశ రాజును నీవలెఁ బాపచరిత్రుఁడు గాక పవిత్రమైన నడవడి గలవాఁడును నగు రామచంద్రమహారాజునకు నేను దూతను, ఆయన రాయబారిగ పంపఁగా వచ్చితిని. నేను వాలి కుమారుఁడను. ఏ సందర్భమందైనను అంగదుఁడను నా పేరు విన్నావా? విని యుండిన వాఁడే నేను.

ఉం. అనఘుఁడు రామచంద్రుఁ డిటు●లాడె దురాత్మక! పూరుషుండవే
ననికిని లేచి రమ్ము, సచి●వాత్మజ బాంధవ మిత్రయుక్తుఁగా
నిను వధియింతు, లోకములు●నిర్వ్యథమై సుఖియింప దేవదా
దనుజఋషీశ్వరాహివని●తాజనకంటకు నిన్నుఁ గూల్చెదన్. ౭౬

అర్థములు. అనికిని=యుద్ధమునకు, నిర్వ్యథమై = వ్యథ దొలఁగినదై.

తాత్పర్యము

పుణ్యాత్ముఁడైన రామచంద్రమూర్తి యిట్లు చెప్పెను. పర్యవసానమున నేమి చెప్పెనందువా? దుష్టబుద్ధీ! మగవాఁడవైతివా? యుద్ధమునకు లేచిరమ్ము, మంత్రులతోఁ గొడుకులతో చుట్టములతో స్నేహితులతో నిన్నుఁ జంపెదను, లోకములకు నీ బాధ తొలఁగునట్లు దేవదానవ ఋషీశ్వరులకును పన్నగులకు స్త్రీలకు బాధగలిగించు నిన్ను వధించెదను.

తే. భూమిజాతను బహుమాన●పూర్వకముగ, సరగఁ గొనివచ్చి
యర్పించి●శరణు వేఁడ
వేని నినుఁ జంపి నీ రాజ్య●మే విభీష,ణునకు నిత్తునటంచను●మనిరాజు ననిన.

అర్థములు. సరగన్ = త్వరగా.

తాత్పర్యము

సగౌరవముగ సీతను దెచ్చి వెంటనే నాకు సమర్పించి శరణు వేఁడక పోయితివా, నిన్నుఁ జంపి నీ రాజ్యమును విభీషణున కిచ్చెదను, అని చెప్పుమనెను అని యంగదుఁడు చెప్పఁగా.

**—● అంగదుఁడు రాక్షసులఁ జంపి మరలి శ్రీరాముకడకు వచ్చుట. ●—**

కం. ఆపరుష భాషణము విని, కోపారుణనేత్రుఁ డసురఁ●కుంజరుఁడు దురా
లాపుని వీనిని గొట్టుఁడు, వే పట్టుఁడు చంపుఁ డనుచుఁ●బెక్కులు తడవల్,

అర్థములు. పరుషభాషణము = కఠినములైన మాటలు - కోపారుణ నేత్రుఁడు = కోపముచే నెఱ్ఱనైన కన్నులు గలవాఁడు-దుర్+ఆలాపుని = చెడు మాటలాడువానిని - పెక్కులు తడవల్ = పలుమాఱు - ఒకటి రెండు మార్లు చెప్పిన నేరాక్షసుఁడును వానిమీఁదికిఁ బోవ సాహసించినవాఁడు కాఁడు. కావునఁ బలుమాఱు చెప్పెను.

తాత్పర్యము

అంగదుఁడాడిన నిష్ఠురవాక్యము విని కోపముచేఁ గన్నుఁ లెఱ్ఱచేసికొని రావణుఁడు దుర్భాషలాడు వీనిని పట్టుఁడు కట్టుఁడు కొట్టుఁడు చంపుఁడని పలుమాఱు చెప్పఁగా,

చం. పలికిన ఘోరరాక్షసులు • పెపడి నల్వురు వాలిపుత్రునిన్
 బెలుచనఁ బట్ట నాతఁడును • స్వీయబలోద్ధతిఁ జూపఁ జిక్కిన
 ట్టులు నటియించి వారలఁ ద • టుక్కునఁ జంకలలోన నొక్కి తా
 నలఘుజవంబునం బలుఁగు • నట్టులు దాఁటెను మేఁడమీఁదికిన్. ౭౪౭

అర్థములు. పెలుచనన్ = ఆటోపముతో - స్వీయబలోద్ధతిన్ = తన బలాతిశయమును.

తాత్పర్యము

ఇట్టులు రావణుఁడు చెప్పఁగా భయంకరములైన యాకారములు గల నలువురు రాక్షసు లొక్కసారిగ నంగదునిమీఁదఁ బడి యాటోపించి పట్టుకొనఁగా నంగదుఁడు తనబలము చూపఁగా వారికిఁ జిక్కినట్లు నటించి చిక్కినాఁడని వారు కేవలము దగ్గరకురాఁగా నున్నట్టులుండి తటాలున వారిమెడలు చంకలలో నిరికించుకొని మేడపైకి పక్షివలె వేగముగ నెగిరెను.

కం. అచ్చట నుండియు నలువురఁ, • జెచ్చెర విదలింప వారు • చేవ చెడంగాఁ
 జచ్చిపడిరి దశకంఠుఁడు, కచ్చఱి కనుఁగొనుచు నుండఁ•గా నంగదుఁడున్.

అర్థములు. కచ్చఱి = గర్వముచెడి.

తాత్పర్యము

ఆమేడమీఁద నుండియే వారిని నలువురను నతివేగముగ నంగదుఁడు విదలింపగా వారు రావణుఁడు గర్వముచెడి చూచుచుండ వానిమెుుటనే చచ్చిపడిరి.

తే. శైలశృంగోన్నతంబు ప్రా•సాదశిఖర, మచట వీక్షించి పదహతి•నవనిఁ గూలఁ
 దన్నె రావణుఁడీక్షింప•మున్ను వజ్రి, మంచుగుబ్బలిశృంగంబుఁ•ద్రుంచుమాడ్కి.

అర్థములు. శైలశృంగోన్నతంబు=కొండశిఖరమువలె నెత్తైనది, ప్రాసాద శిఖరము = మేడపైభాగమును, పదహతిన్ = కాలిదెబ్బచే. వజ్రి = ఇంద్రుఁడు, మంచుగుబ్బలి = మంచుఁగొండ.

తాత్పర్యము

పర్వత శిఖరమువలె నెత్తైన మేడ శిఖరమును జూచి యంగదుఁడు కాలి

దెబ్బచే దానిని దన్నఁగా రావణుఁడు చూచుచుండఁగా నది, యింద్రుఁడు వజ్రాయుధముచేఁ గొట్టఁగా నేలఁబడిన హిమవత్పర్వత శృంగమువలె నేలఁబడెను.

తన దూతలుపోయి వానరులచే భంగపడి వచ్చుటయు, వానరుఁ డొకఁడే వచ్చి తన్ను భంగపఱిచి పోవుటయుఁ జూచియైన రావణుఁడు కాలపాశవశంగతుఁ డౌట బుద్ధి తెచ్చుకొన్నవాఁడు గాఁడు.

ఉ. క్రచ్చఱ నిట్లు సౌధశిఖ♦రంబును ద్రుంచి పరాక్రమించి నే
 వచ్చినవాఁడ నంగదుఁడ ♦ వాలితనూజుఁడ రాముబంట నం
 చచ్చుపడంగఁ బల్కి- మహా ♦ శార్భటు లుల్లసిలంగ తివ్వనన్
 వచ్చి వియత్పథంబునను ♦ బార్థివ వర్యుని ప్రోల వానరుల్. ౭౬-౧

అర్థములు. క్రచ్చఱన్ = వేగముగ, మహాశార్భటులు = గొప్ప సింహనాదములు, వియత్ + పథంబునను = ఆకాశమార్గమున.

తాత్పర్యము

శీఘ్రముగ నిట్లు సౌధశిఖరంబును విఱుగఁదన్ని రావణుని కన్నుల యెదుటనే తన పరాక్రమముఁ జూపి నేను రామచంద్రమహారాజు దూతను, నాపే రంగదుఁడు, వాలి పుత్రుఁడను అని యందఱు వినునట్లు స్పష్టముగఁ బలికి గొప్పగా సింహనాదములు సేయుచు నాకాశమార్గమున తివ్వన వచ్చి రామచంద్రుని ప్రోలనున్న వానరులు.

కం. ఉల్లాసంబున నెరలఁగఁ, బెల్లగు దుఃఖమున నసుర♦వీరులు వగవన్
 మెల్లన నిలిచినఁగని రఘు, వల్లభుఁ డెద మెచ్చి యాహ♦వమునకుఁ దొడరెన్,

అర్థములు. ఆహవమునకున్ = యుద్ధమునకు.

తాత్పర్యము

సంతోషముతో విజృంభింపఁగా రావణునియొద్ద నున్న రాక్షసులు దుఃఖముతో నేడువఁగా వినయముతో మెల్లన వచ్చి నిలువఁగా రామచంద్రమూర్తి మెచ్చుకొని యుద్ధమునకు ప్రారంభించెను.

క. ప్రాసాదభంగమునకున్, రోసము దీపింప రావ♦ణుం డది భ్రష్ట
 శ్రీసూచక మని తనకున్, వేసమకుఱు నాశ మనుచు ♦ వెచ్చగ నూర్చెన్.

అర్థములు. ప్రాసాదభంగమునకున్ = మేడ విఱిగి పడుటవలన - పంచమ్యర్థక షష్ఠి-భ్రష్ట శ్రీసూచకము = చెడిన రాజ్యలక్ష్మికి చిహ్నము.

తాత్పర్యము

రావణుఁడు తనమేడ విఱుగఁబడుటవలన రోస మధికమయ్యెనది తనరాజ్యలక్ష్మి తొలఁగిపోవుటకు శకునమనియుఁ దనకుఁ జేటు తప్పదనియుఁ దలఁచి వేఁడి నిటూర్పులు విడిచెను.

తే. కొండవలె నుండు వలనుపే◆ఱుండు దండి, గండుమీఱిన వానర◆కాండసేన
తోడ నాలుగువంకలఁ◆దోయజారి, చుక్కగుమిఁబోలె జేనాజ్ఞఁ◆జుట్టుచుండె.

తాత్పర్యము స్పష్టము.

ఉ. వ్యూహము దీరి యున్న ప్లవ◆గోత్కరమున్ లవణాబ్ధి దాఁటు న
క్షౌహిణులన్ నిశాచరులు ◆ గాంచి భయంబడి రందు వీరు లౌ
సాహసికాగ్రణుల్ రణము◆నల్పఁ గుతూహల మంది రెంతో యు
త్సాహముఁ బూని శస్త్రములు◆దాల్చి చరించుచు ఝంఝపోలికన్. ౪౬౫

అర్థములు. ప్లవగోత్కరము=వానర సమూహము - అక్షౌహిణులన్ = రూ-అక్షౌహిణులన్= ౨౧౮౭౦ రథములు, అన్నియే యేనుఁగులు -౬౫౬౧౦ గుఱ్ఱములు, ౧౦౯౩౫౦ పదాతులు గలసేన అక్షౌహిణి యనఁబడును. ఝంఝ= వానతోఁగూడిన గాలి, తుఫాను-'ఝంఝా వాతస్సవృష్టికః' యని యమరము.

తాత్పర్యము

వ్యూహముగా నేర్పడి యున్న వానరసమూహమును అదిగాక సముద్రమును దాఁటి యక్షౌహిణుల కొలఁది వచ్చువారిని జూచి కొందఱు రాక్షసులు భయపడిరి. ధైర్యము సాహసము గలవారు కొందఱు యుద్ధముచేయు నుత్సాహముతో శస్త్రములు ధరించి తుఫానుగాలివలెఁ దిరుగుచుండిరి.

తే. వరణపరిఘాంతరంబుల◆వ్యాప్తమైన, కోఁతిగమిఁగని యిది వేఱు◆కోటయొక్కొ
యనుచు వెఱచిరి వారల◆యార్భటులకు, నడలె నసురులవింత హా◆హాయటంచు.

అర్థములు. వరణ+పరిఖా+అంతరములన్ = కోట గోడలకు అగడ్తలకు నడిమి ప్రదేశములందు. 'ప్రాకారో వరణస్సాల' యని యమరము-వ్యాప్తమైన= ఆవరించి యుండిరి.

తాత్పర్యము

కోటగోడలకు నగడ్తలకు నడుమ నిండిన వానరసేనను జూచి యిదియేమి వేఱొక కోటయా యని వెఱచి వానరుల కేకలకు రాక్షసులు హాహాకారములు గావించిరి.

## —◆{ ౪౨-వ సర్గము. రాక్షసులు రావణుతో లంకను వానరులు ముట్టడించి రని తెలుపుట. }◆—

తరువోజ.

అంతట రాక్షసు◆లసురేంద్రునిలయ◆మరిగి యాతనితోడ◆నగచరు ల్లంక
నంతయు రోధించి◆నట్టివిధంబు◆నఖిలంబుఁ దెల్పిన◆నాతండు కనలి
వింతగాఁ గాపెల్ల◆ద్విగుణంబుఁ జేసి◆వెస సౌధ మెక్కి త◆ద్విధమును గాంచెఁ
గాంతార శైలముల్◆గణియింపరాని◆కదనలంపటు లైన◆కపులాక్రమింప.

అర్థములు. రోధించి = అడ్డగించి, కనలి = కోపించి, ద్విగుణంబు = ఇబ్బడి. రెండంతలు, కదనలంపటులు=యుద్ధమం దాసక్తి గలవారు.

తరువోజ, ప్రాసములేని ద్విపద తరువోజ నొక పాదమగును. యతులు నాలుగు గలవు. ఇది జాతివృత్తము. ఇంద్రగణములు మూఁడు, సూర్యగణము ఒకటి. మూఁడవగణము మొదటి యక్షరము యతిస్థానము ఇట్టివి రెండు గూర్చిన తరువోజ యొక్క పాదమగును. ప్రతి మూఁడవ గణము మొదటి యక్షరము యతిస్థానము, ఇది యొక పాదము. ప్రాసముతో నిట్లు నాలుగు పాదములు చెప్పిన తరువోజ యగును.

తాత్పర్యము

ఇట్లు వానరులు లంక నలువైపుల ముట్టడించిన పిమ్మట రాక్షసులు రావణు నింటికిఁ బోయి వానరులు లంక నన్ని వైపుల ముట్టడించిన విధమంతయుఁ దెలుపఁగా నతఁడు కోపించి యిదివరకుంచిన కాపుగాక మఱింత కాపు హెచ్చించి త్వరగా తన మేడ యొక్క యడవులు కొండలు నన్నియు యుద్ధానకు లైన లెక్క లేని కపు లాక్రమించిన విధమును జూచెను.

తోదకము. ధరణిని ప్రిమ్మఁగఁగ ♦ దారొక్కను వీరిన్
దురమున నేగతిఁ ♦ ద్రుంతు నటంచు
స్థిరమును జింత నొ ♦ నర్చుచు నాత్మన్
దిరుఁ డయి వారలఁ ♦ ధీఁమవఁ గాంచెన్. ౪౬౪

అర్థములు. దారొక్కను=కదియు - కరమును = మిక్కిలి - తిరుఁడయి = స్థైర్యము గలవాఁడయి-ధీఁమవన్=ధైర్యముతో.

భూమినిఁ ప్రిమ్మంగునట్లు వచ్చియున్న వీరిని యుద్ధమునం దెట్లు చంపుదునా యని మిక్కిలి యాలోచించి స్థైర్యము గలవాఁడై వారలను ధైర్యముతోఁ జూచెను.

తోదకము, నజజయ గణములు-ఎనిమిదింట యతి, దీనికి తామరసమనియుఁ బేరు గలదు.

కం. భూవిభుఁడును సాలసమీపా, పావని ద్రాయంగ నరిగి ♦ యన్ని దెసల ర
క్షోవీరసమావృతమై, కావఁబడి పతాకమాలికా చిత్రితమై. ౪౬౫

అర్థములు. సాల సమీపావనిన్=ప్రాకార సమీప ప్రదేశమును, పతాక మాలికా చిత్రితమై=ధ్వజముల వరుసలచే నలంకరింపఁబడినదై.

తాత్పర్యము

రామచంద్రమూర్తి ప్రాకార సమీప ప్రదేశమునకుఁబోయి యన్ని ప్రక్కల రాక్షసులచే నావరింపఁబడి, రక్షింపఁబడి, ధ్వజములచే నలంకరింపఁబడినదై.

ఉ. ప్రాలెడిలంకఁ గాంచి జన • క ప్రభుపుత్రిఁ దలంచి యాత్మలో
జాలి వహించి యయ్యొ మృగ • శాబవిలోచన నానిమిత్తమె
బాలఁ గృశించి శోకమున • స్థండిలశాయిని యై తపించెడిన్
హా! లలనామణీ! యనుచు • నారటపాటునఁ దత్కృపాళుఁడున్. ౪౭౦

అర్థములు. మృగశాబవిలోచన = జింకపిల్ల కన్నులవంటి కన్నులు గల సీత, స్థండిలశాయిని=ఉత్తనేలఁ బండుకొనినది, తత్కృపాళుఁడున్ = ఆమెయందు దయగలవాఁడు, ఇట్లు చెప్పుటచే సీతాదేవి యందలి దయచే నామెను రక్షింపఁ గోరి రాక్షససంహారము చేయఁ బూనెనే కాని రాక్షసులయందలి ద్వేషబుద్ధిని గాదని భావము.

"పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతామ్"అని కదా భగవంతుఁడు కృష్ణమూర్తి బోధించెను.

### తాత్పర్యము

ఒప్పుచున్న లంకఁజూచి సీతాదేవిని దలంచి మనస్సులో వ్యసనపడి యయ్యో జింకపిల్ల కన్నులవంటి కన్నులు గల సీత నాకొఱకుఁగా మిగుల శోకించుటచేఁ జిక్కి యుత్తనేలపైఁ బండుకొని బాధపడుచున్నదిగదా. హా స్త్రీరత్నమా యని యారటపడి యామెయందు దయగల వాఁడగు రామచంద్రమూర్తి.

## —• శ్రీరాముఁడు లంకకోటకు లగ్గలు పట్ట వానరుల కనుజ్ఞ యిచ్చుట •—

ఉ. ధ్వంసము సేయుఁడీ సకల వైరుల • నంచు ననుజ్ఞ నీయ బా
హాంసములందు భూజశిఖ • రాళులఁ దాలిచి కీశసంఘముల్
శంసితభంగి గర్జల ది • శావలయంబు విదారితంబుగా
మాంసభుగోఘమండలము • మార్కొనె నుద్దవిడిన్ మహార్భటిన్. ౪౭౧

అర్థములు. బాహాంసము లందున్=భుజములయందు, మూపురములందు-భూజ శిఖరాళులన్ = చెట్లను గొండశిఖరములను ధరించి — శంసిత భంగిన్ = కీర్తింపఁదగిన విధముగ—విదారితంబుగాన్ = చీల్పఁబడినదిగా — మాంసభుక్ + ఓఘ+మండలము=రాక్షస సమూహముల గుంపును-ఉద్దవిడిన్ = విచ్చలవిడిగా-మహార్భటిన్=గొప్ప ధ్వనిలో.

### తాత్పర్యము

విరోధుల నందఱ నాశము చేయుఁడని యనుమతి యీయఁగా భుజములందు మూపురములందు చెట్లు గిరిశృంగములు ధరించినవారై వానరులుపొగడఁదగిన విధముగ దిక్చక్రము పగిలి పోవునట్లు సింహనాదములు చేయుచు కోయనియొక్కసారిగ నందఱు కేక వేసి విచ్చలవిడిగా వారివారి కబ్బిన విధముగ రాక్షససేనా సమూహము నెదిరించెను.

చ. పిడికిటిపోటులం గుధర♦బృందముపాటుల లంక యంతయున్
బొడుపు వడంగఁగాఁ జేయు తమిఁ ♦ బూని రఘుప్రియ కామితార్థమై
విడివడి జీవితాశ విడి♦వింశతి బాహుఁడు చూచు చుండఁగాఁ
గడిమిని లగ్గపట్టి ప్లవ♦గప్రముఖుల్ ద్రుమశైలకోటులన్. ౪౭౨

అర్థములు. కుధర బృందము = పర్వత సమూహము — పొడుపు=గొప్ప తనము—తమిన్ = ఆశచే —రఘు = రామచంద్రుని యొక్క — ప్రియకామితార్థమై=ఇష్టమైనకోరిక నెఱవేర్చు నిమిత్తము, విడివడి=స్వేచ్ఛగా, విడి = వదలి, కడిమిని=బలముచే.

తాత్పర్యము

ఒంటరిగాఁ జిక్కినవానిని పిడికిటిపోటులచేతను గుంపుగా నున్నవారిపైఁ బర్వత శిఖరములు వేసియు లంక సర్వము శ్రీఁగాదశకు వచ్చునట్లు చేయు నాశతో రాముని కిష్టమైన కార్యము చేయుటకై తెగఁబడి స్వేచ్ఛగా ప్రాణములమీఁది యాశవదలి రావణుఁడు చూచుచుండఁగనే బలాతిశయముచే లగ్గపట్టి వానర శ్రేష్ఠులు చెట్లు కొండలు గుంపులుగా.

సీ. ప్రాకారతోరణా♦రణ్యతలంబులఁ, జక్కాడి నిర్మల♦సలిలపూర్ణ
పరిఖలఁ దృణకాష్ఠ♦పర్వతాగ్రద్రుమ, భూపరాగంబులఁ ♦ బూడ్చివైచి
లక్షలు కోటులు ♦ వృక్షచరాగ్రణుల్, కోట నారోహించి ♦ గోపురములఁ
గూలిచి ద్వారముల్ ♦ వ్రీలిచి కొమ్మలు, రాలిచి భయదగ ♦ర్జలను సించి
తే. దొగిరి దాఁటులు వైచుచు ♦ నెల్లవారు
జయము శ్రీరామవిభునకు ♦ జయము లక్ష్మ
ణునకు రాఘవపాలితుం ♦ డీనజావకును
జయ మటంచును ఘోషింత్రు ♦ సంతసమున. ౪౭౩

అర్థములు. ప్రాకార తోరణారణ్యతలంబులన్=ప్రాకారములను ద్వారములను వనప్రదేశములను, చక్కాడి = నేలచదరము చేసి, నిర్మల సలిల పూర్ణ పరిఖలన్=తేటనీట నిండిన యగడ్తలను, తృణ = గడ్డిచేతను, కాష్ఠ = కట్టెలచేతను, పర్వతాగ్ర=కొండశిఖరములచేతను, ద్రుమ = చెట్లచేతను, భూపరాగంబులన్ = నేలనూఁళిచేతను, కొమ్మలు=కోటకొమ్మలు.

తాత్పర్యము

కోటగోడలను ద్వారములను వనభూములను నేల చదరముగ నాశము చేసి తేటనీరు గల యగడ్తలను, గడ్డి, కట్టెలు, శిఖరములు, చెట్లు దుమ్ము వేసి పూడ్చి లక్షలు కోటులుగఁ గ్రోఁతులు కోటపై కెక్కి గోపురములను ద్వారములను విఱుగఁ దన్ని కోటకొమ్మలు విఱిచి సింహనాదములు చేయుచు యుద్ధము వచ్చినవానిని దాఁటి దొగిరి పోవుచు జయము శ్రీరామచంద్రమూర్తికి, జయము లక్ష్మణునకు,

రామచంద్రుల చేత రక్షింపఁబడు సుగ్రీవునకు జయమని సంతోషముతో వఱచుచుండిరి.

క. జాంబూనదతోరణములు, త్ర్యంబకగిరిశిఖరనిభము • లగు గోపురముల్
డంబఱి రూపము మాయఁ జ, లంబున నొనరించి రపుడు • లావరులు కపుల్. ౨౪

అర్థములు. జాంబూనద తోరణములు=బంగారు ద్వారములు, త్ర్యంబక గిరి=కైలాస పర్వతము యొక్క • శిఖర నిభములు = శృంగముతో సమానములు, డంబు+అఱి=కాంతి చెడి, లావరులు=బలవంతులు.

తాత్పర్యము

బంగారు ద్వారములు కైలాసపర్వత శిఖరములవలె నున్నతైన గోపురములు కాంతి చెడి యాకారము కూడ లేకుండునట్లు బలవంతులగు కపులు చలపట్టి చేసిరి.

తే. వీరబాహుసుబాహువుల్ • వీరవరుఁడు నలుఁడు ప్రాకారమును జుట్టి • నాల్గు దెసల
ముట్టడిని గాచి యుండిరి • మోహరమున, నింతలోపలఁ దక్కిన • వృక్షచరులు

అర్థములు. మోహరమునన్=వ్యూహమునందు.

తాత్పర్యము

వీరబాహువు సుబాహువు నలుఁడు నను వారు కోటచుట్టు నాలుగు ప్రక్కలఁ దిరుగుచు వానరులు తక్కువగా నున్నచోట మరలఁ గొంతమందిని నిలుపుచు ముట్టడి యందు సందీయక వ్యూహము చెదరనీయక కాచి యుండిరి. ఈ లోపలఁ దక్కిన వానరులు.

సీ. తగినపద్ధతిని స్కంధా • వారమును దీర్చఁ, గుముదుండు పూర్వపుఁ • గోటికపులు
ప్రఘసుండు పనసుండు • బాసటగా నుండె; వింశతికోటులు • వీరవరులు
దనకుఁ దోడ్పడి నిల్వ • దక్షిణద్వారంబు, నెదుటను శతవలి • భృశబలుండు
నఱువదికోటుల • హరిచయంబులతో సు, షేణుండు పడమటఁ • జేరి నిలిచె

ఆ. రామచంద్రుఁ డుత్తరద్వా • రమునఁ బన్నెఁ, దమ్మునితోడ సూర్య • తనయుతోడఁ
గొండ్రముచ్చుఱేఁడు • క్రూరదర్శనుఁడుఁ గ, వాక్షుఁ డుండె రాము • నంతికమున.

అర్థములు. స్కంధావారమును=వ్యూహముగా సేనను నిలుపుటను.

తాత్పర్యము

అర్హమైన విధముగా వ్యూహముగా సేనను చక్కదిద్దుచుండిరి. తానీశాన్య దిశయందుండి కుముదుఁ డనువాఁడు కోటివానరులతో ప్రఘసుండు పనసుఁడు నను వారు తనకు సహాయులుగా తూర్పుగవని నరికట్టియుండెను. ఇరువది కోటుల వీరులు తనకు సహాయులుగా శతవలి యాగ్నేయ మందుండి దక్షిణ ద్వారంబు నరికట్టెను. అఱువదికోట్ల వానరులతో సుషేణుండు నైరృతినుండి పడమటి గవని నరికట్టెను. రామచంద్రమూర్తి లక్ష్మణునితో వాయవ్యదిశనుండు సుగ్రీవునితోను త్తరద్వారము నరికట్టెను. కొండ్రముచ్చుల ప్రభువు గవాక్షుఁడు రాము సమీపమందుండెను.

తే. ఎలుగులకు ఱేఁడు ధూమ్రుండు ♦ ఋక్షకోటి
బలియ రాముని మఱియొక ♦ ప్రక్క నిలిచె
సచివసహితంబుగా విభీ ♦ షణుఁడు గదను
దాల్చి నిలచెను రఘురాము ♦ దాపునందు. ౪౨౨

తాత్పర్యము స్పష్టము.

తే. గంధమాదనశరభులు♦గజగవాక్ష, గవయులును సెల్ల సేనకు♦గాపు గాఁగ
నన్ని వంకల బరువెత్తి♦యరయుచుండి,రంతయునుజూచి రావణుం♦డాగ్రహించి.

తాత్పర్యము స్పష్టము.

ఇందు, జెప్పఁబడిన గవాక్షుఁడు వేఱొకరుఁడు.

**—♦ రావణుఁడు రాక్షసుల యుద్ధమునకుఁ బోవ ననుజ్ఞ యిచ్చుట ♦—**

సీ. పొండు రాక్షసులార♦భండనమున కన, నామాట వెలువడి♦నదియు లేదొ
యార్పులు పెడబొబ్బ ♦ లట్టహాసంబులు, భీమనిర్ఘోషముల్ ♦ పెల్లు రేఁగెఁ
జంద్రపాండురముఖ ♦ చర్మభేరులు హేమ కోణాహతములుగా ♦ ఘోష లెసఁగ
భూషితాసితతనుల్ ♦ పూరింప శంఖముల్, సబలాక చంచలా ♦ జలదచయము

ఆ. పగిదిఁ దోఁచె నిట్లు ♦ వారిధిపొంగిన, వడువు దోఁచ సేఁకు♦దడము లెదిరె
గపులు పేరుటులివు♦కందరప్రస్థపూ,ర్ణముగఁ దాఁకి వీఁక♦రణము సేయ. ౪౨౩

అర్థములు. భండనమునకు = యుద్ధమునకు—చంద్రపాండుర = చంద్రుని వలెఁ దెల్లనైన — ముఖ=ముఖములుగల — చర్మభేరులు = తోలు నగారాలు— హేమ కోణాహతములుగాన్=బంగారు కోడుపులతోఁ గొట్టఁబడినవై—ఘోషలు= ధ్వనులు—భూషిత+అసితతనుల్ = అలంకరింపఁబడిన నల్లని దేహములుగలవారు— సబలాక=కొక్కెరలతో—చంచలా = మెఱుపులతోను గూడిన-జలద చయము = మేఘసమూహము — పగిదిన్ = వలె-పొంగినవడువు = ఉప్పొంగిన విధము — సేఁకు దడములు = రాక్షససేనలు — పేరుటులివు = గొప్పధ్వని — కందరప్రస్థ పూర్ణము=గుహాలందును జఱియ లందును నిండు నట్లుగా.

తాత్పర్యము

రావణుఁడు రాక్షసులారా యుద్ధమునకుఁ బొండు అని చెప్పఁగా నామాట వెలసినోర వెలువడుటే యాలస్యముగా సింహనాదములు పెడబొబ్బలు భయంకర ధ్వనులు నతిశయించెను. చక్కఁగాఁ బదును చేయుటచేఁ జంద్రునివలెఁ దెల్లనైన ముఖములు గల తోలు నగారాలు బంగారు కోడుపులతోఁ గొట్టఁబడి ధ్వనించెను. అలంకరించుకొనిన నల్లని దేహములుగల రాక్షసులు తెల్లని శంఖములు పూరింపఁగా నల్లని మేఘముల తెల్లని కొంగలతో మెఱుపులతో నుఱుముచున్నట్లుండెను. సముద్రముపొంగి పొరలునట్లు రాక్షససేనలు వానరులపైఁబడెను. వానరుల పెద్ద ధ్వనులు గుహాలందుఁ జఱియలందు నిండెను.

శా. ఘోరం బయ్యెను సంగరంబు కపిర•క్షోనాథయూథాళి క
య్యారే ప్రాక్తన దేవతాసురమహా•భ్యామర్దనీకాశ మై
వీరుల్ కీశవరుల్ నఖాయుధులు భూ•భృద్గ్రావవృక్షాంకులై
పోరన్ రక్కసు లుగ్రశూలపరిఘం•బుల్ శక్తులున్ వైవఁగన్. ౪౪౦

అర్థములు. కపిరక్షోనాథ యూథాళికిన్ = కపినాథ = సుగ్రీవుని యొక్కయు, రక్షోనాథ = రావణుని యొక్కయు, యూథాళికిన్ = సేనల సమూహమునకు అనఁగా వానర రాక్షస సేనలకు, ప్రాక్తన = పూర్వమందు జరిగిన, దేవతాసుర = దేవాసురులయొక్క, అభ్యామర్దనీకాశమై, = యుద్ధముతో సమానమై, నఖాయుధులు = గోళ్లాయుధములుగాఁ గలవారు, భూభృత్ + గ్రావ + వృక్షాంకులై = కొండలు శిఖరములు చెట్లు చిహ్నములుగాఁగలవారై, వారివారి శక్తికొలఁది యని భావము. ఉగ్ర = భయంకరములైన, శూలపరిఘంబుల్ = శూలములు, గుదియలు.

తాత్పర్యము

అప్పుడు పూర్వకాలమున దేవదానవులకు జరిగిన యుద్ధముతో సమానమై వానర రాక్షసులకు యుద్ధము జరిగెను. అందుగోళ్లాయుధములుగాఁగల వానరులు కొండలు శిఖరములు చెట్లు ధరించి యుద్ధము చేసిరి. రాక్షసులు శూలములు గుదియలు శక్తులు విసరివైచిరి.

సీ. తమతమ పేర్వాడి • తరుచరనాయకుల్, జయ జయ సుగ్రీవ • జయము రాజ
యంచు ఘోషించుచు•మించికోటకుఁ బ్రాఁకి ప్రాకారముననున్న • రాత్రిచరుల
నఖములఁ గోఱల • నగములఁ గుజముల, మర్దించి వధియించి• మహినిద్రోయ
రక్కసుల్ చెలరేఁగి • యుక్కున లగ్గెక్క, వారిమీఁదను భిండి• పాలములను
ఆ. ఖడ్గశూలములను • గడువడిఁ గురియంగ, లెక్క గొనక సాల మెక్కి కపులు
కసిమసంగి పరులు • కసిమసిగొనఁ బోర, రక్తమాంస పంక•సిక్త మవని. ౪౪౧

అర్థములు. పేర్వాడి = పేరు + వాడి = పేరుచెప్పి, నగములన్ = పర్వతములచేతను, కుజములన్ = చెట్ల చేతను, భిండిపాలములను = విడిచి వాటు గుదియలను, రూ. భిండిపాలము, కసిమసంగి = విజృంభించి, పరులు = పగవారు, కసిమసిగొనన్ = తొట్రుపాటుచెంద, రక్తమాంస పంకసిక్తము = నెత్తురు మాంసముతోనైన బురదతోఁ దడిసెను.

తాత్పర్యము

వానరశ్రేష్ఠులు తమతమ పౌరుషములు ప్రకాశింపఁ జేయఁ దమ తమ పేర్లు చెప్పుకొనుచు జయజయ సుగ్రీవ, జయము వానరరాజ యని కేకలు వేయుచు కోట మీఁదికిఁబోయి యందున్న రాక్షసులను గోళ్ళచేతఁ గోఱలచేతఁ కొండలచేతఁ జెట్లచేత బట్టి కొట్టి చంపి క్రిందఁబడఁద్రోయ సాగిరి. రాక్షసులు చెలరేఁగి బలముచే లగ్గెక్కువారి మీఁద గుదియలు శూలములును ఖడ్గములు వేవేగఁ గురి

యుంపసాగిరి. దానిని సరకు సేయక వానరులు ప్రాకారమెక్కి విజృంభించి శత్రువులు తికమకలాడునట్లు యుద్ధముసేయఁగా భూమి నెత్తురు మాంసములతోఁ దడిసి బురద యయ్యెను.

## —• ౪౩-వ. సర్గము వానర రాక్షస ద్వంద్వ యుద్ధము •—

క. కాంచనశిరోగ్రభూషో, దంచద్వాహములు పావ • కాభధ్వజముల్
చంచత్కవచంబులు, రవి,సంచురథంబు లయి యమర • సైన్యము మెఱసెన్. ౪౪౨

అర్థములు. కాంచన = బంగారుమయ మైన, శిరః+అగ్ర+భూషా = తలపై నుంచెడి యాభరణములచే, ఉదంచత్ = మిగుల ప్రకాశించు, వాహములు = గుఱ్ఱములు పావకాభధ్వజముల్ = నిప్పువంటి టెక్కెములు, చంచత్కవచంబులు = మినమినలాడు కవచములు, రవిసంచు = సూర్యునివంటి.

తాత్పర్యము

బంగారుమయమై తలలమీఁద ధరింపఁబడిన భూషణములు గల గుఱ్ఱముల చేతను, నిప్పువలె ధగధగలాడు దండములు గల టెక్కెముల చేతను, మెఱుఁగు పెట్టుటచే మినమినలాడు కవచంబుల చేతను, సూర్యునివలెఁ బ్రకాశించు తేర్ల చేతను రాక్షససైన్యము ప్రకాశించెను.

తే. రావణజయార్థు లగుచును • రాక్షసులును, రామవిజయార్థులయి వాన • రప్రముఖులు
రోషముల దృష్టిభీకర • వేషములను, పీఁక దాఁకిరి గర్జలు • మిన్ను దన్న. ౪౪౩

అర్థములు. దృష్టి భీకర = చూచుటకు భయంకరములైన—మిన్నుదన్నన్ = ఆకాశము దగులఁగా.

తాత్పర్యము స్పష్టము

సీ. సంకులసమర మీఁ • చందాన వర్తిల్లు, నెడ వాలిపుత్రుని • నింద్రజిత్తు
త్ర్యంబకు నంతకు • నట్లు మార్కండేయు నిపోరె,సంపాతి దాఁకె ప్రజంఘు నసుర
జంబుమాలి యెదిర్చె • నామీఁరి మిత్రఘ్నుఁ,డతఁడె విభీషణు • నమితకోపుఁ
దపనుండు గజుఁడును • దాఁకిరి నికుంభు, నీలుండు గదిసెఁ బే • రాలమునను
తే. ప్రఘసుతోఁడను డీకొనెఁ • బ్లవగవిభుఁడు,లక్ష్మణుండు విరూపాక్షు • లగుడుపుపతిచె
యజ్ఞకోపుఁడు సుప్తఘ్నుఁ • డగ్ని కేతు,రశ్మికేతులు దెంపున • రాముఁ డాఁక.

అర్థములు. సంకుల సమరము = దొమ్మి యుద్ధము, త్ర్యంబకున్ = మూఁడు కన్నుల శివుని, అంతకునట్లు = యమునివలె; మార్కండేయుని నిమిత్తమై శివునితో యముఁడు యుద్ధము చేసినట్లు, పేరాలము = గొప్ప యుద్ధము, లగుడుపుపతిచెన్ = పరిభవించెను.

తాత్పర్యము

ఈ ప్రకారము దొమ్మియుద్ధము జరుగునపుడు యముఁడు శివునితోఁ బోరినట్లు ఇంద్రజిత్తు అంగదునితో యుద్ధము చేసెను. సంపాతి యనువాఁడు ప్రజంఘుఁ

డను రాక్షసుని. జంబుమాలి హనుమంతుని, మిత్రఘ్నుఁడు విభీషణుని, గజుఁడు తప నుని, నీలుఁడు నికుంభుని, సుగ్రీవుఁడు ప్రఘసుని నెదిరించి పోరిరి. లక్ష్మణుండు విరూపాక్షుని బరిభవించెను. యజ్ఞ కోపుఁడు సుప్తఘ్నుఁడు అగ్ని కేతుఁడు రశ్మి కేతు వను వారలు రాముని దాఁకుటకై.

కం. కిట్టిరి మైందద్వివిదుల, నట్టియెడన్ వజ్రముష్టి • యశనిప్రభుఁడున్
    జెట్టెదిరించిరి నలుఁడుం, గొట్టెన్ బ్రతపనసమాఖ్య•ఘోరాసురునిన్. ౧౪౫

అర్థములు. కిట్టిరి=సమీపించిరి.

తాత్పర్యము

మైందద్వివిదులను వజ్రముష్టి అశనిప్రభు లనువా రెదిర్చిరి. ప్రతపనుఁ డను ఘోర రాక్షసుని నలుఁడు పడఁగొట్టెను.

తే. ధర్మసుతుఁడుసుషేణుండు•దరలఁదాఁకె,నమితబలునివిద్యున్మాలి•యనెడువానిఁ
    దక్కు వానరరాక్షసు•లక్కజముగ, బోరి రెదురైనవారితో•ఘోరముగను.

తాత్పర్యము

ధర్ముని కుమారుఁడగు సుషేణుఁడు మహాబలశాలి విద్యున్మాలిని నెదిరించెను. తక్కినవారు వారివారి కెదురైన వారితో నాశ్చర్యకరముగ యుద్ధము చేసిరి.

ఉ. ఈ విధి రోమహర్షమయి • యుల్లెడ సంకుల సంగరంబుగా
    వావిరి చెల్లఁ దద్ధరణిఁ•బర్వెను గుంతలశాద్వలంబు ని
    ర్జీవశరీరకాష్ఠము న•సృక్తటినీచయు, మట్టివేళ క్షో
    భావహు వాలిసూనుని గ•దాహతి శక్రజితుండు నొంచినన్. ౧౪౬

అర్థములు. రోమహర్షము = గగురుపాటు కలిగించునది, కుంతల శాద్వలంబు=వెంట్రుక లనెడి పచ్చిక గలది. నిర్జీవ శరీరకాష్ఠము=ప్రాణములేనిదేహము లనెడి కట్టెలు గలది, అసృక్+తటినీ చయము = నెత్తుటి నదుల సమూహము, క్షోభావహున్=రాక్షస సేనయందు కలవరము కలిగించు వానిని, శక్రజితుండు = ఇంద్రజిత్తు, నొంచినన్=బాధింపఁగా.

తాత్పర్యము

ఈప్రకారము చూచువారికి గగురుపొడుచునట్లు దొమ్మి యుద్ధము అన్ని ప్రక్కల జరుఁగగా నా యుద్ధభూమియందు వెంట్రుకలను పచ్చికగలదై, ప్రాణము లేని దేహము లను కట్టెలు గలదై, నెత్తురను నేఱు వ్యాపించెను, ఆ సమయమున రాక్షస సేనను మిగులఁ గలవర పెట్టుచున్న యంగదుని నింద్రజిత్తు గదచేఁ గొట్టెను.

ఉ. పట్టఁగ రానికోపమున • వానిరథంబున దూఁకి చాపమున్
    బట్టి విదల్చి దూరముగ • వైచి జవోద్ధతి సూతుమూర్ధమున్
    జట్టుకుఁ బాపి గుఱ్ఱములు • సొల్పడి చావఁగ మోఁది తేరినిన్
    నెట్టన నుగ్గునూచముగ • నేలఁ బడన్ విఱిచెం గపీంద్రుఁడున్. ౧౪౭

అర్థములు. జవోద్ధతి=వేగముయొక్క యతిశయము- మూర్ధము=తల-చట్ట కున్=శరీరమునుండి, పంచమ్యర్థమున షష్ఠి, సాల్పడి = చాలుగఁబడి = వరుసగఁ బడి - నెట్టన=అనివార్యముగ.

తా త్ప ర్య ము

ఇంద్రజిత్తు తన్నిట్లు గదతోఁ గొట్టఁగా నంగదుడు పట్టరాని కోపము గల వాఁడై వాని తేరిమీఁదికి దూఁకి వాని వింటిని బట్టుకొని యీడ్చి విదలించి దూర ముగఁ బాఱవైచి యతివేగముగ సారథి తలఁద్రుంచి గుఱ్ఱములు వరుసగ నేలఁ బడఁ జావఁదన్ని యడ్డము లేనివాఁడై తేరిని బిండిపిండి చేసెను.

ఉ. శాతశరత్రయంబునఁ బ్రజంఘుఁడు దోర్బల మొప్పఁ గొట్ట సం
పాతియు నశ్వకర్ణకుజపాతమునన్ వెస వాని నొంచెఁ బ్ర
స్ఫీతరథంబుపై నిలిచి పేర్కొని కింకను జంబుమాలియున్
వాతతనూజువక్షమున బాధసముజ్జ్వలశక్తిఁ జిమ్మినన్. ౨౪౯

అర్థములు. శాతశరత్రయంబునన్ = పదునైన మూఁడు బాణములచే - దోర్బలము=భుజబలము - అశ్వకర్ణకుజపాతమునన్ = ఇనుమద్దిచెట్టు వేయుటచే- ప్రస్ఫీత=గొప్ప.

తా త్ప ర్య ము

ప్రజంఘుఁడు సంపాతి యుద్ధము చేయునపుడు ప్రజంఘుఁడు సంపాతిని పదునైన మూఁడు బాణములచే భుజబలముకొలఁది కొట్టఁగా నతఁడు ఇనుమద్ది చెట్టుతోఁ గొట్టెను. పెద్ద యుద్ధమునందుండి పేరు చెప్పి కోపముతో జంబుమాలి హనుమంతుని ఱొమ్మునకుఁ దగుల మిగులఁ బ్రకాశించు శక్తిని వేయఁగా.

ఉ. మారుతనందనుండు నస మానజవంబున మించుమాడ్కి నా
తేరున వ్రాలి చేతికోలఁ దిన్ సురవైరినిఁ జెట్టు పెట్టఁగాఁ
దేరును వాఁడు నొక్కత్రుటిఁ దీఱ, నలుం గని తీవ్రబాణసం
దారితగాత్రుఁ జేయుచును దద్దవడిం బయిఁ బాఱుతేరఁగన్. ౨౫౦

అర్థములు. మించుమాడ్కిన్ = మెఱపువలె, పెట్టు పెట్టఁగాన్= దెబ్బ కొట్టఁగా, తీవ్రబాణ సందారిత గాత్రున్=తీక్ష్ణములైన బాణములచేఁ జీల్పఁబడిన దేహము గలవానినిగ తద్దవడిన్=మిగుల వేగముగ, పాఱుతేఱఁగన్ = పరువెత్తి రాఁగా.

తా త్ప ర్య ము

ఆంజనేయుఁడు అసమాన వేగముచే మెఱుఁగు మెఱసినట్లు వాని తేరిమీఁద పడి చేతికోలఁది రాక్షసుని నొక్క దెబ్బ కొట్టఁగాఁ దేరు, వాఁడు కూడ నిమిష కాల ములో జావఁగా నలుఁడు జూచి తీక్ష్ణములైన బాణములచే దేహమును జీల్చుచు మిగుల వేగముతోఁ బయిపడఁ బరువెత్తి వచ్చువానిని.

కం. వానిని బ్రతపనుఁ గనుఁగొని, వానరవరుఁ డైన నలుఁడు ♦ పైఁ బఱికి వెసన్
వాని కనుగ్రుడ్లు రెండు న,దీనజవంబునను బెఱికి ♦ ద్రెళ్ళఁగఁ జేసెన్. ౪౯౧

తాత్పర్యము

ప్రతపనుఁ డనువానిని జూచి నలుఁడు వానిపైకిఁ బరువెత్తి యతివేగమున వాని రెండు కనుగ్రుడ్లు పీఁకి చంపెను.

ఉ. చూపఱు బెగ్గడిల్లఁ బ్రఘ ♦ సుండు కపిధ్వజినీచయంబుఁ బె
ల్లేపున మ్రింగునట్లడర ♦ వృక్షచరాధిపుఁ డుగ్రమూర్తియై
చేపడు సప్తపర్ణమున ♦ శీర్షము వ్రయ్యలు గాఁగ మోఁదినన్
రూపు మెఱుంగరాని గతిఁ ♦ గ్రూరనిశాటుఁడు గూలె నేలపై. ౪౯౨

అర్థములు. చూపఱు = చూచువారు - బెగ్గడిల్లన్ = భయపడంగా - ధ్వజినీ = సేన - చేపడు = లభించిన - సప్తవర్ణమునన్ = ఏడాకుల యరఁటి చెట్లచే - వ్రయ్యలు=తునకలు.

తాత్పర్యము

చూచువారు భయపడునట్లు ప్రఘసుఁ డను రాక్షసుఁడు వానరసేనను మ్రింగు వానివలెఁ బైబడి విజృంభింపఁగా సుగ్రీవుఁడు భయంకరాకారము వహించి సమీపమున నున్న యేడాకుల యరఁటి చెట్టుతో వానితల పగులఁ గొట్టఁగా నాకారము గుర్తింపరాని విధమున నాక్రూరరాక్షసుఁడు నేలపైఁబడెను.

కం. అక్షయశరములు రిపుహృ,దయక్షోభముగాఁగఁ గురిసి ♦ యాశుగ మొకటన్
రక్షోవరుడైన విరూ,పాక్షుని వెస లక్ష్మణుండు ♦ హతుఁగావించెన్. ౪౯౩

అర్థములు. అక్షయ శరములు = మితిమీఱిన బాణములు - రిపు = శత్రువులయొక్క - హృదయక్షోభము=గుండెలు కలఁత పఱచునవి - ఆశుగము= బాణము.

తాత్పర్యము

లక్ష్మణుఁడు శత్రువుల గుండెలు గడగడ లాడునట్లు మితిమీఱిన బాణవర్షము గురియించి యొక్క బాణముతో విరూపాక్షునిఁ జంపెను.

తే. యజ్ఞకోపుఁడు సుప్తఘ్నుఁ ♦ డగ్నికేతు
రశ్మికేతులు బాణప ♦ రంపరలను
రాము నొప్పింపఁ గినుకనై ♦ రయము మెరయ
నల్వురను నాల్గుశరముల ♦ నఱికి వైచె.

అర్థములు. కినుక=కోపము, రయము=త్వర.

తాత్పర్యము స్పష్టము

చం. అడరెడి వజ్రముష్టిఁ గని యాగ్రహ ♦ మారఁగ మైందుఁ డుగ్రుఁడై
పిడికిటఁ గ్రుమ్మ రాక్షసుఁడు ♦ పృథ్విఁబడెన్ నరథుండు సాత్వుఁడై

పిడుగడువంగఁ గూలు పుట • భేదన సౌధ మనంగ, నీలునిం
గఁడు గఱకైన ముల్కులను • గ్రచ్చర వ్రచ్చె నికుంభుఁ డత్తఱిన్. ౩౫

అర్థములు. అదరెడి = విజృంభించెడి = పైపడెడి, సరథుండు = రథముతోఁ గూడినవాఁడై, నాశ్వుఁడై = గుఱ్ఱములతోఁ గూడినవాఁడై, అడువంగన్ = కొట్టఁగా. పుటభేదన సౌధము = నగరమున మేడ.

తాత్పర్యము

పైబడి వచ్చుచున్న వజ్రముష్టిని జూచి కోపించి మైందుఁడు భయంకర మూర్తియై ముష్టిచే గ్రుద్దఁగా వాఁడు తేరితో గుఱ్ఱములతో పిడుగు తాఁకునఁ గూలు మేడవలె నేలఁబడెను. అప్పుడు నికుంభుఁ డనువాఁడు పదునైన బాణములచే నీలుని దేహమును జీల్చెను.

చం. రవి తన యంశుజాలముల • గ్రమ్మున వ్రచ్చు విధంబు దోఁపన
దివిజవిరోధి వెండియును దీ • వ్ర శరంబుల శీఘ్రకారి యై
తవులఁగ వైచి నవ్వినను • దానవవైరి విధంబు దోఁపఁగాఁ
బ్లవగవరుం డమేయతర • లాఘవ మూని తదీయసారథిన్. ౩౬

అర్థములు. రవి = సూర్యుఁడు. అంశుజాలములన్ = కిరణసమూహములచే. వ్రచ్చు = చీల్చు. దివిజ విరోధి = రాక్షసుఁడు, శీఘ్రకారి = వేగముగఁ బనిచేయువాఁడు, దానవవైరి = విష్ణువుయొక్క, అమేయతరలాఘవము = అత్యంత వేగము.

తాత్పర్యము

సూర్యుఁడు తన కిరణములచే మబ్బును జీల్చునట్లు రాక్షసుఁడు మఱియు వేగవంతుఁడై తీవ్రములైన బాణములు తగులునట్లు వేసి నవ్వఁగా విష్ణువువలె వానరుఁడు మిగుల వేగముతో వాని సారథిని.

ఉ. అతని తేరి చక్రమున • నంతకు నంతికసీమ కన్పె, గ్రా
వాతతశృంగ మెత్తి ద్వివి • దాఖ్యుఁడు వే యశనిప్రభాఖ్య వి
ఖ్యాతసురారి వైచియసు • రౌఘము చూడఁగ ధారిణీరుహ
వ్రాతముతోడఁ బైఁ గవియ • రాక్షసుఁడున్ శితకాండపంక్తులన్. ౩౭

అర్థములు. అంతకు = యమునియొక్క, అంతికసీమకు = సమీపప్రదేశమునకు, గ్రావ = పర్వతమురియొక్క, ఆతత శృంగము = విస్తారమైన శిఖరము, అసురౌఘము = రాక్షససమూహము. ధారిణీరుహ = చెట్లయొక్క, వ్రాతముతోడ = సమూహముతో, శితకాండపంక్తులన్ = పదునైన బాణసమూహములచే.

తాత్పర్యము

వాని తేరి చక్రము చేతనే చంపెను. ద్వివిదుఁడు పెద్ద శిఖరమెత్తి యశనిప్రభుఁడను రాక్షసు మీఁదవేసి రాక్షసులు చూచు చుండఁగా చెట్లను దీసికొని వానిపైఁ బడఁగా వాఁడు వాఁడి బాణముల వరుసలచే.

క. వృక్షముల నతికి యాతని, వక్షంబున నారసములు ◆ పరఁగించిన నా
వృక్షాటుఁడు సాలంబున, రాక్షసుతురగములఁ జంపె ◆ రథయుక్తముగన్. ౪౯౦

అర్థములు. నారసములు = బాణములు, వృక్షాటుఁడు = వానరుఁడు, ఆలంబున=యుద్ధమందు.

తాత్పర్యము స్పష్టము

సీ. అపుడు విద్యున్మాలి ◆ స్యందనారూఢుఁడై, కాంచనభూషిత ◆ కాండములను
వర్షించుచు సుషేణు ◆ బాధించి గర్జింపఁ, జివ్వున భూధర ◆ శృంగ మొండు
వైచి రథంబును ◆ భగ్నంబుఁ గావింపఁ; దటుకున నేలకు ◆ దాఁటి యతఁడు
గద కొని నిలఁబడఁ ◆ గవలి సుషేణుండు, బండ నొక్కటి నెత్తి ◆ పైకి నుఱుకఁ
ఆ. దలఁగ దాఁటి యతఁడు ◆ తనగదతోఁ గ్రోఁతి, ఱొమ్ము మీఁటి చూచి ◆ క్రుమ్మ్మటయును
వరకు సేయ కతఁడు ◆ సరగున నా బండ, వానివక్షమగల ◆ వైచుటయును ౪౯౧

అర్థములు. స్యందనారూఢుఁడై = ఆరూఢ స్యందనుఁడై = తేరి నెక్కిన వాఁడై, విశేషాంతమునకుఁ బరనిపాతము, కాంచన భూషిత = బంగారుచే నలంక రింపఁబడిన, కాండములను=బాణములను, అగలన్=పగులునట్లు.

తాత్పర్యము

అప్పుడు విద్యున్మాలి యనువాఁడు తేరెక్కి బంగారుచే నలంకరింపఁబడిన బాణములను వర్షించుచు సుషేణు నొప్పించి సింహనాదము సేయఁగా నతఁడు కొండ శిఖరమును వేగముగఁ దీసికొని వానిపై వేసి వాని రథమును విఱిచెను. ఆ రాక్షసుఁడు తటాలున నేలపై దుమికి గద తీసికొని నిలఁబడఁగా సుషేణుండు బండ నొక్కటిఁ దీసికొని పైకిఁ బరువెత్తఁగా వాఁడు తప్పించుకొని యావలికిఁ బోయి గదతో వానరుని ఱొమ్ము గుఱిచూచి వేయఁగా దానిని వాఁడు లక్ష్యము సేయక యాబండ వాని ఱొమ్ము పగులు నట్లు విసరి కొట్టెను.

క. ముద్ద యగుచు వక్షం బా గద్దఱికాఁ డుర్విఁ గూలెఁ ◆ గ విసంతతము లీ
పద్దున నోఁకులమూఁకలఁ, దద్దయు నాకమున కనిచె ◆ ద్వంద్వరణమునన్.

అర్థములు. గద్దఱికాఁడు=దిట్టతనముగలవాఁడు = విద్యున్మాలి-నోఁకుల= రాక్షసుల యొక్క; నాకమునకున్ = స్వర్గమునకు — ద్వంద్వరణమునన్ = దొమ్మి యుద్ధమందు.

ఱొమ్ము ముద్దకాఁగా నా శూరుఁడగు విద్యున్మాలి నేలఁబడెను. ఈవిధముగ వానరులు ద్వంద్వయుద్ధమున రాక్షసులఁ జంపిరి.

సీ. భగ్నంబులై గదా ◆ పట్టిసతోమర, ఖడ్గసాధనములు ◆ కలయ వ్రాలె
వివిధాకృతులు గాఁగ ◆ విధ్వస్తసైంధవ, సంఘంబు పడిచిన ◆ చంద మయ్యె
భిన్నదంతంబులు ◆ ఛిన్నశుండంబులై, భూరికుంజరములు ◆ ప్రోవు పడియె
నసురవానరులచే ◆ యుంబుల మేనుల, మొండెముల్ తుండెముల్ ◆ దండిమీఱెఁ

ఆ. దునిఁగిపడిన నొగలు•దునిసిన కాఁడులు, విఱిగిపడిన కండ్ల•విసరములును
అవనినెల్ల నెఱసె•నద్భుతరూపమై; వంచకముల కుత్స•వంబు గాఁగ. ౯౦౧

అర్థములు. భగ్నంబులై = విఱిగినవై - విధ్వస్త=నాశము చేయఁబడిన, సైంధవ సంఘము = గుఱ్ఱముల గుంపు - భిన్నదంతంబులు = విఱిగిన కొమ్ములు- భిన్నతుండంబులు = తెగిన తొండములు-భూరికుంజరములు=పెద్ద యేనుఁగులు - ప్రోవు=కుప్ప - వంచకములకు=నక్కలకు.

తాత్పర్యము

(రెండు పద్యములచే రణభూమి వర్ణింపఁబడుచున్నది.) విఱిగిన గదలు పట్టిసములు తోమరములు మొదలగు సాధనము లంతటఁబడియుండెను. నానాకారముగఁ జీల్పఁబడిన గుఱ్ఱములు పడిచినట్లుండెను. విఱిగిన దంతములు తునిఁగిన తొండములు గలవై పెద్ద యేనుఁగులు గుప్పలై పడియుండెను, వానర రాక్షసుల దేహముల తునకలు దండిగా యుండెను. తేరులు, నొగలు, కాఁడులు, కండ్లు భూమి యందంతయుఁ బడి యుండెను, ఇట్లద్భుత రూపమై రణభూమి నక్కలకుఁ బండువుగా నుండెను.

కం. బంధురరక్షః ప్లవగక, బంధంబులు నాట్యమాడె • భయదంబుగ ద
ర్పాంధు లగు కపులతో గత,గంధులు రాక్షసులు పోరి•కడఁక దలిర్పన్ ౯౦౨

అర్థములు. బంధుర = విశేషించిన, కబంధములు = మొండెములు, గతగంధులు=గర్వము పోయినవారు, కడక=ప్రయత్నము.

తాత్పర్యము

రాక్షసులయు వానరులయు మొండెములు విశేషముగ భయంకరముగ నాట్యమాడెను. బలముచే గర్వించిన వానరులతో గర్వము దిగిన రాక్షసులు కష్టముతో యుద్ధము చేయుచు.

ఉ. మేనుల రక్తముల్ గురియ • మేకొనఁజాలక చివ్వకెప్పుడో
కో- నిశ వచ్చు నంచుఁ దమ•యుల్లములం దలపోయుచుండఁగా
భానుఁడు గ్రుంకెఁ గ్రోఁతులకుఁ•బ్రాణవినాశిని రాత్రి ధ్వాంతసం
తానము పర్వఁజేయుచును•దారసిలెం గను గానకుండఁగన్. ౯౦౩

అర్థములు. చివ్వకు= యుద్ధమునకు, మేకొనఁ జాలక=పూనలేక, నిశ = రాత్రి, ధ్వాంతసంతానము=చీఁకటులగుమి, భానుఁడు సవమి.

తాత్పర్యము

దేహములందు నెత్తురు కాఱుచుండఁగా యుద్ధమునకుఁ బూనుకొనలేక తమకు బలకరమైన రాత్రి యెప్పుడు వచ్చునా యని, మనస్సులోఁ దలఁచుచుండఁగా సూర్యు డస్తమించెను. క్రోఁతులకుఁ బ్రాణనాశకరమైన రాత్రి చీఁకట్లు వ్యాపింపఁ జేయుచు కన్నులు గానరాకుండునట్లు తటస్థించెను.

## —♦ ౪౪ వ సర్గము. వానరరాక్షసుల రాత్రియుద్ధము ♦—

కం. ఆ పెంజీఁకటి యుద్ధ, వ్యాపారము జరగె బద్ధ ♦ వైరులకు బలో
ద్దీపకులగు కీశులకుం, బాపాత్ములైన దుష్ట ♦ పలలాశులకున్. ౧౦౪

అర్థములు. పెంజీఁకటి=పెను చీఁకటి, గాఢాంధకారము. బద్ధవైరులకు = విరోధ బుద్ధిచేఁ గట్టఁబడినవారు, బల+ఉద్దీపకులకు=బలముచేఁ బ్రకాశించువారు, ఇవి కీశులకు బలాశులకు విశేషణములు, పలలాశులు=రాక్షసులు, రాత్రియందు నింద్రజిత్తు పాపకార్యము చేయఁబోవుచున్నాఁడు కావున పాపపురాక్షసులనఁబడిరి.

తాత్పర్యము

ఆ గాఢాంధకారమందు మనస్సులందుఁ బగ గలిగినట్టియు బలము గలట్టియు వానరులకు, దుష్టులై పాపకార్యములు చేయు రాక్షసులకు యుద్ధము జరిగెను.

శా. ఓరీ రాక్షస! పోకు పోకు మన నో ♦ హో కీశ! రా రమ్ము నాఁ
గ్రూరుం జంపుము చంపు మం చనఁగ నా ♦ కూడుం దిగన్ మ్రింగునా
నోరీ పాఱక నిల్వరో యనఁగ నో ♦ హో పోనఁ బోనిత్తునా
రారా నాఁగ వినంబడెన్ రవము లా ♦ రాత్రిన్ సమిద్ధారిణిన్. ౧౦౫

అర్థములు. సమిత్+ధారిణిన్=యుద్ధభూమియందు.

తాత్పర్యము స్పష్టము.

కం. నీలతనూకాంతులతో, మేలిపసిఁడికత్తళముల ♦ మెఱుపులతో న
వ్వేళను వనౌషధులతో, శైలేంద్రము లట్టు లసుర ♦ సంఘము వెలిఁగెన్. ౧౦౬

అర్థములు. నీల తనూ కాంతులతోన్=నల్లని దేహముల కాంతులతో, పసిఁడి కత్తళముల=బంగారు కవచముల వనౌషధులతో = అడవిమూలికలతో.

తాత్పర్యము

నల్లని దేహకాంతులు మంచి బంగారు కవచముల మెఱుపులు గలిగిన రాక్షసుల సమూహము అడవిమూలికలతోఁ గొండలవలెఁ బ్రకాశించుచుండెను. రాత్రులందుఁ గొన్ని మూలికలు ప్రకాశించుచుండును.

ఉ. ఆ నిబిడంపుఁజీఁకటిని ♦ నాశరకోటులు మ్రింగఁ జొచ్చె న
వ్వానరపాళిఁ, గ్రోధులును ♦ వారక శత్రుతురంగ దంతిసం
తానములం బతాకలను ♦ దర్పజసంఘముఁ దీక్ష్ణదంష్ట్రిలన్
బూనికఁ దున్కఁ దున్కలుగఁ ♦ బోఁడిమి మాపిరి బెట్టిదంబుగన్. ౧౦౭

అర్థములు. నిబిడంబు=దట్టమైన, ఆశరకోటులు=రాక్షససమూహములు. శత్రు = విరోధుల, తురంగ = గుఱ్ఱములయు, దంతి = ఏనుగులయు, సంతానములన్=సమూహములను.

తాత్పర్యము

ఆ దట్టమైన చీఁకటియందు రాక్షససమూహములు వానరులను బట్టి మ్రింగ

నారంభించిరి. క్రోధులును శత్రువుల గుఱ్ఱములను ఏనుఁగులను టెక్కెములను ధ్వజములను కఱకు కోఱలచే తునుకలు తునుకలుగ చీల్చివైచుచుండిరి.

సీ. రామలక్ష్మణు లప్డు ♦ సామర్ష చిత్తులై, శింజినీనాదంబు ♦ చెవుడు గొలుప
జడివాన గురిసిన♦వడువున బాణముల్, గురియించి యించుక♦గోచరించు
పరిపంథులను గత♦ప్రాణులుగాఁ జేయ. రక్కసుల్ పెనువీఁక♦రథముఁ బఱప
గుఱ్ఱాలగొరిజల♦కొట్టుల రేఁగిన,ధూళి బిల్వాఁగు నం♦ధులను జెవిటి

ఆ. వారిఁ జేసెఁ దచ్ఛ♦రీరంబులను గాఱు,నల్ల వెల్లిపాఱెఁ ♦ గొల్లగాఁగఁ
బణవశంఖ వేణు♦బహుళభేరీనాద, ములును బర్వెదిక్కు♦లలము కొనఁగ. ౯౦౮

అర్థములు. సామర్ష చిత్తులై = కోపముతోఁగూడిన మనస్సుగలవారై - శింజినీ నాదంబు = అల్లెత్రాటిధ్వని - ఇంచుక గోచరించు = కొంచెమైనను గాన వచ్చు-ఇట్లు చెప్పుటచే చీఁకటి వలువులో నల్లని రాక్షసులు గుర్తింపరాకుండి రని భావము-పరిపంథులను=పగవారిని - గతప్రాణులు = చచ్చినవారు - గొరిజల = గిట్టల-నల్ల=నెత్తురు - వెల్లిపాఱెన్ = ప్రవహించెను. పణవ=తప్పెట - వేణు = పిల్లఁగ్రోవి-అలముకొనఁగన్ = ఆక్రమించునట్లు.

**తాత్పర్యము**

రాత్రులందు రాక్షసులకు బలమెక్కువ కావున వారు విజృంభించుట చూచి కోపించి రామలక్ష్మణులు అల్లెత్రాటిధ్వని చెవుడు గలిగింప మీటుచు, జడివాన వలె బాణములు గురియించి కొంచెమైన గుర్తింపఁ జాలిన రాక్షసుల వధించిరి. రాక్షసులును బరాక్రమించి రథములు తోలఁగా గుఱ్ఱాల గిట్టల దెబ్బలచే రేఁగిన దుమ్ము చెవులలో నిండి చెవిటివాండ్రను కన్నులలోఁబడి గ్రుడ్డివాండ్రను జేసెను. ఆ దేహముల నుండి నెత్తురు వెల్లువలై పాఱెను, తప్పెటల శంఖముల పిల్లఁగ్రోవుల పెద్దనగారాల ధ్వని దిక్కులందు వ్యాపించెను.

క. చచ్చెడిరక్షః ప్లవగుల, యుచ్చావచమైన రొదుప్పు ♦ టులి వెల్లదెనన్
బెచ్చరిల్లెఁ గఠోరంబుగ, నచ్చటులసమిద్ధరిత్రి ♦ యా సమయమునన్. ౯౦౯

అర్థములు. ఉచ్చావచము=అనేక విధములైన, 'ఉచ్చావచం నైక భేద' మ్మని యమరము. ఉలివు = ధ్వని, చటుల = ప్రాణులచేఁ జలించుచున్న, సమిత్ +ధరిత్రి=యుద్ధభూమి.

**తాత్పర్యము**

చచ్చుచున్న రాక్షసులయు వానరులయు నానావిధములైన రొదుపు ధ్వనులు నన్ని ప్రదేశములఁ గటువుగ హెచ్చరిల్లెను.

ఆ సమయమందు యుద్ధభూమి.

క. ఘోర రాక తెలియ రాకయుఁ, బురుశోణితమాంసపంక♦ముగ శరసూనో
త్కరసముపహార యయ్యెను, హరివరపలలాదసంఘ♦హారిణి యగుచున్. ౯౧౦

అర్థములు. దారరాక = ప్రవేశించుటకు సాధ్యపడక, తెలియరాక = భూమి కనఁబడక, పురు = విస్తారమగు, శోణిత మాంస పంకముగన్ = నెత్తురు మాంసము బురదగా, శర=బాణములనెడి, సూనోత్కర = పూలసమూహ మనెడి, సముపహార = బలులు గలది, హరివర—వానరశ్రేష్ఠులయు, పలలాద = రాక్షసులయు, ప్రాణ హారిణి=ప్రాణముల హరించునది.

తాత్పర్యము

ప్రవేశించుట కష్ట సాధ్యమై, చూచుట కష్టసాధ్యమై, అధికమైన నెత్తుటిచే మాంసముచే బురదయై బాణము లనెడి పూవులను బలులుగాఁ గలదై,

## —♦ శ్రీరాముఁడు రాక్షసుల వధించుట ♦—

ఆ. పొలిచెఁ గాళరాత్రి♦పోలిక నారాత్రి యట్టిసమయమునను ♦ నసురవరులు
పిండు గట్టి నిశిత♦కాండముల్ గురియుచుఁ రాముఁ దాఁకి రుగ్ర♦రభసమునను.

అర్థములు. కాళరాత్రి=భీమరథి రాత్రి, 'రాత్రి ర్భీమరథిర్నామ సర్వ ప్రాణిభయావహా' యను వాక్య మిటఁ బ్రమాణము. (౨) కాళరాత్రియని యొకానొక శక్తి. 'సతీచ కాళరాత్రిశ్చ భైరవీ గణనాయికా' యను వాక్య మీ యర్థమునఁ బ్రమాణము. పొలిచెన్=ప్రకాశించెను. పిండుగట్టి = గుంపుగూడి, ఉగ్రరభసమునన్=మిగుల వేగమున.

తాత్పర్యము

ఆ రాత్రి కాళరాత్రివలె నుండెను. ఆ సమయమున రాక్షసశ్రేష్ఠులు గుంపుగూడి మిగుల వేగముగ వాఁడి బాణముల గురియించుచు రామచంద్ర మూర్తిని నెదిరించిరి.

క. వారలు కోపోద్రేకిత, నారావము పేర్మి నభము♦నగలించుచు దు
ర్వారత రానాగర్జలు, పారావారములు పొంగు♦భంగిగ నయ్యెన్. ౯౧౨

అర్థములు. కోపోద్రేకితన్ = కోపాతిశయమున — నభము = ఆకాశము— అగలించుచున్=వక్కలు చేయుచు — దుర్వారతన్ = అడ్డములేక — పారావారములు=సముద్రములు.

తాత్పర్యము

కోపాతిశయముచే వారు తమ కంఠధ్వనులచే నాకాశమును బగులఁజేయుచు రాఁగా వారిసింహనాదములు సముద్రములు పొంగినవా యన్నట్లు తోఁచఁజేసెను.

ఉ. వారలరాకఁ జూచి రఘు♦వర్యుఁడు చాపము చంద్రమండలా
కారము గాఁగ జ్యారవము♦కర్ణపుటీ ప్రవిదారణంబుగా
నారసముల్ రెగం దొడిగి ♦ నల్వుర నిద్దర నారిటన్ వడిన్
బోరగిలన్ బడన్ నఱకె♦భూరిభుజంబు నిమేషమాత్రలోన్. ౯౧౩

అర్థములు. జ్యారవము = నారి ధ్వని – కర్ణపుటీ ప్రవిదారణంబుగా = దొప్పలవంటి చెవులు పగిలిపోవునట్లుగా—నారసముల్ = బాణములు – నారాచ శబ్దభవము. తెగన్=అల్లెయందు – తొడిగి = సంధించి.

## తాత్పర్యము

వారిట్లు వచ్చుట చూచి రామచంద్రమూర్తి విల్లు చంద్రమండలము వలె గుండ్రమగునట్లు వంచి యల్లెత్రాటిధ్వని చెవులను బగులఁజీల్చఁగా బాణములాఱు సంధించి యాఱుగురు రాక్షసులు బోరగిలఁబడి చచ్చునట్లు నిమిషకాలములో వారిని నఱకెను.

సీ. అంతట బోక ఖ♦రాంతకుం డెదిరిన, యమశత్రు దుర్ధర్షు♦నమితబలు మ
హాపార్శ్వుని మహోద♦రాఖ్యు మహాకాయు, వజ్రదంష్ట్రుని భీమ♦బాహులైన
శుకసారణులఁ గ్రూర♦వికట బాణంబులా,సారంబుగాఁ గప్పఁ ♦ జావు దప్పి
పాతి రంతట రామ♦బాణావళియు నిరా,ఘాటంబుగాఁ బాఱె♦సూటి చెడక

తే. యగ్ని శిఖలకుఁబురు డయి♦హాటకాంచి,తంబులగుచును రామనా♦మంబులొప్పు
విశిఖచయముల దశ లెల్ల♦వెలుఁగఁజేసె, వహ్నిగతశలభాళినాఁ♦బరులుమడియ.

అర్థములు. నిరాఘాటంబుగా = అడ్డములేక, పురుడు = సమానము, హాటకాంచితంబులు = బంగారుచేఁ బ్రకాశించునవి, విశిఖచయములన్ = బాణ సమూహములచేత, వహ్నిగత=మంటలోఁబడిన శలభాళినాన్ = మిడుతల గుంపో యనునట్లు – పరులు=శత్రువులు, మడియన్ = చావఁగా.

## తాత్పర్యము

అంతతో వదలక రామచంద్రమూర్తి తన్నెదిరించిన యమశత్రువు దుర్ధర్షుఁడు మహాబలశాలియగు మహాపార్శ్వుఁడు మహోదరుఁడు వజ్రదంష్ట్రుఁడు భయంకరమైన చేతులుగల శుకసారణులనువారిని పదునైన బాణములచే వర్షము వలెఁ గప్పఁగా చావుఁదప్పించుకొనఁ బరువెత్తిరి. అంతట రామబాణము లడ్డము లేక గురిచెడక రాక్షసులపైఁ బోయెను. అగ్నిజ్వాలకు సమానములై బంగారుచేఁ బ్రకాశించునవియై రామ నామములు చెక్కఁబడినవైన బాణసమూహములు దిక్కులను బ్రకాశింపఁజేసెను. వానిలో రాక్షసులు మంటలోఁబడిన మిడుతలైరి.

ఉ. ఏపును గోపునుం గలసి ♦ యొంతయు వింతలు సంతరింపఁగాఁ
జూపును రూపునుం బెరసి ♦ సూదులదాడుల గోడగింపఁగాఁ
ద్రోపును దాఁపు నేక మయి ♦ రోపము వేపము భీమణంబుగాఁ
గైపును సైఁపు లేమియు నొ♦కండుగ రాముఁడు చండమూర్తియై. ౯౧౫

అర్థములు. ఏపు=విజృంభణము – కోపు = వింటికొప్పు– సంతరింపఁగా= కలిగింపఁగా – తూపు = బాణము–బెరసి = కలసి – సూదుల = విరోధుల–దాడు లన్=సైన్యములను – గోడగింపఁగాన్=బాధింపఁగా = తాఁపు=దెబ్బ, కైపు =

విజృంభణము-సైపరానిదియు; చండమూర్తియై=కోపముతోఁగూడిన యాకారము గలవాఁడై.

తాత్పర్యము

వింటికొప్పుయొక్క విజృంభణ మెంతో వింతగా నుండెను. అనఁగా బాణము లాగి నపుడు వంగుట విడిచినపుడు లేచుట, యిది యెప్పుడు వంగునో యెప్పుడు లేచునో తెలియరానంతటి వేగముగాఁ బనిచేయు చుండె నని భావము. దృష్టియు బాణము కలసి యనఁగా చూపు పడినచోట బాణము పడియుండునని భావము. శత్రువుల సేనను బాధింపఁగా బాణమువిడుచుట దెబ్బతగులుట యొక్కటయి రోషముతోఁ గూడిన వేషము, భయంకరముగా విజృంభణము, తొందరపాటు నొకటి కాఁగా రామచంద్రమూర్తి చంద్రుఁడై కానవచ్చెను.

క. ఒండు గుఱి సేయఁ దొడుగఁడు, రెండవబాణమును; నే శ•రీరికి నేనిన్
గాండము వెన్నునఁ దగులదు, బెండుగ వ్యర్థ మోవ దొక్క•విశిఖంబేనిన్.

అర్థములు. తొడుగఁడు=సంధింపఁడు - కాండము = బాణము - వెన్నునన్=వీఁపునందు-బెండుగన్=నిస్సారముగ-విశిఖము=బాణము.

తాత్పర్యము

ఒక్కగుఱి భేదించుట కొక్క బాణమే కాని రెండవ బాణము సంధింపఁడు-ఏదేహికైనను బాణము వీఁపున నాటను- గుఱి తప్పిపోయిన బాణముగాని, పగిలి వ్యర్థముగఁబోయిన బాణముగాని లేదు.

వెన్నిచ్చినవానిని రామబాణము విష్ణు చక్రము చంపవు. కావుననే కాకాసురుఁడు, దుర్వాసుఁడు పరువెత్తునపుడు కూడఁబోయి తఱిమెను గాని తగులలేదు.

తే. కనకపుంఖవిరాజిత•కాండతతులు, వేనవేలుగ నెల్లెడ• వెడలి పఱవఁ
బొలిచె రాతిరి మిణుఁగురు•పురుగుగముల, రహిఁ దహించిన శారద•రాత్రికరణి.

అర్థములు. కనక పుంఖ విరాజిత = బంగారు పింజలచేఁ బ్రకాశించు, కాండతతులు = బాణసమూహములు.

తాత్పర్యము

బంగారుపింజలచేఁ బ్రకాశించు బాణసమూహములు వేలకొలఁదిగ నన్ని ప్రదేశములందు వ్యాపింపఁగా నా రాత్రి మిణుఁగురు పురుగులచే వ్యాపించిన శరత్కాల రాత్రివలె నుండెనని భావము.

క. క్రూరాసురగర్జనముల, భూరుహచరసంచయప్ర•భూతరవములన్
ఘోరం బగు నా యామిన, ఘోరతరం బయ్యెనపుడు•గుండెలు పగులన్.

అర్థములు. భూరుహచర=వానరులయొక్క, సంచయ = సమూహముల యొక్క. ప్రభూతరవములన్ = అధిక ధ్వనులచే.

తాత్పర్యము

గాఢాంధకారము క్రమ్ముటచేతనే భయంకరమైన యా రాత్రి, రాక్షసుల క్రూరగర్జల చేతను వానరుల విస్తార ధ్వనుల చేతను, మఱింత భయంకరమై గుండెలు పగిలించుచుండెను.

తే. ధ్వాంతనీకాశనిజతనూ॰కాంతు లెసఁగు
కొండ్రముచ్చులు తమరొదల్॰ కొండ నిండ
దాపరించిన రక్కసు॰దాఁటుఁ బట్టి
పట్టు వదలక భక్షించి॰ వైచె నపుడు. ౨౯

అర్థములు. ధ్వాంతనీకాశ=చీఁకటితో సమానమైన, నిజతనూకాంతులు=తమ దేహకాంతులు, రక్కసదాఁటున్=రాక్షససమూహమును.

తాత్పర్యము

చీఁకటితో సమానమైన తమ నల్లని దేహకాంతు లతిశయింపగా కొండ్రముచ్చులు తమ ధ్వనులు త్రికూట పర్వతము నిండునట్లు చేయుచును, దొరకిన రాక్షసులను బట్టి వదలక తినుచుండెను.

## —॰ ఇంద్రజిత్తంగదుచేఁ బరాజితుఁ డయి మాయాయుద్ధ మొనర్చుట ॰—

చ. ప్లవగులయేటు రాక్షసుల ॰ పాటు నరేంద్రులపోటు చూచి యా
దివిజధవారి రావణి మ॰దిం గనరెత్తి విలాసవిక్రమం
బవితథమై చెలంగఁ గుధ॰రాటులపైఁ గవియంగఁ దోడుతోఁ
దివమెయి వాలిసూనుఁ డవ॰లీలను వాని హతాశ్వుఁ జేయుచున్. ౩౦

అర్థములు. ఏటు=దెబ్బ, ఇచ్చట దెబ్బ కొట్టెడి పరాక్రమ మని యర్థము. పాటు = నాశము, పోటు = శౌర్యము, దివిజధవారి = ఇంద్రజిత్తు, కనరెత్తి = కోపించి, అవితథమై=వ్యర్థము గానిదై, కుధరాటులపై= వానరులమీఁద, తోడుతోన్ = వెంటనే, లిఘిమెయిన్ = అధిక లాఘవముతో, అవలీలను=అనాయాసముగా, హతాశ్వన్ = చచ్చిన గుఱ్ఱములు గలవానిఁగా, ౪౪౪ వ పద్యమునఁ జెప్పఁబడిన దాని శేష ముపక్రమించుట గాని, వేఱొక రథము సిద్ధము చేసికొని మఱల వచ్చెనని కాని యెంచవలెను.

తాత్పర్యము

వానరుల పరాక్రమము రాక్షసుల నాశము రామలక్ష్మణులశౌర్యముఁజూచి యింద్రజిత్తు కోపించి తన పరాక్రమము సార్థకమగునట్లు వానరులపై గవిసెను. వాని వెంటనే యంగదుఁ డతిలాఘవముతో ననాయాసముగా వాని గుఱ్ఱములను జంపి.

కం. సారథిని జంపి రావణి, తీ రిదిగా దనుచుఁ దేరు॰దిగ దాఁటుచు మా
యారంభుండై మఱఁగిన, వీరునిఁ దారేయుఁ బొగడె॰విబుధర్షితతుల్. ౩౧

అర్థములు. మాయారంభుఁడు=మోసవిద్యయందుఁ దనకుఁగల యద్భుత శక్తిని జూపనారంభించినవాఁడై, మఱిఁగినన్ = కానరాకపోఁగా, తారేయున్ = అంగదుని, విభుదర్షి తతుల్ = దేవఋషులసమూహములు.

తాత్పర్యము

సారథిని జంపఁగా నింద్రజిత్తు ప్రత్యక్షయుద్ధమున వీరిని జయింప సాధ్యము గాదని తలంచి తేరుదిగి వంచనయందు దనశక్తిఁ జూపఁ దలఁచిన వాఁడై కానరాక పోఁగా వీరుఁడగు నంగదుని దేవర్షి సంఘంబులు పొగడెను.

కం. ధీరుం డని మాయాజి వి, శారదుఁడని ప్రధనమున న•జయ్యుం డని శ
క్రారిని జగమెఱుఁగుట న, వ్వీరుని నోడుచుటకును మెచ్చె•విశ్వము కీశున్.

అర్థములు. మాయాజిన్ = మాయాయుద్ధమందు, విశారదుఁడు = పండితుఁడు, ప్రధనమునన్=యుద్ధమందు; అజయ్యుండని=గెలువ శక్యముకానివాఁడని, ఓడుచుటకున్=ఓడించుటకు - విశ్వము = ప్రపంచము.

తాత్పర్యము

ఇంద్రజిత్తు మహాధైర్యశాలి యని మాయాయుద్ధమందు సమర్థుఁడని యుద్ధమున జయింపరాని వాఁడని లోకమునకుఁ దెలియును గావున నట్టివాని నోడించుటచేత లోక మంగదుని మెచ్చెను.

ఉ. మెచ్చిరి రామలక్ష్మణులు • మే లని రర్కజుఁడున్ విభీషణుం
డిచ్చ దలిర్ప నిట్లు ప్లవ•గేశుని తాఁకున కోహటించి లో
మచ్చర మెచ్చ రక్కసుఁడు•మాయను గైకొని కానరాక కీ
శోచ్చయమున్ నిశాతవిశి•ఖోత్కరముం గురియించి యేఁచినన్. ౯ ౧౩

అర్థములు. ఓహటించి=వెనుదీసి-ఇచ్చదలిర్పన్ = సంతోష మతిశయింపఁగా-కీశోచ్చయమున్ = వానర సమూహమును - నిశాత విశిఖోత్కరమున్ = పదునైన బాణముల సమూహమును - ఏఁచినన్=బాధింపఁగాఁ.

తాత్పర్యము

అంగదుఁడు చేసిన కార్యముఁ జూచి రామలక్ష్మణులు మెచ్చుకొనిరి. సుగ్రీవుఁడు విభీషణుఁడు మేలుమేలని మిగుల సంతోషించిరి. ఇట్లు లంగదుని దెబ్బకు వెనుదీసి యింద్రజిత్తు మాత్సర్య మతిశయింపఁగా పరులకుఁ గానరాకుండఁ జేయు తిరస్కరిణీవిద్య నాశ్రయించి యెవరికిఁ గనఁబడక వాఁడి బాణసమూహములచే వానరులను బాధింపఁగా.

ఉ. అయ్యెడ రామచంద్రుఁడు వ•నాటసమూహములార! వీఁడు కే
కయ్యమునం దసాధ్యుఁడు, జ•గత్త్రియముం బరిపీడితంబుగా
న య్యజదత్తదుర్వర బ•లాధికతం జెలుపంగఁ జాలు, నా
కియ్యెడ బ్రహ్మవాక్య క్షమి•యింపఁగ నర్హము గాన మీరలున్. ౯ ౧౪

అర్థములు. వనౌకసః=వానరుల, రణయుద్ధమునందు = రాత్రి యుద్ధమందు, అజదత్త = బ్రహ్మచే నీయఁబడిన, దుర్వారబలాధికతస్ = చెడ్డవరముల బలము యొక్క యతిశయముచే.

తాత్పర్యము

అప్పుడు రామచంద్రమూర్తి యిటనియెను. వానరులారా! వీఁడు రాత్రి యుద్ధమందసాధ్యుఁడు. బ్రహ్మ యిచ్చిన దుష్టవరముల బలమున మూఁడు లోకములను బాధింప సమర్థుఁడు. ఏమి రామచంద్రా! నీకసాధ్యమైనది కలదా యందురేమో? నేను బ్రహ్మమాటను వ్యర్థము చేయరాదు. గౌరవింపవలెను. నేను గౌరవింపక వ్యర్థము చేసితినేని నతఁడు అసత్యమాడినవాఁడగును. తరువాత నాయనను దలఁచువాఁడే యుండఁడు. అట్టిస్థితి నతనికిఁ దేరాదు. కావున నేను లోఁబడియుండవలసి యున్నది. సర్వమాయలను నాశనముచేయు బ్రహ్మాస్త్రము, బ్రహ్మశిరోనామకాస్త్రము, నారాయణాస్త్రము లోనైన మహాస్త్రములు రామచంద్రునొద్దఁగలవు. కాని వానిని బ్రయోగించిన నింద్రజిత్తప్పుడే చచ్చునుగాని బ్రహ్మమాట వ్యర్థమగును. ఇంద్రజిత్తు ప్రథమ యుద్ధమందు వదలిన బాణములు బ్రహ్మాస్త్రమంత్రమెఱింగిన హనుమద్విభీషణుల బాధింపవయ్యె. ఆమంత్రము రామలక్ష్మణు లెఱుఁగుదురు. బ్రహ్మనిమిత్తమై కట్టుబడవలసివచ్చెను. యమ రావణ యుద్ధమందు బ్రహ్మ కిటువంటి కష్టమే వచ్చెను. యముని దండ మమోఘముగ బ్రహ్మయే చేసెను. దేవతలచేఁ జావకుండ రావణునకు వరమిచ్చెను. యముఁడు రావణునిపై దండమునైన నెత్తెను. రావణుఁడు దానితోఁ జచ్చినను చావకున్నను బ్రహ్మమాట వ్యర్థమగును. కావున బ్రహ్మ ప్రార్థింపఁగా యముఁడు యుద్ధము చాలించి పోయెను. బ్రహ్మరుద్రులిట్టు లనాలోచితవరములిచ్చుచుందురు. రామచంద్రమూర్తి భృగువు గౌరవము దక్కింప భార్యావియోగము సహించెను. బ్రహ్మ పరువు కాపాడ నాగపాశబద్ధుఁడయ్యెను. తండ్రిమాట కాపాడుటకైకదా వనములపాలాయెను. ఇది గదా మహాపురుష లక్షణము.

కం. సుగ్రీవునికడ నిలఁబడి, జాగ్రద్దశనుండుఁ డనియె • శతమన్యుజితుం

డాగ్రహమున నంతర్హిత,విగ్రహుఁడై మింటి కెగసి•విశ్వభయదుఁడై. ౯౭

అర్థములు. శతమన్యుజితుండు = ఇంద్రజిత్తుఁడు, నిషాంతిమునఁ బరని పాలము, జితశతమన్యుఁ డని యర్థము. ఆగ్రహమునన్ = కోపముతో, అంతర్హిత విగ్రహుఁడై =మఱుఁగుపడిన శరీరము గలవాఁడై, విశ్వభయదుఁడై = అందఱకు భయము కలిగించువాఁడై.

తాత్పర్యము

సుగ్రీవునొద్ద నిలఁబడి హెచ్చరికతో నుండుఁడని చెప్పెను. ఇంతలో నింద్రజిత్తు కోపముచే రామ వానరనాశమందభినివేశము గలవాఁడై యంతర్ధానవిద్యచేఁ గానరానివాఁడై యాకాశమున కెగసి యందఱకు భయము కలిగించువాఁడై.

చం. పిడుగులపిండుపాటు దలఁ • పింపఁగ శాతశరోత్కరంబులన్
జడిగొనఁ గీశసంఘముల • సైన్యముపైఁ గురియింప వారలున్
జడిమయు జిచ్చపాటు కడు • సంభ్రమపాటును బొంది దిగ్భ్రమన్
వడి చెడి తూలి సోలి యిలి • వ్రాలి యడంగి ముడంగి రంతయున్. ౯౨౮

అర్థములు. పిడుగుల పిండుపాటు = పిడుగుల సమూహము పడుటను, తలఁపింపఁగన్=తలఁపునకుఁ దెచ్చునట్లు, శాత = పదునైన, శరోత్కరంబులన్ = బాణసమూహములను, జడిమయు=జడమువలె నేమియుఁ దెలియకపోవుట, చిచ్చపాటు=నిశ్చేష్టత, సంభ్రమపాటు=భయము, వడి = వేగము, తూలి = చలించి, సోలి = పరవశులై, వ్రాలి = పడి, ముడంగిరి = కాళ్ళు చేతులు ముడుచుకొనిన వారైరి.

తాత్పర్యము

పిడుగులగుంపు పడుటను స్మృతికిఁ దెచ్చునట్టి వాఁడి బాణముల సమూహమును జడివానవలె వానరసేనపైఁ గురియింపఁగా వారు మొద్దుబారినవారై నిశ్చేష్టులై భయపడి దిక్కు తెలియక వేగము చెడి నిలిచి వెనుకకు ముందునకు నూఁగి పరవశులై నేలఁబడి యణఁగి కాళ్ళు సేతులు ముడుచుకొని యుండిరి.

ఉ. ఎరికిఁ జూడ రాక తన • యొచ్చటియున్కియుఁ దోఁపనీక పెం
పార భయంకరాహివిశి • ఖావళి రాము సుమిత్రనందనున్
బీరము దీఱ బాణచయ • విద్ధసమస్తశరీరభాగులం
గా రయమారఁ జేసె దశ • కంఠతనూజుఁ డతుల్యతీవ్రతన్. ౯౨౯

అర్థములు. భయంకరాహి విశిఖావళి = భయంకరములైన పాముల యొక్క యాకారములు గల బాణసమూహము, ఇవి కేవలము బాణములు కావు పాములు కావు. బాణములు పాములవలెఁ జుట్టుకొనఁజాలవు. పాములు చుట్టుకొనిన దేహబాధ లేదు. ఇవి పాములవలెఁ జుట్టుకొనును. బాణములవలె బాధించును. సర్పములందు నస్త్రమంత్రము లావహింపఁ జేసెనని చెప్పనగు. కావుననే గరుత్మంతునిఁ జూడఁగానే యవి పరువెత్తెను. చూ. ౧౦౪౭ పద్యము. అచేతన బాణములందు మంత్రము లావహింపఁజేసిన యెడల నవి పరువెత్తి పోఁజాలవు-కావున నాగాస్త్రమంత్రముచేఁ బాణములనే సృష్టించి వానిచే మంత్రశక్తిచేతఁ గట్టివైచెను. బీరము దీఱన్=పౌరుషము క్షయించునట్లు, బాణచయ=బాణసమూహములచే, విద్ధ=బాధింపఁబడిన, సమస్త శరీరభాగులన్=దేహమునందలి యన్నిభాగములు గలవారలను, అతుల్య తీవ్రతన్=అసమానమైన తీక్ష్ణత్వముచే.

తాత్పర్యము

ఎవరైనను జూచుటకు సాధ్యపడక తానెక్కడ నుండునదియుఁ దెలియనీక విజృంభించి యింద్రజిత్తు భయంకరములైన పాముల యాకారము, గుణములు గల

బాణసమూహముచే వారి పౌరుషము చెడునట్లు రామలక్ష్మణుల సర్వావయవము లను మిగుల వేగముగ బాధించెను.

చం. కదనతలంబునం దభిము•ఖంబుగ నిల్చి నృపాలపుత్రులన్
మద మణఁగింపలేమి సుర•మర్దనుఁ డయ్యెడ మాయ పెంపునన్
జిదుమఁగ నెంచి వృక్షచర•శేఖరు లెల్లను జూచుచుండ న
వ్విదితపరాక్రముండు గడ•చెన్ శరబద్ధులఁ జేయ వారలన్. ౯ ౨౮

అర్థములు. ఇంద్రజిత్తు మాయ నాశ్రయింపఁ గారణము చెప్పఁబడు చున్నది. అభిముఖంబుగన్=ఎదురుగ- చిదుమఁగన్ = ఖండింపఁగా, విదిత పరాక్రముఁడు = ప్రసిద్ధి కెక్కిన పరాక్రమము గలవాఁడు, కడచెన్ - కడఁగెన్ = ప్రయత్నించెను-శరబద్ధులన్=బాణములచేఁ గట్టఁబడిన వారిని.

తాత్పర్యము

యుద్ధభూమియందు నెదురుగనిల్చి యుద్ధముచేసి రామలక్ష్మణుల జయింప సాధ్యముగాదని తెలిసికొని మాయచేత వారిని ఖండింపనెంచి ప్రసిద్ధపరాక్రము డయ్యును వానరులందఱుఁ జూచుచుండ వానిని బాణములచేఁ గట్టివేయ యత్నించెను.

**-• ౪౫-వ సర్గము. ఇంద్రజిత్తు శ్రీరామలక్ష్మణుల నాగపాశబద్ధులఁ జేయుట •-**

ఉ. ఎందును దానయై, యునికి • యేమియుఁ గానఁగ రాక, మాయ మి
న్నంది పరాక్రమించు నసు•రాధిపనందను రోయ వృత్రహ
నందననందనుం ద్రుహిణ • నందను నీలు సుషేణపుత్రులన్
వందితవిక్రమున్ శరభ•వానరునిన్ ఋషభాఖ్యు వెండియున్. ౯ ౨౯

అర్థములు. ఎందును దానయై = ఇది భగవంతుని సర్వవ్యాపకత్వము వంటిది కాదు. కొఱవిని ద్రిప్పినట్లని యెంచవలయును, అతివేగముగఁ గొఱవిని ద్రిప్పితిమేని నిప్పు చక్రమే కానవచ్చును. ఇది గమనవేగమును దెలుపును. మాయ=అంతర్ధాన విద్యాబలముచే - మిన్నంది=ఆకాశమున నిలిచి - వృత్రహ నందన నందనున్ = వాలికుమారుఁ డగు నంగదుని-ద్రుహిణ నందను = జాంబవంతుని.

తాత్పర్యము

ఏ ప్రక్కఁజూచిన నా ప్రక్కఁ దానున్నట్లు దోఁపజేయుచు తిరస్కరిణీ విద్యా బలముచే నెవరికిని గానరాక యాకాశమందుండి పరాక్రమము చూపు నింద్ర జిత్తును వెదకుటకు నింద్రునిమనుమని నంగదుని, బ్రహ్మ కొడుకు జాంబవంతుని, నీలుని, సుషేణ పుత్రులను, నందఱచే నమస్కరింపఁబడిన పరాక్రమము గల శరభుని, ఋషభుని మఱియు.

కం. వినతుని సానుప్రస్థుని, ఘను ఋషభస్కంధుఁ బంప • ద్వ్యామరుమహాగిరిసా
ధనులై మింటను నల్గడఁ, బనిగొని నెమకంగ నింద్ర•వైరియుఁ గడిమిన్. ౯౩౦

తాత్పర్యము

వినతుని, పానప్రస్థుని, ఋషభస్కంధుని పంపఁగా వారు చెట్లు కొండలు సాధనములుగాఁ దీసికొని యాకాశమునందు నాలుగు ప్రక్కలఁ బనిపూని వెదకఁగా నింద్రజిత్తు బలముచే.

కం. రెక్కలుగల పెనుఁబాముల, మొక్కలమున జివ్వటన్న • మ్రోఁతయె బుసగా
నొక్కవడి బాణజాలం, బక్కపితతి దిమ్మఁదిరుగ • నడరించి మఱిన్. ౯౩౧

అర్థములు. మొక్కలమునన్ = బలముతో, ఒక్కవడిన్=ఒక్కసారిగ, దిమ్మఁదిరుగన్ = భ్రమపడునట్లు.

తాత్పర్యము

రెక్కలుగల పెద్దపాముల బలముతో జివ్వని మ్రోయు బాణముల మ్రోఁతయే పాముల బుసగా నొక్కసారిగ నసమాన వేగముతో బాణముల సమూహమును వానరుల సమూహము మీఁద వారు దిక్కుతెలియక భ్రమగొనునట్లు ప్రయోగించి మఱియును.

కం. పరమాస్త్రంబుల వారల, త్వరయును గమనంబు నాఁప • వనచరవీరుల్
పరికింపరైరి యాతని, బరపగు నాగడపలఱుమ • భాస్కరు ననఁగన్. ౯౩౨

అర్థములు. పరపు + అగు = విశాలముగ వ్యాపించిన - ఆగడపలు = మబ్బుల గుంపులు - ఇది నిత్యబహువచనాంతము - అఱుమన్ = ఆక్రమింపఁగా.

తాత్పర్యము

ఉత్తబాణముల చేతనే కాక మహాస్త్రముల చేతను వారల వేగము సంచారము నణఁపఁగా వారు పదుగురు విశాలమేఘముల గుంపు క్రమ్మిన సూర్యునివలెఁ జూడ లేక పోయిరి.

చ. తెఱపి యొకింత యిచ్చినను • దెప్పిలికేనియు వీరి మ్రోలఁ గ్ర
మ్మఱ నిలఁగా నశక్య మని • మానవరాజకుమారవీరులన్
గలఁకుఁ గసిందికోఁతల ఘ • గమ్ములు మేనుల నిండ దండిగా
నిలుగడ లేక యయ్యసుర • వీరుఁడు నైచె సరోషచిత్తుఁడై. ౯౩౩

అర్థములు. తెఱపి = అవకాశము-సందు-తెప్పిలికి + ఏనియు = తెప్పతిల్లుకొన్న యెడల - అపాయము నుండి తప్పించుకొన్న యెడల - కలఁకు = తీక్ష్ణమైన-కసింది=కఠినమైన-శబ్దరత్నాకరమున నీ శబ్దము నిర్బిందుకముగాను, అల్పమని యర్థమనియు వ్రాయఁబడినది. కాని వరాహ పురాణము పంచమాశ్వాసము ౯౩వ పద్యమున పూర్ణానుస్వారముతోఁ బ్రయుక్తమగుటచే సబిందుకమనియు నర్థ మనల్పమనియుఁ దోఁచుచున్నది.

“తండ్రీ! సాకెదు అవ్వ నాగ్రహముమీఁదం గన్నదే గాతిగా
గుంపుడాలం గొని దాయగాక యిది నాకుం దల్లియే యెన్నఁడున్.

వీండ్రం జూచిన జాడ నన్ను యమునన్ వీక్షింప దంతంతకున్
బింద్రంబయ్యెఁగసిండి కోఁత వలదా మీకు న్విచారింపఁగన్."

ఖగమ్ములు=బాణములు; విఱుగడ=విరామము.

తాత్పర్యము

ఏమాత్రము కొంచెమైన వీరికి మార్పు పుచ్చుకొను నవకాశ మిచ్చినను నీ యపాయమునుండి తప్పించుకొని రా మరల వీరి యెదుట నిలువసాధ్యము గాదు అని తలఁచి వీరులైన యా రాజకుమారులను పదును గలిగి కఠినముగాఁ దెగఁ గోయు బాణములను దేహమున దండిగా నిండఁగా విరామము లేక యా రాక్షస వీరుఁడు కోపముతోఁ గూడిన మనస్సుగల వాఁడై వైచెను.

ఉ. ఆ చటులాస్త్రఘాతజని • తాస్రఘనీరసిక్తగాత్రులై
పూచిన కింశుకంబులను • బోలెడివారల రక్తనేత్రుఁడై
యేచి విభిన్నకజ్జలసి • తేతరగాత్రుఁ డదృశ్యకాయుఁడై
చూచుచుఁ బల్కె నైజభృశ • శూరత వార లెఱుంగఁ జాటుచున్. ౯౩౪

అర్థములు. చటుల = చలించుచున్న - అస్త్రఘాత = అస్త్రముల దెబ్బచే-జనిత=పుట్టిన- అస్రఘనీరస = నెత్తుటి యేటి ద్రవముచే - సిక్త = తడిసిన-గాత్రుఁడై=దేహముగలవాఁడై-కింశుకములు= మోదుగుచెట్లు - విభిన్న = చెదిరిన-కజ్జల=కాటుకవలె - డబ్బిలోనుంచక విడిగా నుంచిన కాటుక దుమ్ము గప్పి మీఁది భాగము బూజుపట్టినట్లుండును. పరచినట్లు నెఱపిన నల్లగా నుండును. సితేతర=నల్లని-గాత్రుఁడు=దేహము గలవాఁడు,ఇంద్రజిత్తు, అదృశ్యకాయుఁడై = కానరాని శరీరము గలవాఁడై నైజ= సహజమైన- భృశశూరతన్ = అధికమైన శౌర్యముచే.

తాత్పర్యము

జళిపించిన కత్తులవలెఁ గదలుచున్న యస్త్రముల దెబ్బలవలనఁ బుట్టిన నెత్తుటి యేటి నీళ్ళచేఁ దడిసిన దేహము గలవారలై పూచిన మోదుగు చెట్లవలె నున్న వారలను రామలక్ష్మణులను నెత్తురి కన్నులు గలవాఁడై విజృంభించి చెదరిన కాటుక కుప్పవంటి నల్లని దేహము గల యింద్రజిత్తు కానరాని దేహము గలవాఁడై చూచుచు మాట మాత్రము వినవచ్చునట్లు తన శౌర్యాతిశయముఁ బ్రకటించుచు నింతకార్యము చేసినవాఁడు తానని తెలియునట్లు పలికెను.

ఉ. మీరలు నన్ను మార్కొనెడి • మేటిమగల్? ప్రధనోర్వి నుగ్రమా
యారతి నే నగోచరుఁడ • నై చరియింపఁగ వజ్రపాణియై
శ్వారియు డాయలేఁడు గద • నైనను లేఁ డన మీకు లెక్కయే
ఘోరతరాస్త్రసంతతులఁ • గూల్చెదఁ జూడుఁడు మిమ్ము నిద్దఱన్. ౯౩౫

అర్థములు. మేటిమగల్=గొప్ప శూరులు, ప్రధనోర్విన్ = యుద్ధభూమియందు, అగోచరుఁడనై=కానరాని వాఁడనై.

తాత్పర్యము

మీరా నన్ను మార్కొనఁగల శూరులు? యుద్ధభూమియందు మాయాబలముచే నేను గానరాని వాఁడనై తిరుగునపుడు వృత్ర విరోధి యగు నింద్రుఁడైనను నన్ను సమీపింపను లేఁడు. చూడను లేఁడు. ఇఁక మీరా నాకొక లక్ష్యము? మమ్మిద్దఱను భయంకరములైన యస్త్రసమూహములఁ జంపెదఁ జూడుఁడు.

ఉ. రోషణభాషణంబు లిటు • క్రూరనిశాటుఁడు వారిఁ బల్కి జ్యా
భీషణఘోషణం బరులు • పెల్కుఱఁ జేయుచు శాత్రవస్మయ
ప్రేషణ శోషణాహిశర•బృందముఁ బైపయిఁ గ్రమ్మి దుష్టవి
ద్వేషణభూషణాత్ములను • వే శరబద్ధులఁ జేసె నీసునన్. ౯౩౬

అర్థములు. రోషణభాషణంబులు=కోపముతోఁ గూడిన మాటలు-జ్యా=అల్లెత్రాటి మ్రోఁత - భీషణఘోషణంబు = భయంకర ధ్వనిచే-అరులు = శత్రువులు - పెల్కుఱన్=విహ్వలించునట్లు-దేహములు విరవిరపోవునట్లు-శాత్రవ = విరోధుల - స్మయ=గర్వమును ప్రేషణ = అప్పుడు పోఁగొట్టునదియు-శోషణ = శాశ్వతముగా మొదలంటఁ బోఁగొట్టునదియు నగు, అహిశర బృందము= పాము బాణముల సమూహము - దుష్టవిద్వేషణాత్ములను = దుష్టులగువారిని ద్వేషించుటయే భూషణముగాఁగల మనస్సుగలవారిని - 'పాపానామసుర ప్రభో' యన్ని కలదుగదా. దుష్టవిద్వేషణ మనఁగా దుష్టుఁడు చేయు కార్యములు కొనసాగనీయకుండఁ జేయుటయే శరబద్ధులన్ = బాణములచే గట్టఁబడిన వారినిగ-ఈసునన్ = కోపముచే - ఈసు అనునది ఈర్ష్యాశబ్దభవ మైనను దానికి ఈర్ష్యయనియు, కోపమనియు రెండర్థములు గలవు.

తాత్పర్యము

క్రూరములైన కార్యములు చేయు నా రాక్షసుఁడు కోపముతో వారి నిటు పల్కి యల్లెత్రాటి భయంకరమైన మ్రోఁతచే శత్రువులు విహ్వలపడఁ జేయుచు శత్రువుల గర్వము సమూలము నాశనము చేయు నాగాస్త్ర సమూహములను మీఁద మీఁదఁ బ్రయోగించి దుష్టజనద్వేషము భూషణముగఁ గలవారిని కోపముచే బాణములచేఁ గట్టివైచెను.

కం. ఆ యెతరి రాకొమరుల, కాయంబులఁ గాఁడె శరని•కాయము ప్రేలెం
డే యెడ సందోసరఁగ నీ, కా యుద్ధతికిం జలించి • యా వీరవరుల్. ౯౩౭

అర్థములు. ఎతరి = దుష్టుఁడు, కాఁడెన్=నాటెను, ప్రేలెండు=ప్రేలెడు=ప్రేలి పరిమాణము, పరిమాణార్థంబునఁ బ్రథమైన వచనం బంద యెడుఁ వర్ణకంబగును. వ్యా. తద్ధిత. ౩౭ సూ. ఉద్ధతి=ఉత్+హతి=పెద్ద దెబ్బ.

తాత్పర్యము

ఆ దుష్టుఁడు రాజకుమారుల దేహములందు ప్రేలెఁడైన నెడము లేకుండునట్లు

బాణసమూహము నాటెను. ఆ వీరు లా దెబ్బకుఁ జలించి.

చం. ముడిబిగి తూలు నింద్రు ధ్వజముం దలఁపించుచుఁ గంప మందుచున్
 సడలఁగ నిబ్బరంబు నిముషంబును గన్నులు విప్పరాక పై
 నడరెడి మర్మభేదనశరావళిఁ గర్శితులౌచుఁ గాయముల్
 బుడబుడఁ గ్రక్కు నెత్తురుల మ్రుంగి కలంగి వలంగి రంతయున్. ౯౩౭

అర్థములు. ముడిబిగి = కట్టిన క్రొత్త ముడియొక్క - బిగువు - తూలి = వదలుపాఱిన - కంపమందుచున్ = వణఁకుచు - ముందు వెనకకు నూఁగుచు - నిబ్బరంబు = ధృతి - అడరెడి = పడుచున్న - మర్మభేదన = ప్రాణస్థానముల భేదించు - శరావళిన్ = బాణ సమూహములచే - కర్శితులు = బాధపెట్టఁబడిన వారు - మ్రుంగి = మునిఁగి. కలంగి = కలఁత చెంది - వలంగిరి = వలిఁగిన వారైరి.

తాత్పర్యము

బిగువుగాఁ గట్టిన క్రొత్తు వదలు పాఱఁగా నూఁగుచున్న యింద్రధ్వజమును స్మృతికిఁ దెచ్చుచు వణఁకుచు ధైర్యము చెడఁగా కొంచెము సేపైనఁ గన్నులు తెఱువ సాధ్యపడక పైపై పడుచు మర్మస్థానముల నాటియున్న బాణములచే బాధ పడుచు గాయములనుండి నెత్తురు కాఱఁగా దానిలో మునిఁగి కలఁత చెంది వలఁగిరి పూర్ణావతారమూర్తులగు రామలక్ష్మణుల శరీరము లప్రాకృతశరీరములు కదా వానినుండి ప్రాకృతరక్త మెట్లు స్రవించెను ?

శ్లో॥ నభూత సంఘ సంస్థానో దేహోఽస్య పరమాత్మనః। నతస్య ప్రాకృతా మూర్తి ర్మాంసమేదోఽస్థి సంభవా" యని యిత్యాది వాక్యములచే శ్రీరాముని దివ్యమంగళ విగ్రహము అప్రాకృతమని చెప్పఁబడెను. ఇట్టిదానినుండి నెత్తు రెట్లు స్రవించె ననిన :—

బ్రహ్మమాటను దక్కించవలసియున్నది కావున వీని యస్త్రములకు లోఁబడెద మని వానిని నిరసింప శక్తి గలిగియు నెప్పుడు లోఁబడెనో యప్పుడే యాయన చెల్లియుండియు సైరణ చేసినవాఁడు కావున రామచంద్రమూర్తి బ్రహ్మకంటెఁ బరముఁడని యేర్పడెను. ఇట్టివాఁ డప్రాకృతపురుషుఁడుగాక మఱి యెవ్వఁడగును? ఇట్టివాఁడు తన పరస్వభావము వదలకయే మనుష్యరూపమున ధర్మము స్వయముగ ననుష్ఠించి లోకమా విధముగ వర్తింపఁజేయ నవతరించెను. ఇదికదా ధర్మసంస్థాపన మార్గము. ఇట్లు చేయఁదలఁచినవాఁడు అనుష్ఠించు వారికి సాధ్యమగు నవి చేసిననే వారనుష్ఠింపఁగలరు. కాని యమానుషచర్యలు సలిపిన నాయన భగవంతుఁడు కావున నట్లు చేయఁగలిగెను. మనుష్యులము మనమట్లు చేయఁగలమా యని నిరుత్సాహులై యాధర్మమును మనుష్యులనుష్ఠింపరు. కావునఁ దానప్రాకృతపురుషుఁడను జ్ఞానము లోకులకుఁ గలుగనీయరాదు. అందు రావణునకు మొదలే తెలియనీయరాదు. రాముఁడు మనుష్యుఁడను భావ ముండిననే రావణుఁడు రామునిచేఁ

జచ్చునుగాని దేవత్వబుద్ధి కలిగినా వాఁడు చావఁడు. కావునఁ గేవల ప్రాకృత పురుష నటనమే గర్భవాసాది కార్యములు చేయవలసివచ్చెను. అట్లు గాకుండిన ప్రాకృత స్త్రీకి నప్రాకృత పురుషుఁ డెట్లుదయింపఁగలఁడు? సర్వ స్వతంత్రుఁడైన చక్రవర్తి యైనను నలుగురతోఁ జెండాట యాడునపుడు వారికి తానే విధించిన విధులప్రకారము తాను లోఁబడి వర్తింపవలయు గదా! అటుగాదేని యది యాటయేకాదు. అతఁ డాటకాఁడు కాఁడు. అట్టి నిర్బంధములకుఁ దాను లోఁబడుటచేఁ దన స్వాతంత్ర్యమును శక్తిని ప్రభుత్వమును గోలుపోఁడు. అట్లే రామచంద్రమూర్తియు. కావున, లోక సంగ్రహార్థమై బంధనాదికములు, రక్తస్రావాదులు నటించె నని యెఱుంగ నగు. అట్లు చేయకున్న నవతార ప్రయోజనమే చెడును. ఇప్పుడు రామచంద్రమూర్తి చేసిన వన్నియు మనకు సాధ్యములే. కష్టములందు, సుఖములందు నాయన యెట్లు వర్తించెనో యట్లు మనము వర్తించినచో బాగుపడుదు మని మనకుఁ దోఁచుచున్నది. అటుగాక యాయన పరత్వము దివ్యశక్తి చూపియుండిన యెడల ఆయనను మనము మార్గదర్శిగా గ్రహించి యుండము రామచంద్రమూర్తి చేసిన కార్యములన్నియు మనముచేయ సాధ్యమగునుగాని కృష్ణమూర్తివలె నగ్నిని మ్రింగఁగలమా? కొండ నెత్తఁగలమా? విశ్వరూపము చూపఁగలమా? కావుననే రాముఁడు చేసినట్లుచేయుము. కృష్ణుఁడు చెప్పినట్లు చేయుము. అని సూక్తి యేర్పడెను. ఈ నాగపాశ బంధనమువలన మనము నేర్చుకొనవలసిన దేమన ఎంతటి గొప్ప వారికైనను ఆపదలు రాక మానవు ధర్మమును మనము వర్తించుచుంటిమేని మనము కోరకున్నను వానిని భగవంతుఁడే తొలఁగించును. ఎవరు పిలువకున్నను గరుత్మంతుఁడు వచ్చినట్లు, పెద్దవారిని దిరస్కరింప శక్తియున్నను వారి మాట ప్రకారము పోయినఁ గొంచెము కష్టము వచ్చినను సహింపవలెఁ గాని వారిని ధిక్కరించి యవమాన పఱుప రాదనియు, ఆపదలు కాఁపురములు సేయవనియు నెఱుఁగనగు.

కం. అనఘుల కరాంగుళంబుల, దనుక న బాధితము నప్ర దారిత మనిలా
శనశరనికరాబద్ధము, తనువులఁ గన రా దెడంబు తచ్ఛరవృష్టిన్. ౯౩౯

అర్థములు. అనఘుల=పాపరహితులయొక్క - లోకములోని మనుష్యులందఱు తాము పూర్వము చేసిన పాపకర్మముల ఫలముగా నిప్పుడు కష్టము లనుభవింతురు. వీరియం దట్టి కర్మబంధము లేదనియు, లోకసంగ్రహార్థముగ నిది స్వేచ్ఛాగృహీత మనియుఁ దెలుపుచున్నది. తనువులన్=దేహములందు, కరాంగుళంబుల దనుకన్ = చేతివ్రేళ్ళవఱకు. అబాధితము = బాధింపబడనిది - అప్రదారితము= చీల్పఁబడనిది - అనిలాశనశరనికర = నాగాస్త్ర సమూహములచే - అబద్ధము = కట్టబడనిది-తత్ =ఆ యింద్రజిత్తుయొక్క - శరవృష్టిన్=బాణ వర్షముచే.

తాత్పర్యము

ఆ పుణ్యాత్ముల దేహములందు నింద్రజిత్తు బాణవర్షముచే చేతి వ్రేళ్ళకొనల నణుకు గాయపడనిది, చీల్పఁబడనిది, నారాచాస్త్రముచేఁ గట్టఁబడనిది యగు ప్రదేశము లేదు.

ఉ. అంజక యంతకున్ సయిఁచి • యట్టె నిలంబడి యున్న రాముని
న్గెంజిగి దొట్టు గన్గవ వి•నిర్జితనాకపుఁడున్ శితాగ్రముల్
కంజరపుంఖముల్ భయద • కాండము లుగ్రత వత్సదంతభ
ల్లాంజలికక్షురాశుగచ•యంబులు భీకరసింహదంష్ట్రిముల్. ౫౪౦

అర్థములు. అంజక = భయపడక - అంతకున్ = అంతకష్టమునకు - కెంజిగి=ఎఱ్ఱని కాంతి-వినిర్జిత నాకపుఁడున్=ఇంద్రుని జయించిన వాఁడు - ఇంద్రజిత్తు - శితాగ్రముల్ = వాఁడిగల కొనలు గలవు. కంజరపుంఖముల్ = బంగారు పింజలు గలవి - భయదకాండములు = భయంకర బాణములు - వత్సదంత = దూడల పండ్లవంటి కొనలుగలవి. భల్ల=బల్లెములవంటి కొనలుగలవి, అంజలిక = అంజలివంటివి-క్షుర=మంగలికత్తివంటి వాఁడికొనలుగలవి- ఆశుగచయంబులు = బాణసమూహములు - భీకరసింహ దంష్ట్రిముల్ = భయంకరములైన సింహము కోఱలవంటివి.

తాత్పర్యము

ఇంత బాధపెట్టినను భయపడక సహించి మునుపటివలె నిలఁబడి యున్న రాముని కన్ను లెఱ్ఱచేసి చూచి యింద్రజిత్తు వాఁడి కొనలుగల బంగారు పింజలు, దూడల పండ్లవంటివి, బల్లెముల వంటివి, అంజలి వంటివి, మంగలికత్తుల వంటివి, సింహముల కోఱల వంటివి యగు భయంకర బాణములను.

క. వ్రేసిన హెచ్చిన నొవ్విన, నా సింహబలుండు త్రిణత•మై విజ్యంబై
భాసురరత్నాంచితమై, కై వడలెడి వింటితోడ • క్ష్మాశయనించెన్. ౫౪౧

అర్థములు. సింహబలుండు = సింహమువంటి బలము కలవాఁడు, త్రిణతమై = మూఁడువంపులు గలదై - విజ్యంబై = అల్లెత్రాడులేనిదై - భాసురరత్నాంచితమై = ప్రకాశించు రత్నములచేఁ శోభించునదియై - కైవడలెడి=చేతినుండి జాఱిపోవుచున్న, శయనించెన్=పండుకొనెను-పండుకొనె నని చెప్పఁబడెను గాని యవశుఁడై పడెనని చెప్పఁబడలేదు. పండుకొనుట స్వతంత్ర కార్యము గాని పరవశ కార్యముగాదు.

తాత్పర్యము

వ్రేయఁగా నొప్పి హెచ్చుగుటచే సింహబలమువంటి బలముగల రామచంద్రమూర్తియు మువ్వంపు గలిగి నారిపడలి రత్నములచేఁ బ్రకాశించుచు చేతినుండి జాఱుచున్న వింటితోడ నేలపైఁ బరుండెను.

ఉ. ఆ నళినాంబకుండు బహు♦శాత్రిని వ్రాల్తను వీరశయ్యపై
మేను గదించె, నన్న యిటు ♦ మేదిని వ్రాలఁగఁజూచి తమ్ముఁడున్
మాని స్వజీవితాశ శర ♦ మండలతల్పగుఁ డయ్యె, నింతకున్
వానరముఖ్యులెల్ల నర ♦ వర్యులఁజేరి నితాంతదుఃఖులై. ౯౪౨

అర్థములు. స్వజీవితాశ=తన బ్రతుకవలెనను యాశను-శరమండల తల్పగుఁ డయ్యెన్=బాణసమూహము లనెడి పానుపును బొందినవాఁ డయ్యెను.

తాత్పర్యము

మన్మథునివంటి సుకుమారుఁడును, తామరవంటి కన్నులు గలవాఁడునగు రామచంద్రమూర్తి బాధ యతిశయమువలనఁ ద్రోలుత బాణశయ్యపై వీరుల కుచితమగు విధమునఁ బండుకొనెను. అన్న యీ ప్రకారము నేలమీఁదఁ బండు కొనుట చూచి లక్ష్మణుఁడును తానును దన ప్రాణములమీఁది యాశ వదలి బాణ శయ్యపైఁ బరుండెను. ఇట్లగుటవలన వానరులందఱు వారి యిరువుర సమీపించి మిగుల దుఃఖముగలవారై.

బలధైర్య స్థైర్యములఁబట్టి లక్ష్మణుఁడు తొలుతఁ బడవలసినవాఁడు-అట్లుండ రామచంద్రమూర్తి తొలుతఁ బరుండుటకుఁ గారణ మట్లు చేసినఁగాని బ్రహ్మ వరము పూర్తి కాదు. ఇంద్రజిత్తు పోఁడు. తన నిమిత్తముగ వాఁడు వానరులను బాధించుచుండును. ఇవన్నియు నాలోచించి యాయన ముందు పండుకొనెను.

♦ ౪౬-వ సర్గము సుగ్రీవాదులు బద్ధులైన శ్రీరామ లక్ష్మణులఁ జూడవచ్చుట ♦

ఉ. క్రిందను మీఁదుచూచుచుఁ బ♦రిక్షతులై శరపూర్ణగాత్రులై
క్రిందను వ్రాలియున్న నర♦కేసరులం గనుచుండ నింతలో
మందత నొందఁ రావణజ♦మార్గణవృష్టియు వేగ భానుమ
న్నందనుఁడున్ విభీషణుఁడు ♦ దత్స్థలికిం బఱతెంచి వారలన్. ౯౪౩

అర్థములు. పరిక్షతులై=మిక్కిలి గాయపడినవారై, శరపూర్ణగాత్రులై=బాణములచే నిండిన దేహములు గలవారై, రావణజ=ఇంద్రజిత్తుయొక్క, మార్గణ వృష్టి = బాణవర్షము, మందతనొందన్ = తగ్గిపోఁగా, రామలక్ష్మణులు పడి పోగానే యింద్రజిత్తు బాణవర్షము తగ్గించెను.

తాత్పర్యము

రామలక్ష్మణుల వంక భూమియు-నింకను వీఁడేమి చేయఁదలఁచెనో యని యాకాశమును జూచుచు మిక్కిలి గాయపడి బాణములచే నిండిన దేహములు గల వారై నేలఁబడియున్న నరసింహమూర్తులను రామలక్ష్మణులను జూచుచుండ వారుపడఁగానే యింద్రజిత్తు బాణవర్షము తగ్గుటచే వేగముగ సుగ్రీవుఁడు విభీష ణుఁడు నా స్థలమునకు వచ్చి,

కం. కని యచ్చట ద్వివిదాంగద, హనుమన్మైందకుముదాద్య♦గాటయుతముగా
వనరుచుఁ దద్దురవస్థకు, మనమునఁ దికమకలుపడుచు♦మల్లడిఁ గొనుచున్.

అర్థములు. వసరుచున్ = శోకించుచు - మల్లడి గొనుచున్ = పరితాప పడుచు.

తాత్పర్యము

వారలను జూచి ద్వివిదుఁడు అంగదుఁడు హనుమంతుఁడు మైందుఁడు కుముదుఁడు మొదలగుగాఁగల వానరులతోఁడ వారి దురవస్థకు శోకించుచు నేమిచేయుటకుఁ దోపక తికమక లాడుచు పరితాపపడుచు.

సీ. జాలువాఱెడు నెత్తు • జాజావాఱిన మేను, గాజు వాఱిన మోము•కళలవారిఁ
గాలు చేయి కదల్పఁ • గడిమి చాలనివారి, నొయ్యనియూరుపు•లూర్చువారి
వాఁడిములుకు•లు లెస్స • గాడిన మైవారిఁ, బుట్టపట్లన బుస•గొట్టువారి
నలుగులపాన్పున • నత్తమిల్లినవారి, హాటకధ్వజముల • సాటివారి
తే. వీరశయనశయానుల•వీరవరుల, మందవిక్రము లై యున్న•మనుజవరుల
నీరు గాఱెడి కనుల వ•నేచరాళి, మిడుక నెఱుఁగక స్మృతి దప్పి•పడినవారి.

అర్థములు. జాలు వాఱెడు = కాలువగాఁ గాఱుచున్న - నెత్తు = నెత్తురు, రక్తముచే-జాలువాఱిన = ఎఱ్ఱనైన-మేను = దేహము-గాజువాఱిన = మాసిన-కళల వారిన్ = కాంతులు గల వారిని-కడిమి = బలము, ఒయ్యని=మెల్లనగా - గాఁడిన = నాటిన మైవారి = దేహములు గలవారి - పుట్టపట్లు = పాములు - అలుగుల పాన్పునన్ = బాణముల శయ్యయందు-అత్తమిల్లినవారిన్ =పండుకొనిన వారిని-హాటక = బంగారు - వీరశయన = వీరులకు యోగ్యమైన శయనమందు శయానులన్=పండుకొనిన వారిని.

తాత్పర్యము

నెత్తురు వెల్లువగా దేహమందంతటఁ బాఱుటచే నెఱ్ఱని దేహములు, హీనమైన మోము కాంతి గలవారిని, కాలుసేతులు కదలింప బలములేనివారిని అప్పుడప్పుడు మెల్లఁగా శ్వాసము పుచ్చువారిని, కఱకు బాణములు బాగుగ దేహమునందు నాటినవారిని, పాములవలె బుసకొట్టువారిని, అమ్ముల శయ్యమీఁదఁ బండుకొన్నవారిని, బంగారు ధ్వజములవంటి వారిని రణభూమియందుఁ బండుకొనిన వీరులను, పరాక్రమము తగ్గిన రాజులను వానరులు కన్నీరు కార్చుచు దుఃఖించుచున్నను దెలియని వారిని.

క. వగచుచు దుఃఖభరంబున, వగరుచుచున్ మిన్నుగనుచుఁ • బర్వతరిపు పె
న్పగతుని యడపొడ గానక, యగచరవరు లన్నిదిక్కు•లరసిరి పృథగన్. ౫౪౬

అర్థములు. వగరుచుచున్=నిట్టూర్పు విడుచుచు, పర్వతరిపు = ఇంద్రుని యొక్క, పెన్పగతుని=గొప్ప శత్రువగు ఇంద్రజిత్తుయొక్క, అడపొడ=జాడ.

తాత్పర్యము

వ్యసనపడుచు దుఃఖాతిశయమున నిట్టూర్పు విడుచుచు, నాకాశము జూచుచు

నింద్రజిత్తుజాడ గానక వానరులు వ్యర్థముగ నన్ని దిక్కులు వెదకిరి.

కం. మాయావి నన్నకొడుకున్, మాయాసంఛన్ను లబ్ధ•మహితవరబలున్
మాయావేది విభీషణుఁ, డా యెడ నొక్కండ కనియె•నట రావణియున్.

అర్థములు. మాయావి=మాయగలవాఁడు, అస్మాయామేధాస్రజోవినిః । పాణిని, ౫, ౨, ౧౨౧. వి,మత్వర్థీయప్రత్యయము, మాయాసంఛన్నున్ = మాయచే మఱుఁగుపడిన వానిని, లబ్ధమహిత వరబలున్ = పొందఁబడిన గొప్ప వరబలము గలవానిని, మాయావేది=మాయ దెలిసినవాఁడు.

తాత్పర్యము

మాయ చేయుటయందు సమర్థుఁడును మాయచే మఱుఁగుపడిన వాఁడును గొప్ప వరముల బలముగల వాఁడును నగు నన్న కొడుకు నింద్రజిత్తును ఆవిద్య తెలిసిన విభీషణుఁ డొక్కఁడు మాత్రమే చూడఁగలిగెను.

మాయాశబ్దమునకు మొదటి యర్థము జ్ఞానము. ఇది సంకల్పరూపమైనది. కావున నిది భగవచ్ఛక్తియే. కావుననే ప్రకృతికి మాయయనిపేరు. ఈ శక్తి యత్యద్భుతమై యాశ్చర్యకరమైన కార్యములు చేయునపుడు మాయ యనఁ బడును. ఉన్నదున్నట్టుగాక మఱియొక విధముగాఁ గనఁబడఁ జేయుట గొప్పశక్తియే కదా. సర్వ ప్రపంచము భగవత్స్వరూపమై యుండఁగా నట్లు గానరానీయక మఱియొక విధముగఁ గానవచ్చునట్లు ప్రకృతి చేయుచున్నది. కావున నిది మోసము. కావున నొకనిని మఱియొకఁడు మోసము చేసినపుడు మాయ చేసినాఁ డందుము. ఇంద్రజాల మహేంద్రజాలవిద్య లన్నియు నిట్టి శక్తి గలవే. ఈ విద్యలకు మాయ లని, యివి కలవాఁడు మాయావి యని పేరు. కావుననే భగవంతుఁడు మాయి, యని, ప్రకృతి మాయ యని చెప్పఁబడును, వానికిఁ-పర్యాయభావము నగుటచేఁ గాదు- ఈ విద్యలు మణి మంత్రౌషధములచే సాధ్యములు - అద్భుతశక్తి-ప్రకృతి యను నర్థమునందే యుపనిషత్తులందు నీ శబ్దము ప్రయోగింపఁబడెను.

ఇంద్రజిత్తును జూచిన విభీషణుఁడేల యితరులకుఁ జెప్పలేదు? ప్రయోజనము లేదుగనుక. వాఁడు చక్రమువలె దిరుగుచుండెను. విభీషణుని నోటిమాట నోర నుండఁగానే వాఁడు స్థానము తప్పించుచుండును. కన్నులు లేనివారికిఁ గన్నులు గలవాఁడు పరువెత్తు పక్షిని గుఱించి యెట్లు చెప్పఁగలఁడు ?—

## —• ఇంద్రజిత్తు శ్రీరామలక్ష్మణులు చచ్చి రని రాక్షసులతోఁ జెప్పుట •—

కం. తనశరముల బాధితులై, తనువు లెఱుంగక ధరిత్రి • తల్పముగా ప్రా
లినభ్రాతలఁ గని పొంగుచుఁ, దనవారికి నుబ్బసంగ•దర్పించి యనున్. ౯౪౦

తాత్పర్యము

తన బాణములచేఁ బీడింపఁబడినవారై దేహములు తెలియక భూమిపాన్పుఁగాఁ

బడిన యన్నదమ్ములఁజూచి సంతోషించి తనవారికి సంతోషము గలుగునట్లు గర్వించి యింద్రజిత్తిట్లనియె.

సీ. ఎవ్వరు ఖరుని నా • మైక శేషునిఁ జేసి, రెవ్వరు దూషణుఁ • ద్రో వ్వడంచి
రెవ్వరిచింతఁ బా • న్పెపి యుంటక మూఁడు, జాము లేగడి రేల • జనకుఁడకును
నెవ్వరు సకలక • పీంద్రులతోఁ గూడి, కడలి సేతువుఁ గట్టి • విడిసి రిందు
నెవ్వరి కడిమికి • నీలంక కలగుండు, పడె వానకారున • వాఁక పోలె
ఆ. నట్టివారి నిదిగో • నస్త్రబంధంబులఁ, గట్టి చంపినాఁడఁ • గట్లు విప్ప
నఖిలనిర్జరర్షు • లైనను జాలరు, తక్కువారిమాట • తడవ నేల ? ౯౪౯

అర్థములు. నామైకశేషుని = పేరుమాత్రము మిగిలినవానిగా, చచ్చిన వానిగా, మూఁడుజాము లేగడిన్ - రేల = రాత్రులందు మూఁడు జాములు పోవుచున్న వాఁడు, రాత్రికిత్రియామ = మూఁడు జాములు గలదియని పేరు. రాత్రి మొదటి భాగమున నరజాము, ఉదయమునకుఁ బూర్వ మరజాము పగటికాలమందుఁ జేరుచున్నది. కడలిన్ = సముద్రమందు, కడిమికిన్ = పరాక్రమమునకు, కలగుండుపడెన్ = క్షోభ మొందెను.

తాత్పర్యము

ఎవ్వరు ఖరుని దూషణుఁ జంపిరో, ఎవ్వరి విచారముచే నాతండ్రి మూఁడు జాములు రాత్రులందు నిద్దుర లేక యుండుచున్నాఁడో, ఎవ్వరు వానరులతో సముద్రమందు సేతువు కట్టి దాఁటి యిచ్చట దిగిరో, ఎవ్వరి బలముఁ దలఁచి లంకలోని వారందఱు వానకాలమున వంకవలె కలఁత పడుచున్నారో యట్టివారి నిదిగో నాయస్త్రములచేఁ గట్టి చంపినాఁడను. ఈ కట్లు విప్పుటకు దేవర్షులైనను సమర్థులుగారు. ఇఁకఁ దక్కినవారి మాట యేల ?

క. ఈ రాఘవుఁ డీ లక్ష్మణుఁ, డీ రాణువ చేసి యున్న • యెల్ల మగతనం
బీ రే నిష్ఫల మై చనె, శారదదినములను మేఘ • జాలం బనఁగన్. ౯౫౦

అర్థములు. రాణువ = సేన.

తాత్పర్యము

ఈ రాముఁడు ఈ లక్ష్మణుఁడు ఈ సేన చేసిన పౌరుషకార్యము లన్నియు నీరాత్రితో వ్యర్థమై శరత్కాల దినములందు మేఘసమూహమువలెఁ బోయెను.

—• ఇంద్రజిత్తు వానరవీరుల నొప్పించుట •—

చ. ప్లవగచమూచయంబు పని • పట్టెడ నిం కిటఁ జూడుఁ డంచు వా
సవపరిపంథి యూధపులఁ • జక్కడుపన్ సమకట్టి ములుకులన్
నవకము చేల నీలు మెయి • నాటఁగఁ గ్రుచ్చియు మూఁట మైందునిన్
ద్వివిదుని మూఁట నైచి యొక • పేరలుగుం దోడి జాంబవంతునిన్. ౯౫౧

అర్థములు. పనిపట్టెదన్ = చేయవలసిన కార్యమునకుఁ బూనెదను. వాసవ

పరిపంథి=ఇంద్రజిత్తు — చక్కఁడుపన్ = చంపుటకు - సమకట్టి = పూని-నవకము చేతన్=తొమ్మిదింట, పేరలుగున్=పెద్దబాణమును-తొడి=సంధించి.

తాత్పర్యము

ఇఁక వానరసేనను జంప యత్నించెదను చూడుఁడు అని చెప్పి యింద్రజిత్తు యూథనాయకులఁ జంపఁబూని తొమ్మిది బాణములు తీసికొని నలునిమూఁట, మైందునిమూఁట, ద్వివిదుని మూఁట వైచి యొక్క పెద్ద బాణమును సంధించి జాంబవంతుని.

చ. ఉరమునఁ గాఁడఁ జిమ్మె జవ ♦ నోద్ధతు మారుతపుత్రుఁ దాఁకఁగా
  శరదశకంబు వైచి రభ ♦ సంబు మెయిన్ శరభున్ గవాక్షు భీ
  కరఖగయుగ్మతాడితుల ♦ గా నొనరించి కలంబవృష్టులన్
  గురిసెను వాలిసూనుపయిఁ ♦ గ్రోధసమేధితశౌర్యధుర్యుఁడై. ౯౨౨

అర్థములు. జవనోద్ధతున్ = వేగాతిశయముగల - శరదశకంబు = పది బాణములు-రభసంబు మెయిన్ = శీఘ్రముగా, ఖగయుగ్మ తాడితులన్=రెండు బాణములచేఁ గొట్టఁబడిన వారిని - కలంబవృష్టులన్=బాణవర్షములను - క్రోధసమేధిత=కోపముచేతవృద్ధినొందిన, శౌర్యధుర్యుఁడు=శౌర్యాతిశయముకలవాఁడై.

తాత్పర్యము

ఉరమున నాటునట్లువైచి యతివేగముగల యాంజనేయునిపైఁబడి బాణములతి వేగముగ వైచి శరభుని గవాక్షుని రెండుబాణములచేఁ గొట్టి క్రోధాతిశయమున నంగదుపై బాణవర్షము గురియించెను.

తే. వహ్నిశిఖలను నెఱిమించు ♦ బాణములను
  బలిముఖుల మేను లెల్లను ♦ దొలులు గొట్టి
  సింహనాదంబు గావించెఁ ♦ జేవ మొడలి
  ప్లవగకుంజరములు భీతిఁ ♦ బడలు పడఁగ. ౯౨౩

అర్థములు. పడలు పడఁగన్=గుంపులుగాఁ బడునట్లు.

తాత్పర్యము

కాంతియందు వహ్నిజ్వాలలను మించు బాణములచే వానరుల దేహములు చిల్లులు పడునట్లు గొట్టి వానరశ్రేష్ఠులు సత్తువచెడి భయముచేఁ గుప్పలు పడఁగా సింహనాదము చేసెను.

ఉ. అంబరవీథి నిల్చి ప్లవ ♦ గావళి యుక్కు మడంచి యట్టహా
  సం బొనరించి రాక్షసుల ♦ సంఘముఁ గన్గొని యప్డు చూడుఁడీ
  యిం బఱి నేల వ్రాలి వివ ♦ శేషునిబద్ధశరీరమైన యు
  గ్మంబు నటన్న వారతని ♦ కార్యముఁ గన్గొని విస్మితాత్ములై. ౯౨౪

అర్థములు. అంబరవీథిన్=ఆకాశమార్గమున-ఉక్కు = బలము-మడంచి= తగ్గునట్లు చేసి-అట్టహాసంబు=పెద్దనవ్వు-ఇంబు+అఱి = అందముచెడి - వివశేషు =

భయంకర బాణములచే - నిబద్ధ = కట్టఁబడిన - శరీరమైన = దేహముగల - యుగ్మంబు=రామలక్ష్మణుల నిర్వ్యరను-విస్మిత+ఆత్ములై = ఆశ్చర్యమునొందిన మనస్సులు గలవారై.

తాత్పర్యము

ఆకాశమందుండి వానరుల బలము చెదిరి పెద్దగా నవ్వి రాక్షసులఁజూచి రామలక్ష్మణు లిర్వురు బాణములచేఁ గట్టఁబడి యందముచెడి నేలఁబడియున్నారు. చూడుఁడని చెప్పగా వా రతఁడు చేసినపనికి నాశ్చర్యపడిరి.

కం. జలదము లుఱిమెడువడువున, బలితపు గర్జలను నించి • పార్థివులు సమి
త్తలమునఁ జచ్చిరిగా యని, తలఁచుచు నమ్మేఘనాదుఁ•దన్పిరి పూజన్. ౨౮

అర్థములు. వడువున=విధమున, సమిత్తలమునన్ = యుద్ధభూమియందు, చచ్చిరకా=చచ్చినవారే యని; చచ్చిరకా "అకానిత్యర్థకం బగు" ప్రౌ. వ్యా. క్రియా. 33 సూ. 'అపజయముకా లక్షించి' భార. అర ౨ ఆ. దీనివలన సీతారామా మాచార్యులవారు అపజయము+అకాన్ అని పదచ్ఛేదముచేసి వకారోపదేశముచున్నది. దీనికంటె అపజయము+కాన్ అని విభజించి అపజయమే యని నిర్ధారించిన బాగని తోఁచుచున్నది. కాన్=అగు నని యర్థము. 'ఏను నిల్చినట్లకానూఱడిల్లు, నీవున్న నన్న రేశ్వరోత్తముండు' ద్రోణ. ౩-౨౨. ఇచ్చటను అవధారణార్థకము మీఁద కానే చేర్చినట్లు చెప్పుట బాగు. ఈ ప్రయోగ మిది ద్రుతప్రకృతిక మగుట స్థిరీకరించుచున్నది. మేఘనాదున్=ఇంద్రజిత్తును, తన్పిరి=తృప్తుని జేసిరి.

తాత్పర్యము

రామలక్ష్మణులు యుద్ధభూమియందుఁ జచ్చినవారే యని మనస్సులందుఁ దలఁచి రాక్షసులు మేఘము లుఱిమిన విధమున సింహనాదములు చేసి యింద్రజిత్తును గౌరవించిరి.

క. ఆడక కాలులుఁ జేతులు నాడక యుచ్ఛ్వాస మేమి • యవనీగతులై
గోడుకొను నన్నదమ్ములు గూడిరి మృతి ననుచుఁ దలఁచి•కొని రయ్యసురుల్.

తాత్పర్యము

కాలుచేతులు కదలింపక శ్వాస విడువక భూమిమీఁదఁబడి యాపద నొందిన యన్నదమ్ములు చచ్చిరని రాక్షసులు దలఁచిరి.

—• విభీషణుఁడు సుగ్రీవునకు ధైర్యముఁ జెప్పుట. •—

ఉ. ఎంతయు సంతసంబున సు•రేంద్రజితుండును లంకఁ జొచ్చి, భూ
కాంతులయున్కిఁజూచి దిన•కాంతతనూజుఁడు బెగ్గడిల్లి నే
త్రాంతములన్ జడింగొనుచు • నశ్రులు రాలఁగ శోకతప్తుఁడై
చింతను మోము వెల్ల నయి • చేడ్పడి యుండ విభీషణుం డనున్. ౨౯

అర్థములు. దినకాంత తనూజుఁడు = సుగ్రీవుఁడు, బెగ్గడిల్లి = భయపడి, నేత్రాంతములన్ = కనుల కొనలందు, వెల్లనయి = తెల్లఁబాఱి, చేష్టడి = నిశ్చేష్టుఁడై.

తాత్పర్యము

ఇంద్రజిత్తు రామలక్ష్మణులు చచ్చి రను సంతోషముతో లంకలోనికిఁ బోయెను. రామలక్ష్మణులుండు స్థితిఁజూచి సుగ్రీవుఁడు భయపడి కన్నీళ్ళు జడిగాఁ గాఱఁగా శోకముచేఁ దపించినవాఁడై విచారముప మోము తెల్లపాఱఁగా నిశ్చేష్టుఁడై యుండ నతనితో విభీషణుఁ డిట్లనియె.

చ. చనునె కపీంద్ర! ప్రాకృతుని • చందమునన్ దిగులొంద, మానుమీ
కనుఁగవ బాష్పపూరములు • గార్పకు యుద్ధము లిట్టివే కదా
యనిఁ దనగెల్పె నిశ్చయ మ•టంచని నమ్మఁగవచ్చు నయ్యొ? నీ
మనమున ధైర్యమూని గతి•మాలిన నన్నును దేర్పు మియ్యెడన్. ౯౧౪

అర్థములు. ప్రాకృతిని చందమునన్ = పామరునివలె, అనిన్=యుద్ధమందు, నమ్మఁగవచ్చునయ్యొ = అయ్యో నమ్మవచ్చునా ? ఇది వ్యతిరేకార్థము సూచించు ప్రశ్నార్థకము. ఒకొ్కక్కచోఁ దద్ధర్మకక్రియ యార్యాద్యర్థపరం బయి వ్యతిరేక వ్యంజక ప్రశ్నార్థకం బగు, ప్రౌ. వ్యా. క్రియ. ౪ సూ. నమ్మరాదని యర్థము. గతిమాలిన=గతికి చెడిన, తేర్పుము=ఊరడింపుము.

తాత్పర్యము

వానరరాజా! పామరునివలె నీవు భయపడవచ్చునా? కన్నీరు కార్పకుము. యుద్ధముల లక్షణము లిట్టివే కదా ! యుద్ధమందు నేనే గెలిచెదనని నమ్మవచ్చునా? కూడదు. నీకంటె రెంటను చెడినవాఁడను నేను. నన్ను నీవు సమాధానపఱుపుము.

చ. మనకును భాగ్యశేషము ర•మాధవ! యుంచుకరైన నున్నచో
ననఘులు భూరిశౌర్యులు మ•హాత్ములు మూర్ఛ దొలంగువారు పౌ
మ్మనయము సత్యధర్మనిర•తాత్ముల కెం దపమృత్యుభీతి లే
దని యుదకార్ద్రహస్తమున • నాతని నేత్రయుగంబుఁ దుడ్చుచున్.

అర్థములు. భాగ్యశేషము=భాగ్యమునందు శేషము, మిగిలినది, పొమ్మ= నిశ్చయము, అనయము = ఎల్లప్పుడు, సత్యధర్మ నిరతాత్ములకున్ = సత్యమందు ధర్మమందువిశేషప్రీతిగలమనస్సుగలవారికి, అపమృత్యుభీతి=అకాలమరణభయము, ఇదియే ఈ ఘట్టమున నేర్చుకొనవలసిన నీతి, అధర్మమం దుండువాఁ డెంత బలిష్ఠుఁడైనను ధర్మమందుండువాఁ డెంత బలహీనుఁడైనను ధర్మాత్మునకు తత్కాలమునఁ గొంచెము కష్టము కలిగినను తుదకు ధర్మమే జయించును. 'ధర్మస్య ప్రభురచ్యుతః' ధర్మమునకుఁ బ్రభువు నారాయణుఁడు. కావున ధర్మము చెడకుండ నాయన రక్షించును. 'ధర్మో రక్షతి రక్షితః' ధర్మము తన్ను రక్షించువాని రక్షించును. 'ధర్మ

నిస్తారక మయ్యు సత్యఫలదాయకమయ్యును దైవముండెడున్," ఖార, ఉద్యో. ఇంద్రజిత్తు మహామాయలు ధర్మాత్ములగు రామలక్ష్మణులందు వ్యర్థములయ్యెను. ఉదకార్ద్రి హస్తమునన్ = నీటితోఁ దడిసిన చేతితో.

తాత్పర్యము

సుగ్రీవా! మనకుఁగూడఁ గొంచెమైన నదృష్టము మిగిలి యుండెనా యది వ్యర్థము పోరాదు. కావున పాపరహితులు, మహాశూరులు, మహాత్ములు నిజముగా మూర్ఛవిడిచి లేతురు. అంత దృఢముగా నీవెట్లు చెప్పఁగలవందువా? సర్వదా సత్య ధర్మములందుఁ బ్రీతిగలిగి వర్తించువారికి నకాలమరణభయము కలుగదు. వీరట్టివారు కావున వీరికి నపమృత్యు భయములేదు, చూడుమని చేతులు కడుగుకొని నీళ్లు మంత్రించి యా తీర్థముతో నతని కన్నులు తుడిచెను.

తే. మంత్రితాంబువులను గొని • మంత్రవిదుఁడు, మార్జనము సల్పె నేత్రయు • గ్మంబుకీశ
రాజునకు వెండి కాలసం • ప్రాప్తమైన, వాక్యములు పల్కు మదిలోఁ బ్రు • పాటుదొలఁగ.

తాత్పర్యము

మంత్రించిన జలముగొని మంత్రము లెఱిఁగిన విభీషణుఁడు సుగ్రీవుని రెండు కన్నులు తుడిచి కాలయోగ్యమైన మాట లిట్లు చెప్పెను.

బ్రహ్మ వరమునకు విభీషణుఁ డడ్డుపడలేకపోయినాఁడు కాని యింద్రజిత్తు చేయు మాయ విభీషణుఁడు తెలిసికొనలేకపోలేదు. ఈ కారణము చేతనే మాయకు బ్రతిమాయ యేదైనఁ జేయునేమో యను భయముచే విభీషణుని నింద్రజిత్తు కొట్టలేదు. రామలక్ష్మణులు మూర్ఛపోయిరి కాని చావలేదు. ఆ యస్త్రములకుఁ గట్టివేయునంత మాత్రము బలమే కాని చంపెడు శక్తి లేదు. విద్యుజ్జిహ్వుఁడు కల్పించిన మాయవలె, మాయచేసినది యల్పకాలముండునే కాని దీర్ఘకాల ముండదు. మంత్రబలము తగ్గగానే కట్లూడిపోవును. ఈ లోపల బాధపడలేక ప్రాణము పోయినఁ బోవలెను. ఈ మాయాస్త్రముల లక్షణము వాస్తవము తెలిసిన సుగ్రీవుఁడు ధైర్యముతో నుండునని తలఁచి విభీషణుఁడు మంత్రజలముల నాయన కన్నులు తుడిచెను. అప్పుడు సుగ్రీవుఁడున్న వాస్తవము తెలిసికొన్నవాఁడయ్యెను.

కం. కాలంబు గాదు నీకున్, డీలు పడఁగ నిట్టిగతి, న • తిస్నేహము దు
ష్కాలంబున వీక్షించుట, హేళిసుతా! మరణమునకు • హేతువు సుమ్మీ.

అర్థములు. డీలుపడఁగన్ = దిగులు పడఁగన్, వీక్షించుట = పాటించుట, హేళిసుతా = సూర్యపుత్రా.

తాత్పర్యము

ఈ విధముగ నీవు దిగులు పడవలసిన కాల మిదికాదు. ఇది ధైర్యముతో నుండవలసిన కాలము. అకాలంబున నతిస్నేహము పాటించుటయే మరణమునకు కారణము. అకాలమం దతిస్నేహము పూనరాదు.

సీ. కావున సర్వార్థ•ఘాతి యధైర్యంబు, విడువుము వానర•వీరవర్య
రామచంద్రుఁడె తమ•ప్రాపని నమ్మిన, దళిముల నెల్లను • దలఁపవయ్య
కాదేని స్మృతి తప్పి • కాయ్కుత్స్నుఁ డుండెడు, దాఁక నాతనికాపు•దలఁగ కయ్య
జనవరేంద్రులు లబ్ధ•సంజ్ఞులైనను మన, యడలెల్లఁ దీర్చ స•మర్థు లయ్య
ఆ. నాగపాశబంధ•నములు శ్రీరాముని, కెట్టిబాధ నిడవ • యింత నిజము
మరణభీతి వలదు•మరణించువారి కీ, కాంతి వదనసీమఁ•గలుగ దెపుడు. ౯౬౨

అర్థములు. సర్వార్థఘాతి=సమస్తకార్యములు చెఱుచునది, అధైర్యంబు= భయము, లబ్ధసంజ్ఞులు=మూర్ఛ తేఱినవారు, అడలు=దిగులు=దుఃఖము.

తాత్పర్యము

సుగ్రీవా! యధైర్యమున నన్నికార్యములు చెడును. కావున దానిని వదలుము. రామచంద్రుఁడే తమకు దిక్కని ఈ వానరులెల్ల నమ్మియున్నారు. నీవు దిగులుపడి కూర్చుండితివేని రామునకేమో యని వీరెల్లరు భయపడుదురు. దానివలనఁ గార్యహాని యగును. నీవు ధైర్యము వహించిన వారును ధైర్యము వహింతురు. అట్లు కాదేని వీరు మూర్ఛఁదేఱువఱకు వీరిని కాచువారిని నియమింపక విడువకు. వీరు మూర్ఛదేఱిరా మన దిగులు వ్యసనముఁ బాపఁగలరు. ఈ నాగపాశబంధములు రామచంద్రమూర్తికి బాధ కలిగించునవి కావు. బ్రహ్మవరము గౌరవింపవలసి యిట్లున్నాఁడుకాని నిజముగ బాధచేఁగాదు. ఈ బాధచే రామచంద్రమూర్తి మరణించునని భయపడవలదు. ఏలన మరణించువారి ముఖములం దీ కాంతి యుండదు.

ఉ. కావున సర్వకార్యములు • క్రమ్మఱ నే సరిపెట్టుదాఁక సు
గ్రీవ! సమాశ్వసిల్లు మొకఁ • గీశ సమూహము నూఱడింపుమీ
యీ వనచారులెల్ల వికచే•క్షణులై వెఱ తొట్రిల్లఁగా
నావల నట్టె చూచి కపి•నాయక యొండొరు వీనులం దొగిన్. ౯౬౩

అర్థములు. వికచేక్షణులై - ఱెప్పలు పైకెత్తి కన్నులు వికసింపఁ జేసినవారై - వెఱ=భయము-నేనే యింద్రజిత్తని తొట్రిల్లఁగా = అతిశయింపఁగా - అట్టెచూచి=ఱెప్పలువాల్పక చూచి.

తాత్పర్యము

సమస్తకార్యములు చక్కఁబెట్టి మరల నేను వచ్చువఱకు సుగ్రీవా! నీ వూఱడుము. వానరసేనలను సమాధానపఱుపుము. ఏలన నీ వానరులందఱు నేనే ఇంద్రజిత్తని భయపడి కన్నులు పెద్దవిచేసికొని నన్నుగా డిగా చూచుచు నొకరి చెవిలో మఱియొకరు.

తే. గుసగుసలు వోవుచున్నారు•వెసఁ బలాయ, మాను లగుటకు వీరిని•మాన్పవయ్య
వనచరావళి భక్తపూ•ర్వప్రజంబు, వోల్కి భయమును విడువంగ•బుద్ధి సెపుమ.

అర్థములు. పలాయమానులు = పరువెత్తి పోవువారు - భుక్తపూర్వా= ముందనుభవింపఁబడిన-స్రజంబు=పూల దండ-పోల్కి=వలె.

తాత్పర్యము

గుసగుస రహస్యములు చెప్పుకొనుచున్నారు. వారి నడవడి చూచినఁ బరు వెత్తి పోవుటకు సిద్ధపడినట్లు తోఁచుచున్నది. కావున ముడిచితీసిన పూలదండను మరల ధరింపక యావలఁ బాఱవైచునట్లు భయమును వదలుఁడని వీరికిబోధింపుము.

కం. అనుచు విభీషణుఁ డీగతి-వనచరపతి నూఱడిల్లఁ•బలికి మఱి పలా
యనపరమగు ప్లవగావళి,ననునయవాక్యములఁ దేర్చె•నడలక యుండన్.

అర్థములు. పలాయన పరము = పరువెత్తుట యందాసక్తిగల, అనునయ వాక్యములను=సమాధానపు మాటలచే.

తాత్పర్యము

అని యీ ప్రకారము సుగ్రీవునకు నూఱడింపు మాటలు చెప్పి పరువెత్తి పోవ నాలోచించు వానరులకు సమాధాన వాక్యములు చెప్పి వారు భయపడకుండ వారి కలఁక దీర్చెను.

**—•{ ఇంద్రజిత్తు రావణునితోఁ దాను శ్రీరామలక్ష్మణుల నాగపాశబద్ధులఁ జేసి వధించితి నని చెప్పుట. }•—**

ఉ. అక్కడ నింద్రజిత్తు సక•లాసురసేనలు గొల్వ లంకఁ జే
రుకున్నఁ జొచ్చి తండ్రికి ర•ఘూద్వహయుగ్మముచావుఁ జెప్పినన్
గ్రక్కునఁ బీఠి డాఁకి కొడు•కా! బళిరే యని మెచ్చి శీర్షమున్
మొక్కలపుంబ్రమోదమున•మూర్కొని కౌఁగిటఁ జేర్చి పిమ్మటన్. ౯౬౬

అర్థములు. పేరుకున్నన్=మిగుల బలగర్వముతో, యుగ్మము = జంట• మొక్కలపుంబ్రమోదమునన్=నంతోషాతిశయమున,మూర్కొని=వాసనచూచి•

తాత్పర్యము

అక్కడ నింద్రజిత్తు రాక్షస సేనలన్నియుఁ దన్ను సేవింపఁగా బలవిజృంభణ ముచే లంకలోనికిఁ బోయి తండ్రికి రామలక్ష్మణు లిరువురు చచ్చిరని చెప్పఁగా నాసనమున నుండి దూఁకి 'కొడుకా బలే బలే' యని మెచ్చి యధిక సంతోష ముతో నతని శిరస్సు వాసనచూచి కౌఁగిలించి యావల.

కం. శ్రీరాఘవులవధవిధం, బారఁగ వినఁగాఁ గుతూహ•లాత్ముం డగుచున్
నారాచబంధనంబున, వారలు నిశ్చేష్టు లగుట•ప్రథ పాయుటయున్. ౯౬౭

తాత్పర్యము

ఎట్లు చంపితివి? ఏమి యుపాయము చేసితివి? అని యావిధమంతయుఁ జెప్పు మని వినఁగోరిక గలవాఁడై యడుగఁగా నాగపాశములచే వారిని గట్టివైచితిని.

కాలుసేతులు కదలింపలేక పడిపోయిరి. ముఖమునఁ గాంతియుఁ దొలఁగెను. దూరమునుండి తెలియవచ్చునది యింతయేకదా.

కం. వినిపించె యథావృత్తం, బును సర్వం బింద్రజిత్తు • ముదమునను దశా
ననుఁ డుత్సహించి రాఘవ,జనితభయము విడిచి పుత్రు•శ్లాఘించెఁ గడున్.

అర్థములు. యథావృత్తము=జరిగిన విధము.

తాత్పర్యము

అని జరిగిన విధమంతయు నింద్రజిత్తు వినిపింపఁగా రావణుఁడు రామలక్ష్మణుల వలనఁ గలిగిన భయము విడిచి సంతోషించి కొడుకును మిగులఁ బొగడెను. ఇంతవఱకుఁ బాడ్యమినాఁటి యుద్ధమని మహేశ్వర తీర్థీయము. అయినను జీకటి వర్ణింపఁబడుటచే బహుళ ప్రతిపత్తు గాదని తోఁచుచున్నది. రెండవపక్షమున నిది యంతయు నవమినాఁటి యుద్ధమే. ఏలన రామలక్ష్మణులు బంధముక్తులై లేచిన తరువాత (౧౦౬౦ ప.) నిశామధ్యమని చెప్పఁబడెను. ఈలోపల పగటి వర్ణనము చెప్పఁబడలేదు.

**—• ౪౭-వ సర్గము. హనుమదాదులు శ్రీరామలక్ష్మణులఁ గాచియుండుట. •—**

తే. హనుమదంగదనీలగ • వాక్ష గవయ, గజ సుషేణ కుముద నల • కంజజాత్మ
జాతవృషురంభ శతవలి•శరభ గంధ,మాదనులు ఋషభస్కంధ•మర్కటుండు.

• తాత్పర్యము స్పష్టము.

కం. కృతకార్యుం డై రావణ, సుతుఁ డరుగుడు లంక కంతఁ•జుట్టు నిలిచి దుః
ఖితు లై మిక్కిలి జాగ్ర, న్మతితో రక్షణ మొనర్చ•మానవనాథున్. ౯౨౦

అర్థములు. కృతకార్యుండై = చేయవలసిన పని చేసినవాఁడై - అరుగుడున్=అరిగిన యనంతరము - జాగ్రత్ + మతితోన్ = హెచ్చరికతోఁగూడిన మనస్సుతో.

తాత్పర్యము

ఇంద్రజిత్తు తాను జేయవలసిన పని చేసినవాఁడై లంకకుఁబోయిన తరువాత రామలక్ష్మణులఁ జుట్టుకొని నిలిచి దుఃఖించుచున్నవారయ్యు మిగుల హెచ్చరిక గలవారై వారిని రక్షించుచుండిరి.

కం. వృక్షచరు లున్నవారలు, వృక్షంబులఁ గేలఁ బూని•తృణము గదలినన్
రాక్షసు లని యులుకుచు మది, వీక్షించిరి దిక్కులెల్ల•విన్నన్ మన్నన్.

అర్థములు. ఉన్నవారలు=తక్కినవారు-ఉలుకుచున్=ఉలికిపడుచు.

తాత్పర్యము

తక్కిన వానరులు చేత వృక్షములు పట్టుకొని గడ్డిపోచ గదలినను రాక్షసులు వచ్చిరని యులికిపడుచు నే దిక్కునుండి వచ్చిరని పదిదిక్కులు చూచుచుండిరి.

—•{ రావణుఁడు రాక్షసస్త్రీలతో సీతాదేవికిఁ శ్రీరామలక్ష్మణులఁ జూపుఁడని చెప్పుట. }•—

తే. ఆత్మజునిఁ బంచి యసుర ధ • రాత్మజాత, రక్షిణుల రాక్షసస్త్రీల • రా వచింపఁ
త్రిజట మున్నుగ వారలే • తేరఁ బ్రీత, మానసంబున నిట్లను • మానినులకు. ౯౭-౨

అర్థములు. అసుర=రావణుఁడు, రక్షిణులన్=రక్షించు స్త్రీలను.

తాత్పర్యము స్పష్టము.

ఉ. చచ్చిరి రామలక్ష్మణులు • శక్రజిచే నని భూమి కన్యతో
ముచ్చటమీఱఁ జెప్పి రణ • మూర్ధ తలస్థితులన్ నెలంత దా
నచ్చిక పుట్టఁ జూడ జత • నంబునఁ బుష్పకయానసీమ పై
నచ్చలి నిల్పి తోడ్కొని ర • యంబునఁ బొం డటఁ జూపుఁ డంతయున్. ౯౭౩

అర్థములు. శక్రజిచే = ఇంద్రజిత్తుచే, 'జగదింద్రజిత్తుల తకారంబునకు లోపంబు విభాష నగు,' సు. వ్యా. తత్స. ౯౧ సూ. ఇందలి యింద్రజిత్తను శబ్దము తత్సమానముల కుపలక్షకము. రణమూర్ధతలస్థితులన్ = యుద్ధభూమి ముందరి భాగమున నున్నవారిని, నెలంత=స్త్రీ, సీత నచ్చిక = నమ్మకము, జతనంబునన్ = ప్రయత్నముతో, రావని చెప్పినను వదలక.

తాత్పర్యము

రామలక్ష్మణు లింద్రజిత్తుచేఁ జచ్చిరని సీతాదేవితో సంతోషముతోఁ జెప్పి యామె నమ్ముటకై యామెను బలవంతముగనైనఁ బుష్పక విమానముపై గూర్చుండఁ బెట్టుకొని యుద్ధస్థలమున ముందరి భాగమందే పడియున్న రామ లక్ష్మణులఁ జూపుఁడు. యుద్ధరంగమంతయుఁ జూపుఁడు.

ఉ. ఎవ్వని ప్రాపు నమ్మి జల • జేక్షణ కావర మెత్తి నన్నుఁ దా
గవ్వకు లెక్క సేయ దల • కాంతుఁడు రాముఁడు భ్రాతృయుక్తుఁడై
చివ్వను జచ్చె, నింక పతి • చింతయు శంకయు నాశఁ బాసి యా
మవ్వరి సర్వభూషణ సు • మండిత యై నను డాయుఁ గావుతన్. ౯౭౪

అర్థములు. కావరము = పొగరు, భ్రాతృయుక్తుఁడై = తమ్మునితో, చివ్వను=యుద్ధమందు, మవ్వరి = సుందరి, మవ్వము+అరి = మత్వర్థీయ తద్ధితాంతము, సర్వభూషణ సుమండితయై=సమస్తాభరణములతో నలంకరించుకొన్నదై.

తాత్పర్యము

ఎవ్వఁడు తన కాశ్రయమని నమ్మి సీత గర్వముచే నన్ను గవ్వతో సమముగ నైన లక్ష్యము సేయకున్నదో యట్టి మగఁడు రాముఁడు తమ్మునితో యుద్ధమందుఁ జచ్చెను. ఇఁక మీఁద నామె విచారము భయము రామునితో మరలఁ గలయఁగల నను నాశ వదలి యాయుందగతై సమస్తాభరణములుధరించి నన్ను నమీపించునుగాక.

క. ఇపుడు కదా తమ్మునితో, విపులం బరాసువుగ నున్న • విభుఁ గనుఁగొనుటన్
వ్యపనీతాశను సతి తన, విపరీతస్థితి ననన్య•విధగతి నెఱుఁగున్. ౯౭౫

అర్థములు. విపులన్=భూమియందు, పరాసువుగన్=పీనుఁగుగ, వ్యపనీతాశను=రాముని యాశవదలినదై, విపరీతస్థితి=మారిపోయినస్థితి=మగఁడు లేకుండుటను, అనన్యవిధగతిన్=వేఱువిధమైన ప్రాపు లేకుండుటచే.

తాత్పర్యము

ఇప్పుడుగదా తమ్మునితోడఁ దన మగఁడు చచ్చి నేలఁబడి యుండుట చూచి రాముఁడు తన్ను రక్షించు నను నాశ పోయినదై సీత తన విధవాత్వమును, నేను దప్ప వేఱు ప్రాపు లేకుండుటను తెలిసికొనును.

ఉ. ఇప్పుడు భర్తపట్ల నిర•పేక్షమనంబున నన్నుఁ దానుగాఁ
దప్పక గైకొనం దెలువ • తప్పదు పొం దన, వారు నట్టులే
చెప్పఁగఁ బుష్పకంబుఁ గొని • దీనత వల్లభశోకత ప్తయై
ముప్పిరి గొన్న తాపమున • మున్గ ధరాసుత నంపు నిల్పుచున్. ౯౭౬

అర్థములు. నిరపేక్షమనంబునన్=కోరికలేని మనస్సుతో, తానుగాన్=తనకుఁదానే, నా ప్రార్థనలేకయే. "అయి తా నవ్యయంబులు స్వయమర్థకంబులగు", ప్రౌ.వ్యా.క్రియ ౩౭ సూ. వల్లభశోకత ప్తయై=భర్తృశోకమునఁ దపించునదియై, ముప్పిరి=అతిశయించిన, మూఁడు+పిరులు=ముప్పిరి, ద్విగువు.

తాత్పర్యము

ఇప్పు డీక భర్త వచ్చును, తన్ను రక్షించును, అను నపేక్ష వదలినదై సీత నన్నుఁ దనకుఁ దానే నేను గోరకున్నను తప్పక గ్రహించును. ఇది తప్పదు, పొండని చెప్పఁగా వారట్టులే పుష్పకము తీసికొని భర్తృవ్యసనముచేఁ దపించుచు నతిశయమునఁ దాపమున మునిఁగియున్న సీతను దానియుంచి.

కం. ఫాలికలనికిఁ దోడ్కొని చని, రలి నేఁడి యుఁ ద్రిజటతోడ•నటఁ గని ధరపై
బలిముఖదళములు సర్వము, విలయంబును బొందిన చెడిన•విధ; మిటఁ బరిలోన్. ౯౭౭

అర్థములు. ఫాలికలనికి—స్మశానమునకు=రామలక్ష్మణులు పడియుండు యుద్ధప్రదేశమునకు, విలయము=నాశము, బలిముఖదళములు=వానరసేనలు.

తాత్పర్యము స్పష్టము

కం. హర్తినముదమున దశముఖుఁ, డార్తించెన్ ధ్వజము లెల్ల•యెడఁ బ్రకటించెన్
మిర్తిని గూర్చెను వాసవ, జిత్తని రాఘవుల ననుచుఁ•జెచ్చెర నంతన్. ౯౭౮

అర్థములు. హర్తిన=పొందిన, ముదమునన్=సంతోషముచే, మిర్తిని=మృత్యువును, వాసవజిత్తు=ఇంద్రజిత్తు.

తాత్పర్యము స్పష్టము.

—• సీతాదేవి పుష్పకంబున నుండి శ్రీరామలక్ష్మణులఁ జూచుట. •—

కం. పొంగెడి రక్కసమూఁకలఁ, గ్రుంగెడి కాకుత్స్థపార్శ్వ•గుల వానరులన్
గంగిసస్మృతి దొఱఁగిన దు, ర్భంగుల శరతల్పగతుల•రాముని ననుజున్.

అర్థములు. పొంగెడి=సంతోషముచే నుబ్బుచున్న, రక్కసమూఁకలన్=రాక్షససమూహమును, క్రుంగెడి=దుఃఖముచే నణఁగిన, కాకుత్స్థపార్శ్వగులన్=రామలక్ష్మణుల ప్రక్కలనున్న వారిని, కంగిసన్=యుద్ధమునందు, స్మృతిదొఱఁగిన=తెలివితప్పిన, దుర్భంగులన్=చెడుస్థితి గలవారిని, శరతల్పగతులన్ = బాణముల పాన్పు నందుండు వారిని, దీనికి గర్భపదము ౯౨౧ లోని అసితేక్షణ.

తాత్పర్యము

సంతోషముతో నుబ్బిపోవుచున్న రాక్షసుల గుంపులను, దుఃఖముచే నణఁగి రామలక్ష్మణుల ప్రక్కలనున్న వానరులను యుద్ధమున తెలివితప్పి దుస్థితియందు నంపపానుపుపైఁ బడిన రాముని నతని తమ్ముని.

ఉ. వ్రాలినచాపముల్ రుచులు•వాడినరూపము లూడురోపముల్
చీలినవర్మముల్ దెగిన•జీవితమర్మము లాడుచర్మముల్
దూలెడి యూర్పులుం జెడిన•తోరపునేర్పులు మోముమార్పులున్
ధూళిని బ్రుంగుమేను లగు•తోయజనేత్రుల నగ్నిపుత్రులన్. ౯౨౦

అర్థములు. వ్రాలిన = నేలఁబడిన, రుచులు=కాంతులు, రోపముల్ = బాణములు, వర్మముల్=కవచములు, జీవితమర్మములు=ప్రాణములుండునాయువుపట్లు, బ్రుంగు=మునిఁగిన.

తాత్పర్యము

నేలఁబడిన విండ్లు, కాంతులుఁ జెడిన రూపములు, సడలిన బాణములు, పగిలిన కవచములు, తెగిన యాయువుపట్టులు, వ్రేలాడు చర్మములు, కొంచెముగా వెలువడు శ్వాసములు చెడిన మిక్కిలి నేర్పులు, పూర్వమువలెఁగాక మాఱిపోయిన ముఖములు, దుమ్ములోఁ మునిఁగిన దేహములుగల కమలనేత్రులను నగ్నిపుత్రులతో.

కం. ఎనసెడివారల భ్రాతల, ననుపమదేవప్రభావ•హారులఁ బతి నా
యనవద్యగాత్ర సౌమిత్రిని నసితేక్షణ నితాంత•దీనాత్మిక యై. ౯౨౧

అర్థములు. ఎనసెడి =పోలుచున్న, అనుపమ = అసమానమైన, దేవప్రభావ=విష్ణువు మహిమచే, హారులన్ = మనోహరులైన వారలను, అనవద్యగాత్ర = దోషరహితమైన దేహము గలది. అనఁగా వైధవ్యచిహ్నము లేనిది. అసితేక్షణ=నల్లని చూపులుగలది, నితాంత=మిక్కిలి, దీనాత్మికయై=దుఃఖముతోఁ గూడిన మనస్సు గలదై.

తాత్పర్యము

పోలుచున్న యన్నదమ్ములను, అసమానమైన విష్ణుప్రభావమువంటి ప్రభా

వము గలవారిని, దోషరహితమైన దేహముగలది, తన భర్తయగు రామచంద్ర మూర్తిని, కాటుకకంటిది లక్ష్మణుని మిగులదుఃఖముతోఁ గూడిన మనస్సుగలదై.

కం. కాంచుచు నెట్టులొకో యీ, యంచితమహిమాఢ్యు లిట్టు•లై రనుచు విత
ర్కించుచు బాష్పంబులఁ గురి, యించుచు దుఃఖాబ్ధి మునిఁగి•యీవిధి నేడ్చెన్.

అర్థములు. వితర్కించుచు=ఆలోచించుచు.

తాత్పర్యము స్పష్టము.

## ౪౮-వ సర్గము. నాగపాశబద్ధులైన శ్రీరామలక్ష్మణులఁ జూచి సీతాదేవి దుఃఖించుట.

కం. సుతవతి నయ్యెద ననుచుం, బతిహీనత నొంద ననుచుఁ • బలికిరి నన్నున్
క్షితిసురులు లక్షణజ్ఞులు, హతుఁడగుటను రాముఁ డనృత•మాడిరి జ్ఞానుల్.

అర్థములు. లక్షణజ్ఞులు = స్త్రీ సాముద్రికశాస్త్రము తెలిసినవారు, క్షితిసురులు = బ్రాహ్మణులు, 'వస్తివదుత్తరా యోషిదంగలక్షణ' మ్మని స్త్రీ సాముద్రికము. సుతవతిని=కొడుకులుగలదానను, పతిహీనత=వైధవ్యము.

దీర్ఘాంగుళీశ్చ యా నారీ, దీర్ఘకేశీచ యా భవేత్
దీర్ఘమాయు రవాప్నోతి, పుత్రైశ్చ సహవర్తతే.'

పొడుగు వ్రేళ్ళుగలదియు పొడుగు వెండ్రుకలు గలదియు నగు స్త్రీ దీర్ఘాయుస్సు గలదై కొడుకులుగల దగును.

"శుభః కమలినీపృష్ఠ గజస్కంధోపమో భగః
వామోన్నతస్తు కన్యాకః పుత్రదో దక్షిణోన్నతః".

గుహ్యము తాఁబేటి వీఁపువలెను ఏనుఁగు మూపురమువలెను నుండిన శుభప్రదము. ఎడమప్రక్క నున్నతముగ నుండిన స్త్రీ సంతానము కుడిప్రక్క నున్నతముగ నుండిన పురుషసంతానము కలదు.

'సూతే సుతాన్ బహూన్ నారీ పృథుకుక్షిస్సుఖాస్పదమ్
క్షితీశం జనయే త్పుత్రం మండూకాభేన కుక్షినా'
'ఉన్నతే నోదరేణైవ - వంధ్యా నారీ ప్రజాయతే.

కడుపు పెద్దదిగ నుండిన బహుపుత్రులఁ గనును. కప్ప యాకారమువంటి కడుపుగలది భూమి పాలించువానిని గనును. ఉన్నతముగ నుండిన గొడ్రాలగును

'సువిశాలోదరీ నారీ-నిరపత్యా చ దుర్భగా
ప్రలంబజఠరా హంతి - శ్వశురం చాపి దేవరమ్'॥

మిక్కిలి విశాలమైన యుదరము గలది సంతానహీనురాలును దరిద్రురాలు నగును. వ్రేలాడు పొట్టగలది మామగారిని మఱఁదిని జంపును.

'నిర్లోమ హృదయం యస్యాః సమం నిమ్నత్వ వర్జితం
ఐశ్వర్యం చాప్యవైధవ్యం, ప్రియప్రేమచ సా లభేత్ ॥

హృదయమందు వెండ్రుకలులేక, సమమై గుంతగా లేక యుండునో యామె యైశ్వర్యము, అవైధవ్యము గలదై ప్రియుని ప్రేమ సంపాదించుకొనునది యగును.

మధ్యం స్త్రియా స్త్రివళి సార్థ మరోమశంచ
వృత్తే ఘనా వవిషమా కఠినా పురోజౌ
రోమాప్రవర్జిత మురో మృదు చాంగనానామ్
గ్రీవాచ కంబు నిచితార్థ సుఖాని దత్తే ॥ అని సాముద్రిక శాస్త్రము.

తాత్పర్యము

సాముద్రిక శాస్త్రము తెలిసిన బ్రాహ్మణులు నాకుఁ గొడుకు లుదయింతు రనియు నాకు వైధవ్యము లేదనియుఁ జెప్పిరి. ఇప్పుడు నాభర్త హతుఁ డగుటచే నీ రెండు నసత్యము లయ్యెను. కావున జ్ఞాను లసత్యమాడిరి.

కం. క్రతుశతనిరతుం డగు సువ్రతికి మహిషి సత్రయాగ•పరుపత్నినినై
నతిఁ గందు నంచుఁ బలికిరి, హతుఁ డగుటను రాముఁ డనృత•మాడిరి జ్ఞానుల్.

అర్థములు. క్రతుశత నిరతుండు=నూఱు యాగములు చేయుటయందుఁ బ్రీతి గలవాఁడు, సువ్రతి = అటువంటి మంచి వ్రతము గలవాఁడు, మహిషి = పట్టాభిషిక్తురాలగు భార్య, సత్రయాగపరు=బహు సంవత్సర సాధ్యమై యనేకులు కర్తలుచేయు యాగము సత్రయాగము. అట్టియాగము చేయువాని పత్ని; ఆయజ్ఞ సంబంధముగల భార్యను 'పత్యుర్నో యజ్ఞసంయోగే' యను పాణిని సూత్రప్రకారము పతి శబ్దమునకు నకార మంతాదేశమై జీప్రత్యయము రాఁగాఁ బత్ని యని రూపము.

తాత్పర్యము

నేను నూఱు యజ్ఞములుచేయు నభిలాష గలవానికిఁ బట్టపురాణి నగుదు ననియు, సత్రయాగము చేయువాని పత్నినై కీర్తిఁగందుననియుఁ జెప్పిరి. రాముఁడు హతుఁ డగుటచే జ్ఞాను లనృతమాడిన వారైరి.

కం. మతిమంతులు దైవజ్ఞులు, క్షితిసురు లే వినుచు నుండఁ • జెప్పిరి శుభ సం
తతిశతము నన్నుఁ గూరిచి, హతుఁ డగుటను రాముఁ డనృత•మాడిరి జ్ఞానుల్.

అర్థములు. మతిమంతులు = బుద్ధిగలవారు, దైవజ్ఞులు = అదృష్టఫలము చెప్పఁగల జోస్యులు, శుభసంతతిశతము=అనేక శుభములు గలుగు నని.

తాత్పర్యము

బ్రాహ్మణులు, పండితులు, జోస్యులు నన్ను గుఱించి యెన్నియో శుభములు చెప్పిరి. రాముఁడు హతుఁడగుటచే జ్ఞాను లసత్యమాడిన వారైరి.

కం. అతులిత వీరవరుం డగు, క్షితిపతికిం బత్ని నగుచుఁ • జెలఁగెద నని స
త్కృతి నని చెప్పిరి యతౌర్యా, హతుఁ డగుటను రాముఁ డనృత•మాడిరిజ్ఞానుల్.

అర్థములు. అతులిత=అసమానమైన, వీరవరుఁడు=వీరులందు శ్రేష్ఠుఁడు, క్షితిపతికిన్=రాజునకు, సత్కృతిని=పుణ్యాత్మురాల నని.

తాత్పర్యము

అసమానవీరులందు శ్రేష్ఠుఁడగు రాజునకు నేను భార్యనగుదునని, పుణ్యాత్మురాలని బ్రాహ్మణులు చెప్పిరి. రాముఁడు హతుఁడగుటచే జ్ఞాను లసత్య మాడినవారైరి.

ఉ. పాదములందు నే కమల♦పాణికిఁ గ్రాలునో యట్టి పద్మరే
ఖాది సుచిహ్న సంచయము ♦ లా తరళాక్షి నరేంద్రు పత్నియై
శ్రీదయివాఱఁ బొందు నభి♦షేకముఁ బట్టముతోడ, నక్కటా
నా దురదృష్ట మిట్టిదియు ♦ నాశములయ్యె నిరర్థకంబులై. ౯౦౭

అర్థములు. కమలపాణికిన్=కమలమువంటి యొజ్జని యుఱచేతులు గలదానికి, పద్మరేఖాది=పద్మమువంటి రేఖలు మొదలయిన గుర్తులు, శ్రీ=సంపద, దయివాఱన్=అతిశయింపఁగా, దురదృష్టము=దౌర్భాగ్యము, నిరర్థకంబులై=వ్యర్థములై.

తాత్పర్యము

కమలమువంటి యరచేయిగల యే స్త్రీ పాదములందు నాకుఁగల పద్మరేఖలు మొదలగు శుభరేఖలు గలవో యా స్త్రీ రాజపత్నియై భర్తతోడఁ బట్టము కట్టుకొని యభిషేకము నొందును. దాని సంపదయు నభివృద్ధి పొందును. అయ్యో! నాదౌర్భాగ్యదశ, యిట్టి ప్రసిద్ధములైనవి కూడ వ్యర్థములైనపుడు బ్రాహ్మణు లసత్యమాడి రననేల ?

చ. తరుణులు లక్షణంబు లెవి ♦ దాల్చుటచేతను భాగ్యహీనలై
ధర విధవాత్వ మందుదురొ ♦ తత్కలుషాంకము లందు నొక్కటిన్
బొరయదు, నిట్టి దుస్థితిని ♦ బొందుట యెట్టులొ? భద్రలక్షణో
త్కరములు పద్మ చిహ్నములు♦కార్యములేమి యడెట్లొ దైవమా. ౯౦౮

అర్థములు. భద్రలక్షణోత్కరములు=శుభచిహ్నముల సమూహములు, పద్మచిహ్నము=పద్మాకార రేఖల గుర్తులు, కార్యములేమి=ఫలింపకపోవుట.

తాత్పర్యము

ఎట్టిచిహ్నము ధరించిన స్త్రీలు భాగ్యహీనులయి విధవలగుదురని చెప్పఁబడెనో యట్టి చిహ్నములం దొకటియైన నాయందు లేదు. నాకేల యిట్టి దుస్థితి వచ్చెను? నాయందు శుభకరములైన పద్మచామరాది రేఖలు గలవు. అవి వ్యర్థములై యేల పోయెను ?

'విధవా విపులేన స్యాద్దీర్ఘాంగుష్ఠేన దుర్భగా'

కాలి బొటనవ్రేలు వెడల్పుగ నుండిన విధవ యగును. మిక్కిలి పొడవుగ నుండిన దరిద్రురా లగును.

'పరస్పరం సమారూఢాః - పాదాంగుల్యో భవంతిచేత్
హత్వా బహూ నపి పతీన్ - పరప్రేష్యా తథా భవేత్
యస్యాః కనిష్ఠికా భూమిం - న గచ్ఛంత్యాః పరిస్పృశేత్
సా క్రమతం స్వపతిం హత్వా - జారేణ రమతే పునః
అనామికా చ మధ్యా చ - యది భూమిం నసంస్పృశేత్
పతిద్వయం నిహంత్యాద్యా చాపరాతు పతిత్రయమ్' ॥

కాలి వ్రేళ్ళొకదానిమీఁద నొకటి యెక్కి యుండిన అనేక పతులను జంపి పరపురుషునిచేఁ దీసికొని పోఁబడును. నడచు నపుడు చిటికెనవ్రేలు భూమినిదాఁక కుండిన తన మగనిఁ జంపి జారునితోఁ గ్రీడించును. దానికిఁ బ్రక్కది యగు ననామిక వ్రేలు నేలను దాఁక కుండిన నిద్దఱు పతులను జంపును, నడిమివ్రేలు తాఁక కుండిన ముగ్గురు పతులను జంపును.

"ఏకరోమా రాజపత్నీ ద్విరోమాఽతి సుఖాన్వితా,
త్రిరోమా రోమకూపేషు భవే ద్వైధవ్య దుఃఖభాక్"

పిక్కలందు రోమకూపములందు నొక రోమ ముండిన రాజపత్ని యగును. రెండు రోమము లుండిన సుఖవంతురా లగును. మూఁడు రోమము లుండిన వైధవ్య దుఃఖ మనుభవించును.

"వైధవ్యం రోమశైర్యుక్తం దౌర్భాగ్యం చిపిటై రపి"

తొడలయందు వెండ్రుక లుండిన విధవ యగును. చప్పటగా నుండిన దౌర్భాగ్యవతి యగును.

"వివృతా చిపిటా దీర్ఘా నిర్మాంసా శకటాకృతిః
హ్రస్వరోమయుతా నార్యా దుఃఖ వైధవ్య సూచకాః"

మొల (నడుము క్రింది భాగము) వంగినదియు చప్పిగను పొడవుగను మాంస హీనముగను శకటాకారముగను పొట్టిగను రోమములు గలదిగను నుండిన విధవయగును.

"కురంగఖురరూపో య శ్చుల్లీకోటర సన్నిభః
రోమశో వివృతాస్యశ్చ దృశ్యనాసోఽతిదుర్భగః."

లేడియడుగువంటి రూపముగలదియు, పొయ్యిత్తొఱ్ఱవలె నుండునదియు, రోమములచే దట్టమైనదియు, ముఖము తెఱచుకొని యుండునదియు, దృశ్యనాసయు నగు భగము దౌర్భాగ్య సూచకము.

'శంఖావర్తో భగో యస్యా - స్సా గర్భ మిహ నేచ్ఛతి'

శంఖావర్తమువంటి సుడిగల భగము గర్భమును గ్రహింపఁ జాలదు.

'వంశే వేతస పత్రాభో ఘనరోమాఘ నాసికః
వికటః కుటిలాకారో లంబగల్ల స్తథాఽశుభః.'

వెదురాకు, ప్రబ్బలియాకు, వీని యాకారముగలిగి ఘనమైన రోమములు గల నాసిక కలిగి హెచ్చు తక్కువయై వంకరలై వ్రేలాడుచున్న పార్శ్వస్థానములు గల భగము అశుభప్రదము.

'భగస్య జాలం జఘనం విస్తీర్ణం తుంగమాంసలమ్
మృదులం మృదురోమాఢ్యం దక్షిణావర్త వీడితమ్
వామావర్తంచ నిర్మాంసం భుగ్నం వైధవ్యసూచకమ్.'

భగమునకుఁ బార్శ్వదేశము విశాలముగను, ఉబికిన మాంసము గలదిగను మెత్తగను మెత్తని రోమములతోఁ గూడినదిగను దక్షిణపు సుడిగలదిగ నుండిన శుభసూచకము. ఆ ప్రదేశము మాంసము లేక వంగినదై యెడమసుడి కలిగి యుండిన వైధవ్యము కలుగును.

'మధ్యే క్షామాచ సుభగా భోగాఢ్యా సవళిత్రయా.'

నడుమ సన్నమై మూఁడు మడతలతోఁ గూడియుండిన సౌభాగ్యవంతురాలును ఐశ్వర్యభోగ్యములు గలదియు నగును.

'ఋజ్వీ తన్వీచ రోమాళీ యస్యాః సా శర్మవర్మభూః
కుటిలా కపిలా స్థూలా విచ్ఛిన్నా రోమరాజికా
చౌర్యం వైధవ్య దౌర్భాగ్యే విదధ్యా దిహ యోషితామ్.

నూగారు వంకర లేనిదిగను, సూక్ష్మముగ నుండిన సుఖము ప్రీతియు గలదై యుండును. వంకరై కపిల వర్ణము గలిగి స్థూలమై నడుమఁ దెగియుండిన స్త్రీ దొంగయు, నిర్భాగ్యురాలును, విధవయు నగును.

'విస్తీర్ణహృదయా యోషా పుంశ్చలీ నిర్దయా తథా:
ఉద్భిన్నరోమ హృదయా పతిం హంతి వినిశ్చితమ్
అష్టాదశాంగుళతత మురః పీవర మున్నతమ్
సుఖాయ దుఃఖాయ భవే ద్రోమశం విషమం పృథు.'

విశాలవక్షస్థలముగల స్త్రీ వ్యభిచారిణియై నిర్దయు రాలగును. ఱొమ్మునందు పైకి స్పష్టముగాఁ దెలియుచున్న రోమములుగల స్త్రీ పతిని జంపును. పదునెనిమిది యంగుళముల వైశాల్యము గలిగి బలిసియుండిన సుఖప్రదము. రోమములు హెచ్చు తక్కువగ నున్న దుఃఖకరము.

'ఘనౌ వృత్తౌసమౌ పీనౌ దృఢౌ శస్తౌ పయోధరౌ
స్థూలాగ్రౌ విరళౌ శుష్కౌ వామోరూణాం న శర్మదౌ.
దక్షిణోన్నత వక్షోజా పుత్రిణీ వ్యగ్రజా మతా
వామోన్నతకుచా సూతే కన్యాం సౌభాగ్య సుందరీం
పీవరాస్యౌ సాంతరాలౌ పృథూపాంతౌ నశోభనౌ
మూలే స్థూలౌ క్రమ కృశౌ వగ్రే తీక్ష్ణౌ ప్రశస్తకౌ

సదృశౌ చూచుక యుగం శస్తం శ్యామం సువర్తులం
అంతర్నిమగ్నంచ దీర్ఘంచ కృశం క్లేశాయ జాయతే.

చన్నులు పెద్దవిగను, వట్రువగను, సమానములుగను, బలిసినవిగను, దృఢముగ నుండినఁ ప్రశస్తములు. మొనలు లావుగను, ఎడముగను, ఎండినవిగ నుండిన సుఖ మీయవు. కుడి చన్నెత్తై యుండిన మంచి కొడుకును గనును. ఎడమ చన్నెత్తై యుండిన మంచి సుందరి, భాగ్యవతి యగు కూఁతును గనును. కొనలు బలువు, రెండు స్తనములకు నడుమ నెడము, స్తనములకొనలు లావుగనుండుట, స్తనముల యంత ప్రదేశములు లావుగ నుండుట ప్రశస్తగుణములు కావు. మొదట లావుగను క్రమముగ సన్నముగను మొనలు తీక్ష్ణముగనుండిన ప్రశస్తములు, చనుముక్కులు సమానములుగను, గుండ్రములుగను, నల్లగనుండిన శుభము. లోన ముడుచుకొనినవి పొడవైనవి కృశించినవి యగు చనుముక్కులు దుఃఖకరములు.

"వక్రౌ స్థూలౌ చ రోమాఢ్యౌ యది వైధవ్య సూచకౌ
నిగూఢసంధీ శస్తాగ్రౌ శుభౌ వంసౌ సుసంహతౌ
వైధవ్యదౌ సముచ్ఛ్రాగ్రౌ నిర్మాంసౌ పతిదుఃఖదౌ"

వంకర గలిగినవియు, లావైనవియు, రోమములు గలవి నగు భుజ శిరస్సులు వైధవ్యము కలిగించును. గూఢములగు సందులు గలవియు, ప్రశస్తమైన కొనలు గలవియు బాగుగ గూడినవి శ్రేష్ఠములు. కొన లెత్తై యుండిన వైధవ్యము ప్రాప్తించును. మాంసరహితములైన యెడల దుఃఖకరములు.

"విధవా బహురేఖేణ విరేఖేణ దరిద్రిణీ"

అఱచేతియందు గీఁతలు విస్తరించి యుండిన విధవ యగును. గీఁతలు లేకుండిన దరిద్రురాలగును.

'అంగుష్ఠమూలా న్నిర్గత్య రేఖా యది కనిష్ఠికామ్
యది సా పతిహంత్రీ స్యా ద్దూరత స్తాం వివర్జయేత్.'

అంగుష్ఠ మూలమునుండి ప్రారంభించి చిటికెనవ్రేలివరకు రేఖ యుండిన మగనిని జంపునది యగును. దానిని వర్జింపవలయును.

స్థూలగ్రీవాచ విధవా హ్రస్వగ్రీవాచ కింకరీ
వంధ్యాహి చిపిటగ్రీవా కుబ్జగ్రీవాచ దుఃఖభాక్.'

మెడ స్థూలముగ నుండిన విధవ యగును. పొట్టిగానుండిన దాసి యగును. చప్పటి మెడయుండిన గొడ్డురాలగును. మఱుగుజ్జుగానుండిన దుఃఖమనుభవించును.

'శ్యామ స్థూలోధరోష్ఠ స్స్యా ద్వైధవ్య కలహప్రియః'

పెదవి నల్లగ లావుగ నుండిన వైధవ్యము, కలహమును కలుగఁజేయును.

'అధస్తా దధికై ర్దంతై ర్మాతరం భక్షయే త్స్ఫుటమ్
పతిహీనాచ వికలైః కులటా విరలై ర్భవేత్.'

క్రిందివరుస దంతము లెక్కువగా నుండినఁ దల్లి లేనిదగును. విఱిగినవిగను హెచ్చుతగ్గులుగ నుండిన పతి లేని దగును. ఎడములు కలవైన జారిణి యగును.

—• సుళ్ళు —•

శ్లో. శిరసో దక్షిణావర్తా పితరం హంతి కన్యకా
వామేచ జననీం హంతి త్రివర్షాభ్యంతరే స్తనే।
స్తనద్వయే యదావర్తో యస్యాస్సాఽపతికా భవేత్
ముఖావర్తా ధవం హంతి భుజావర్తా ప్రతివ్రతా।
ఉదరే శ్వశురం హంతి లలాటే హంతి దేవరం
యా నారీ చూచుకావర్తా సా భవేత్స్వైరగామినీ।
కర్ణమూలే యదావర్తా శ్రీవావర్త ద్వయం భవేత్
కించిత్సౌభాగ్య మాప్నోతి సా కన్యా విధవా భవేత్।
భ్రువోర్మధ్యే భ్రువోర్వ్యగ్రే పాదావర్తా స్తథాస్త్రియః
విధవా జారిణీ వా స్యాత్ భ్రమణంచ యథేచ్ఛయా।
త్రిణ్యావర్తాః ప్రదృశ్యంతే లలాటే చోదరే కటా
శ్వశురం చైవ భర్తారం హన్యాత్సా దేవరం క్రమాత్।
భుజమధ్యే యదావర్తం సమం మధ్యేచ సంస్థితం
ప్రదక్షిణం భవేత్తచ్చ ధనపుత్ర ప్రవర్ధనం।
జాను ద్వయే యదావర్తో గుల్ఫావర్తోఽప్రదక్షిణః
దుశ్శీలా భ్రమతే నిత్యం పరపుంసి రతా భవేత్।
పాణ్యోః ప్రదక్షిణావర్తా, ధర్మ్యా వామా నశోభనా
నాభౌ శ్రితశ్చోరసివా, దక్షిణావర్త ఈరితః।
సుఖాయ దక్షిణావర్తః, పృష్ఠవంశస్య దక్షిణే
అతః పృష్ఠం నాభిసమం, బహ్వాయుః పుత్రవర్ధనం।
గుహ్యావర్తా యదా నారీ, పరపుంసిరతా భవేత్
రాజపత్న్యాః ప్రకాశశ్చ, భగమాలా ప్రదక్షిణః।
నచేచ్ఛకటభంగీ స్యాత్, త్రతాన్యాపత్యవినాశనః
స్యాతా ముదర దేశేచ, పృష్ఠావర్తా నశోభనా।
ఏకేన హంతి భర్తారం, భవే దన్యేన పుంశ్చలీ
కంఠగో దక్షిణావర్తో దుఃఖవైధవ్య హేతుకః।
శీర్షేవాథ లలాటేవా త్యాజ్యా దూరా త్ప్రయత్నతః
ప్రదక్షిణో వా వామో వా రోమ్ణా మావర్తకః స్త్రియః।
ఏకోవా మూర్ధని ద్వౌవా దశాహాద్ధంతి సా పతిం

సుప్తా పరస్పరం యాతు దంతాన్ కటకటాపయేత్
సులక్షణాపి వసా శస్తా వివాహే కుంభసంభవ ॥

శిరమున కుడి సుడియుండిన తండ్రియు, ఎడమ సుడి యుండిన తల్లియు లేని దగును. స్తనమునందు సుడియుండిన మూఁడు సంవత్సరములలో తల్లి మరణించును, స్తనద్వయమున సుళ్ళుండిన పతిహీనురా లగును. ముఖమునందు సుడి యుండిన మగని జంపును. భుజములం దుండిన పతివ్రత యగును. కడుపునం దుండిన మామగారిని జంపును. నుదుట నుండిన మఱఁదిని జంపును. చను మొనలయం దుండిన అంకులాడి యగును. చెవుల మొదట రెండు సుళ్ళును, శిరమునందు రెండు సుళ్ళును ఉండిన కొంచెము సౌభాగ్యమును పొంది పిదప విధవ యగును. కనుబొమల నడుమను రెండు కనుబొమల యందును పాదముల యందును సుళ్ళుండిన విధవయు జారిణియు యథేచ్ఛముగఁ దిరుగునదియు నగును. లలాటము-పొట్ట-కటిప్రదేశము వీనియందు మూఁడేసి సుళ్ళుండిన మగఁడు, మామ, మఱఁది వీరిని చంపునది యగును. భుజమధ్యమునందు సమముగ ప్రదక్షిణాకారముగ నుండిన ధనమును గోధుకులను గలిగించును. రెండు మోఁకాళ్ళయందును చీలమండల యందును అప్రదక్షిణమగు సుడియుండిన నెల్లప్పుడు దుస్స్వభావము గలిగి పరపురుషాసక్తురాలయి తిరుగునది యగును. చేతులయందు సుడులు ప్రదక్షిణముగ నుండిన ధర్మముగలిగి యుండును. ఎడమ సుళ్ళుండిన నశుభకరము. బొడ్డునందును ఱొమ్మునందును వెన్నెముకకు దక్షిణ పార్శ్వమునను కుడిసుడి యుండిన సుఖము ఆయుష్యము పుత్రసంతానము కలుగును. గుహ్యమునందు సుడియుండిన పరపురుషులను గూడునది యగును. భగమూలియందు ప్రదక్షిణమగు సుడియుండిన రాజపత్ని యగును. అదియే శకటాకారముగ నుండిన పుత్రనాశముగలదియగును. కడుపునందును వీఁపునందును రెండు సుళ్ళుండిన పతిని జంపునదియు అంకులాడియు నగును. కంఠమునందు కుడిసుడి యుండిన వైధవ్యముగలదియగును. శిరమునందును లలాటమునందును సుడులుండిన నట్టి స్త్రీని విడువవలయును. శిరస్సునందు కుడి యెడమ సుళ్ళలో ఒకటిగాని రెండుగాని వెండ్రుకలతో తిరిగియుండిన పది దినములలో మగనిఁ జంపును. నిద్రించునపుడు దంతములను కటకట కొఱికెడు స్త్రీ సులక్షణవతియైనను పురుషునకు వివాహమునకుఁ దగదు. ఇట్టి దుష్టచిహ్నములు తన యందు లేవని చెప్పి తనయందున్న శుభలక్షణములు చెప్పుచున్నది.

సీ. సమములువలుపులు♦సన్నముల్ చికురముల్, కనుబొమల్ రెండును♦గలయఁబడవు
రోమహీనములు వ♦ట్రువలు నాజంఘులు, పలుచా లెడము లేక♦కలిసినదియుఁ
గనఁతలు నేత్రముల్ ♦ కరచరణంబులు, నూరులు గుల్ఫంబు ♦ లుబ్బు గలవు
నిద్దముల్ గుంద్రముల్♦నెఱిసమంబులుగోళ్ళు, ఉరుప యోధరములొం♦డొంటి

నొరయు

తే. మగ్నములు చనుముక్కులు ♦ మఱియు నాభి
యుబ్బుప్రక్కలు లోఁతును ♦ నొరపదియుఁ
బ్రక్కలును ఱొమ్ము నుబ్బునఁ ♦ బ్రాలు నాదు
నవయవద్యుతి మణినిభ♦మై తనర్చు. ౯౦౯

అర్థములు. చికురముల్=తల వెంట్రుకలు, జంఘలు = పిక్కలు, గుల్భములు = చీల మండలు, పయోధరములు = చన్నులు, అవయవ ద్యుతి = అంగముల కాంతి, మణినిభమై=రత్న కాంతివంటి కాంతి గలది.

తాత్పర్యము

నా తల వెంట్రుకలు సమానములుగ నీల వర్ణములుగ సన్నగా నున్నవి. కనుబొమ్మలు రెండును నొక దానితో మఱియొకటి కలియక యున్నవి. నా పిక్కల యందు వెంట్రుకలు లేవు. గుండ్రముగానున్నవి. నా దంతములు నడుమ సందులేక యన్నియుఁ గలిసియున్నవి. కణఁతలు కన్నులు కాళ్ళు చేతులు తొడలు చీల మండలు బలిసియున్నవి. గోళ్ళు నునుపులై గుండ్రములై సమములై యున్నవి. స్తనములు పెద్దవై యొకదాని నొకటి నొరసికొని యున్నవి. చను ముక్కులు నిట్ట పొడిచికొని యుండక లోపలికి ముడుచుకొని యున్నవి. నాభి ప్రక్కలం దుబ్బు గలిగి లోఁతై యున్నది. ప్రక్కలు ఱొమ్ము ఉబ్బియున్నవి. నా యవయవముల కాంతి రత్న కాంతిఁబోలి యున్నది.

కం. మృదువులు తనూరుహంబులు, పదతలములుఁ గాలివ్రేళ్ళు ♦ బాగుగ ధరణీ
పదమున నానుట భద్ర, ప్రదచిహ్నము లనుచు నన్నుఁ ♦ బలికిరి పెద్దల్.

అర్థములు. తనూరుహంబులు = వెంట్రుకలు, మృదువులు = మెత్తనివై యున్నవి.

తాత్పర్యము

నా తల వెంట్రుకలు మృదువులుగా నుండుట నా కాలివ్రేళ్ళు కాలి యడుగు ప్రదేశములు నడచునప్పుడు బాగుగ నేల నానుట యివి శుభచిహ్నము లని నన్ను గుఱించి పెద్దలు చెప్పిరి.

కం. ఎఱుపులు నిరంతరంబులు, మఱియు సమగ్రయవరుచులు♦మత్కరపదముల్
చిఱునగు కల దని కన్యల, గుఱుతు లెఱుక కలుగు విప్ర♦కోటులుపలికెన్.

అర్థములు. మత్కరపదముల్ = నా చేతులు కాళ్ళు, నిరంతరంబులు=వ్రేలికి వ్రేలికి నడుమ సందు లేనివి, సమగ్రయవరుచులు=సంపూర్ణ యవకాంతులు గలవి.

తాత్పర్యము

నాయడుకాళ్ళు నఱచేతులు ఎఱ్ఱని కాంతిగలవి. వ్రేలికివ్రేలికి నడుమ సందు లేదు. పూర్ణమైన యవల కాంతిగలవి. ముఖమునం దెప్పుడు చిఱునవ్వుండును. ఇవి

యన్నియు శుభప్రదము లని కన్యకల లక్షణము లెఱిఁగిన బ్రాహ్మణులు చెప్పి యుండిరి.

తే. అవని దేవులు పలికి రే•నాధి రాజ్య, మందుఁ బతితోడ నభిషేక•మందఁ గల వ
టంచుఁ దత్సర్వమును వ్యర్థ•మయ్యె నాదు, భాగ్యహీనతఁ దద్వాక్య•భంగమందె.

అర్థములు. అవని దేవులు = బ్రాహ్మణులు – స్వర్గమునందు దేవతలఁ జెప్పినపుడుమాత్రమే దేవశబ్దమునకు బహువచనరూపము లేదు. సు.వ్యా.తత్సమ ౬౭-సూత్రము.

తాత్పర్యము

బ్రాహ్మణులు నేను గొప్ప రాజ్యమందు నాభర్తతోడఁ బట్టాభిషేక మందఁ గలనని చెప్పిరి. అది యంతయు వ్యర్థమయ్యెను. నా నిర్భాగ్యదశవలన బ్రాహ్మణ వాక్యము కూడ భంగమయ్యెను.

కం. శోధించి జనస్థానము, సాధించి మదీయవార్త • జలనిధి బలిమిన్
రోధించి గోష్పదంబున, బాధింపఁబడిరి మఱఁది • ప్రాణేశ్వరుఁడున్. ౯౯౩

అర్థములు. శోధించి = వెదకి - రోధించి = అడ్డకట్టి - గోష్పదంబున = అల్పమునందు.

తాత్పర్యము

. నా నిమిత్తమై జనస్థానమంతయు వెదకి నే నెచ్చట నుండునది తెలిసికొని సముద్రమున కనకట్ట కట్టి యింతటి కష్టసాధ్యకార్యములు చేసియుఁ గడపట నింద్రజిత్తు మాయ యను నావుగిట్టంత ప్రదేశమును దాటుటయందు మఱఁది, భర్త యిరువురు బాధ చెందిన వారైరి.

సీ. వారుణాస్త్రంబును • వాయవ్యబాణంబుఁ, బావకాస్త్రంబును • బ్రహ్మశిరము
నైంద్రాస్త్ర మాదిగా • నఖిలాస్త్రమండలి, వీర లెఱిఁగిన • వార మఱియు
రామునికంటికి • రణమునఁ బ్రతిపంథి, యగపడి యసురుతో • నరుగ లేఁడ
యతఁ డెంతటిమనోజ•వాఢ్యుఁ డేనియు నట్టి; వీరులఁ బర్వత • వైరినిభుల

తే. నిఱుముకొని మాయ మఱుగున•నింద్రజిత్తు, దిక్కు లేకుండ నాకల•దిక్కు గాఁగ
నున్న రాముని లక్ష్మణుఁ•యుద్ధవీథిఁ, బిలుకుమార్చెను నిం కేమి•తెలుప వచ్చు.

అర్థములు. బ్రహ్మశిరము=ఇది యొక గొప్ప యస్త్రము. ఇది పుట్టిన వారిని బుట్టఁబోవువారిని తల్లి కడుపులో నున్నవారిని కాన వచ్చిన వారిని కాన రానివారిని నందఱఁ జంపఁగలిగిన యస్త్రము. దీనినే యశ్వత్థామ పరీక్షిత్తుపైఁ బ్రయోగించినది. దీనిని బ్రయోగించి యుండిన లంక నంతయు భస్మము చేసి యుండును. అప్పుడు నిరపరాధులు యుద్ధము చేయనివారు పిల్లలు వృద్ధులు స్త్రీలు నందఱుఁ జచ్చి యుందురు. కనుచాటు వారిని గొట్టుట రామునికి సమ్మతము గాదు. కావున నా దివ్యాస్త్రములఁ బ్రయోగింపఁ లేదు. ప్రతిపంథి =

విరోధి, మనోజవాధ్యుఁడు = మనస్సు పోవునంత వేగముతోఁ బోవఁగల గొప్ప వాఁడు. దీనివలన మనోవేగమున కంటె వేగముగ రామబాణము పోఁగలదని భావము. పర్వతవైరి నిభులన్ = ఇంద్రసమానులను, ఇఱుముకొని = డాఁగికొని, పిలుకు మార్చెను = చంపెను.

తాత్పర్యము

వారుణాస్త్రము వాయవ్యాస్త్రము ఆగ్నేయాస్త్రము బ్రహ్మశిరోనామకాస్త్రము, ఐంద్రాస్త్రము లోనుగా సమస్తాస్త్రములు వీరు తెలిసినవారే. ఏయస్త్రము ప్రయోగించినను శత్రువులు నాశమైయుందురు. అట్లేల వీరు చేయలేదో! అస్త్రముల దాఁకఁబోవలయునా? రామచంద్రమూర్తి కంటికి నగపడి శత్రువనువాఁడు మనోవేగము గలవాఁడైనను ప్రాణముతో మరలఁ బోలేఁడు. ఆశౌర్య మేమాయెనో? ఎదుట నిలఁబడి యుద్ధము చేయలేక చాటుగా నుండి కొట్టువాఁడు పిఱికివాఁడే కదా? అట్టివానిని గొట్టరాదని యూరకుండిరి కాఁబోలు. అది యెఱిఁగి యింద్రసమానులగు వీరిని మాయచాటున నుండి యింద్రజిత్తు దిక్కులేని నాకు దిక్కుగా నుండువారిని రామలక్ష్మణులను వధించెను. దీని కేమని యనుకొనవలయును?

కం. రాముఁడు తమ్మునితోఁ రణ ♦ భూమిం దెగిపడుట కాల ♦ మున కతిభారం
బేమెయిఁ గలుగదు దైవం, బే మేలుం గీడుఁ గూర్ప ♦ హేతువు జగతిన్.

తాత్పర్యము

రామచంద్రమూర్తి యంతటివాఁడు తనయంతటి తమ్మునితోడ యుద్ధభూమి యందు మరణించుటచేఁ గాలమునకు నసాధ్యమైనది లేదనుట సత్యము. ఇంతటి యసాధ్యకార్యము కాలము తప్ప మఱియేదియుఁ జేయఁజాలదు. మేలుగాని, కీడుగాని జేయుటకు దైవమే కారణము, కాని పౌరుషము కాదు. లోకమునం దింతకంటెఁ బౌరుషవంతులు లేరు. పురుషకారము చేయగలవారు చేసినవారు లేరు. దైవబలము దుర్బలమైనపుడు సర్వము వ్యర్థమయ్యెను. ఈనీతి రామాయణమునఁ బలుమాఱు బోధింపఁబడెను.

కం. రామునకు సంత వగవన్, సౌమిత్రికి సంత వగవ ♦ జననికి వగవన్
నా మాత్ర కేడ్వఁ గౌసల్యామహిత తపస్వినికి న ♦ లందురుదానన్. ౯౯౭

అర్థములు. అలందురుదానన్ = దుఃఖించెదను — అంత = కౌసల్య కేడ్చినంత విశేషముగ.

తాత్పర్యము

కౌసల్యకుఁ గలిగిన పుత్రశోకమునకై దుఃఖించినంత రామునకై నేను దుఃఖింపను. ఆయన కర్మమాయన యనుభవించెనని తలఁతును, అన్ననిమిత్తమై వచ్చి నిష్కారణముగ నిట్టి యపమృత్యువు పాలాయెఁగదా యని లక్ష్మణునకు నేను

విశేషించి దుఃఖింపను. అదియును నాయన బుద్ధిపూర్వకృతమే. నా నిమిత్తమున నన్నుఁబెంచి పెద్దచేసిన యద్దుముద్దు చూచిన నాతల్లికి నింత దుఃఖము వచ్చెనని యామెకై దుఃఖింపను. నాకిటువంటి కష్టదశ ప్రాప్తించెఁగదా యని నాకై నే నేడ్వను. 'అవశ్య మనుభోక్తవ్యం, ఫలం కర్మ శుభాశుభ'మ్మని సహించెదనుగాని మహాతపస్సులు పండ్లకొలఁది ధారవోసి 'కొడుకో కొడుకో' యని కలవరించి యింతటి గొప్ప వానిని గని, 'యీనగాచి నక్కలపాలు చేసి'నట్లు నిష్కారణముగఁ గొడుకు నిట్లు కానని దేశమునఁ బోఁగొట్టుకొనిన యేకపుత్రికను గౌసల్యకై దుఃఖించెదను. ఈవార్త వినినేని యామె కడుపులో నెట్లుండునో కదా! ఈ కాలమునందలి యత్తలు కోడండ్రు సీతాదేవి యభిప్రాయమును మనస్సునం దుంచుకొందురుగాక. కౌసల్యకు సీతాదేవియం దెంత ప్రీతి లేకున్న నామె యిట్టిమాటలు చెప్పునా? కనుక నేకదా 'కన్నతల్లికి మిన్న కరుణన్ లాలించు సత్తగారా' యని యేడ్చెను.

కం. ఎప్పుడు వ్రత మీడేరునొ, యెప్పుడొకో కనుదు సీత • నే రామునితో
నొప్పెడి లక్ష్మణునని మది, నెప్పుడుఁ జింతించుఁ ద్రోవ • లెదురుం జూచున్.

### తాత్పర్యము

కౌసల్యనిమిత్తమై విశేషించి దుఃఖించుటకుఁ గారణము చెప్పుచున్నది. వనవాసవ్రత మెప్పుడు ముగియునాయని దినము లొక్కొక్కటిగా లెక్కించుచు నేను సీతను రామునితోఁగూడియుండు లక్ష్మణు నెప్పుడు చూతునాయని సర్వదా చింతించుచుఁ ద్రోవ లెదురుచూచుచుండును. అట్టి దీ వార్త వినిన నెట్లు ప్రాణము నిలుపఁగలదు. సీతాలక్ష్మణులతోడి రాముని నెప్పుడు చూతునాయని కాదు, కౌసల్య యెదురు చూచునది. ప్రాధాన్యము రామునకీయ లేదు. సీతను లక్ష్మణుని తరువాత రామునిఁ జూడఁగోరెనని ప్రాధాన్యము తనకు లక్ష్మణునకుఁ జెప్పుకొనెను. ఇట్లు చెప్పుటచేఁ దన కన్న కొడుకు రామునియందుండు ప్రీతికంటె సీతాలక్ష్మణుల యందుఁ గౌసల్యకుఁ బ్రీతి మెండని భావము.

### —• త్రిజట సీతాదేవికి శ్రీరామలక్ష్మణులు జీవించియున్నారని చెప్పుట •—

చ. అని విలపింపఁగా త్రిజట • యాసతిఁగాంచి వచించె నేల యా
వనజదలాక్షి యేడ్చెదు భవ • త్పతి ప్రాణయుతుండు, దుఃఖమున్
గొనకుము, రామలక్ష్మణులు • గూల రటంటకు గొప్ప హేతువుల్
వినిచెద విన్ము నేఁ గనిన • విన్ మును నాకు నెఱుంగనైనవిన్. ౯౨౩

అర్థములు. ప్రాణయుతుండ = ప్రాణముతో నున్నవాఁడే, కనినవిన్ = కనినవియును, ఎఱుంగనైనవిన్ = ఎఱుంగనైనవియును.

### తాత్పర్యము

ఈ ప్రకారము సీతాదేవి దుఃఖింపఁగాఁ ద్రిజట యామెను జూచి యిట్లు

చెప్పెను. ఏలమ్మా నీవిట్లు దుఃఖించెదవు. నీభర్త మరణించినవాఁడు కాఁడు. ప్రాణముతో నేయున్నాఁడు. కావున నీవు దుఃఖింపకుము రామలక్ష్మణులు మరణింప లేదనుటకుఁ బూర్వము నేను జూచినవియు, నాకుఁ దెలిసినవి చెప్పెద వినుము.

సీ. పతి హతుఁ డాయెనా • భటుల ముఖంబులఁ, గనలును ముదమేమి • కానఁబడదు
పుష్పకం బను పేరి • వ్యోమయానము దివ్య, మిది వీరు తెగిన ని • న్నిందుఁగొనదు
హతవీరసైన్యంబు • హతనావికతరి నా, నుత్సాహ మెడలి ని • రుద్యమ మగు
నీ సేన భయ మింత • యెఱుఁగక, కలఁగక రాఘవులను లెస్స • రక్ష సేయు
తే. నిన్ను దెలిపితి నీ మీఁద • నెనఁగు ప్రీతి, భద్రకారణచిహ్నముల్ • పడఁతి యెఱిఁగి
నా నుడివి విశ్వసింపుము • మాను వగపు, నన్నదమ్ములు బ్రదికియ • యున్నవారు.

అర్థములు. కనలు = కోపము, ముదము = సంతోషము, హతవీర సైన్యంబు=చంపఁబడిన వీరులు గలసేన, హతనావిక తరి నా=చంపఁబడిన యోడ మాలిమిగల నావ యన్నట్లు, నిరుద్యమము = ప్రయత్నహీనము, భద్రకారణ చిహ్నముల్=శుభమునకుఁ గారణములైన గుర్తులు.

తాత్పర్యము

ప్రభువు మరణించెనేని యతని భటుల ముఖములందుఁ గోపము గాని సంతోషముగాని గానఁబడదు. ఇది నేను మునుచూచిన విషయము. ఇచ్చటనో వానర వీరుల ముఖములందుఁ గోపము సంతోషము గానవచ్చుచున్నది. ఇఁక నాకుఁ దెలిసిన విషయము చెప్పెద విను. ఈ పుష్పకము దివ్యవిమానము. ఇది భర్త మరణించిన దానిని మోయదు. నీ భర్త మరణించి యుండెనా నిన్నిది మోసియుండదు. కావున నీ భర్త మరణింపలేదు. వీరులు చచ్చిన సేన, యోడమాలిమి చచ్చిన పడవవలె నుత్సాహముచెడి ప్రయత్నము నేమియుఁ జేయదు. వానరులు వృక్షహస్తులై యుద్ధమునకు సిద్ధపడియున్నారు. ఈ వానరసేన భయ మనునది కొంచెమైన తెలియక కలఁత పడక రామలక్ష్మణులను కాపాడుచున్నారు. వారు మరణించియే యుండిన నీ కాపేల? నీయందు నాకుండు ప్రీతిచే శుభకారణములైన లక్షణము లన్నియు నీకుఁ దెలిపితిని. ఇవి తెలిసికొని నామాట నమ్ముము. వ్యసనము మానుము. అన్నదమ్ములు ప్రాణముతో నున్నారు. మరణింపలేదు.

కం. అనినది లేదు కల్లల, నాడఁగఁ బోనింక నెప్పు • డంబుజనేత్రా !
యోడకు నా మది కెక్కితి, చేడియ చారిత్రసఖ్య • శీలత్వములన్. ౧౦౦౦

అర్థములు. కల్లలన్ = అసత్యములను, ఓడకు=భయపడకుము, నామది కెక్కితివి=నాకు సంతోషము కలిగించిన దానవైతివి, చారిత్ర=నడవడి చేతను, సఖ్య = స్నేహము చేతను, శీలత్వములన్ = పాతివ్రత్యము చేతను, చరిత్రమే చారిత్రము. ఇది నరక, పురుషాది శబ్దములవంటిది.

తాత్పర్యము

సీతాదేవీ ! నేనింతవఱకసత్యమాడిన దానఁగాను. ఇఁక మీఁద నేనాడఁబోవునదిలేదు. భయపడకుము. నామాట నమ్ముము. నీ నడవడి చేతను స్నేహము చేతను పాతివ్రత్యము చేతను నాకు మనస్సునకు సంతోషము కలిగించితివి. నిన్ను మెచ్చుకొంటిని కావునఁ జెప్పితిని.

ఉ. జానకి వీరి గెల్వఁగ న • సాధ్యము సేంద్రసురాసురాళికిన్
మానితభద్రచిహ్నములు • మానమిఁ గాంచి వచింతు వారి నె
మ్మేనులవైఖరుల్ గనుమి • మెల్లన మూర్ఛ వలంగి యుండియున్
మానదు నైజలక్ష్మి, ద్యుతి • మాఱుఁ జుమీ విగతాసుదేహులన్. ౧౦౧

అర్థములు. సేంద్ర = ఇంద్రునితోఁ, గూడిన, సుర + అసుర + ఆళికిన్ = దేవతలయు నసురులయు సమూహమునకు, భద్రచిహ్నములు = శుభలక్షణములు, వైఖరులు=విధములు, నైజలక్ష్మి = స్వభావకాంతి, ద్యుతి = కాంతి, విగతాసుదేహులన్=ప్రాణములేని దేహములు గలవారికి.

తాత్పర్యము

జానకీ ! యీ రాజకుమారులను నింద్రునితోఁడ దేవతలు నసురులు వచ్చినను గెల్వ శక్యముగాదు. వారియందు శుభచిహ్నములు దోఁగి పోకుండుట చూచి చెప్పుచున్నాను. వారి దేహముల తీరు చూడుము. మూర్ఛలో మునిఁగియుండినను సహజకాంతి మాఱినదికాదు. ప్రాణము పోయిన దేహములం దీకాంతి యుండదు.

కం. సుందరి రామసుమిత్రా,నందనులకు వగచు టుడుగు • నమ్ముము వీరిన్
క్రందింప నెట్టివా రా, స్కందనమునఁ జాల రేల • కళవళపడఁగన్. ౧౦౨

అర్థములు. క్రందింపన్ = చంపుటకు - ఆస్కందనమునన్=యుద్ధమందు, కళవళ పడఁగన్=కలఁత పడెదవు.

తాత్పర్యము

సుందరీ! రామలక్ష్మణుల గుఱించి నీ వేమవవలదు. వారికి వచ్చిన భయము లేదు. నామాట నమ్ముము. వీరిని యుద్ధమం దెవ్వరును వధింపఁజాలరు. ఏల యూరక కళవళపడెదవు ?

తే. త్రిజట యీరీతిఁ పల్కిన • దేవకన్య, పోని మైథిలుకన్య యా • పొలఁతిఁ జూచి
యంబ నీ పచియించిన • యట్ల యగుత, మంచు నంజలిఁ గీలించి • యనియెనంత.

అర్థములు. దేవకన్యపోని = దేవకన్యవంటి - అగుతన్ + అంచు = అగుత మంచు-ఆశీరాద్యర్థకంబు లయిన ఎదు తలకు నచ్చు పరమైనపుడు ద్రుతమునకు మకారము వచ్చును.

తాత్పర్యము

త్రిజట యీ ప్రకారము చెప్పఁగా దేవకన్యవంటి (లక్ష్మి) సీతాదేవి

యమ్మా! నీవు చెప్పినదే వాస్తవ మగును గాక యని చేతులు జోడించి నమస్కరించెను. త్రిజట వృద్ధ స్త్రీ, హితకాంక్షిణి భయమునుండి రక్షించునది కావునఁ దల్లితో సమానురాలు.

తే. మరలిచని పుష్పకము రాము॰తరుణితోడఁ, ద్రిజటతో వారిలంకలో॰దించుటయును
నసురకాంత లశోకవ॰నాంతరము ప్ర, వేశ పెట్టిరి జానకీ॰లేశమధ్య. ౧౦౪

అర్థములు. లేశమధ్య=సూక్ష్మమైన నడుముగలదానిని, అణుమధ్య.

తాత్పర్యము

పుష్పకము మరలిపోయి సీతా త్రిజటలను లంకలో దించెను. అచ్చటినుండి రాక్షసస్త్రీలు సీతాదేవిని నశోకవనమునకుఁ బిలిచికొనిపోయిరి.

కం. ఆరాక్షసలోకేశు వి, హారతలం బైన మంజు॰లారామము సీ
తారమణి చొచ్చి, రాజకు,మారుల భావించి కాంచి॰మతి మతి వగచెన్.

అర్థములు. విహారతలంబు=వేడుకగాఁ దిరుగు ప్రదేశము, మంజులారామము=అందమైన యుద్యానవనము.

తాత్పర్యము

రావణుఁడు క్రీడార్థము తిరుగు సుందరమైన యుద్యానవన మందుండు సీతాదేవి రామలక్ష్మణులను దలఁచి వారున్న కష్టదశఁజూచి మిగుల దుఃఖించెను.

—॰ ౪౮-వ సర్గము. శ్రీరాముఁడు మూర్ఛ దేఱి లక్ష్మణుఁజూచి దుఃఖించుట ॰—

ఉ. వీరులు కీశనాయకులు ॰ వేయివిధంబులఁ దన్నుఁ గాచుచున్
భూరితరార్తి దుఃఖమునఁ ॰ బొక్కుచు నుండఁగ నంతలోపలన్
ధీరుఁడు సత్త్వశాలి రఘు॰నేత శరోత్కరబద్ధుఁ డయ్యునున్.
గూరి స్మృతిన్ నిజాంతికపు ॰ క్షోణితలంబున నున్న తమ్మునిన్. ౧౦౬

అర్థములు. సత్త్వశాలి=బలవంతుఁడు, రఘునేత=రామచంద్రమూర్తి, శరోత్కర బద్ధుఁడు = బాణ సమూహములచేఁ గట్టఁబడినవాఁడు, స్మృతిన్ = తెలివి, నిజాంతికపు=తనకు సమీపమందలి, క్షోణితలంబునన్=భూమియందు.

తాత్పర్యము

వీరులగు వానరశ్రేష్ఠు లనేక విధములఁ దన్ను రక్షించుచుండఁగా మిగుల బాధచే దుఃఖించుచు నుండఁగా నంతలో ధైర్యవంతుఁడును, బలవంతుఁడు నగు రామచంద్రమూర్తి బాణములచేఁ గట్టువడియు స్మృతిదెచ్చుకొన్నవాఁడై తన సమీపమందుండిన తమ్ముని.

క. నెత్తురువఱులు వాఱఁగ, జొత్తిల్లినమేనితోడ ॰ సొలిమిడి గొని గా
ఢాత్తశరబంధనంబున, నొత్తోరు వయి నొగిలి యున్న ॰ యుత్తమవీరున్.

అర్థములు. వఱులు వాఱఁగన్=కాలువలుగాఁ బ్రవహింపఁగా, జొత్తిల్లిన=ఎఱ్ఱవాఱిన, సొలిమిడి గొని = మూర్ఛపోయి, గాఢాత్తశరబంధనంబునన్ =

గట్టిగా నాటిన బాణముల కట్లచే, ఒత్త్రోరువు = ఒత్తు + ఒరువు = ఒత్త్రోరువు= మిక్కిలి పీడింపఁబడి, నొగిలి=దుఃఖపడి.

తాత్పర్యము

నెత్తురు ప్రవహింపఁగా నెట్టపాటిన దేహముతో మూర్ఛపోయి గట్టిగా కట్టఁబడిన బాణముల కట్లచే మిగుల బాధపడి నొచ్చిపడియున్న తమ్మునిను త్తమవీరుని.

కం. తిలకించి దుస్సహార్తిన్, నలఁగుడుపడి యేడ్చె నాయ॰నా! లక్ష్మణ! హా
యలఘుమతీ! తమ్ముఁడ! ని, న్నిల నిట్టియవస్థఁ గంటి॰నెంతటిపాపిన్. ౧౦౦౪

అర్థములు. తిలకించి = చూచి, దుస్సహ + ఆర్తిన్ = సహింపరాని దుఃఖముచే, నలఁగుడుపడి=బాధపడి.

తాత్పర్యము

చూచి సహింపరాని దుఃఖముచే బాధపడి నాయనా! లక్ష్మణా! హా గొప్ప మనస్సుగలవాఁడా! తమ్ముఁడా! నీవు ఈ ప్రకారము బాధపడుచుండఁ జూడఁ గంటిని. అయ్యో! యెంతటి పాపాత్ముఁడను.

కం. దురమున నిటు నిర్జితుఁ డై, సొరిగి పడిన శూర్మితమ్ముఁ॰జూడఁగఁ గలిగెన్
ధరణి నిఁకేటికి సీతా, తరుణియు గిరుణియును జీవి॰తము గీవితమున్. ౧౦౦౫

అర్థములు. దురమునన్ = యుద్ధమందు. నిర్జితుఁడై = జయింపఁబడినవాఁడై, సొరిగి = మూర్ఛపోయి, తరుణి గిరుణి - జీవితము గీవితము. నిందయందు గిగీ లగు.

తాత్పర్యము

మరి దేనియందుగాదు. అటవంటి యుద్ధమందు నీ విధముగ జయింపఁబడుటగాక మ్మూర్ఛపోయియుఁ బడిన శూరివింగల తమ్ముని నేను ప్రతిక్రియ చేయలేక రక్షింప లేక యూరక చూడవలసివచ్చెను. ఇఁక నాకు సీతయేల? ప్రాణమేల? ఇంతకంటె నవి ప్రియములైనవా?

కం. నెమకిన సీతకు సమ యగు, కమలాక్షి లభింప వచ్చు॰ క్షమ లక్ష్మణుతో
సముఁ డగు తమ్ముఁడు సచివుఁడు, సమర కళావిదుఁడు దొరక॰జాలం డెందున్.

అర్థములు. నెమకినన్ = లోకమున వెదకిన, సచివుఁడు = మంత్రియు, మిత్రుఁడు, సమర కళావిదుఁడు=యుద్ధవిద్యయందు నేర్పరి.

తాత్పర్యము

సీతకంటెఁ దన ప్రాణమునకంటె లక్ష్మణుఁ డెక్కువ యనుటకుఁ గారణము చెప్పుచున్నాఁడు.

భూమియందు వెదకినయెడల సీతవంటి భోగ్యస్త్రీ దొరకవచ్చును. ఈ దేహముపోయినమరల దేహము రావచ్చునుగాని లక్ష్మణుతో సముఁడైన తమ్ముఁడు, మంత్రి, మిత్రుఁడు, యుద్ధవిద్యాసమర్థుఁడు నెందు దొరకును? ఇది కేవలదుర్లభము.

కం. బాణహతిఁ దమ్ముఁడే ని, ర్యాణంబును బొందఁ గలిగె♦నా నిక్కమిటన్
క్షోణిరుహాటులు గనఁగాఁ, బ్రాణంబులు విడుతుఁ గాక ♦ బ్రదు కేమిటికిన్.

అర్థములు. బాణహతిన్ = బాణముల దెబ్బలచే - నిర్యాణంబున్ = మరణమును-క్షోణిరుహాటులు=వానరులు - 'ధరా ధరిత్రీధరణిక్షోణిర్జ్యా కాశ్యపీ క్షితిః' అమరము-క్షోణిశబ్ద మీకారాంతము గలదు.

తాత్పర్యము

బాణముల దెబ్బలచే నా తమ్ముఁడే మరణింపఁగలిగెనా నిశ్చయముగా నీ స్థలమందే వానరులందఱుఁ జూచుచుండఁ బ్రాణములు విడుతును. ఆవల నేను బ్రదికియు నేమి ప్రయోజనము. నే నెవరిని సుఖపెట్టవలయునని కోరెదనో యట్టివారు లేనప్పుడు నే నేల సుఖార్థినై ప్రాణములు ధరింపవలెను. నేను బ్రదుకుట నానిమిత్తమె కాదు.

కం. ఏ మందును గౌసల్యకుఁ, నే మందును గైకయికిని ♦ నే మందును నా
సౌమిత్రికి భరతున కీ, సౌమిత్రిని విడిచి నేను ♦ జనిత నయేనిన్. ౧౦౧౨

అర్థములు. ఆ సౌమిత్రికిన్ = శత్రుఘ్నునకు.

తాత్పర్యము

బ్రదికితిని, పో, యుద్ధమందు జయించి సీతను దీసికొని యయోధ్యకుఁ బోయితిని బో, ఏమి సంతోషము — పోఁగానే కౌసల్య లక్ష్మణుఁ డేడని యడుగునే యేమని చెప్పుదును? కైక కేమి చెప్పుదును. వీని నిచ్చట విడిచిపోయి భరతునకేమి చెప్పుదును? శత్రుఘ్నునకేమి చెప్పుదును? లక్ష్మణుని లంకలో రాక్షసుల పాలుచేసి నేను నా పెండ్లాము సుఖముగా వచ్చితి మని చెప్పుదునా?

ఆ సౌమిత్రిని=అన్నా సుమిత్రాదేవి కొడుకు లిరువురు మన దాసులైరి. నా సౌమిత్రిని నేను గాపాడఁ గలిగితిని, నీ సౌమిత్రిని నీవు కాపాడ లేక పోయితివా యని భరతుఁ డడిగిన నేయని చెప్పుదు నని భావము.

ఉ. ఎన్నఁడు వచ్చునో తనయుఁ ♦ డెప్పుడు గందునో యంచు నున్న స్త్రీ
ఖిన్నకు నేమి చెప్పుదు సు ♦ మిత్రకు, నీ చెడువార్తఁ జెప్పినన్
ఖిన్నత వేపమాన యయి ♦ క్రేపు దొలంగిన ధేను వై మహా
పన్నత నొంది యేడ్వ నది ♦ పల్కు-డు నే మని యూఱడించెదన్. ౧౦౧౩

అర్థములు. స్త్రీఖిన్న=స్త్రీమణి, స్త్రీలయందు శ్రేష్ఠురాలు, ఖిన్నతన్ = ఖేదముచే, వేపమానయయి = వణకుచున్నదై, క్రేపు = దూడ, మహాపన్నత = గొప్ప విపత్తును.

తాత్పర్యము

తల్లులకు దూరమునం దుండు కొడుకులే పలుమాఱు తలంపునకు వచ్చుచుందురు. కావున నా కొడు కెపుడు వచ్చునో, ఎన్నడు కన్నులారఁ జూతునో యని యెదురు చూచుచుండు స్త్రీరత్నమగు సుమిత్రాదేవికి నీ దుర్వార్త చెప్పఁగానే శోకాతిశ

యముచే నిర్బరించుకొన లేక వణఁకుచు లేఁగను బాసిన గోవువలె విపత్తుపాలై దుఃఖింపఁగా నేనేమని సమాధాన పఱుతును ?

చ. అడవుల కేగు నీ కటు స • సహాయునిఁగాఁ దెకతేర కేను నా
కొడుకును బుచ్చితిన్, వనులఁ • గోల్పడి యాతని నీవు భార్యయున్
విడిదికిఁ జక్కవచ్చితిరె • వీరుఁడ యొక్కనిఁగాన నీకునున్
గడిమి దొలంగెనా? యనుచుఁ•గ్రార్యము దోఁప సుమిత్ర పల్కినన్. ౧౦౧౪

అర్థములు. తెకతేరకున్=నిర్నిమిత్తముగా-ఏయుద్దేశము లేక, వీరుఁడ = ఇది యెత్తిపొడుపుమాట – ఎటువంటి వీరుఁడ వని నిష్ఠురోక్తి – కడిమి=బలము.

తాత్పర్యము

నీ వడవులకుఁబోవుచుండఁ జూచి యయ్యో యొంటరిగాఁ బోవుచున్నాఁడే యని యే యితరోద్దేశము లేక నీకు సహాయునిఁగా నా కొడుకును బంపితినే, అతనిని బోఁగొట్టుకొని నీవు. నీ పెండ్లామ్మాత్ర మింటికి వచ్చితిరా? ఆహా!మాయొక్కని గాపాడలేని శూరుఁడవు, ఏమి శూరుఁడవయ్యా నీవు, ఆమాత్రము నీకు బలము లేదాయెఁగదా యని పరుషముగా సుమిత్ర పలికెనేని.

కం. సైరించు టెట్లొకో నా, కారణమున మడిసినట్లు • క్షమఁ బడినాఁ డీ
శూరుఁ డనార్యుఁడ భృశపా,పారంభుఁడ ఛీ మనంగ•నగు ఫల మేమీ. ౧౧౦౫

తాత్పర్యము

ఎట్లు సహింతును? నా నిమిత్తముగాఁగదా చచ్చినట్లు అటువంటి శూరుఁడు నేలఁబడియున్నాఁడు నే ననార్యుఁడను, పాపకార్యములే చేయువాఁడను, నా నిమిత్తమై పరుల హింసించువాఁడను, ఛీ! బ్రతికి లాభ మేమి ?

సీ. అనయంబు దుఃఖించు•నను నూఱడింతువే, విలపింప నివు డేల•పలుక వయ్య
యెవ్వారి రణమున•నేపు మాపుదు వట్టి, యసురులచే హతుఁ డై తె తండ్రి
శరతల్పమునను నె•త్తురు గాఱ శరజాల, వృతుఁడవై సంధ్యార్కు•నెనసి దీవు
ఘనబాణహతమర్మ•తను బల్కఁజాలమి, వ్యథఁ బ్రేమదృష్టుల•బలికె దీవు
తే. వనములకు నొంటిగాఁ జను•వాఁడ ననుచు, వెంట నెటు లీవు వచ్చితో•వీరవర్య
యటుల యమలోకమునకు నీ•వరుగ నొంటి, నేను దోడవ వచ్చుట•నీతిగాదె.

అర్థములు. శరజాలవృతుఁడవై = బాణ సమూహములచేఁ గప్పఁబడినవాఁడవై, సంధ్యార్కున్ = సాయంకాలసూర్యుని, ఎనసెదవు = సరిపోలెదవు, ఘనబాణహతమర్మతను=గొప్ప బాణములచేఁ గొట్టఁబడినవాఁడ వగుటను, ప్రేమదృష్టులన్=ప్రేమను దెలుపు చూపులచే.

తాత్పర్యము

ఎల్లవేళల దుఃఖించుచుండు నన్ను నీ వూరడించుచుందువే యిప్పుడు నే నేడ్చుచున్నను ఏల సమాధానపఱుపవు? యుద్ధమునందు నెవ్వారి పరాక్రమ మణచు

చుండువో యట్టి రాక్షసులచేతనే తండ్రీ! కొట్టఁబడితివా? బాణశయ్యమీఁద నెత్తురు గాఱుచుండ బాణములచేఁ గప్పఁబడి సాయంకాల సంధ్యవేళ యుండలి సూర్యునివలె నున్నావు అస్తాద్రి శరతల్పము-నెత్తురు సంజకెంజాయ-బాణములు సూర్య కిరణములు-లక్ష్మణుఁడు సూర్యుఁడు. గొప్పబాణము లాయువు పట్టులఁ దగులుటచేఁ బల్కలేక యుండినను నీ దృష్టులు, నీ ప్రేమను దెలుపుచున్నవి.

అడవులకు నే నొంటిగాఁ బోవుచున్నాననికదా నీవు నీవారి నందఱ వీడి నా వెంట వచ్చితివి. అటులే నీవు యమలోకమునకు నొంటిగాఁ బోవునపుడు నేను నీతోడ వచ్చుట నీతియేకదా!

తే. ఇష్టబంధుజనావృతుఁ ♦ డితఁ డెప్పు, డయ్యు నేవేళ నన్నుఁదా♦ననుసరించు
నట్టి గుణశాలి దురదృష్టుఁ ♦ డైన నాదు, తెలివిలేమిని నిట్టి దు♦స్థితిని గాంచె.

అర్థములు. ఇష్ట బంధు జనావృతుఁడు = ఇష్టులచేతను బంధువులచేతను చుట్టఁబడియుండువాఁడు—దురదృష్టుఁడు=భాగ్యహీనుఁడు.

తాత్పర్యము

ఇతఁ డెప్పు డిష్టులచేతను, బంధువులచేతను జుట్టఁబడియుండువాఁడు. అటు లుండియు నెల్లవేళలఁ దాను నన్ననుసరించి నా వెంటనే యుండును. నిర్భాగ్యుఁడ నైన నా తెలివిలేమిచేత నటువంటి గుణవంతుఁ డిట్లు దుస్థితికి వచ్చెను. నాకు మేలు చేయవలయునని యితఁడు రాఁగానే నతనికిఁ గీడు గలిగించితిని.

కం. కోపించితి నేని నయో, పాపం బీలక్ష్మణుండు ♦ ప్రతిగా ననుఁ దా
నేపాటనేని యహితం, బో, పరుష మొు పలుకఁ డెఱుఁగ♦ మొుగమున విఱుపేన్.

తాత్పర్యము

అయ్యో! పాపము! నేను దనపైఁ గోపించినను నీ లక్ష్మణుండు మాటకు బదులు మాటగానైన, నేవిధముగనైనను హితము గానట్టి మాటగాని, కఠినోక్తి గాని పలుకువాఁడుగాఁడు. మొుగము చిట్లించుటయు నే నెఱుఁగను.

చ. అనమునఁ గార్తవీర్యుఁడు మ♦హాంబక పంచశతంబు లొక్కటన్
వెసఁ బరఁగించులోన భృశ ♦ వేగమునన్ బలుఁ డితఁ డన్నియే
మసలక వైచుఁ, ద్రుంచు శత ♦ మన్యునియస్త్రము లస్త్రపాళి, నీ
యనమసుఖోచితుండు దెగి ♦ హా! ధరణిం బడియున్నవాఁ డయో. ౧౦౧౯

అర్థములు. అనమునన్ = దర్పమున, కార్తవీర్యుఁడు = కృతవీర్యుని కొడుకు, వేయి చేతులవాఁడు, మహాంబక పంచశతంబులు = ఐదువందల గొప్ప బాణములను, ఐదునూర్ల విండ్లలో నైదునూర్ల బాణములను, పరగించులోనన్= ప్రయోగించులోపల, భృశవేగమునన్=మిగుల వేగముచే, మసలక = ఆలస్యము చేయక, శతమన్యుని = ఇంద్రుని, అనమసుఖ + ఉచితుండు = అసమానమైన సుఖమనుభవింపఁ దగినవాఁడు.

తాత్పర్యము

సహస్ర బాహుబల గర్వముగల కార్తవీర్యార్జునుఁడు వేయిచేతులందు నైదు నూర్లవిండ్ల నేకకాలమున ధరించి యైదు నూర్ల బాణములను బ్రయోగించువంత మాత్రపుఁ గాలములో నీ లక్ష్మణుఁ డొక్క వింట నొక్క చేత నన్ని బాణములు వేయఁగలఁడు. ఇంద్రుని యస్త్రములనైనను దన యస్త్రములచే ఖండింపఁగలఁడు. అటువంటి బాహుబలము, అస్త్రబలము గలవాఁడు ఎంతో సుఖ మనుభవింపఁ దగినవాఁడు చచ్చినట్లయ్యో నేలఁబడి యున్నాఁడు గదా!

తే. ప్రతిన చేసితి రాక్షస • రాజుఁ జేయు, వాఁడ నంచు విభీషణు • బాస దప్పె
నట్టి యనృతోక్తియిపుడు నా • యవయవముల, నిప్పువలెఁ గాల్చుచున్నది • నేర్తునే నెఁ.

తాత్పర్యము

విభీషణుని లంకకు రాజు చేసెద నని ప్రతిజ్ఞ చేసితిని. ఆ ప్రతిజ్ఞ తప్పిపోయెను. ఆయసత్యభాషణము నా యవయవములను నిప్పువలెఁ గాల్చుచున్నది. సహింప నేరను.

## —• శ్రీరాముఁడు సుగ్రీవుతోఁ గిష్కింధకుఁ బొమ్మని చెప్పుట •—

శా. నీ వీ మూర్తమునందె యంగదు నలున్ • నీలున్ బలం బెల్ల సు
గ్రీవా! తోడ్కొని పొమ్ము నిల్వకిట వా • ర్ధిం దాటుమీ యేల నా
దేవారాతిపరీవృఢుండు • నుకన్ • దృష్టించి నాలేమి నీ
పై వచ్చున్ హితసైన్యయుక్తుఁ డయి, పో • వం దెప్పరం బత్తెసన్. ౧౦ ౨౧

అర్థములు. దేవారాతి పరీవృఢుండు=రాక్షసశ్రేష్ఠుఁడు — రావణుండు, దెప్పరంబు=కష్టము.

తాత్పర్యము

సుగ్రీవా! నీ వీ మూర్తమునందే యంగదుని నలుని నీలుని వానరసేన నంతయుఁ దీసికొని సముద్రముదాఁటి పొమ్ము. ఇందు నిల్వవలదు. ఏలంటివా? నా సాహాయ్యము మీకు లేకుండుట తెలిసికొని రావణుఁడు సమస్త సేనలతోడను హితులతోడను నీపై యుద్ధమునకు వచ్చి త్రోవ యడ్డగించును. అప్పుడు పోవుట యసాధ్య మగును.

సీ. అన్యులు గావించు • నట్టివా పావని, సమురానఁ జేసిన • సాహసములు?
ఈ జాంబవంతుండు • నీ గవాక్షుండును, జలిపిన కృత్యముల్ • పలుక వశమె?
శారేయు తెంపు నా • తరమె వర్ణింప, మైందుండు ద్వివిదుఁ డ • మందబలులు
కేసరి సంపాతి • చేసిన కార్యంబు, లలఁతులా? యే మని • యాడువాఁడ?
తే. గజుఁడు శరభుండు • గవయుఁడు • గంధమాద, నుండు లోనగు కీశు లుద్దండవృత్తి
మన్నిమిత్తంబు ప్రాణముల్ • మఱచి తెగిరి, మెచ్చితిని వీరినెల్ల నో • సచ్చరిత్ర!

అర్థములు. శారేయు = అంగదుని యొక్క, అలఁతులా=అల్పములా?

తెగిరి=సాహసించిరి, సాహసములు = సాహసకార్యములు, 'విశేషణంబులు కొన్ని యెడల విశేష్యలక్షకంబు లగు' ప్రౌ. వ్యా. శబ్ద. ౧౨ సూత్రము.

తాత్పర్యము

హనుమంతుఁడు యుద్ధమునందుఁ జేసిన సాహసకృత్యము లితరులకు సాధ్యమైనవా? ఈ జాంబవంతుఁడు ఈ గవాక్షుఁడు చేసిన కార్యము లిట్టివని చెప్పుటకైన సాధ్యమా? అంగదుని సాహస మిట్టిదని నేను జెప్పలేను. మైందుఁడు ద్వివిదుఁడు కేసరి సంపాతి వీరు స్వల్పకార్యములా చేసిరి. వీరందఱు చేసినవి నేనేమని చెప్పఁగలను? గజుఁడు శరభుఁడు గవయుఁడు గంధమాదనుఁడు మొదలగు వానరులు ప్రాణములు తమ దేహములం దున్నవనుట మఱచి సాహసించి కార్యములు చేసిరి. వీరి నందఱను జాల మెచ్చుకొంటిని.

కం. నీవు సుహృత్తును మిత్రుం, డౌవాఁ డెం తెంతఁ జేయు • నగు నంతయు సు
గ్రీవా! ధర్మభయంబునఁ, గావించితి దైవ మఱఁపఁ•గా నరు వశమే. ౧౦౨౩

అర్థములు. సుహృత్తు = దుఃఖే విపది సమ్మోహే కార్యకాలాత్యయేపిచ హితాన్వేషీచ హితకృ ద్యస్సుహృ త్సోభిధీయతే" దుఃఖమందును ఆపదలందును సమ్మోహమందును కార్యము కడచినపుడును హితమైనదాని వెదకువాఁడు, హితము చేయువాఁడు, మంచి మనస్సు గలవాఁడు సుహృత్తనఁబడును. మిత్రుఁడు=ఉపకారమునకుఁ బ్రత్యుపకారము చేయువాఁడు, ధర్మభయంబునన్=ధర్మము లోపించునేమో యను భయమున-పంచమీతత్పురుషము-దైవము=అదృష్టమును.

తాత్పర్యము

సుగ్రీవా! నీవు సుహృత్తు మిత్రుఁడు నగు వాఁ డెం తెంతచేయ సాధ్యమో, ధర్మము లోపించునేమో యను భయముచే నీవు నంతఁ జేసితివి కాని నా యదృష్టమును నీవు తొలఁగింపఁగలవా? అది నరులకు సాధ్యమా?

కం. వానరవరులారా! కడుం, బూనికమై మిత్రకార్య • మును జేసితి రే
మానసమున మెచ్చితి మీ, కానఁతి యిడినాఁడ నరుగ•రయ్యా స్వేచ్ఛన్.

అర్థములు. అరుగరయ్యా = అరుగుఁడు+అయ్యా=అరుగరయ్యా 'ప్రార్థనార్థక మధ్యమ పురుషంబున నెడాదు లనుప్రయుక్తంబు లగుచో ముడుఁబులకు వురు లగు.' సు - వ్యా - క్రియ. ౩౦. 'సంబోధ్యవాచకంబు బహువచనాంతంబయ్యుఁ గ్రియలమీఁది యయ్యాదు లేకవచనాంతంబుల యగు' ప్రౌ. వ్యా. శబ్ద. ౪౪.సూ.

తాత్పర్యము

వానరశ్రేష్ఠులారా! మిత్రకార్యమును మీరుమిక్కిలి పూనికతోఁ జేసినవారైతిరి. నేను జాల సంతోషించితిని, అనుజ్ఞ యిచ్చితిని. ఇఁక మీ మీ యిష్టప్రకారము పోవచ్చును.

చ. అనవుడు నెల్ల వానరులు • హా యని కన్నులు వాఁచ బాష్పముల్
కనుఁగవనుండి వెల్లువలు • గట్టఁగ నేడిచి రింతలో ననీ
కినులను నందు నందుఁ బరి • కించి దృఢంబుగ నిల్పి రాఘవుల్
పెనుపటి యున్న చోటికి వి•భీషణుఁడుం జనుదెంచెఁ జయ్యనన్. ౧౦౨౫

అర్థములు. అనీకినులను=సేనలను, పెనుపు+అటి=గొప్పతనము చెడి.

తా త్ప ర్య ము

రామచంద్రమూర్తి యిట్లు చెప్పఁగా వారందఱు కన్నులు వాఁచునట్లు హా యని కన్నీళ్లు ప్రవాహము లగున ట్లేడ్చిరి. ఇంతలో సేనలను ఆ యా స్థానము లందుఁ గదలకుండ నిలిపి రామలక్ష్మణులు పడియున్న చోటికి శీఘ్రముగ విభీషణుఁడు వచ్చెను.

కం. అంజనధరాధరంబున,కుం జతయై గద ధరించి • గొబ్బునఁ జనుదే
రం జడిసి యింద్రజిత్తని, యంజాయించుచును బాఱె•నగచరకోటుల్. ౧౦౨౬

అర్థములు. అంజన ధరాధరంబునకుఁ = కాటుకకొండకు, జతయై = సమానమై, 'సరళంబులకు ముందున్న ద్రుతంబునకుఁ బూర్ణబిందువు' "అంజెదవు గాక నను జెంతం జేరఁగ నీక యెంతతడిసిన మిరియాలుం జొన్నలు సరిగావే" నాచన సోముఁడు. అంజాయించుచును=భయపడుచు.

తా త్ప ర్య ము

కాటుక కొండవంటి నల్లని దేహముతో విభీషణుఁడు గద ధరించి రాగా మరల నింద్రజిత్తే వచ్చెనని భయపడి వానరులు పరువెత్తిరి.

**—• ౫౦-వ సర్గము. కపులు విభీషణుని నింద్రజిత్తని భ్రమించి పరువెత్తుట •—**

సీ. వాతూలహతిఁ బటా • పంచ మౌ మబ్బుల, భంగిని దనసేన • పరువు వెట్టఁ
గనుఁగొని సుగ్రీవుఁ • డనియె నీ సైన్యంబు, కడలినడుమ సుడి • గాలులకును
దిరుగుడుపడు నావ•కరణి నల్లాడెడిఁ, గత మేమొ యనఁగ నం•గదుఁడు పల్కె-
వీరులు రాజకు•మారులు రాముఁడు, సౌమిత్రి మార్గణ • జాలనిహతు
తే.లగుట కారణమనసుతు•నని యెసూర్య,పుత్రుఁ డదికాదుమఱియేదొ•పుట్టెఁబోలు
నాయుధంబులు విడినాడి•యదరి బెదరి విలువుచూపులువిన్న మో•ములునుగలిగి.

అర్థములు. వాతూలహతిన్=సుడిగాలి దెబ్బచే, పటాపంచము = చెదరి పోయినవి, కడలి నడుమ = సముద్రమధ్యమున, మార్గణజాలనిహతులు = బాణ సమూహములచేఁ గొట్టఁబడినవారు.

తా త్ప ర్య ము

సుడిగాలి దెబ్బకు మబ్బులు చెదరి పోవునట్లు తన సేన పరువెత్తుచుండుట చూచి సుగ్రీవుఁ డిట్లనియె. సముద్రము నడుమ సుడిగాలికిఁ దిరుగుడువడు నావవలె నేల యీ సైన్యం బల్లాడు చున్నది? అనిన నంగదుఁడు రామలక్ష్మణులు బాణ

ముల తాఁకునఁ బడియుండుట కారణమనిన నది కాదు. మఱియేదో యై యుండ వలెను. ఇంత సేపు లేనిది యిప్పు డేమి వచ్చెను? ఆయుధములు పాఱవైచి యదరి బెదరి నిలువు చూపులు తెల్లని ముఖములు గలిగి.

తే. ఉఱుకుచున్నారు దెసలందు • నెఱయఁ బిఱికి, కండలందఱు నిశి నావ • గండలగుచుఁ
బడినవారిని దాఁటుచుఁ • బ్రక్కవారి, నీడ్చుకొని పోవుచున్న వా • రింతయేల?

అర్థములు. నావగండలు = సిగ్గువిడిచినవారు - నిశిన్=రాత్రియందు - దీనివలన నిది యంతయు మొదటి నాఁటి రాత్రికథయే.

తాత్పర్యము స్పష్టము.

కం. అనులోన విభీషణుఁడును, దన కేలన్ గద ధరించి • తఱియఁగఁ జని దీ
వన లిచ్చి యినజునకు రా, ముని లక్ష్మణుఁ జూచుచుండె • మునుఁగుచుఁ జింతన్.

తఱియఁగఁ జని=దగ్గఱకుఁబోయి.

తాత్పర్యము స్పష్టము.

చ. వనచరలోకభర్త యుఁ బ్ల • వంగమభీషణు నవ్విభీషణున్
గని నికటస్థు భల్లుకని • కాయపతిం గని యవ్విభీషణుం
గని కపికోటి రావణిరు • క్రమ్మఱి వచ్చె నటన్న శంకచేఁ
గనుకని పాఱెడిం, దెలిపి • క్రమ్మఱుపం గదె వారి నెల్లరన్. ౧౦౩౦

అర్థములు. ప్లవంగమభీషణున్=వానరులకు బెదరు పుట్టఁజేసిన వానిని - నికటస్థున్=సమీపమందున్న వానిని - భల్లుకనికాయపతిన్=ఎలుఁగుల సమూహమునకుఁ బ్రభువును=జాంబవంతుని - కనుకని=తొట్రుపాటుచే.

తాత్పర్యము

సుగ్రీవుఁడు వానరులకు భయము కలిగించిన యీ విభీషణునిఁ జూచి తన సమీపమందున్న జాంబవంతునితో నీవానరు లింద్రజిత్తు మరల వచ్చెనని భయపడి తొట్రుపడుచుఁ బరువెత్తుచున్నారు. వాస్తవము వారికిఁ దెలిపి యంద ఱను మరల వచ్చునట్లు చేయుమా!

కం. అనవుడును జాంబవంతుఁడు, వనచరసంఘాతమెల్లఁ • బరువిడుమార్గం
బున కడ్డ మగుచు నిట్లనుఁ, దన చేతుల నెత్తి కడు ను • దారరవమునన్.

అర్థములు. సంఘాతము=సమూహము, ఉదారరవమునన్=పెద్ద ధ్వనితో.

తాత్పర్యము స్పష్టము.

చ. వెఱవకుఁడీ కపీంద్రులు! వి • భీషణుఁ డీతఁడు, శక్రజిత్తు గాఁ
డుఱుకకుఁడీ నిజం బరయు • కూరక యంధత గొఱ్ఱదాఁటుగ
న్బిఱికితనంబు పౌరుషము • నేర్చితి రెన్నఁడు? చాలు నింకఁ గ్ర
మ్మఱుఁడు దన వారు ఋక్షవిభు • మాట వినియుం జని యవ్విభీషణున్. ౧౦౩౨

అర్థములు. కపీంద్రులు = కపీంద్రులారా, మధ్యమ పురుషము గావున ఆరగాగమము లోపించెను. గొఱ్ఱెదాటుగన్=ఒక్క గొఱ్ఱెదాటిన నన్ని గొఱ్ఱెలు కారణము విచారింపక దానివెంట దాఁటినట్లు, పిఱికితనంబు పొత్తికము = పిఱికి వాండ్రీ ప్రకారము పరువెత్తి పోవలయునని చదువు పాఠము. పుస్తకశబ్దభవము పొత్తికము.

తాత్పర్యము స్పష్టము.

కం. కని విగతభీతి నుండిరి, యనఘుండు విభీషణుండు నాశుగచితులన్
ఘనబలుల రామలక్ష్మణులను గని వగపాటుమెయి జలంబులఁ గనులన్.

అర్థములు. విగతభీతిన్=భయమువిడిచి, ఆశుగచితులన్=బాణములచేఁ గప్పఁబడిన వారిని, వగపాటుమెయిన్=వ్యసనముచే.

తాత్పర్యము స్పష్టము.

—దుఃఖించు విభీషణుని సుగ్రీవుండు దేర్చుట.—

కం. తుడిచి భృశదుఃఖభరమున, మిడుకుచుఁ బలవించె హా యమేయబలాఢ్యుల్
కడు సాత్త్వికు లాజిప్రియు, లడఁగిరిగా కూటయోధులగు నసురులచేన్.

అర్థములు. తుడిచి=తుడిచికొని, ఆత్మనేపద మనిత్యము కావున 'కొని' చేర్పలేదు. భృశదుఃఖభరమునన్ = విశేష దుఃఖభారముచే, అమేయబలాఢ్యుల్ = అపరిమిత బలముగలవారు, కడున్ = మిక్కిలి, సాత్త్వికులు = సత్త్వ గుణమే ప్రధానముగఁ గలవారు. ఆజిప్రియులు=యుద్ధమందుఁ బ్రీతి గలవారు, కూటయోధులు = మోసయుద్ధము చేయువారు.

తాత్పర్యము

తుడుచుకొని దుఃఖాతిశయముచేఁ దపించుచు నయ్యో పరిమితి చెప్పరాని బలముగల వీరులు మిగుల సత్త్వమే ప్రధానగుణముగాఁ గలవారు, యుద్ధప్రియులు నయ్యో మాయాయుద్ధము చేయు రాక్షసులచేఁ బడిపోయిరి గదా.

ఇంద్రజిత్తు తాను గానరాక శత్రువుల గొట్టెను. రామచంద్రమూర్తియుఁ గానరాక చాటుననుండి వాలిని గొట్టెను. ఇంద్రజిత్తు కూటయోధుఁడగునేని రామచంద్రమూర్తి యేలఁ గాఁడు ?

ఇప్పుడు వానర రాక్షసులకు జరిగినది యుద్ధమే. కాని మఱియొండు గాదు. ధర్మయుద్ధమందు నెదురెదురుగానుండి యొకరు నొకరు కొట్టవలెను గాని కనుచాటై యుండి కొట్టుట ధర్మముగాదు. కావున ఇంద్రజిత్తు చేసినది కూటయుద్ధము. రామచంద్రమూర్తికి వాలికి జరిగినది యుద్ధముకాదు. అధర్మప్రవర్తనముచే వధ్యుఁడగు దోషిని ప్రభువు దండించుట యగును. వధ్యుఁడగు దోషిని నే విధముగఁ జంపినను దోషముకాదు. కావున నది యుద్ధము కాదు. కూటయుద్ధ మంతకుముందే కాదు. ఈ విషయము కిష్కింధాకాండ మందుఁ జర్చితము, దీనికి దానికిఁ బోలికయే లేదు.

తే. క్రూరచిత్తుండు మాయన్న • కొడుకు వీరి, భుజపరాక్రములను మోస • నిజపలాశి
వక్రబుద్ధిని బీడింప • వ్రాలియున్న, వారు ములుకులతో ముండ్ల • పందు లనఁగ.

అర్థములు. భుజపరాక్రమమును=వంచనలేక చక్కటి యుద్ధముచేయు వారిని, మోసన్ = మోసముచే, మోసము-రూ- మోస - నిజ = స్వభావసిద్ధ మైన, పలాశి=రాక్షసులయొక్క, వక్రబుద్ధిని = కుటిలబుద్ధిచే, ములుకులతోన్ = ముండ్లతో, మా యన్నకొడుకు. 'సంబంధంబున యుష్మదస్మచ్ఛబ్దములకుం గొన్ని యెడల బహుత్వంబగు' ప్రౌ. వ్యా. శబ్ద. ౭౬ సూ, 'మా యత్త పృథ్వీసమాన పృథాదేవి' భార. అర. ౫ ఆ.

### తాత్పర్యము

క్రూరకార్యములు చేయుటయందు మనస్సుగల మా యన్నకొడుకు వంచన చేయక పరాక్రమము చూపు వీరిని మోస విధముగ రాక్షసులకు సహజమైన కుటిల బుద్ధిచే బాధింపఁగా బాణములు దేహము నిండ నాటుకొనఁగా ముండ్లు విచ్చిన పందివలెఁ బడి యున్నారు.

ఉ. ధీయుల నేరిఁ జేరితిఁ బ్ర • తిష్ఠను గోరి నరేంద్రు లిద్దఱే
తీరున మిత్తిఁ గూరెడిగ • తిం బడినా, రిఁక నేను మన్గడన్
గోరియుఁ జచ్చిన ట్లయితిఁ • గుంఠితరాజ్యమనోరథుండ నై
కోర్కియుం బ్రతిజ్ఞ సమ • కూడె దశాస్యున కేమి పాపమో. ౧౦౩౬

అర్థములు. ప్రతిష్ఠను గోరి=విభీషణుఁడు రామచంద్రమూర్తి దాసుఁడు, సఖుఁడు అను గౌరవము సంపాదింపఁగోరి - మిత్తి = మరణము - మన్గడన్ = బ్రదుకుపాటు, కుంఠితరాజ్య మనోరథుండనై =వ్యర్థమైపోయిన రాజ్యాభిలాష గల వాఁడనై - ఈ మాట నాధారము చేసికొని విభీషణుఁడు రాజ్యాభిలాష శరణాగతి చేసెనని కొంద ఱందురు. ఏ కోరికతోనైన శరణాగతి చేయవచ్చును. అది దోషము గాదు గాని రావణుని - పటాలున విడిచి వచ్చునపుడు గాని, శరణాగతి చేసినపుడు గాని యట్టి యభిప్రాయ మతని కున్నట్లు ప్రమాణము లేదు. ఇక్కడ రాజ్య మనోరథ మనునది కైంకర్య సామ్రాజ్య మనోరథ మని యర్థము చెప్పవలెను. అట్లు చెప్ప నిష్టము లేనివారు ఇది రామచంద్రమూర్తి లంకాధిపత్యమునకు నభిషేకము చేసిన తరువాత చెప్పినమాట కావున నట్టి కోరిక తదనంతరము కలిగె నని తలంప వలయును గాని యీ యుద్దేశముతోనే బయలుదేఱి వచ్చె ననుటకు నాధారము శూన్యము. ఈ విషయము శరణాగతి ఘట్టంబునఁ జర్చితము. కుంఠితరాజ్యమనోరథుఁడను = రాజ్యవిషయమైన మనోరథము కుంఠిత మయ్యె నని యర్థము చెప్ప రాదు. అది నిరాకరము కావున కుంఠిత రాజ్యమైన మనోరథము అనఁగా కుంఠిత రాజ్యమైన కైంకర్య మనోరథ మని యర్థము గ్రహింపవలెను. రాజునకు రాజ్యమం దెంత యభిలాషయో యంత యభిలాష విభీషణునకు కైంకర్యమునం దుండెను.

అది కుంఠిత మన్యోను. నరేంద్రుఁడు లిద్దఱు ననుచో ఆ నరేంద్రుఁ లిద్దఁ అని తచ్ఛబ్దం బధ్యాహార్యంబు,—'కొన్ని యెడలఁ దదాదులు విశేషణంబు లధ్యాహార్యంబులు' ప్రౌ.వ్యా.వాక్య.౧౦ సూ.

తాత్పర్యము

లోకమునందు నెవ్వరియొద్దఁ జేరిన నాకు గౌరవము కలుగునని తలఁచి చేరితినో యా ధీరులు రామలక్ష్మణు లిరువురు నీ విధమున మరణించు వారివలెఁ బడినారు. నేను వ్యర్థమైన కైంకర్య రాజ్యాభిలాష గలవాఁడనై బ్రతికియుఁ జచ్చిన వానివలె నైతిని. అది యేమి పాపబలమో పాపాత్ముఁడైన రావణుని కోరికయుఁ బ్రతిజ్ఞయు ఫలించెను.

దశాస్యున కేమి పాపమో యనియు నన్వయింప నగు.

కం. అని విలపించు విభీషణుఁ, దన కౌఁగిటఁ బొదివి పలుకుఁ ♦ దరుచరవిభుఁ డ
ల్లన లంక నీవ యేలెదు, తనయులతోఁ గనఁడు కాంక్షి♦తము రావణుఁడున్.

లంక నీవయేలెదు తనయులతో ననికాని, రావణుఁడు తనయులతోఁ గాంక్షితము గనఁడు అని కాని యన్వయింప నగు. కుంఠిత రాజ్యమనోరథుండనై యన్నమాటకు రామచంద్రమూర్తి రాజ్యమిచ్చెద నన్నమాట స్మరించి చెప్పుచున్నాఁడని సుగ్రీవుఁడు గ్రహించి ప్రత్యుత్తర మిచ్చుచున్నాఁడు.

తాత్పర్యము

ఈ ప్రకారము దుఃఖించు విభీషణుని సుగ్రీవుఁడు కౌఁగిలించి నీవే లంక యేలెదవు. రావణుఁడు తన కొడుకులతోఁ గోరిక నెఱవేర్చుకొనఁ జాలఁడు.

కర్ణునినమ్మి దుర్యోధనుఁడు చెడినట్లు తీ కొడుకులను నమ్మి రావణుఁడును జెడిపోవుననియు నర్థము చెప్పవచ్చును.

చ. వగవకు మయ్య వీరి కొక ♦ బాధయుఁ గల్గదు, మూర్ఛ దేఱిన
న్బగతుని సైన్యయుక్తుఁడగు ♦ పంక్తిముఖున్ విదళింతు, రంచు నో
ప్పుగుగతి నూఱడించుచు ని♦జాంతికవర్తి సుషేణుతోడ నో
యగచర! లబ్ధసంజ్ఞుల న♦రాధిపులం గొని కీశసేనతోన్. ౧౦౩౮

అర్థములు. పగతుని=పగవానిని, నిజాంతికవర్తి=తన సమీపమం దున్నవాఁడు, లబ్ధసంజ్ఞులన్ = స్మృతివచ్చిన వారిని.

తాత్పర్యము

విభీషణా! దుఃఖింపకుము. వీరు మూర్ఛపోయిరేకాని, ప్రాణాపాయదశ యందు లేరు. వీరు మూర్ఛదేఱఁగానే విరోధియగు రావణుని సేనతోడఁ జంపుదురు అని యూఱడించి తన సమీప మందున్న సుషేణునిఁజూచి యిట్లనెను. సుషేణా! వీరు మూర్ఛతేఱఁగానే వీరి నిద్దఱను వానరసేనను తీసికొని.

కం. చనుమీ కిష్కింధకు నే, దను జేంద్రు పపుత్రమి త్ర•తతి బాంధవునిన్
దునిమి కొని తెత్తు సీతన్, మును నష్టశ్రీని నమర•ముఖ్యునిమాడ్కిన్. ౧౦౩౯
అర్థములు. నష్టశ్రీని=నశించిన రాజ్యలక్ష్మిని, అమరముఖ్యునిమాడ్కిన్= దేవేంద్రునివలె.

తాత్పర్యము స్పష్టము.

—• సుగ్రీవునితో సుషేణుఁడు సంజీవకరణిఁ దెప్పింపు మని చెప్పుట. •—

సీ. అనుఁడు సుగ్రీవుతో • ననియె సుషేణుండు, తొల్లి దారుణ మయి•చెల్లెఁగలహ
మమరాసురుల కందు • నసమదానవశర విహతి బృందారక •నిచయ మెల్ల
వ్రాలి సొమ్మసిల్లి పోయి•ప్రాణముల్ విడువంగ, నమరగురుండువి•ద్యాప్రయుక్త
మహితౌషధుల చేత•మాన్పెను దద్బాధ, నవియు క్షీరాంబుధి•ప్రాంతమునను
తే. గలవు సంపాతి పనసాది•కపులఁ బంపి, వేగఁ దెప్పింపవయ్య క•పిప్రకాండు
లెల్ల రెఱుఁగుదు రచ్చోటు•నీ మరుత్త,నూజుఁ బంపుము బలియుండు• తేజమెఱసి.
అర్థములు. అమరాసురులకు = దేవదానవులకు, అసమ=అసమానమైన, దానవశర=దానవుల బాణములయొక్క. విహతిన్ దెబ్బలచేత, బృందారక నిచయము = దేవతా సమూహము, సొమ్మలు = మూర్ఛలు, విద్యాప్రయుక్త = మృతసంజీవనీ విద్యచేఁ గూడిన, మహిత=ఓషధులచేత = గొప్పమూలికలచేత, క్షీరాంబుధి=పాలసముద్రము, కపిప్రకాండులు=వానరశ్రేష్ఠులు.

తాత్పర్యము

అని చెప్పఁగా సుగ్రీవుతో సుషేణుఁ డిట్లనియె. పూర్వము దేవదానవులకు ఘోరయుద్ధము జరిగెను. అందు దానవుల బాణములచే దెబ్బలు దిని దేవతలు మూర్ఛపోయిరి. కొందఱు చచ్చిరి. అప్పుడు బృహస్పతి మృతసంజీవని విద్యతోఁ గూడిన కొన్ని మూలికలచేత దేవతలబాధ మాన్పెను. ఆ మూలికలు పాలసముద్రము సమీపమున నున్నవి. సంపాతి పనసుఁడు లోనగు వానరులఁ బంపి తెప్పింపుము అవి యుండుచోటు లీ వానరశ్రేష్ఠు లెఱుఁగుదురు. ఈ యాంజనేయుఁ బంపుము. ఆతఁడు తన పరాక్రమముచే.

తే. తెచ్చు సుధకయి దేవతల్•దచ్చి రెచటఁ,గలశవారాశిచోటఁ•గలవు ద్రోణ
చంద్రకుధరంబు లందు వి•శల్యకరణి,దివ్యసంజీవకరణియుఁ • దేజరిల్లు. ౧౦౪౧
అర్థములు. సుధకయి=అమృతము నిమిత్తము, దచ్చిరి = చిలికిరి, కలశవారాశి=పాలసముద్రము, మందరముచే పాలసముద్రము మథించు నపుడు కలశముగాఁ జేయఁబడినది ద్రోణచంద్ర కుధరంబులు = ద్రోణపర్వతము, చంద్రపర్వతము.

తాత్పర్యము

తేఁగలఁడు. ఏ ప్రదేశమందు నమృతము నిమిత్తమై దేవతలు పాలసముద్ర

మును జలికిరో యచ్చట ద్రోణపర్వత మని, చంద్రపర్వత మని, రెండు కొండలు గలవు. అందు విశల్యకరణి, సంజీవ కరణియుఁ బ్రకాశించును. విశల్యకరణి = దేహమునందలి ములుకులను నూడదీయునది, సంజీవకరణి = ప్రాణమిచ్చునది, ఇప్పుడు కావలసిన వీ రెండని భావము.

కం. ఓషధులు నిలిపి రసుర, ద్వేషులు వేవేగ వానిఁ ♦ దెమ్మను మనుచున్
భాషించుచుండ నీలో,ఘోషము వినవచ్చెఁ జెవుడు♦గొలుపుచు ఘనమై.

అర్థములు. అసురద్వేషులు=దేవతలు, ఘోషము=ధ్వని.

తాత్పర్యము

దేవత లా యోషధు లందు నిల్పిరి. వానిని త్వరగాఁ దెప్పింపుము అనుచుండఁగా నింతలో చెవుడు గలిగించునట్టి గొప్ప ధ్వని వినవచ్చెను.

—♦ గరుత్మంతుఁడు శ్రీరామలక్ష్మణులఁ జూడవచ్చుట. ♦—

కం. విడివడి మబ్బులు చెదరఁగ, కడలి కర ళ్ళెగసి యల్ల ♦ కల్లోలముగా
గడగడ లాడఁగ మేదిని, గడు సద్వీపద్రుమంబు♦గా నవనాబ్ధిన్. ౧౦౮౩

అర్థములు. విడివడి=విచ్చలవిడి, కడలి = సముద్రముయొక్క; కరళ్ళు = అలలు, అల్లకల్లోలముగా = గందరగోళము, మేదిని = లంకాద్వీపము, సద్వీపద్రుమంబుగాన్ =ద్వీపములతోను జెట్లతోను గూడినదిగా.

తాత్పర్యము

విచ్చలవిడి మబ్బులు చెదరిపోఁగా సముద్రము నందలి యల లెగసి కలవరపడఁగా ద్వీపములతో చెట్లతో సముద్రము నందలి భూమి యదరఁగా.

కం. మూలములతోడ భూరుహ, జాలంబులు విఱిగి కూలఁ ♦ జండసమీరం
బోలి నుదయించె సుడివడి, వ్యాలంబులు బెదరి పఱచి♦యంబుధి దూఁకెన్.

అర్థములు. భూరుహజాలంబులు = చెట్లగుంపులు, చండసమీరము = భయంకరమైనగాలి, సుడివడి = కలఁతచెంది, వ్యాలంబులు = పాములు, పఱచి= పరువెత్తి.

తాత్పర్యము

వేళ్ళతోడ విఱిగి చెట్లు క్రిందఁబడునట్లు తీవ్రమైన గాలిపుట్టెను. కలఁతచెంది వెలుపలఁ దిరుగు పాము లన్నియు దిగులుపడి పరువెత్తిపోయి సముద్రములో దూఁకెను.

ఉ. వెంటనె సంజ్వలద్దహను ♦ పెంపున వెల్గుచు వైనతేయుఁడున్
మింటను దోఁచెఁ, దోఁచుటయు ♦నీరజనేత్రులఁ జుట్టియున్న యా
తుంటరి పాఁవపుర్వులను ♦ దోన యథాయథలై భయంబు లో
నంటఁగఁ బాఱి దూఁకె లవ ♦ ణాంబుధి; నగ్గరుడుండు డాయుచున్. ౧౦౮౪

అర్థములు. సంజ్వలత్ + దహను = మండుచున్న యగ్నియొక్క, పెంపునన్ = గొప్పతనముతో, వైనతేయుఁడున్ = గరుత్మంతుఁడును, తుంటరి = దుష్టములైన, పాఁపపుర్వులును = పాములు, తోన = వెంటనే, యథాయథలై = చెదరిపోయి. రామలక్ష్మణులను జుట్టియున్న పాములు పరువెత్తి సముద్రములో దూఁకెననుటచే మంత్రసృష్టము లగు పాములందు మంత్రశక్తి నావహింపఁజేసి వానిచే నింద్రజిత్తు కట్టెనని యేర్పడుచున్నది. ౫-౨౩ వ-౧౦౫ ౭-పద్యములఁ జూచునది.

గ్రంథములందు నాగాస్త్ర ప్రయోగము వర్ణింపఁబడిన చోటఁ బాము లుత్పత్తియై బయలు వెడలునట్లును గరుడాస్త్రముచే నది వారింపఁబడునట్లు వర్ణింపఁబడినది. ఇప్పుడైనను గరుడాస్త్రమును రామలక్ష్మణులు ప్రయోగించి యుండిన నీ యస్త్రము వ్యర్థమైయుండును. కాని చీఁకటిలో బాణయుద్ధము చేయుచు వానిలో సందుచేసికొని నాగాస్త్రమును బ్రయోగించుటచే నది నాగాస్త్రమని రామలక్ష్మణులు గుర్తింపఁ జాలరైరని తోఁచెడిని. ఇంద్రజిత్తు కానరాకుండుటచే బాణవర్షమునకుఁ బ్రతిక్రియ చేయ సాధ్యపడ దయ్యె. కానరానివానిమీఁద నస్త్ర ప్రయోగము శేయరాదయ్యె. కావునఁ గట్టుపడవలసివచ్చెను.

తాత్పర్యము

అ క్షణమందే మండుచున్న యగ్నిహోత్రునివలెఁ బ్రకాశించుచు గరుత్మంతుఁ డాకాశమునఁ గాన వచ్చెను. ఆయన కానరాఁగానే రామ లక్ష్మణులను జుట్టుకొనియున్న పాపపుఁ బాములు చెల్లాచెదరై భయముతోఁ బరువెత్తి పోయి సముద్రములో దూఁకెను. ఆ గరుడుఁడు సమీపించి.

కం. కాకుత్స్థులఁ గని యలరుచు, శ్రీకరచంద్రాభముఖకు • శేశయయుగ మ
స్తోకప్రేమను నిమురఁగఁ, బ్రాకటగతి మాసె మేని • వ్రణజాలంబుల్. ౧౦౭౮

అర్థములు. అలరుచున్ = సంతోషించుచు, శ్రీకర = సంపత్కరమైన, చంద్రాభ = చంద్రునితో సమానమైన, ముఖకుశేశయ యుగము = ముఖకమలముల జంట, అస్తోకప్రేమను = అధిక ప్రేమతో, వ్రణజాలంబుల్ = గాయముల సమూహములు.

తాత్పర్యము

రామలక్ష్మణులఁ జూచి సంతోషించి వారి యిరువుర ముఖకమలములను తడువఁగా వారి దేహము లందలి గాయము లన్నియు మానెను.

తే. ధిషణబలములు వీర్యంబు • తేజ మోజ
ము త్తమగుణంబు లుత్సాహ • మోలి స్మృతియు
సత్త్వదర్శనమును రామ • చంద్రునకును
లక్ష్మణునకును రెట్టించె • లలితరీతి. ౧౦౭౯

అర్థములు. ధిషణ బలములు = బుద్ధిబలము, దేహబలము, వీర్యంబు = శత్రు

వుల ధిక్కరించు శక్తి, తేజము = పరాక్రమము, ఓజము = కాంతి, ఉత్తమ గుణంబు=ఉత్సాహ విశేషము, ఉత్సాహము=లోకోత్తర కార్యములు చేయుట యందలి స్థిర ప్రయత్నము, స్మృతి = మఱపులేమి. సత్+ప్రదర్శము = మంచి సూక్ష్మబుద్ధి, రెట్టించెన్=రెండంత లయ్యెను, ఇందలి 'ధి' గాయత్రి యందలి పదునేడవ యక్షరము.

### తాత్పర్యము

గరుత్మంతుఁడు దేహములు తుడువఁగానే వారికి బుద్ధిబలము, దేహబలము, వీర్యము, తేజము, ఓజస్సు, ఉత్సాహము, స్మరణశక్తి, బుద్ధిసూక్ష్మత, రామలక్ష్మణులకు నిబ్బడించెను.

తే. మేనికాంతియుఁ బసిఁడికి • మేలుచేయి, యయ్యె నంత సుపర్ణుఁడా • యనఘమతుల
నత్తికవుఁగిట నొత్త నీ • తేఱుఁ డనియె, వసుమతిసంతోషమున విన • తాత్మజునకు.

అర్థములు. మేనికాంతి = దేహకాంతి, పసిఁడికి=బంగారుకంటె, మేలుచేయి=శ్రేష్ఠమైనది, సుపర్ణుఁడు = గరుత్మంతుఁడు, అనఘమతులన్=పాపరహితమైన మనస్సుగల వారిని.

### తాత్పర్యము

దేహకాంతి బంగారు కాంతికంటె నెక్కువయయ్యెను. అప్పుడా గరుత్మంతుఁడా నిష్పాపమనస్కులను నత్తికొని కౌఁగిలింపఁగా సంతోషముతో రామచంద్రమూర్తి గరుడునితో నిట్లనియె.

### —• { నాగపాశ బంధవిముక్తులై శ్రీరామలక్ష్మణులు గరుత్మంతునిఁ బ్రశంసించుట } •—

ఉ. అయ్య! భవత్ప్రసాదమున • నాసురభర్తృసుతప్రయుక్త మా
నియ్యహిపాశబంధతతి • నెట్టి విపత్తును లేక యేమియున్
డయ్యక మున్నువోలెఁ బెను • ధాకయుఁ గంటిమి, నిన్నుఁజూడ మా
యయ్యను నాజిఁ దాత నజు • నాదృతిఁ గన్నటు లుల్ల ముబ్బెడున్. ౧౦౫

అర్థములు. భవత్+ప్రసాదమునన్=నీ యనుగ్రహముచే, అసురభర్తృసుత=రాక్షసరాజు కుమారునిచే, ప్రయుక్తము = ప్రయోగింపఁబడినది, అహిపాశబంధతతిన్=పాములనెడి త్రాళ్ళచేఁ గట్టఁబడిన కట్లసమూహముచే, డయ్యక=శ్రమపడక, ధాకయు = శౌర్యము, అయ్యను = తండ్రిని, ఆజిన్ = దశరథుని - తాత యగు నజుని, ఆదృతిన్ = ఆదరముతో, ఉల్లము = మనస్సు, ఉబ్బెడిన్=సంతోషముచేఁ బొంగుచున్నది.

### తాత్పర్యము

అయ్యా, నీ యనుగ్రహముచే నింద్రజిత్తు కట్టిన నాగపాశబంధములచే నెట్టి కీడును బొందకుండుటయేకాక శ్రమము లేక మునుపటివలె గొప్పశక్తియుఁ బొంది

తిమి. నిన్నుఁజూడగా మా తండ్రి దశరథుని తాత యజమహారాజును జూచినట్లు మనస్సు సంతోషముచే నుప్పొంగుచున్నది.

తే. రూపమును దివ్యమాల్యాను♦లేపనముల, విమలవస్త్రంబులను దివ్య♦వివిధభూష
ణంబులదాల్చి దివ్యతే♦జంబుఁ గలిగి, యొప్పుచున్నాఁడ వెవ్వండ♦వో మహాత్మ!

తాత్పర్యము

మహాత్మా! నీ వెవ్వండవు? నీ రూపము మనుష్యులందుఁ గానవచ్చునది కాదు. దివ్యమైయున్నది. నీవు ధరించిన మాల్యములు చందనాదులు దేవతలు ధరించునవియై యున్నవి. వస్త్రములు భూషణములు నట్టివే యై యున్నవి. నీవు దివ్య తేజస్సు గలవాఁడవై యున్నాఁడవు. నీ వెవ్వఁడవు?

**—♦ గరుడుఁడు శ్రీరామునకు హెచ్చరికఁగ యుద్ధముసేయ బోధించుట ♦—**

కం. అనవుడు నానందాశ్రులు, కనుఁగొనలన్ సందడింప ♦ ఖగపతి యను మీ
కనుఁగు సఖుండను గరుడుండఁ, బ్రణుతయశా! నీబహిశ్చ♦ర ప్రాణంబన్. ౫౦౫౧

సీ. చనుదెంచితిని మీకు♦సాహాయ్య మొనరింప, దానవాసురులు గం♦ధర్వులైన
నింద్రుని మున్నుగా ♦ నిడుకొనివచ్చినఁ బాపలే రీ శర♦బంధనములు
మాయాబలంబున ♦ మఘవారి నిర్మింపఁ, గాద్రవేయులు విష♦కఠినదంష్ట్రి
లిట్లు శరంబులై ♦ యేతెంచి బంధించి, రీ వార్త విని రయం♦బెసక మెసఁగ

తే. వచ్చినాఁడను స్నేహాత♦త్పరత రామ!, వీడఁ జేసితి బంధముల్ ♦ వీరవర్య!
కూటయోధులు రాక్షస♦కులజు లెల్ల, నప్రమత్తతి మీరుండు♦టర్హమయ్య.

అర్థములు. ఆనందాశ్రులు = సంతోషముచేఁగలుగు కన్నీళ్ళు, ఖగపతి= పక్షిరాజు, అనుఁగు సఖుండను=ప్రేమగల స్నేహితుఁడను, బహిశ్చర ప్రాణంబన్= వెలుపలఁ దిరుగు ప్రాణమును. నివాహన మగుటచే నీకు సఖుఁడ నని చెప్పరాదు. పరత్వము వెలిపఱచినట్లగును, దేవ రహస్యము రావణవధము నఱకు బహిరంగము చేయరాదు. కావున గూఢోక్తిగా ననెను. బహిశ్చర ప్రాణమనుటచే నీకు లక్ష్మణుఁ డెట్టివాఁడో నే నట్టివాఁడనే యని భావము. మాయాబలంబునన్ = మంత్రములవలనఁ గలిగిన యద్భుత శక్తిచే, కాద్రవేయులు=కద్రువ కొడుకులు-సర్పములు ఎసక మెసఁగన్=అతిశయింపఁగా, కూటయోధులు=మోసయుద్ధము చేయువారు, అప్రమత్తతన్=హెచ్చరికతో.

తాత్పర్యము

మీతోఁడోడు పడుటకై వచ్చితిని. దానవులు, అసురులు, గంధర్వులు ఇంద్రుని ముందుంచికొని వచ్చినను నీశరబంధములను వదలింపలేరు. అది యేమనిన వీని నింద్రజిత్తు మంత్రములవలనఁ గలిగిన యద్భుతశక్తిచే సృష్టింపఁగా విషముచే క్రూరములైన కోఱలుగల సర్పములు బాణములై వచ్చి మిమ్ము బంధించెను. ఈ వృత్తాంతము విని నీ యందుండు స్నేహభావముచే నే నతిశీఘ్రముగ బయలుదేఱి

వచ్చితిని. ఆకట్లను వదలించితిని. రామచంద్రా! రాక్షసులు మోసయుద్ధము చేయువారు కావున నీవు ప్రమాదపడక యుండవలెను.

కం. అసురులకు బలము మాయయె, యనఘ వినిర్మల మనస్కు-లగు మీకు బలం
బెనఁగు ఋజుత్వమె కావున, నసురుల నమ్మంగవలద-దాహవమందున్.

అర్థములు. ఆహవమందున్=యుద్ధమందు.

తాత్పర్యము

రాక్షసులకు మోసగించుటయేబలము. అది విడిచిన వారు దేనికిఁ గొఱగారు. నిర్మలమగు మనస్సుగల మీకు ఋజుత్వము బలము-మీరు మాయ నాశ్రయింప రాదు. కావున రణమందు రాక్షసులను మీరు నమ్మరాదు. కావున మీరు ఋజుత్వము విడువక వారి మాయలకు లోబడక హెచ్చరిక కలిగి యుండవలెను. మాయలకుఁ బ్రతిమాయలు చేయవలసిన పనిలేదుగాని వారి మాయలు చెఱచు పని చేయుట దోషముగాదు.

కం. దృష్టాంతం బిదె యనుచును, స్పష్టముగ గ్రహించి వారి-చరితము నీ వ
ష్టాష్టకమున మెలఁగుడు మీ,యిష్టము నెఱవేఱు శీఘ్ర-మే రఘురామా!

అర్థములు. వష్టాష్టకమునన్=కలహమున.

తాత్పర్యము

నేను జెప్పిన దానికి దృష్టాంత మిప్పుడు జరిగినదియే. దీనివలననే వారి నడవడి మీకు స్పష్టపడి యుండవచ్చును. వారి మాయను జెఱచు యత్నము మీరు చేసి యుండిన నిట్టికష్టము ప్రాప్తించి యుండదు. అటుగాక యూరకున్న కారణమున నిట్టి బాధ పడవలసి వచ్చెను. కావున నీ కలహమందు మీరు హెచ్చరిక కలిగి యాత్మరక్షణోపాయము నేమఱక వర్తింపుఁడు.మీకు శీఘ్రముగనే మేలుకలుగును.

ఉ. నేను సఖుండ నెట్లయితి - నీ కని చూచెద నవ్విచారమున్
మానుము, తద్విధం బని స-మాప్తము నొంద నెఱుంగవచ్చు, నా
కానతి యిచ్చెదే చనఁగ - నప్రతిధర్మవిధిజ్ఞ! శత్రులం
దేనియు మాన వీవు కృప - నెప్పుడు నీరజపత్రలోచనా. ౧౦౯౫

అర్థములు. అని=యుద్ధము - అప్రతి = అసమానమైన - ధర్మవిధిజ్ఞ= ధర్మశాస్త్రము నెఱిఁగినవాఁడా.

తాత్పర్యము

నీ ముఖమే నేనెఱుఁగనే. నిన్నుఁజూచినదియు లేదే. నేను నీకు సఖుఁడ నెట్లయితి నని యడుగఁ గుతూహలపడుచున్నావు. ఆ యాలోచన మానుము, ఆ విధము యుద్ధము పూర్తియయిన పిమ్మట నీవు తెలిసికొనఁగలవు. నాకు సెల విచ్చెదవా? పోయివచ్చెదను. ధర్మశాస్త్రము నీవలె నెఱిఁగినవారు లేరు. కావున నీవు నన్నుఁజంప యత్నించిన శత్రువులందు నీవు దయమానవు.

కం. బాలురు వృద్ధులు దక్కఁగ, నీ లంకఁ గలట్టి యసుర•బృందంబుల ని
ర్మూలించి మార్గణంబుల, శీలవతిన్ సీత మఱలఁ•జెందెద వనుచున్. ౧౦౫౬

అర్థములు. మార్గణంబులన్ = బాణములచే.

తాత్పర్యము

పసివాండ్రను, ముసలివాండ్రను తప్ప మగవారిలో లంకలో రాక్షసుఁడను వాఁడు లేకుండునట్లు రాక్షస సమూహములను వేరుతోడ నాశముచేసి పతివ్రత యగు సీతను మరల గ్రహింపఁగలవు.

తే. పలికి వారలఁ దనయంక•పాళిఁ గ్రుచ్చి, తతముదం బొనగూర్చి ప్ర•దక్షిణించి
పవనునట్టుల యాకాశ•పథముఁ బట్టి, తార్క్ష్యుఁ డరిగెనఁ దేజిన•దాశరథుల.

అర్థములు. అంకపాళిన్=కౌఁగిట, తార్క్ష్యుఁడు=గరుడుఁడు.

తాత్పర్యము

ఇట్లు చెప్పి వారిని కౌఁగిలించి వారికి సంతోషము కలిగించి ప్రదక్షిణము చేసి గాలివలె నాకాశమార్గమున గరుడుఁడు పోయెను. మూర్ఛనుండి తెప్పరిల్లి కొనిన రామలక్ష్మణులను.

—• శ్రీరామలక్ష్మణులఁ జూచి కపులు సింహనాదంబులు సేయుట •—

కం. తిలకించి హర్షభరమునఁ, బులకించి మదించి వాల•ములఁ దాఁచుచు గ
ర్జల నించి భేరినినదము, బలియించి మృదంగరవముఁ•బరఁగించి కపుల్.

అర్థములు. తిలకించి=చూచి-హర్షభరమునన్= సంతోషాతిశయముచే-పులకించి = గగ్గురుపాటుచెంది - మదించి= గర్వించి - తాఁచుచున్ = నేలకు వేసి కొట్టుచు - గర్జలనించి=సింహనాదముల నిండఁజేసి-భేరి = నగారాల-నినదము = ధ్వని - మృదంగరవము = మద్దెలల ధ్వని.

తాత్పర్యము

చూచి సంతోషాతిశయమున గగ్గురుపాటు చెంది గర్వించి తోఁకలను నేలకు వైచి బాఁదుచు సింహనాదములు చేసి నగారాల వాయించి మద్దెల రవములు వానరులు వ్యాపింపఁ జేసిరి.

కం. వాయించుచు వాద్యంబుల, మ్రోయించుచు శంఖములను•మునుపటియట్టుల్.
కోయంచును జేయంచును, మాయించుచు రాక్షసులను•మార్కొని రెలమిన్.

అర్థములు. కోయంచును కోబలీ=కోబలియని, బలితీసికో యని యర్థము, జే=జయ, మాయించుచున్=నాశము చేయుచు.

తాత్పర్యము

వాద్యముల వాయించుచు శంఖముల మ్రోయించుచు మునుపటివలె కోయని జేయని ధ్వనులు చేయుచు, రాక్షసుల వధించుచు వానరులు రాక్షసుల నెదుర్కొనిరి.

కం. జలదాగమమున వెఱగొన, జలదంబులు మ్రోయుగతి నిశామధ్యమునన్
బలిముఖులభీమనినదం,బులు కర్ణకఠోరముగనఁబోరిఁ బోరి సెగసెన్. ౧౦౬౦

అర్థములు. జలదాగమమున = వానకాలమందు, వెఱగొన = లోకులు భయపడునట్లు, నిశామధ్యమునన్ = నడిరేయియందు, ఇట్లు చెప్పుటచే నిపుడు యుద్ధమున మొదటి దినమున నడిరేయి యైనట్లు తేర్పడెను. నాగపాశ బంధముల తోనే ప్రథమదిన యుద్ధము ముగిసినదనుట విచార్యము. భీమనినదము=భయంకర ధ్వని-కర్ణకఠోరముగను=శత్రువుల చెవులకుఁ గటువుగ-పోరిఁబోరి=మిక్కిలి.

తాత్పర్యము

వానకాలమందు వినువారికి భయము కలుగునట్లు మేఘములు ధ్వనించునట్లు అర్ధరాత్రమున వానరుల భయంకరధ్వనులు రాక్షసులకుఁ వినఁగరానివములై మీఁద మీఁద నంతకంతకు నతిశయించెను.

ఇంద్రజిత్తువలన రామలక్ష్మణులకుఁ గలిగిన పరాభవమువలన నిర్మలమన స్సులు గలవారై బుజు ప్రవర్తనము గలవారికి ప్రాణాపాయము కలిగించు నంతటి కష్టదశ ప్రాప్తించినను, వినాశములేదు, విపరీత వర్తనముగల పాపాత్ములకు తత్కాలమున మేలు గలిగినను, హస్తగతములైనవికూడ వ్యర్థములై పోవుచున్న వని గ్రహింపనగు. ధర్మాధర్మములు శాస్త్రములవలన నెఱుఁగనగును, గాని వాని ననుష్ఠాన రూపమునఁ జూపి లోకుల ననుష్ఠింపఁజేయుటచే ధర్మసంస్థాపనము చేయుటకే భగవంతుఁడు శ్రీరామచంద్రమూర్తియై యవతరించెను. ఈవిషయము పూర్వమే విశదీకరింపఁబడెను.

## —• { ౫౧-వ సర్గము. రావణుఁడు కపులసంతోషమునకుఁ గారణము విచారించుట. } •—

మ. పటుసంరంభవిజృంభమాణకపిసంవ్రాతస్ఫురద్భీషణా
ర్భటు లుద్దామగభీరకంఠనినదవ్యాపారముల్ పర్వనొ
క్కట సంసద్గతరావణుం డులికి రక్షఃకాండమున్ వానరో
ద్భటకోలాహలసింహనాదములు నాదస్మేఘగర్జాచ్ఛటన్. ౧౦౬౧

అర్థములు. పటు=దృఢమైన-సంరంభ = వేగముతోఁగూడిన - విజృంభ మాణ = వృద్ధియగుచున్న - కపిసంవ్రాత = వానర సమూహముయొక్క - స్ఫురత్ =ప్రకాశించునవియు=అందఱకు వినఁబడునట్లు సర్వత్ర వ్యాపించునవి - భీషణ = భయంకరములైన - ఆర్భటులు = సింహనాదములు = పెద్దకేకలు - ఉద్దామ = పెద్దవియు - గభీర = గంభీరములును నగు - కంఠనినద=సింహనాద ఉపుడి - వ్యాపారముల్ = కార్యములు-పర్వన్ = వ్యాపింపఁగా - ఒక్కటన్ = ఏకకాలమున=ఒక్కసారిగ-సంసత్ + గత = సభయందుండిన-ఉలికిపడి = భయ

పడి - రక్షఃకాండమున్ = రాక్షససమూహమును - ఆరసిరంతు = పొందను దానితో (౧౦౬౮) నన్వయము. వానర = కోతుల - ఉద్భట = అతిశయించిన, కోలాహల, సంకుల శబ్దములు — సింహనాదములు = గర్జలు - నాదత్ = ధ్వనించుచున్న - మేఘ = వర్షాకాలమునందలి మబ్బుయొక్క - గర్జాచ్ఛటన్ = ఉరుముల సమూహమును.

## తాత్పర్యము

మిక్కిలి వేగముతో నంతకంతకు వృద్ధియగుచున్న వానరులయొక్క సర్వత్ర వ్యాపించిన కేకలు అధికమై గంభీరమైన కంఠనాదములు నొక్కటిగా సభయందుదన జయము గుఱించి సంతోషముతోఁ బ్రశంసించుకొనుచు నావలి కార్యమేమి చేయవలెను, అందఱు యొక్కసారి వానరసేనపై పడి ధ్వంసముచేయుదమని యాలోచించు రావణునకువిని యులికిపడి రాక్షసులతో నిట్లనియెను. వానరుల కలకలములు సింహనాదములు వానకాలమందలి మేఘముల యుఱుముల సమూహమును.

కం. తలపించెను బట్టణముం, దలఁకించెను సాగరంబుఁ ♦ దలరించెను లో
నలు కించుక లేక యిటుల్, తలిరువఁగా నేది కత మొ♦తరుచరవీరుల్. ౧౦౬౯

అర్థములు. తలఁపించెను = స్మృతికిఁ దెచ్చెను, తలఁకించెను = కదిలింపఁజేసెను, తలరించెను = కలఁత నొందఁజేసెను. లోన్ = మనస్సులలో, అలుకు = భయము, ఇంచుక = కొంచెమైనను, తలిరువఁగాన్ = సంతోషింపఁగా, కతమొ = కారణమో.

## తాత్పర్యము

స్మృతికి దెచ్చుచున్నవి. నగరమును గదిలించుచున్నవి. సముద్రమును గలత నొందించుచున్నవి. వానరులు మన ప్రభువు పడిపోయెను గదా, ఇక మన కేమిగతి. శత్రువులు పై పడుదురేమో యను భయము కొంచెమైనను లేక యీ ప్రకారము సంతోషింపఁ గారణ మేమి కలిగెను.

ఉ. ఏదియొ హర్ష హేతువు క♦పీంద్రులకున్ ఘటియిల్ల నోపు. నీ
తాదయితుండు లక్ష్మణుఁడు ♦ దారుణనాగమహాస్త్రబద్ధులై
మేదినిఁ గూలి యుండఁగ ని♦మిత్తము లేకయె సేన యుబ్బునే?
మేదుర మయ్యె సందియము ♦ మీఱు వెసం జని తన్నిదానమున్. ౧౦౬౩

అర్థములు. హర్ష హేతువు = సంతోషకారణము - ఘటియిల్లన్ - ఓపున్ = కలిగియుండవలెను. మేదురము = అధికము = దట్టము - తత్ + నిదానమున్ = దాని మూలకారణమును.

## తాత్పర్యము.

వానరుల కేదియో సంతోషకారణము లభించియుండవలెను. రామలక్ష్మణు లిరువురు నాగపాశబద్ధులై భూమిపైఁబడి యుండఁగాఁ గారణము లేక సేన సంతో

పించునా? ఎవరైన దేవతలు సహాయులై వచ్చిరా? వారు కట్లు విడిపించుకొనిరా-నాకు బలమైన సందేహ మధికముగా నున్నది. మీరు త్వరగాఁబోయి దాని యాది కారణమేమో.

ఉ. ఆరసి రండు పొం డన భ•యాకులతం బరువెత్తిపోయి ప్రా
 కారము లెక్కి వానరని • కాయముఁ గన్గొని ముక్తబంధులన్
 హారివిహారలోలసమ • రాంగణవర్తుల భీమమూర్తులన్
 శూరుల రామలక్ష్మణులఁ • జూచి గభిల్లన గుండె లాశరుల్. ౧౦-౧౨

అర్థములు. ఆరసి = విచారించి — భయాకులతన్=భయముచేఁ గలిగిన కలఁతచే-ముక్తబంధులన్=కట్టులనుండి విడివడ్డవారిని-హారి = మనోహరముగ-విహారలోల=సంచారమందు నాసక్తిగలవారై, సమరాంగణ వర్తులన్ = యుద్ధ భూమియందు వర్తించువారిని, భీమమూర్తులన్=భయంకరములైన యాకారములు గలవారిని, రామలక్ష్మణులు సౌమ్యమూర్తులైనను రాక్షసులకు మృత్యుదేవతలవలె నగుటచే వారికి భయంకరులుగానే కానవచ్చిరి. ఆశరుల్=రాక్షసులు.

తాత్పర్యము

విచారించి రండు పొండని చెప్పఁగా వారు భయముచే గుండెలు కొట్టుకొను చుండఁ బరువెత్తిపోయి ప్రాకారము లెక్కి వానరుల గుంపును జూచి వారిలో బంధములు వదలించుకొని స్వేచ్ఛగా యుద్ధభూమియందుఁ దిరుగువారిని భయంకరాకారులను, శూరులను, రామలక్ష్మణులనుజూచిగుండెలు గుభిల్లుమనఁగా రాక్షసులు,

మ. వెలుకం బారిన మోము లొప్పఁ జని యా•వృత్తాంతమున్ సర్వమున్
 దెలియం బల్కిరి శక్రవైరిశరబం•దీభూతనిశ్చేష్టు లా
 బలధుర్యుల్ గజతుల్యవిక్రములు త • త్పాశంబులం ద్రెంచి య
 స్ఖలితాడంబరవృత్తిఁ గ్రాలెదరు రా•జా! రాముఁడుం దమ్ముఁడున్. ౧౦-౧౩

అర్థములు. వెలుకంబారిన = వెల్లబోయిన, శక్రవైరి = ఇంద్రశత్రు రొక్క, శర=అస్త్రములచే, బందీభూత=కట్టఁబడినవారై, నిశ్చేష్టులు = కదలక మెదలక యున్నవారు, గజతుల్యవిక్రములు = ఏనుఁగు బలముతో సమానమైన దేహబలముగలవారు-తత్ + పాశంబులన్=ఆ కట్టులను-అస్ఖలితాడంబర వృత్తిన్= కట్టుపడుటకు ముందున్న స్థితికంటెఁ దక్కువకాని, మొక్కవోయైన, వేగిరపాటుతోఁ గూడిన వ్యాపారముతో —

తాత్పర్యము

ముఖములు వెలవెలఁబోవఁబోయి యా వృత్తాంతము సర్వము రావణున కిట్లు చెప్పిరి. రాజా! యింద్రజిత్తు బాణములచేఁ గట్టువడి కదల మెదలలేక యుండిన రామలక్ష్మణులు, బలవంతులు, ఏనుఁగుల విక్రమము గలవారు, ఏనుగులు తమ్ము గట్టిన త్రాళ్ళను త్రెంచుకొనినట్లు ఆ పాశముల ద్రెంచుకొని అంతకు ముందున్న యాడంబరమున కంటె దక్కువ కాని యాడంబరముతోఁ బ్రకాశించుచున్నారు.

### -• శ్రీరామలక్ష్మణులు నాగపాశవిముక్తు లగుటకు రావణుఁడు వ్యసనపడుట. •-

చ. అనవుడుఁ జింతయున్ వ్యసన • మూరట పెట్ట విషణ్ణచిత్తుఁడై
యనియె దశాస్యుఁ డేమిది మ•హాపవనాశనతుల్యముల్ వికః
ర్తనసమముల్ పితామహవ•రప్రతిపన్నము లప్రతీపముల్
ఘనతరమత్సుతాస్త్రములు • కావవి వ్యర్థము లెన్నఁ డేనియున్. ౧౦౬

అర్థములు. చింతయున్=ఇఁక మీఁద నేమి చేయవలయునా యని యాలోచన, వ్యసనము=ఇంతగొప్ప ప్రయత్నము వ్యర్థమైపోయెఁగదా యని విచారము, విషణ్ణచిత్తుఁడై = విషాదముతోఁ గూడిన మనస్సు గలవాఁడై, మహాపవనాశన తుల్యముల్=వాసుకి తక్షకుఁడు మొదలైన గొప్ప సర్పములతో సమానములైనవి, పవన+అశన= గాలి యాహారముగాఁ గలవి, పాములు, వికర్తన సమముల్ = సూర్యునివలె మండుచుండునవి, పితామహవర ప్రతిపన్నములు=బ్రహ్మవరముచేఁ బొందఁ బడినవి, అప్రతీపముల్=ఎదురులేనివి, ఘనతర=మిగుల గొప్పశక్తిగల, మత్సుత=నా కుమారునియొక్క, అస్త్రములు.

తాత్పర్యము

ఈ ప్రకారము చూచివచ్చిన రాక్షసులు చెప్పఁగా రావణుఁ డిక నేమి చేయుదునా, చేసిన దంతయు వ్యర్థమైపోయెనే యని విషాదపడుచు, నేమిది యాశ్చర్యము! వాసుకి, తక్షకుఁడు లోనగు గొప్ప సర్పములతో సమానములై సూర్యునివలె మండునవియై బ్రహ్మవరముచే సంపాదింపఁబడిన వైన నా కుమారుని మహాస్త్రము లెన్నఁడు వ్యర్థములు కావే.

కం. అట్టి శరంబుల నింద్రజి, ద్దిట్టుగఁ గట్టినను మరల•విడివడిరి రిపుల్
చిట్టలు నా బల మిఁక న, న్నెట్టును రక్షించు ననుట•యేమో నమ్మన్. ౧౦౭

అర్థములు. చిట్టలు = ఆశ్చర్యము, చిత్రశబ్దభవము. ఇది నిత్యబహువచనాంతము.

తాత్పర్యము

అటువంటి బాణములచే నింద్రజిత్తు గట్టిగాఁ గట్టినను శత్రువులు విడిపించుకొనిరి. ఇది యాశ్చర్య విషయము. నా బల మిఁక నన్ను రక్షించునని నేను నమ్మఁజాలను. అది సందేహింపఁ దగినదే. నమ్మరాదు.

కం. ఒవ్వని వారల ప్రాణము, లువ్విళ్ళుగఁ దీయఁ జాలు•నుగ్రశరచయం
బవ్వాసుకిసమతేజం, బివ్విధి వ్యర్థముగఁ బోయె•నిఁక నేమనఁగన్. ౧౦౮

అర్థములు. ఒవ్వని వారల=విరోధుల, ఉవ్విళ్ళుగ=నిశ్శేషముగ.

తాత్పర్యము

శత్రువుల ప్రాణములను నిశ్శేషముగఁ దీయఁజాలు భయంకరశరసమూ

హము వాసుకి తేజముతో సమానమైన తేజము గలవి యీ ప్రకారము వ్యర్థమై పోయినవు డిక నను కోనవలసిన దేమున్నది ?

### —♦ ధూమ్రాక్షుఁడు యుద్ధమునకుఁ బోవుట ♦—

కం. అని రోషకషాయితలో,చనుఁడై రోఁజుచును బాము♦చందమున దశా
నను డను ధూమ్రాక్షునితోఁ, జనుమీ దుర్వార సైన్య ♦ సంయుక్తుఁడవై.

అర్థములు. రోషకషాయిత లోచనుఁడై = కోపముచే నెఱ్ఱనైన కన్నులు గలవాఁడై, రోఁజుచున్ = బుసకొట్టుచు, దుర్వారసైన్య సంయుక్తుఁడవై = వారింప రాని సేనతోఁ గూడినవాఁడవై.

#### తాత్పర్యము

ఈ ప్రకారము చెప్పి కోపముచేఁ గన్నులెఱ్ఱచేసి పామువలె బుసగొట్టుచు నూరకుండిన వానరులు పైబడి లంకలోఁ బ్రవేశింతురని తలఁచి యిదివఱకు జరిగిన దొమ్మి యుద్ధమున రాక్షసులకు మేలు లేమి నాలోచించి కోట వాకిండ్లన్ని మూయించి యొక్కొక్కని నొక్కొక్క ప్రక్కకుఁ బంపఁ దలఁచి ధూమ్రాక్షుఁ డను వానిని జూచి విశేషబలముగల సేనతోఁ బొమ్ము.

ఉ. నీవు వధార్థమై మదవ ♦ నేచరయుక్తుఁడు రాము మీఁదికిన్,
నావుడు వాఁడు సమ్మదము ♦ నన్ దశకంధరు మ్రొక్కి పోయి సై
న్యావళిఁ గూర్పు తూర్ణముగ ♦ నాలము చేసెద వేల? నావుడున్
రావణు నాజ్ఞ సైన్యపతి ♦ రాణువ సిద్ధముఁ జేసి తెచ్చినన్. ౧౦౭౦

అర్థములు. మదవనేచరయుక్తుఁడు = గర్వించిన వానరులతోఁ గూడిన వాఁడగు-ఇది షష్ఠికి విశేషణము కావున ప్రథమ. 'చనుమీ నీవు వధార్థమై' యనుట యందశ్లీలము స్ఫురించుచున్నది. నీవు రాముపధార్థమై పొమ్మని రావణు నభిప్రాయమైనను 'సత్యా వాణీ సరస్వతీ' యన్నట్లు నీవు మరణించు నిమిత్తమై పొమ్మని యర్థము తోఁచుచున్నది. తూర్ణముగన్ = వేగముగ, ఆలము = ఉపేక్ష, రాణువ = సైన్యము.

#### తాత్పర్యము

గర్వించిన వానరులతోఁ గూడియుండు రామునిమీఁదికి నీవువధార్థమైపొమ్ము అని చెప్పఁగా వాఁడును సంతోషముతో రావణునకు నమస్కరించి సేనానాయ కునితో నాతోడ రాఁగల సేనను గూర్చి యిమ్ము. ఏల యాలస్యము చేసెద వనిన వాఁడును రావణు నాజ్ఞ దీసికొని సైన్యము సిద్ధము చేసి ధూమ్రాక్షునకుఁ దెలిపెను.

కూర్పు తూర్ణముగ నాలము చేసెదవేల యనుటచే నందఱు నన్ని ప్రక్కలఁ బోయి సాధింపలేని దానిని వీడొక్కఁడు పోయి యేమి సాధింపఁగలఁ డని సేనాపతి సందేహించి జాగుచేసె ననియు రావణాజ్ఞ కావున మరల సేనగూర్చి యిచ్చెననియు స్ఫురించెడిని.

శా. ఘంటావ్రాతఘణంఘణంఘణఘణ ♦ క్వాణంబు నిండన్ దెస
ల్మంటల్ చిమ్మ ధగద్ధగద్ధగిత శూ ♦ ల ప్రాసభల్లాదులున్
మింటిం దన్న ధమంధమంధమధమా ♦ మేయోరువాద్యధ్వనుల్
గంటుం గొంటరి తుంట రక్కసులమూఁ ♦ కల్ మీఱె నస్తోకమున్. ౧౦౭౧

అర్థములు. ఘంటా వ్రాత = రథములకుఁ గట్టిన గంటల సమూహముల క్వాణంబు = ధ్వని, శూల = ముమ్మొన యాయుధములు, ప్రాస = ఈఁటెలు, భల్లము = బల్లెములు, అమేయోరు వాద్యధ్వనుల్ = అపరిమితమైన గొప్ప నాదములు, కంటు+గొంటరి+తుంట రక్కసులు-కంటుంగొంటరి = విరోధముచేఁ గతినులును, తుంట=దుష్టులు నగు, రాక్షసులు, అస్తోకము=విశేషముగ.

తాత్పర్యము

రథములకుఁగట్టిన గంటల ఘణఘణ యను ధ్వనులు దిక్కులునిండు చుండఁగా శూలములు ప్రాసములు బల్లెములు వీని కాంతులు ధగద్ధగ మని మంటలు చిమ్ముచుండఁగా, ధమ ధమ వాద్యముల ధ్వను లాకాశము నంటుచుండఁగా, పగచేఁ గఠినులగు తుంటరాక్షసుల గుంపులు మిక్కిలి యతిశయించెను.

కం. క్ష్వేళాపూరితదిశులై, కాలాయసదండ పరిఘ♦కరవాల మహా
శూలపరశ్వధపట్టిస, జాలజ్వలితాంగు లగుచు ♦ సంభ్రమమతులై. ౧౦౭౨

అర్థములు. క్ష్వేళాపూరిత దిశులై=సింహనాదములచేఁ నిండిన దిక్కులు గలవారై, కాలాయస = ఉక్కుచేఁ జేయఁబడిన, దండ = కట్టెలు, పరిఘ = గుదియలు, కరవాల = కత్తులు, పరశ్వధ = గండ్రగొడ్డండ్లు, పట్టిస = దండముల వలెనుండు నాయుధములు, వీనియొక్క, జాల=సమూహముచే, జ్వలితాంగులు= వెలుఁగుచున్న దేహములు గలవారు, సంభ్రమమతులై=తొట్రుపడుచున్న మనస్సులు గలవారై.

తాత్పర్యము

సింహనాదములచే దిక్కులు నిండఁగా ఉక్కు దండములు, ఇనుపకట్ల గుదియలు కత్తులు, పెద్ద శూలములు, గండ్రగొడ్డండ్లు, పట్టిసములు వీనిచే వెలుఁగుచున్న దేహములు గలవారై తొట్రుపడుచు.

కం. కవచులు ఖడ్గులు ధ్వజులై, సవురుగ రాక్షసులు స్వర్ణ ♦ సంచయయుతముల్
వివిధాస్యఖరంబులు గల, రవిసన్నిభరథములందుఁ గ్రాలిరి ♦ కీవిన్. ౧౦౭౩

అర్థములు. కవచులు=కవచములు తొడిగికొనినవారు, ఖడ్గులు = కత్తులు ధరించినవారు, ధ్వజులు=టెక్కెములఁ బట్టుకొన్న వారు, స్వర్ణసంచయయుతముల్= బంగారు సొమ్ముల సమూహములతోఁ గూడినవి, వివిధాస్యఖరంబులు = నానావిధములైన ముఖములుగల కంచరగాడిదలు, రవిసన్నిభ=కాంతియందు సూర్యునితో సమానములైన.

తాత్పర్యము

మీఁది పద్యంబునఁ జెప్పఁబడినవారు కాలిబంట్లు, ఈ పద్యంబున రథికులు చెప్పఁబడుచున్నారు.

కవచములు తొడిగికొని ఖడ్గములు ధరించి తేరిపైఁ దమ ధ్వజము లెక్కించి బంగారు నగలచే నలంకరింపఁబడిన గాడిదలు కట్టిన సూర్యునితో సమానముగ వెలుఁగుచున్న రథములందుఁ గొందఱు ప్రకాశించిరి.

కం. పరమజవోపేతము లగు, హరులపయిన్ మదకలంబు ♦ లగు దంతుల పై
    సురవైరులు వ్యాఘ్రంబుల, కరణిన్ దుర్జయులు చనిరి ♦ కలహోత్సుకులై.

అర్థములు. పరమజవోపేతములు = మిక్కిలి వేగముతోఁ గూడినవి. హరులు=అశ్వికులు, మదకలంబులు=మదముచే మనోజ్ఞమైనవి. 'మదేన కలో మనోజ్ఞః మదకలః' అని వ్యుత్పత్తి. ఇచ్చట నవయవార్థమునే గ్రహింపవలెను. కలహోత్సుకులై=యుద్ధ ప్రయత్నము గలవారై.

తాత్పర్యము

కొందఱు మిగుల వేగముగఁ బోఁగల గుఱ్ఱములపైఁ గూర్చుండియుఁ, గొందఱు మదపుటేనుఁగులపైఁ గూర్చుండియు పులులవలె జయింపరాని రాక్షసులు యుద్ధసన్నద్ధులై పోయిరి.

కం. వృకసింహాముఖ సువర్ణ, ప్రకటాలంకార యుక్త ♦ పటుఖరరాజ
    ద్వికటస్యందనగతుఁడై, చకచక ధూమ్రాక్షుఁ డరిగె♦సమరంబునకై. ౧౦౭౫

అర్థములు. వృకసింహముఖ=తోడేళ్ళయు, సింహములయు ముఖములవంటి ముఖములుగల, సువర్ణ ప్రకటాలంకార=బంగారుతోఁ జేయఁబడిన అభరణములతో, యుక్త=కూడిన, పటు = దృఢమైన, ఖర = కంచరగాడిదలచే, రాజత్ = ప్రకాశించు, స్యందనగతుఁడై = రథమునం దున్నవాఁడై, సమరంబునకై = యుద్ధము నిమిత్తముగ.

తాత్పర్యము

తోడేళ్ళ ముఖములు, సింహముఖములుగాఁ దీర్పఁబడిన బంగారు సొమ్ములతో గూడిన దృఢమైన కంచరగాడిదలచేఁ బ్రకాశించు తేరిపైఁ గూర్చుండిన వాఁడై ధూమ్రాక్షుఁడు యుద్ధము నిమిత్తమై త్వరగాఁ బోయెను.

—♦ ధూమ్రాక్షున కపశకునంబు లగపడుట ♦—

ఉ. హారివిలాసహాసరుచి ♦ రాననుఁడై హనుమంతుఁ డున్న యా
    ద్వారముఁ జేరఁబో శకున ♦ వారము మింటను గట్టె గ్రద్దయున్
    దేరిపయిన్ దభాలునను ♦ ద్రెళ్ళె, ధ్వజాగ్రమునందు గ్రద్దలున్
    వారక వ్రాలె దెల్లనిక ♦ బంధము దన్నికటస్థలంబునన్. ౧౦౭౬

అర్థములు. హారి = మనోహరమైన, విలాస=శృంగారముతోఁ గూడిన, హాస=నవ్వుచే, రుచిర = అందమైన; ఆననుఁడై = ముఖము గలవాఁడై, శకున చారము = పక్షిసమూహము, గ్రద్దలు మొదలైనవి, కట్టెన్ = కుడినుండి యెడమకుఁ బోయెను, కబంధము=మొండెము, తన్నికట స్థలంబునన్ = ధూమ్రాక్షుని సమీప ప్రదేశమునందు.

తాత్పర్యము

వినోదక్రీడకుఁ బోవువానివలె ధూమ్రాక్షుఁడు నవ్వుచే నందమైన ముఖము గలవాఁడై హనుమంతుఁడున్న పశ్చిమద్వారము చేరఁబోఁగా నాకాశమునఁ బక్షులు గట్టెను. తేరిమీఁద దభాలున గ్రద్దపడెను. ధ్వజముమీఁద తోలినను బోక గుంపులుగ గ్రద్దలు వ్రాలెను. అతని సమీపమందుఁ దెల్లని మొండెము.

కం. తోరఁగడి నెత్తుటఁ దడియుచు స్వరము వికారంబుగాఁగ • సైన్యాధ్యక్షున్
బరికించి యార్చటించుచు, ధరణీతలమందుఁ బడియె•దబ్బున మఱియున్.

అర్థములు. తోరఁగడి=కాఱుచున్న, సైన్యాధ్యక్షున్=ధూమ్రాక్షుని.

తాత్పర్యము స్పష్టము.

కం. కురిసెన్ నెత్తురు పిడుగులు, దొరలెడిగతి గాలి వీచె • దొర కెదు రగుచున్
ధరణి వణంకెను నల్లెడ, నిరు లతిమెను దిశలు కాంతి•హీనము లయ్యెన్.

అర్థములు. దొరకు = సేనానాయకునకు, ఇరులు=చీఁకట్లు, అతిమెను = ఆక్రమించెను.

తాత్పర్యము స్పష్టము.

కం. వీక్షించి వాని నా ధూ, మ్రాక్షుఁడు తనలోన మిగుల • నలమట చెందెన్
రాక్షసులును మూర్ఛాగతు,లై క్షితిపైఁ బడిరి సాధ్వ•సాక్రాంతమతిన్.

అర్థములు. అలమట = వ్యసనము, సాధ్వస = భయముచే, ఆక్రాంతమతిన్ = ఆక్రమింపఁబడిన మనస్సులతో.

తాత్పర్యము

ఈ యపశకునములను జూచి ధూమ్రాక్షుఁడు తన చావు నిజ మని మిగుల వ్యసన పడెను. రాక్షసులును భయపడినవారై మూర్ఛపోయి పడిరి.

కం. ఎట్టును ధృతిగొని సేనలు, చుట్టును దనుఁ గొలిచి రాఁగ•సురసూదనుఁడున్
జెట్టుంద్రిమ్మరిగమిపై, నిట్టల మగువీఁకఁ జనియె • నిబ్బర మొనరన్. ౧౦౮

అర్థములు. ఎట్టున్=ఎట్లెట్లో,తప్పనిదని-భయపడి యేమి ప్రయోజనము. వెనుకకుఁబోయిన రావణుఁడు చంపును. ముందుపోయిన దైవము పెట్టినట్లగును అని ధృతిగొని=ధైర్యము తెచ్చుకొని, సురసూదనుఁడున్ = రాక్షసుఁడు, ధూమ్రాక్షుఁడు-చెట్టుంద్రిమ్మరిగమిపై = వానరుల గుంపుమీఁద, నిట్టలము = అధికము

తాత్పర్యము స్పష్టము.

## —• ౫౨వ సర్గము ధూమ్రాక్షు సేనలు కపులతోఁ బోరుట •—

ఉ. ద్వారము దాఁటి వచ్చు సుర•వైరిని గాంచి కపీంద్రు లెల్ల హ
 ర్షారభటుల్ చెలంగఁ గల•హ ప్రియులై వెస నంటఁ దాఁకినన్
 వారల సంకులాహవ మ•వారితభీషణమై రహించె గో
 త్రారుహశూలముద్గరశ•రప్రతిఘాత మనన్యసామ్యమై ౧౦౮౧

అర్థములు. హర్షారభటుల్=సంతోషధ్వనులు, సంకులాహవము=ద్వంద్వ యుద్ధము, అవారిత=వారింపఁబడని, భీషణమై = భయంకరమై, గోత్రారుహ = వృక్షములయు, ప్రతిఘాతము=దెబ్బలుగలది, అనన్యసామ్యమై = దీనితో సమాన మైనది వేఱొకటిలేనిదై.

### తాత్పర్యము

ద్వారముదాఁటి వచ్చుచున్న రాక్షసునిజూచి వానరులు సంతోషముచే ధ్వనించుచు యుద్ధమందుఁ బ్రీతిగలవారై సమీపించి యెదిరింపఁగా నా వానర రాక్షసుల ద్వంద్వయుద్ధము నివారింపరానిభయము గలిగించునదియై చెట్ల దెబ్బలు శూలముల ముద్గరముల బాణముల దెబ్బలు గలదై యసమానమై చెలంగెను.

చ. పరశుగదాత్రిశూలశర•పట్టిసభల్లకభిండిపాలము
 ద్గరముఖసాధనంబుల ము•ఖాముఖి రాక్షససేన పోరఁగాఁ
 దరుగిరిశృంగహస్తు లయి • దర్పిత వానరకోటి రాక్షసో
 త్కరములమీఁద దూఁకి ప్రవి•దారిత గాత్రముఁ జేసె సైన్యమున్. ౧౦౮౨

అర్థములు. ముఖాముఖి = ఎదురెదురై. తరుగిరి శృంగహస్తులు = చెట్లు కొండ శిఖరములు చేతియందుఁ గలవారు. ప్రవిదారితగాత్రము = చీల్పఁబడిన దేహము గలది.

### తాత్పర్యము

గండ్రగొడ్డండ్లు గదలు త్రిశూలములు బాణములు బల్లెములు లోనైన సాధనములు గైకొని రాక్షసులు వానరుల కెదురై యుద్ధము చేయఁగా వానరులు చెట్లు కొండ శిఖరములు చేతఁ దీసికొని రాక్షససమూహములమీఁద దూఁకి వారి దేహములను జీల్చివైచెను.

చ. కినుక సురారిసంఘములు • కేరి గదాదికసాధనాదులన్
 వనచరపాళి నెత్తురులు • వఱ్ఱులు వాఱఁగఁ జేయ వారలున్
 ఘనశరదారితాంగు లయి•ఖడ్గసుతాడిత దేహు లయ్యునన్
 వెనుచన కశ్మవృక్షహతి • వ్రీలఁగఁ జేసిరి తచ్ఛిరంబులన్. ౧౦౮౩

అర్థములు. కినుకన్ = కోపముచే, కేరి = విజృంభించి, గదాదిక సాధనాదులన్=గదలు మొదలగు నాయుధములు మొదలగు వానిచే, వఱ్ఱులు=వంకలు, ఘనశరదారితాంగులయి=గొప్ప బాణములచేఁ జీల్పఁబడిన దేహములు గలవారై, ఖడ్గసుతాడిత దేహులయ్యునన్=కత్తులచే బాగుగఁ గొట్టఁబడిన దేహము గలవా

రయ్యు, వెనుచనక = వెనుకకుఁ బోక, అశ్మవృక్షహతిన్ = జాలయు చెట్లయు దెబ్బలచే, వ్రీలఁగన్=పగులునట్లు.

తాత్పర్యము

రాక్షసులు కోపముచే విజృంభించి గదాదులు సాధనములు గ్రహించి వానర సమూహములను నెత్తురు వంకలు పాఱునట్లు చేయఁగా వానరులు బాణములచేఁ జీల్పఁబడిన దేహములు,ఖడ్గములచేఁ గొట్టఁబడిన దేహములు గలవారయ్యును వెను కడుగు పెట్టక జాలదెబ్బలచే, చెట్ల దెబ్బలచే వారి తలలు పగులఁగొట్టిరి.

మ. శిరముల్ వ్రద్దలు వాఱ మోఁదుచు రయ•శ్రీదోఃప్ర శాఖావళిన్
గరముల్ నేలఁ దొరంగ బాఁదుచును ని•ష్కారుణ్య చిత్తంబునన్
నరముల్ వ్రేవులుఁ ద్రెంచి వైచుచును నా•నాభంగి దంష్ట్రాళిచే
సురముల్ వ్రచ్చిరి దొంతి గ్రుచ్చిరి జయ•ప్రోత్సాహ మేపారఁగన్. ౧౦౮

అర్థములు. రయశ్రీ=వేగసంపద.

తాత్పర్యము

కొమ్మలచే నతివేగముగ రాక్షసుల తలలు వ్రద్దలగునట్లు కొట్టుచు, దయా హీనులై చేతులు విఱిగి నేలఁ బడఁగొట్టుచు, నరములు ప్రేగులు చించుచు నానావిధములుగఁ గోఱలచే యుద్ధజయము ప్రేరింపఁగా ఱొమ్ములు చీల్చిరి. దొంతిగా రాక్షసుల గ్రుచ్చిరి.

ఉ. చింతురు శత్రుకాయములఁ • జీలిక లై పడ రెండు రెండుగా
దంతురు బజ్జ బజ్జ గను •దారరయంబునఁ జెట్ల దెబ్బలన్
నొంతురు జాల అప్పల న•నూన మహాద్భుత వృష్టిఁ గొల్పి మ
ర్దింతురు ముష్టిఘాతములఁ•గ్రిందఁ బడన్ మెడఁ ద్రొక్కి యాసురన్. ౧౦౯

అర్థములు. అనూన=కొఱతలేని, మహాద్భుత వృష్టిన్ = మిగులనాశ్చర్య కరమైన వానను, కొల్పి=కలిగించి.

తాత్పర్యము

వానరులు తమ విరోధుల దేహములను రెండు రెండు చీలికలై పడఁ జీల్తురు. చెట్ల దెబ్బలు వేగ వేగముగఁ బజ్జగఁ గొట్టుదురు. అధికమైన జాలవాన గురి యించి జాలచేత అప్పలచేత వారిని నొప్పింతురు. క్రిందఁ బడవైచి మెడఁ ద్రొక్కిపట్టి కోపించి పిడిగ్రుద్దులచే కొట్టుదురు.

కం. రక్కసులు కపులపోటులఁ గ్రక్కిరి నెత్తురులు నేలఁ • గండలతోఁ దా
రుక్కిరి బిక్కిరియై చెడి, స్రుక్కిరి మక్కిరి మఱుంగు•చొచ్చిరి భీతిన్.

అర్థములు. పోటులన్ = దెబ్బలచే, ఉక్కిరి బిక్కిరియై=ఊపిరి తిరుగక, స్రుక్కిరి=మూర్ఛిల్లిరి, మక్కిరి = చచ్చిరి, మఱుంగు చొచ్చిరి = దాఁగుకొనిరి.

తాత్పర్యము స్పష్టము.

కం. కూలినఖరముల ప్రోవుల, వ్రాలిన టెక్కెములఁ జెడిన ♦ రథములగుమిచేఁ
దూలిన గజములచే మెయి, చీలినతురగములచేత ♦ క్షితి నిండారెన్. ౧౦౮౭

అర్థములు. మెయి = దేహము.

తాత్పర్యము

నేలఁబడిన గాడిదల కుప్పలచేతను నేలకు వ్రాలిన ధ్వజములచేతను విఱిగిన రథముల గుంపులచేతను చచ్చిన యేనుఁగులచేతను దేహములు చీలిన గుఱ్ఱముల చేతను రణభూమి నిండెను.

కం. గంతుకొని చివ్వనం దమ,దంతంబులఁ గఱకుగోళ్ళ ♦ దనుజులముఖముల్
వ్రంతలుపడ చీలిచి యము,నంతికమున కనిచి రగచ ♦ రాధిపు లంతన్.

అర్థములు. చివ్వనన్=తటాలున, గంతుకొని = దూఁకి, వ్రంతలుపడ = గుంతలు పడునట్లు, అంతికమునకున్ = సమీపమునకు, అగచరాధిపులు=వానర శ్రేష్ఠులు.

తాత్పర్యము

తటాలున మీఁద దూఁకి తమ కోఱలచేతను, పదునుగల గోళ్ళచేతను, రాక్షసుల ముఖములు గుంతలుపడఁ జీలిచి వానరులు చంపిరి.

కం. వ్రేలెడు వెంట్రుకలును రుచి,మాలిన మోములును రక్త♦మాంసజమాదో
త్తాలకు గంధముసోఁకున, సోలెడు దేహములు వగుచు♦సోఁకులు పరవన్.

అర్థములు. రుచిమాలిన = కాంతి తొలఁగిన, రక్తమాంసజ = నెత్తురు మాంసమువలనఁ గలిగిన; మాదోత్తాలకుగంధమున = అధికమైన మదపు చెడు వాసన తగులుటచే, సోలెడు = పడిపోవు, సోఁకులు = రాక్షసులు, పరవన్=పరు వెత్తఁగా.

తాత్పర్యము

వెంట్రుకలు వ్రేలాడుచుండఁగా, ముఖములందుఁ గాంతి తొలఁగిపోఁగా నెత్తురుగా మాంసమువలనఁ గలిగిన మదపువాసనలు తగులుటచే దేహములు సోలి పోవుచుండ రాక్షసులు పరువెత్తిరి.

—♦ ధూమ్రాక్షుఁడు కపుల వధించుట ♦—

కం. కొందఱు రోషవశంబునఁ, గ్రందుగఁ బైబడి శతార ♦ కఠినతలములన్
డిందముల మోఁద వారల, మ్రందించిరి కపులు చరణ♦మహిజాహతులన్.

అర్థములు. క్రందుగన్=గుంపుగ, శతారకఠినతలములన్=వజ్రమువంటి గట్టి యఱచేతులచే, డిందములన్=బొమ్ములందు, చరణమహిజాహతులన్=కాలి దెబ్బలచేతను-చెట్లదెబ్బలచేతను, మ్రందించిరి=చంపిరి.

తాత్పర్యము

కొందఱు రాక్షసులు రోషించినవారై వజ్రమువలెఁ గఠినములైన తమ

యుఱచేతులతో వానరుల బొమ్మలపైఁ గొట్టఁగా వారు కాళ్ళతోను చెట్లతోను గొట్టి యా రాక్షసులఁ జంపిరి.

కం. రాక్షసులపాఱిపోకయు, వృక్షాటులమీఱిరాక • వీక్షించుచు ధూ
మ్రాక్షుఁడు రోషకషాయిత, వీక్షణుఁ డై కవిసె నహిత•బృందమువీఁదన్.

అర్థములు. వృక్షాటులు = వానరుల, రోషకషాయిత వీక్షణుఁడై =కోపముచే నెఱ్ఱనైన కన్నులు గలవాఁడై, అహిత బృందమువీఁదన్ = శత్రుసమూహము మీఁద.

తాత్పర్యము

రాక్షసులు పాఱిపోవుట వానరులు పైపడివచ్చుట ధూమ్రాక్షుఁడు చూచి కోపించి శత్రువులపై బడెను.

ఉ. వాసవశస్త్రతుల్యశిత • బాణపరంపరఁ గ్రుచ్చి కొందఱన్
బ్రాసపరశ్వధాహతులఁ • బట్టి సముద్గరశూలఘాతులన్
ద్రాసకరాస్త్రసంతతుల • దారితగాత్రులఁ జేసి గొందఱన్
భాసురవిక్రమం బడర • బల్విడి క్రోఁతుల రేఁ పడంచుచున్. ౧౮-౨౨

అర్థములు. వాసవశస్త్ర=ఇంద్రాయుధమైన వజ్రముతో, తుల్య=సమానమైన, శిత=పదునైన, బాణపరంపరలన్=బాణముల వరుసలచే, ప్రాసపరశ్వధాహతులన్=ప్రాసములయు గండ్రగొడ్డండ్లయు దెబ్బలచే, త్రాసకర = భయము కలిగించు, దారితగాత్రులన్=చీలిన దేహములు గలవారిగ, ఏపు=పరాక్రమము.

తాత్పర్యము

వజ్రముతో సమానమైన బాణములచే గొందఱఁ గ్రుచ్చియు, కొందఱను ప్రాసములచేతను గొడ్డండ్ల చేతను పట్టిన శూల ముద్గరముల దెబ్బలచేతను, గొంద ఱను భయంకరాస్త్రముల చేతను, దేహములు చీల్చి తన పరాక్రమము ప్రకాశించుచు వానరుల పరాక్రమము నణంచుచు.

కం. ఎక్కడఁ జూచినఁ దానై, ప్రక్కలు చెక్కుచు నురంబుఁ • బగిలించుచు మేన్
వ్రక్కలు వ్రక్కలు చేయుచు, నుక్కున విహరించె బలమ•దోద్ధతి మెఱఁగన్.

అర్థములు. ఉక్కునన్ = బలముతో, బలమదోద్ధతి=బలమువలన గలిగిన యధిక గర్వము.

తాత్పర్యము స్పష్టము.

కం. తెఱపి గని పోఁకముఁకలు, నఱకఁగఁ గీశులను వారు • నలిగులి యగుచున్
బఱచిరి చచ్చిరి నెత్తుటఁ, దఱచుగఁ దోఁగిరి నరాలు • తరుగుడు పడఁగన్.

అర్థములు. తెఱపి=సందు, నలిగులి = మిక్కిలి నలఁగునట్లు, పఱచిరి = పరువెత్తిరి, తోఁగిరి=స్నానము చేసిరి—మునిఁగిరి, తఱుగుడు పడఁగన్=నఱికి బడఁగా

తాత్పర్యము

ధూమ్రాక్షుఁడు విజృంభించుటచే రాక్షసులకుఁ గొంచె మవకాశము లభిం

పఁగా, వారు వానరులను నలుకఁగా; వారు మిగుల నలఁగి పరువెత్తిరి. కొందఱు చచ్చిరి. కొందఱు నెత్తుట మునిఁగిరి. కొందఱు శరములు నలుకఁబడిరి.

కం. జ్యాతంత్రీమధురము హీ కాౣ తాళసమన్వితంబు • గజబృంహిత సం
గీతము రణగాంధర్వం, బాతతమై వెలసె నతని • యాహవకేళిన్. ౧౮౯

అర్థములు. జ్యాతంత్రీమధురము=అల్లెత్రా డనెడి తంతెచే మనోహరమై, హీకాౣ తాళ సమన్వితంబు=(౧) ఎక్కౣళ్ళనెడి తాలములతోఁ గూడినదియు,(౨) గుఱ్ఱముల సకిలింత లనెడి తాళములతోఁ గూడినదియు, గజబృంహిత సంగీతము= ఏనుఁగుల ఘీంకారము లనెడి పాటలు గలది, రణగాంధర్వము = యుద్ధమనెడి సంగీతసభ, ఆతతమై=విస్తారమై.

తాత్పర్యము

అల్లెత్రాటి మ్రోఁత లనెడి మనోహరమైన వీణాతంత్రుల నాదము గలదియు, గుఱ్ఱముల సకిలింత లనెడి తాళములు గలదియు, ఏనుఁగుల ఘీంకారము లనెడి పాటలు గలదియునైన యుద్ధ మనెడి సంగీతసభ యుద్ధవేళ యందు దోఁచెను.

కం. కార్ముకవిచ్యుతశరజా, లోర్మిపరంపరలఁ గపికు • లోర్విని ముంపన్
మార్గోన్ముఖ మిడుఁ గోఁతులఁ గని, ధూర్మహితగ్రావ మెత్తి • ద్రుతగతి యగుచున్.

అర్థములు. కార్ముక=విల్లనెడి సముద్రము-సముద్రము అధ్యాహార్యము, విచ్యుత=వెలువడిన, శరజాల=బాణసమూహ మనెడి, ఊర్మిపరంపరలన్ = అలల వరుసలచేత, కపికుల = వానరసమూహ మను, ఉర్విని=భూమిని, ధూర్మహిత = భారముచే గొప్పదైన, గ్రావము = పెద్దఱాయి, ద్రుతగతి=వేగముతోఁ గూడిన గమనము గలవాఁడు.

తాత్పర్యము

విల్లనెడి సముద్రమునుండి వెలువడిన బాణము లనెడి యలలు వానరసేన యనెడి భూమిని ముంపఁగా వానరులు పెడముఖములు గలవారై పరువెత్తఁగా భారముగల ఱాతిని దీసికొని మిగుల వేగము గలవాఁడై.

## —• ధూమ్రాక్షుఁడు హనుమంతునిచే హతుం డగుట. •—

కం. ధూమ్రాక్షునిపై మారుతి, తామ్రాక్షుం డగుచు వైచెఁ • దచ్ఛిల వడి రా
వే మ్రొగ్గ జవంబున ధర, పై మ్రాన్పడ కుఱికి నిలిచెఁ • బటుగదఁ గొనుచున్.

అర్థములు. తామ్రాక్షుఁడు = ఎఱ్ఱని కన్నులు కలవాఁడు, తత్+శిల= ఆఱాయి, వడి=వేగముగ, రాన్=రాఁగా, వే = శీఘ్రముగ, మ్రొగ్గజవంబున = అధిక వేగముతో, మ్రాన్పడక = దిగులుపడక, నిశ్చేష్టుఁడుగాక.

తాత్పర్యము

ధూమ్రాక్షుని మీఁద హనుమంతుఁడు విసరివైచెను. ఆ బండ వేగముగ

వచ్చుట చూచి వాఁడు దిగులు పడక గదచేతఁ దీసికొని వేగముగ రథమునుండి భూమిమీఁదికి దుమికెను.

చ. పిడుగన వచ్చి యా శిలయుఁ ♦ బిండిగఁ జేసె రథంబుఁ గాఁడితోఁ
 దోడితోడి వింటితో ధ్వజము ♦ తో రథచక్రయుగంబుతోడఁ ద
 త్తడిగమితోడ దానిఁ గని ♦ దానవవీరులు వేగవంతులై
 యెడఁ జొరఁ బాఱి తాఁకిరి య ♦ హీనపరాక్రము మారుతాత్మజున్. ౧౦౯౮

అర్థములు. తోడితోడి=మిగుల వేగముతో, తత్తడిగమి = తేరికిఁగట్టిన గుఱ్ఱముల గుంపు, ఎడన్=సందు చేసికొని.

తాత్పర్యము

ఆ బండ పిడుగువలె వచ్చి రథముపైఁబడి దానిని గాఁడితోను, వింటితోను, ధ్వజముతోను, రెండుచక్రములతోను, గుఱ్ఱములతోను బిండిగఁజేసెను. అది చూచి రాక్షసులు వేగము గలవారై సందు కలిగించుకొని మహాపరాక్రమ వంతుఁడైన యాంజనేయునిపైఁ బడిరి.

ఉ. ఆతఁడు గండుమీఱి విల ♦ యాంతకు డై వడి స్కంధయుక్త భూ
 జాతముఁ ద్రిప్పుచుం గవిసి ♦ చావఁగ మోఁదుచు ఫట్ఫటారవ
 స్ఫీతముగాఁ దలల్పగులఁ ♦ జేయుచు శోణితవాహినిన్ సము
 ద్భూతముఁ జేయ రాక్షసులు ♦ దూలిరి త్రస్తవిషణ్ణచిత్తులై. ౧౦౯౯

అర్థములు. గండుమీఱి=పౌరుష మతిశయించి, విలయాంతకుడై వడిన్= ప్రలయకాల యమునివలె, స్కంధయుక్త భూజాతము=బోదెతోఁగూడిన చెట్టును, ఫట్ఫటారవస్ఫీతము = ఫట్ ఫట్ అను ధ్వని యతిశయించు పటులు, శోణిత వాహినిన్=నెత్తుటి ప్రవాహమును, సముద్భూతము జేయన్ = సృష్టింపఁగా, త్రస్త = భయపడిన, విషణ్ణ = విషాదముతోఁ గూడిన, చిత్తులై = మనస్సులు గలవారై.

తాత్పర్యము

ఆయనయుఁ బౌరుష మతిశయింప ప్రలయకాలయముని వలె కొమ్మలు బోదె గల చెట్టును త్రిప్పుచు రాక్షసులపై పడి వారి తలలు ఫట్ ఫట్ మని పగులగాఁ గొట్టుచు, నెత్తుటి వంకఁ బాఱఁజేయఁగా రాక్షసులు భయపడి విషాద మునఁ దూలిపోయిరి.

ఉ. రాక్షసు లిట్లు పాఱుటయుఁ ♦ గ్రమ్మఱ నొక్కనగంబు కూటమున్
 దక్షుఁడు కేలఁ బట్టి భయ ♦ దత్వరితుం డయి మీఁద రాఁగ ధూ
 మ్రాక్షుఁడు సింహనాదముఖ ♦ రాననుఁడై గద మొత్తి మారుతిన్
 వక్షము వ్రయ్య నేయుటయుఁ ♦ బావని లక్ష్యము సేయ కుగ్రుఁడై. ౧౧౦౦

అర్థములు. సింహనాద ముఖరాననుఁడై = సింహనాదముచే ధ్వనించు ముఖము గలవాఁడై.

### తాత్పర్యము

ధూమ్రాక్షున కడ్డము వచ్చిన రాక్షసులు పరువెత్తి పోఁగా హనుమంతుఁడొక పర్వత శిఖరమును చేతఁబట్టుకొని భయంకరమైన వేగము గలవాఁడై తన మీఁదికి రాఁగా ధూమ్రాక్షుఁడు సింహనాదము గావించుచు గదయెత్తి యాంజనేయుని బొమ్మపగుల వేయఁగా దానిని హనుమంతుఁడు పరకు సేయక కోపించినవాఁడై.

కం. లక్షించి శృంగమును ధూమ్రాక్షునినడినెత్తి పైచె • నతిజవమునఁ ద
 ద్రక్షఃపాలుఁడు దానం, బ్రక్షీణాయుష్కుఁ డగుచుఁ•బడియె ధరిత్రిన్.

అర్థములు. లక్షించి=గుఱిచూచి, రక్షఃపాలుఁడు = రాక్షసనాయకుఁడు, ప్రక్షీణ+ఆయుష్కుఁడు = పూర్ణముగ క్షీణించిన యాయుస్సు గలవాఁడు, చచ్చినవాఁడు.

### తాత్పర్యము

గుఱిచూచి యాశిఖరమును నతివేగమున ధూమ్రాక్షుని నడినెత్తిపై వైచెను. దానితో వాఁడు ఆయుస్సు దీఱి చచ్చి నేలపైఁ బడెను.

కం. పిడుగడచిన కుధరముక్రియఁ, బడిన బలాధ్యక్షుఁ జూచి•ప్లవగము లెగవన్
 సుడివడి యెదవడి విహ్వలపడి పఱచిరి లంకఁ ద్రోవఁ•బట్టి నిశాటుల్. ౧౧౦.౨

అర్థములు. కుధరము = పర్వతము, ఎగవన్ = తఱుమఁగా, సుడివడి= కలఁతపడి, ఎదవడి=భయపడి, విహ్వలపడి = వెలవెలఁ బోయి, పఱచిరి = పరువెత్తిరి.

### తాత్పర్యము

పిడుగుదెబ్బ తగిలిన కొండవలె నేలఁబడిన తమ సేనానాయకునిఁ జూచి వానరులు తఱుముచుండఁగా భ్రమగొని దిగులుపడి వెలవెలఁబోయి రాక్షసులు లంకత్రోవఁబట్టి పరువెత్తిరి.

కం. ఈ విధి హనుమంతుఁడు రక్షోవీరుం బిలుకుమార్చి • క్రోఁతిబలఁగముల్
 వావిరిఁ బూజింపఁగఁ దన, తావునఁ జని నిలిచె యుద్ధ•తత్పరుఁ డగుచున్.

అర్థములు. పిలుకుమార్చి = చంపి.

### తాత్పర్యము

ఈ ప్రకారము హనుమంతుఁడు రాక్షసవీరు ధూమ్రాక్షుని జంపి వానర సమూహము తన్ను గౌరవింపఁగాఁబోయి యుద్ధానక్తితోఁ దన స్థానమం దుండెను.

## —• ౫౩-వ సర్గము. రావణుఁడు వజ్రదంష్ట్రుని యుద్ధంబున కనుచుట. •—

సీ. ధూమ్రాక్షుమృతి విని•తోరపు టల్కచే, దశకంధరుఁడు వజ్ర•దంష్ట్రుఁ జూచి
 రామలక్ష్మణుల శా•ఖామృగనేతతో, సంహార మొనరింపఁ•జనుము నీ వ

టన్న వల్లె యని • యధికసైన్యముతోడ, సరిగ యుద్ధేచ్ఛ మా • యావి యసుర
మకుటకేయూరాది • మండితగాత్రుఁడై, కవచంబు దొడి పట్టి • కార్ముకంబు
తే. ధ్వజసమాలంకృతోజ్జ్వల • తప్తకనక, రమ్యభూషణభూషిత • రథముఁ జేరి
దాని వలగొని యెక్కె గ • దావిచిత్ర, శూలముద్గరవరకర • వాలధరులు. ౧౧౦౪

అర్థములు. తోరము+అల్క = తోరపుటల్క=అధికకోపము, మకుట= కిరీటము, కేయూరము = భుజకీర్తులు, ఆది=ఈ మొదలైన యాభరణములచే, మండితగాత్రుఁడై = అలంకరింపబడిన దేహముగలవాఁడై; తొడి=తొడిగి, ధ్వజ సమాలంకృత=టెక్కెముచే నలంకరింపఁబడిన, ఉజ్జ్వల = ప్రకాశించు, తప్త = పుటము వేయఁబడిన, కనక=బంగారుచేఁ జేయఁబడిన, భూషణ=ఆభరణములచే, భూషిత=అలంకరింపఁబడిన, వలగొని = ప్రదక్షిణించి, ముద్గరవరములు = గొప్ప రోఁకండ్లు, కరవాల=కత్తులు, ధరులు=ధరించినవారు.

తాత్పర్యము

ధూమ్రాక్షుఁడు చచ్చె నని విని కోపాతిశయమున రావణుఁడు వజ్రదంష్ట్రుఁ డను వానిని జూచి నీవు పోయి రామలక్ష్మణసుగ్రీవుల సంహరింపుమని చెప్ప వాఁ డట్లులే చేసెద నని చెప్పి గొప్ప సేనతో నా మాయావి యగు రాక్షసుఁడు యుద్ధము నందలి కోరికతోఁ బోయి కిరీటము, భుజకీర్తులు లోనగు నాభరణముల ధరించి కవచంబు దొడిగికొని విల్లుపట్టుకొని ధ్వజ మెత్తఁబడి బంగారు సొమ్ములచే నలంక రింపఁబడిన తేరి యొద్దకుఁబోయి దానికిఁ బ్రదక్షిణ పూర్వకముగా నమస్కరించి యెక్కె గదలు, శూలములు, రోఁకండ్లు కత్తులు ధరించిన వారు.

కం. భటులు వివిధాస్త్రశస్త్రో, ద్భటులు విచిత్రాంబరులు ము • దంబునఁ జన ను
త్కటమదదంతావళములు, పటుగతి నడకొండ లనఁగ • బలువిడి నడవన్.

అర్థములు. వివిధ + అస్త్ర + శస్త్ర + ఉద్భటులు = నానా విధములైన యస్త్రశస్త్రములచే నతిశయించినవారు, విచిత్రాంబరులు = వింతయగు వస్త్రములు గలవారు, ఉత్కటమద = అధికమైన మదముగల, దంతావళములు = ఏనుఁగులు, నడకొండలు = నడచు పర్వతములు, బలు + విడి=అధికపరాక్రమముతో లేక, అధిక కోపముతో.

తాత్పర్యము

నానావిధములైన యస్త్రశస్త్రములచే నతిశయించినవారై చిత్ర వస్త్రములు గట్టి పదాతులు నడవఁగా నడచుచున్న కొండలో యనునట్లు మిగుల మదించిన యేనుఁగులు మిగులఁ గోపముతో నడువఁగా.

తే. తోమరాంకుశకరులు సం • గ్రామనిపుణు, లధికశూరులు కరులపై • నరిగి రల్ల
బలము వర్షాగమమున శం • పానమేఘ, గర్జదంబుదనిచయంబు • కరణిఁ బొలిచె.

అర్థములు. తోమర+అంకుశకరులు=చిల్లకోలలు అంకుశములు చేతధరిం

చినవారు, వర్షాగమమునన్ = వానకాలమందు, శంపాసమేత = మెఱుపులతోఁ గూడిన, గర్జత్ + అంబుదనిచయంబు = ఉఱుముచున్న మేఘములగుంపు, కరణిన్ = విధముగ-సామ్ములకు మెఱుపులు, సింహనాదములకు ఉఱుములు, నల్లని రాక్షసులకు వానకాలపు మబ్బు లుపమానములు.

తాత్పర్యము

చిల్లకోలలు అంకుశములు ధరించినవారు, యుద్ధమునందు నేర్పుగలవారు మిగులశూరులు ఏనుఁగులమీఁదఁ బోయిరి. అప్పుడా బలము మెఱుపులతో నుఱుములతో నొప్పు వానకాలపు మబ్బువలె నుండెను.

—• వజ్రదంష్ట్రుఁడు యుద్ధమునకు వెడలుట •—

ఉ. వాలితనూజదక్షిణపు•ద్వారమునన్ వెడలంగ వారిపై
 వ్రాలె విమేఘ మైన సుర•వర్త్మమునుండి మహోల్క లగ్నులన్
 జ్వాలలు గ్రక్కి నక్క లశు•భంబుగ భీకరరీతిఁ గూసె ర
 క్షోలయ మారఁ దెల్పుచు శ•కుంతములున్ విహరించె మింటిపై. ౧౧౦౭

అర్థములు. విమేఘము = మబ్బు లేనిది, సురవర్త్మమునుండి = ఆకాశమునుండి, మహోల్కలు = పెద్దకొఱవులు, రాలెను - రక్షోలయము = రాక్షసుల నాశము, శకుంతములున్ = పక్షులు.

తాత్పర్యము

వజ్రదంష్ట్రుఁ డంగదుఁ డున్న పడమటిద్వారమున బయలు వెడలఁగా మేఘములు లేని యాకాశమునుండి వారిమీఁదఁ గొఱవులు పడెను. నక్కలు మంటలు గ్రక్కుచు నశుభము సూచించుచు భయంకరముగఁ గూసెను. రాక్షసులవినాశముఁ దెలుపుచు నాకాశమునఁ బక్షులు దిరుగుచుండెను.

కం. మృగములు రక్షోజాలము, తెగుటను సూచింపఁదొడఁగెఁ•దేరకు యోధుల్
 వగచెడి భయమోహితు లై, దిగువం గా ల్జాతి పడిరి • ధృతిచెడి రరుగన్.

అర్థములు. రక్షోజాలము = రాక్షససమూహము, తెగుటను = చచ్చుటను, తేరక = కారణము లేక, వగ + చెడి = అందము చెడి, ధృతి = ధైర్యము.

తాత్పర్యము స్పష్టము.

కం. ఆ మహితోత్పాతములకు, వ్యామోహిత మగుచు యోధ•వర్గము దూలన్
 భీమాహవదోహలుఁ డై, యేమియు నవ్వజ్రదంష్ట్రుఁ•డెడవడ కరిగెన్.

అర్థములు. మహితోత్పాతములకున్ = గొప్పయుపద్రవములకు, వ్యామోహితము = భ్రమగొన్నది, తూలన్ - భయపడి వణకఁగా, భీమాహవదోహలుఁడై = భయంకర యుద్ధము నందాసక్తిగలవాఁడై, ఏమియున్ = కొంచె మైనను, ఎడవడక = భయపడక.

తాత్పర్యము

ఆ గొప్ప యశుభసూచకములగు రాక్షసయోధులు దిగ్భ్రమఁగొని భయముచే వడఁకిరి. వజ్రదంష్ట్రుఁడు గొప్ప యుద్ధమం దాసక్తి గలవారై కొంచెమైన భయపడక పోయెను.

ఉ. ఆతనిరాకఁ గాంచి కపు ♦ లంబరముం బగిలించు నార్పులన్
వీతదరంబుగా నడిమి ♦ భీమము గాఁగ రణం బొనర్పఁగా
జాతరుషాత్ములౌ కపి ని♦శాచరముఖ్యు లొకళ్ళొకళ్ళ ని
ర్ఘాతసమప్రహారముల ఘాత ♦ మొనర్పఁగ బూని యుద్ధతిన్. ౧౧౧౦

అర్థములు. వీతదరంబుగాన్ = భయములేక, తడిమి = ఆక్రమించి, అంబరమున్ = ఆకాశమును, జాతరుషాత్ములు = పుట్టినకోపము గలవారు, కపినిశాచరముఖ్యులు = వానరులందు రాక్షసులందు ముఖ్యులగువారు నిర్ఘాత = పిడుగులతో, సమ = సమానమైన, ప్రహారములన్ = దెబ్బలచే, ఘాత మొనర్పఁగన్ = చంపఁగా.

తాత్పర్యము

అతఁడు వచ్చుచుండుటఁజూచి వానరు లాకాశము పగులునట్లు నిర్భయముగాఁ గేకలు వైచుచు వారిపైఁబడి భయంకరయుద్ధము చేయఁగా వానర రాక్షసులలో ముఖ్యులగువారు కోపించినవారై యొకరి నొకరు పిడుగులవంటి దెబ్బలు గొట్టి చంపఁబూనిరి.

కం. చివ్వున బువ్వున రాలును, జివ్వలవలె వచ్చు శితవి ♦ శిఖములు దగులన్
జివ్వను నెగిరెడిమిడుఁగురు, లవ్వేళం జూపఱకు మ♦హాద్భుత మిడియెన్.

అర్థములు. చివ్వలవలె = ఆకాశబాణమనెడి యొకానొక మందుగొట్టము, శిత విశిఖములు = వాఁడి బాణములు, చివ్వను = యుద్ధమందు.

తాత్పర్యము

ఆ యుద్ధమందు రాక్షసులు ప్రయోగించిన బాణములకు వానరులు చివ్వున బువ్వున రాలు తగులఁగా నెగయుచున్న మిణుఁగురులు చూచువారికి నాశ్చర్యము గలిగించుచుండెను.

సీ. ఉపలద్రుమంబులు ♦ విపులకాలాయస, సాధనంబును దాఁక ♦ జరిగు రవము
సరభసంబుగఁ జాఱు♦స్యందనంబుల నేమి, చయముల నుదయించు♦చప్పుడులును
భేరీమృదంగశం ♦ ఖారింఖణధ్వనుల్, జ్యాలతాటంకార ♦ శబ్దములును
గరులబృంహితములు ♦ హరుల హేషారవం, బులును గాల్బలముల♦బొబ్బరింత

ఆ. లట్టహాసములును ♦ నన్యోన్యతాడన, నాదములును సమితి♦వాదములును
గరము లప్పళింత♦బెరసి యయ్యెగు వాఁగుఁ, జెవులుపగిలె గుండె♦చెదరఁజేసె.

అర్థములు. ఉపలద్రుమంబులు = ఱాలు, చెట్లు, విపుల కాలాయస సాధనంబును = విశాలమైన యినుప కట్టాయుధములను, సరభసంబుగన్ = వేగముగ

స్యందనంబుల=తేర్లయొక్క, నేమి చయముల = రథచక్రముల కమ్ములసమూహముల, ఆరింఖణ=అధికమైన, జ్యాలతా = తీఁగవంటి యల్లెత్రాడుల, బృంహితములు—ఘీంకారములు. హేషారవంబులు=సకిలింపు ధ్వనులు, బొబ్బరింతలు = సింహనాదములు- అట్టహాసములు—పెద్దనవ్వులు, సమితి=యుద్ధమందు, కరములు= చేతులు, అప్పళింతలు=తట్టుటలు.

తాత్పర్యము

వానరులు వేసిన తాలు చెట్లు రాక్షసుల యొక్క యుధములకుఁ దగులఁగాఁ బుట్టిన ధ్వనులు, వేగముగఁబోవు తేరుల చక్రముల కమ్ములు నేలకు రాచుకొనుటచేఁ గలిగిన ధ్వనులు, నగారాలు, మద్దెలలు, శంఖములు వీని యధిక ధ్వనులు, అల్లెత్రాడుల టంకారములు, ఏనుఁగుల ఘీంకారములు, గుఱ్ఱముల సకిలింపులు, పదాతుల సింహనాదములు, పెద్దనవ్వులు, ఒకరినొకరు కొట్టుకొనఁగాఁ గలిగిన ధ్వనులు, యుద్ధవీరుల వాదముల ధ్వనులు, భుజములు తట్టుకొనుటచేఁ గలిగిన ధ్వనులు కలిసి రెండుపక్షముల వారికి చెవుడు గలిగించి గుండెలు చెదరఁ జేసెను.

కం. అసురులు కొందఱు సాధన, విసరంబులఁ గపుల నొంప • వృక్షాటవరుల్
కసిపూని ద్రుమములం గొని, పస మాపిరి శత్రు సైన్య•భటవర్గములన్. ॥౨౩

అర్థములు. విసరంబులన్ = సమూహములచే, కసి=పగ, ద్రుమంబులం గొని = చెట్లను దీసికొని, పస = సారము

తాత్పర్యము

రాక్షసులు కొంద ఱాయుధ సమూహములచే వానరుల నొప్పింప వానరులు వారిని చెట్లతోఁ గొట్టి బలహీనులఁ జేసిరి.

ఉ. అయ్యెడ బాహుయుద్ధము మ • హాద్భుతభంగిఁ జెలంగ వానరుల్
చయ్యనఁ గాలుసేతులను • జానుల ముష్టుల నొంపఁ జొచ్చినన్
గుయ్యిడఁ జొచ్చె నాశరుల • కూటువఁ వారలపాటుఁ గాంచి మ
బ్బొయ్యన సూర్మ్యభంగి రథ • ముద్ధతిమైఁ బఱపెన్ మదాంధుఁ డై. ॥౨౪

అర్థములు. జానులన్ = మోఁకాళ్ళచే, కూటువ=సమూహము, మదాంధుఁడై = గర్వముచేఁ గన్నులు తెలియనివాఁడై.

తాత్పర్యము

ఆ సమయమందు రాక్షస వానరులకు చేతులు చేతులు కలసిన యుద్ధము మిగుల నాశ్చర్యముగా జరిగెను, అందు వానరులు రాక్షసులను వేగముగ కాళ్ళచేఁ జేతులచే మోఁకాళ్ళచే పిడికిళ్ళచే మర్దింపఁగా రాక్షసులసమూహము సహింపలేక కూఁతలుపెట్టసాగెను. వారలకష్టముచూచి వజ్రదంష్ట్రుఁడు బలగర్వముచేఁగన్నులు గానక మేఘ ముఱుమునట్లు వానరుల మీఁదికిఁ దన రథము తోలించెను.

తే. వజ్రదంష్ట్రుండు దుర్వార • బాణజాల, వృష్టిఁ బరఁగించి వానర•వీరవరులఁ
గనుపుగొట్టుచుఁ ద్రిజగతీ•కల్పసమయ, పాశహస్తకసమవర్తి•పగిదిఁదిరిగె.

అర్థములు. కనుపు గొట్టుచున్ = తుండించుచు, త్రిజగతీ...సమవర్తి పగిది=మూఁడు లోకముల ప్రలయసమయమున పాశమును ధరించిన యమునివలె.

తాత్పర్యము స్పష్టము.

చ. వెఱ పొకయింత లేక యరి•వీరబలంబులలోని కుద్ధతిం
బఱపి రథంబు జ్యాలతిక • బంధుర మై మొరయంగ బాణము
ల్దెఱపియు లేక యుండ నవ•లీల నిగుడ్చుచుఁ గ్రోఁతిమూఁకలన్
నఱకుచుఁ బాఱఁదోలుచు వి•నాశముఁ జేయుచుఁ జేవఁ జూపినన్. ౧౧౧౭

అర్థములు. జ్యాలతిక = తీఁగవంటి యల్లెత్రాడు, బంధురమై = విశేషముగ, మొరయంగన్=ధ్వనింపఁగా, తెఱపి=సందు, చేవ=పరాక్రమము.

తాత్పర్యము

కొంచెమైనను భయములేక శత్రువులగు వీరుల సేనలోనికి తేరుపోనిచ్చి యల్లెత్రాడు విశేషముగ ధ్వనించుచుండ విరామములేక బాణముల నవలీలగాఁ బ్రయోగించుచు క్రోఁతిగుంపుల నఱకుచుఁ దఱుముచు వినాశముచేయుచుఁ బరాక్రమము చూపఁగా.

**—• అంగదుఁడు శత్రుసేనపై విజృంభించుట •—**

ఉ. ఆతనిప్రాపునం గెరలి • యాశరవర్గ మనర్గళక్రమ
స్ఫీతమహాస్త్రధారలను • జెండెఁ బ్రచండగతిం బ్లవంగమ
వ్రాతము, దానికిం గనలి • వాలిసుతుండు యుగాంతహేతిమ
ద్భాతిని మండుచుం గదియఁ•బాఱె నుదగ్రమహీజహస్తుఁడై. ౧౧౧౮

అర్థములు. కెరలి = విజృంభించి, ఆశరవర్గము = రాక్షససమూహము, అనర్గళక్రమస్ఫీత = అడ్డములేని సంచారముచే నధికమైన, మహాస్త్రధారలను = గొప్ప యస్త్రముల వర్షముచే, ప్లవంగమవ్రాతమున్ = వానర సమూహమును, కనలి = కోపించి, యుగాంత = మహాయుగముల కడపటి, హేతిమద్భాతిని = అగ్నివలె, కదియన్=సమీపించునట్లు, ఉదగ్రమహీజహస్తుఁడై = భయంకరమైన వృక్షమును చేతఁ గలవాఁడై.

తాత్పర్యము

వాని యాశ్రయమున రాక్షస సమూహము విజృంభించి యడ్డములేని విధముగ నస్త్రపరంపరలను వర్షమువలెఁ గురియించి వానర సమూహములను నఱకెను. అదిచూచి కోపించి యంగదుఁడు ప్రలయకాలాగ్నివలె మండిపడుచు చేత నొక పెద్ద చెట్టు తీసికొని వానిని సమీపించెను.

శా. శాఖా ద్రిప్పు చదృశ్యుఁడై బలజవ ♦ ప్రావీణ్యముల్ దోఁపఁ గం
భాణస్యందన కేతుసూతయుతర ♦ క్షస్సైన్యసంఘంబు సం
క్షీణం బై చెడఁ గృత్తభూజములమా ♦ డ్కీన్ ఛిన్నమూర్ధాంగగీ
ర్వాణారుల్ ధర వ్రాల విక్రమకళా ♦ రంభైక సంరంభుఁ డై. ౧౧౧౪

అర్థములు. శాఖా ద్రిప్పుచు = ఆ చెట్టునే శాఖాకట్టె త్రిప్పువిధముగఁ ద్రిప్పుచు, బలజవప్రావీణ్యముల్=బలముయొక్కయు వేగముయొక్కయు నేర్పు, కంభాణ = గుఱ్ఱములతోను, స్యందన = తేర్లతోను, కేతు = ధ్వజములతోను, సూత=సారథులతోను, యుత = కూడిన, రక్షస్సైన్యసంఘంబు = రాక్షస సేనా సమూహము, సంక్షీణంబై=మిగుల నశించినదై, కృత్తభూజముల మాడ్కిన్ = నఱకఁబడిన చెట్లవలె, ఛిన్న=ఛేదింపఁబడిన, మూర్ధాంగ=తలలు అవయవములు గల, గీర్వాణారుల్ = దేవ విరోధులు = రాక్షసులు, విక్రమకళా = పరాక్రమ విద్యను జూపుటయందు తొందరగలవాఁడై.

తాత్పర్యము

తన బలవేగముల సామర్థ్యము కనబడునట్లు శాఖాకట్టెను ద్రిప్పునట్లా చెట్టును ద్రిప్పుచు ఆ వేగమునఁ గానరాక దానితో గుఱ్ఱములు,రథములు,కేతువులు సారథులు గల రాక్షససైన్యమును క్షయించి చెడఁగా నఱకఁబడిన చెట్లవలె ఛేదింపఁబడిన తలలు నవయవములు గల రాక్షసులు నేలఁబడఁగా తన పరాక్రమము చూపుటయందుఁ దొందరఁ గలవాఁడై.

కం. ఎక్కడఁ జూచిన రుధిరం, బెక్కడఁ జూచిన శవంబు ♦ లెక్కడఁ గనినన్
రక్కసుల మేనితుండెము, లెక్కడ శస్త్రముల తునక ♦ లెసఁగెంచె ననిన్.

అర్థములు. అనిన్=యుద్ధమందు, మేని తుండెములు = దేహముల తునకలు, శవంబులు=పీనుఁగులు.

తాత్పర్యము స్పష్టము

కం. హారంబులతో మణికే,యూరంబులతోడ నంబ ♦ రోత్కరములతో
సారతరశస్త్రితతితో, శారదనిశవోలె వెలిఁగె ♦ సమరాంగణమున్. ౧౧౨౦

అర్థములు. మణికేయూరంబులతోడ = రత్నములు చెక్కిన భుజకీర్తులతో అంబర+ఉత్కరములతో=వస్త్రసమూహముతో, సారతర = మిగుల దృఢమైన, శస్త్రితతితో=శస్త్రముల సమూహములతో,శారదనిశవోలెన్=శరత్కాలరాత్రి వలె; హారాదులకు - నక్షత్రములకు, అంబరములకు- మేఘములకు నుపమానము.

తాత్పర్యము స్పష్టము.

కం. క్షుద్రమృగంబులఁ జూచిన, రుద్రాణీవాహనంబు ♦ రూపున భృకశా
రోద్రేకస్ఫూర్తిని గపి, రౌద్రంబుగ రూపు మాపె ♦ రాక్షసకోటిన్. ౧౧౨౧

అర్థములు. క్షుద్రమృగంబులు=అల్పమృగములు, నక్కలు మొదలైనవి,

రుద్రాణీ వాహనము=పార్వతి వాహనము-సింహము, భృశ=అధికమైన, శౌర్యోద్రేకస్ఫూర్తిని=శౌర్యాతిశయము మిక్కుటమగుటచే, కపి=అంగదుఁడు.

తా త్ప ర్య ము

అల్పమృగములఁ జూచిన సింహమువలె నధికమైన శౌర్యాతిశయముచే నంగదుఁడు భయంకరముగ రాక్షసులను ధ్వంసముచేసెను.

—♦ ౫౮-వ సర్గము. వానరులు వజ్రదంష్ట్రుసేనలఁ బోరిగొనుట ♦—

సీ. అంగదుఁ డిట్టుల ♦ భంగురవిక్రమ, మెసఁగ శాత్రవసేనఁ ♦ గసిమసంగ
నుగ్రప్రభంజను ♦ నుద్ధతి కోర్వక, విరియు మబ్బులమాడ్కి ♦ విచ్చుసేనఁ
గని వజ్రదంష్ట్రుండు ♦ కసలి శత్రుకాశని, సమనిస్వనం బైన ♦ జ్యారవంబు
చెవులు గొల్లఁగ మహా ♦ శీవిషసంకాశ, నారాచవర్షంబు ♦ ఘోరభంగిఁ

ఆ. గుఁరిసి మిగిలివచ్చు ♦ క్రోఁతుల నాఁగినఁ, దేఱి రాత్రిచరులు ♦ దివ్యశస్త్ర
సమితిఁ గీశయోధ♦సంఘంబుపైఁ జిమ్మి, యుబ్బఁణంప దండి ♦ నిబ్బరమున.

అర్థములు. అభంగుర విక్రమము=క్షయింపని పరాక్రమము, ఎసఁగన్ = అతిశయింపఁగా, కసిమసంగన్ = ఖండింపఁగా, ఉగ్రప్రభంజను=తీవ్రమైనగాలియొక్క, ఉద్ధతికిన్ = దెబ్బకు, విరియు=చెదరిపోవు, కసలి=కోపించి, శత్రుకాశని = పిడుగుతో, సమ = సమానమైన, నిస్వనంబైన = ధ్వనిగల, జ్యారవంబు = అల్లెత్రాటిమ్రోఁత, మహాశీవిష=గొప్పపాములతో, సంకాశ=సమానమైన, నారాచవర్షంబు = బాణములవాన, ఆఁగినన్ = అడ్డగింపఁగా, తేఱి = తెప్పతెల్లుకొని, ఉబ్బు = గర్వము - పొంగు.

తా త్ప ర్య ము

ఈప్రకార మంగదుఁడు బుజావైన పరాక్రమ మతిశయింపఁగా విరోధిసేనను జంపఁగా దీవ్రమైన సుడిగాలి దెబ్బకు విచ్చు మేఘములవలెఁ జెదరిపోవుచున్న సేనను జూచి వజ్రదంష్ట్రుఁడు కోపించి పిడుగు పడునప్పుడు కలుగు ధ్వనివంటి ధ్వనిగలుగునట్టు లల్లెత్రాడు మీటి, వినువారికి చెవుడుగలిగించి, పాముల వర్షమువలె బాణవర్షము గురిసి పైపడివచ్చుచున్న వానరసేన నడ్డగించిన నంతలోఁ దేఱుకొని రాక్షసులు దివ్యశస్త్రసమూహమును వానరసేనపైఁ జిమ్మిపొంగణఁగింపఁగా మిగుల నిబ్బరమున.

కం. వేలకొలందుల సాధన, జాలంబుల సోఁకుమూఁక ♦ సందీక వడిన్
శైలాటయోధముఖ్యుల, పై లీలన్ విసరి విసరి ♦ పస మాపంగన్. ౧౧-౨౩

అర్థములు. సోఁకుమూఁక = రాక్షస సమూహము, శైలాట యోధ ముఖ్యులపై=వానర యోధులందు ముఖ్యులగు వారిమీఁద, పస=సత్తువ.

తా త్ప ర్య ము స్పష్టము.

కం. చేయుంగల కీశులు గ్రా,వాయుధులై కోయటంచు ♦ నాస్పుచ గుములై
యా యామినీచరేంద్రుల, కాయంబుల నలియ నడిచి♦కాలునిగూర్పన్. ౧౧-౨౮

చేయఁగల=సామర్థ్యముగల, కీశులు=వానరులు, గ్రావాయుధులై = పెద్ద బండలు గుండ్లు ఆయుధములుగాఁ గలవారై, అడిచి=కొట్టి, కాలునిఁ గూర్పన్= చంపఁగా.

తాత్పర్యము స్పష్టము.

సీ. గుట్టలై రాలిన • కుణపరాసుల నెక్కి, తోడేళ్ళు లాడి య • స్తోకరతిని
చిట్టలుగా రేఁగి • యట్టలగుమి మూఁగి, గొండిలి సల్పెఁ బ్ర • చండభంగి
నందిపొందినవార • లందఱతోఁ గడు, పార గ్రద్దలు విందు • లారగించె
నల్ల యేఱులఁ బుల్లె • మొల్లంపుఁ దెప్పల, నిక్కుచు నూరేఁగ • నక్కపిండు

తే. వాయసంబులు మింటఁ గా • వాచరించెఁ, గాకగృధ్రంబులకుఁ బెద్ద • కలహమయ్యె
నపుడు భూతభయావకం • బైనరీతిఁ, బరిఢవిల్లెను నాసుర • ప్లవగరణము. ॥ ౨౫

అర్థములు. కుణపరాసులు = పీనుఁగుల ప్రోవులు, రాశి, ఏక, బహు, రాసులు. అస్తోకరీతిని = అధిక ప్రేమతో, చిట్టలుగా = ఆశ్చర్యకరముగ, అట్టల గుమిన్= మొండెముల రాసులందు, రేఁగి=విజృంభించి, గొండలి=నాట్యము, అంది పొందినవారలు=దూరపు బంధువులు, నల్లయేఱులన్ =నెత్తుటి ప్రవాహములందు, కావా=గుండ్రముగాఁ దిరుగుట, పరిఢవిల్లెను=అతిశయించెను.

తాత్పర్యము

గుట్టలవలెఁ బడిన పీనుఁగుల కుప్పలమీఁద నెక్కి తోడేళ్ళు పరమ ప్రీతితోఁ నెక్కి యాడుకొని యాశ్చర్యకరముగా విజృంభించి మొండెముల గుంపునకై ముసురుకొని తీవ్రముగా నాట్యము సలిపెను. గ్రద్దలు తమ దూరపు బంధువులను గూడఁ బిలుచుకొని కడుపునిండ విందులారగించెను. నెత్తురు నదులలోఁ బుల్లెలను తెప్పలమీఁద నక్కలు గరువముతో నూరేఁగెను. కాకు లాకాశంబున గుండ్రముగాఁ దిరిగెను. ఈ పీనుఁగు నాదనిన నాది యని కాకులకు గ్రద్దలకు పెద్దజగడము జరిగెను. అప్పుడు వానర రాక్షసయుద్ధము భూతములకు భయము గలిగించెను.

## —• వజ్రదంష్ట్రుఁడు వానరసేనపై విజృంభించుట •—

కం. పగులుతలలఁ దెగడు మొలల, న్నొగులు మెయుల్ తునుఁగుచేతు • లుం బాధములై
తగులు శరంబుల నెసఁగిన, నెగులునఁ జెడి పడిరి యామి • నీచరకీశుల్. ॥ ౨౬

అర్థములు. నొగులు=నొప్పిచెందిన, మెయుల్ = శరీరములు, నెగులున= బాధచే, యామినీచరకీశుల్ = రాక్షసులు, వానరులు.

తాత్పర్యము

పగులుచున్న తలలు, తెగుచున్న నడుములు, నొప్పిచెందుచున్న దేహములు, తునిఁగి పడుచున్న చేతులు కాళ్ళు కలిగి తగులుచున్న బాణములచే నతిశయించిన బాధవలనఁ జెడి రాక్షసులు వానరులు పడిరి.

ఉ. చండతరప్రతాపి కపి•సైన్యముచేఁ దమవార లందఱున్
గండఱి తూలి తాఁ గన వి•శావికలై చనుచుండ వజ్రదం
ష్ట్రుండు శరాసనంబుఁ గొని • రోషసముజ్జ్వలభీకరప్రతీ
కుం డయి వానరుల్ బెదరఁ • గ్రూరగతిం బరఁగించె నమ్ములన్. ౧౧-౩౭

అర్థములు. చండతరప్రతాపి=మిగుల తీక్ష్ణమైనప్రతాపముగల, గండు+అఱి=శౌరుషముచెడి, తూలి = పడి, విశావికలై = చెల్లాచెదరై, రోష = కోపముచే, సముజ్జ్వల = ప్రకాశించు, భీకర = భయంకరమైన, ప్రతీకుండయి = దేహము గలవాఁడై. తాత్పర్యము

తీవ్రమైన ప్రతాపము గల వానరసేనచేత తమవారు శౌరుషముచెడి, కొందఱుపడి, కొందఱు చెల్లాచెదరై, పోవుచుండఁగాఁ జూచి వజ్రదంష్ట్రుఁడు విల్లుతీసికొని కోపముచే మండుచున్న దేహముగలవాఁడై వానరులు భయపడునట్లు బాణములఁ బ్రయోగించెను.

శా. వ్యూహంబుల్ కలఁగంగఁ బాఱ నరదం•బుం దోలుచున్ సంగరో
త్సాహం బిన్మడిగా నిశాతవిశిఖా•సారంబునం గీశరా
డ్దేహంబు ల్తుటుమాడుచున్ నఱకుచున్ • దృష్టింప దుర్లక్ష్యుఁడై
బాహాటోపముఁ జూపె నాహవకళా•పాండిత్యముం జాటుచున్. ౧౧-౩౮

అర్థములు. వ్యూహంబుల్ = సేనలు గుంపులుగూడినతీరు, కలఁగంగఁ బాఱన్ = కలఁతచెందునట్లు, ఇన్మడి = రెట్టింపు, నిశాత = పదునైన, విశిఖ + ఆసారంబునన్ = బాణవర్షముచే, తుటుమాడుచున్ = తుటుముగాఁ జేయుచు, సన్నసన్న తునుకలుగాఁ జేయుచు, దుర్లక్ష్యుఁడై =లక్షింపరానివాఁడై, ఆహవ కళా = యుద్ధవిద్యయందలి, పాండిత్యము = జ్ఞానాతిశయము.

సేనలకూర్పు చెదరిపోవునట్లు రథమును నానాదిక్కులఁదోలుచు యుద్ధమందలి యుత్సాహము రెండింతలుగాఁగా వాఁడి బాణముల వర్షముచే వానర ముఖ్యుల దేహములు పొడిపొడిగా నఱుకుచు తేఱిచూడరానివాఁడై తన యుద్ధమందలి పాండిత్యము ప్రకటించుచు భుజబలముఁ జూపెను.

కం. తక్కక క్రోధావేశం, బెక్కఁగ నేవురును నేద్యు•రెనమంద్రుగఁ దా
నొక్కొకనారాచంబున,నక్కపులను గుదులు గ్రుచ్చి•యామికఁ బాపెన్.

అర్థములు. గుదులు గ్రుచ్చి = ఒకరివెంట నొకరిని వరుసగా పుల్లలకు పూలు గ్రుచ్చినట్లు గ్రుచ్చి, ఆమిక = అహంకారము.

తాత్పర్యము స్పష్టము.

కం. ఒఱగు మెడల్ విఱుగుదొడల్, నఱకుడువడు కాళ్ళు నగుచు•నగచరవర్యుల్
విఱిగి చని వాలితనయుని, మఱుఁగునఁ జొరఁబాఱి రపుడు•మలచపు వెఱచేన్.

అర్థములు. మలదపువెఱ=అధికమైన భయము, మఱుఁగునఁజొఁబాఱిరి= చాటునకుఁ బోయిరి, శరణుజొచ్చిరి.

తాత్పర్యము స్పష్టము.

—• వజ్రదంష్ట్రుఁ డంగదుతోఁ బోరి చచ్చుట •—

ఉ. త్రస్తుల నాత్మయోధులను • దారతనూజుఁడు గాంచి కిన్కమై
మస్తక మూఁచి చూపులనె • మానవభోజి దహించునట్టిఁడై
శస్తజవంబునన్ హరి గ•జంబుపయిం బడుమాడ్కి దూఁకి య
భ్యస్త సమస్తజన్యవిధుఁ • డంకిలి లే కొక్క గ్రుద్దు గ్రుద్దినన్. ౧౧౩౧

అర్థములు. త్రస్తులన్ = భయపడినవారిని, మస్తకము = తల, ఊఁచి= ఊఁగులాడించి, శస్త = ప్రశంసింపఁదగిన, జవంబునన్ = వేగముచే, అభ్యస్త= అభ్యాసము చేయఁబడిన, సమస్త=అన్నివిధములైన, జన్యవిధుఁడు=యుద్ధవిధములు గలవాఁడు, అంకిలి=అడ్డము=భయము.

తాత్పర్యము

భయపడిన తనయోధులను జూచి కోపించి తల యూఁగులాడించి చూపుల చేతనే రాక్షసుని దహించువానివలెనై పొగడ్త కెక్కిన వేగమున నంగదుఁ డేనుఁగు మీఁదఁబడు సింహమువలె వానిమీఁద దూఁకి యన్ని యుద్ధవిధముల నలవాటుపడిన యతఁడు భయపడక వాని నొక గ్రుద్దు గ్రుద్దెను.

కం. తోమరసంఘాతంబుల సామజమును గ్రుమ్మ్నగతి ని•శాచరుఁ డలుకన్
భీమశరసహస్రముల సు•త్రామజసుతు మేను సలిపె•రక్తమయముగన్. ౧౧౩౨

అర్థములు. తోమర=చిల్లకోలల, సంఘాతంబులన్ = సమూహములచే, సామజమును=ఏనుఁగును, గ్రుమ్మ్నగతి=పొడుచునట్లు, సుత్రామజసుతు = ఇంద్రుని కొడుకగు వాలిపుత్రుని, రక్తమయముగన్=నెత్తుటితో నిండునట్లు.

తాత్పర్యము

చిల్లకోలల సమూహముచే నేనుఁగును బొడుచునట్లు రాక్షసుఁడు కోపముతో భయంకరములైన యనేక బాణములచే నంగదుని దేహము నెత్తుటితో నిండునట్లు చేసెను.

ఉ. ఇవ్విధి బాణవర్షము న•హీనగతిం గురియించి మర్మముల్
నొవ్వఁగఁజేయ శక్రజత•నూభవుఁ డొక్కవిశాలసాలము
ద్రువ్వున పీఁచి వైవఁ గని • నూల్కొని లీల సురారి భూజమున్
గ్రొవ్వున నింత లింతలుగఁ • గూల్చె ధరం బడ శౌర్యసంపదన్. ౧౧౩౩

అర్థములు. విశాలసాలము = పెద్దచెట్టు, నొవ్వఁగన్=బాధ కలుగునట్లు, నూల్కొని=పురిగొని, లీలన్=అనాయాసముగా.

తాత్పర్యము

ఈ ప్రకారము విశేషముగ బాణవర్షము కురియించి ప్రాణస్థానములను బాధింపఁగా నంగదుఁ డొక పెద్దచెట్టును ఱువ్వని విసరివేయఁగా రాక్షసుఁడు పుఱికొని యవలీలగా నా చెట్టును చిన్న చిన్న తునకలై పడునట్లు నఱకెను.

ఉ. ఆశరువిక్రమంబు తెలఁ ♦ గంతయుఁ గన్గొని శైల మొండు వే
కీశవరుండు గైకొని ప♦కీలున వైచె ససింహనాదుఁడై
లేశముఁ గొంక కాతఁ డవ♦లీల గదం గొని దిగ్గదాఁటెనన్
నాశముఁ జేసె భూధ్రము క్ష♦ణంబునఁ దేరి సచక్రవాజిగన్. ౧౧౩౪

అర్థములు. ఆశరు=రాక్షసుని, పకీలున=వేయునప్పటి ధ్వన్యనుకరణము, భూధ్రము=కొండ, సచక్రవాజిగన్=చక్రములతో గుఱ్ఱములతో.

తాత్పర్యము

రాక్షసుని పరాక్రమము విధమంతయుఁ జూచి పర్వత మొక్కటి తీసికొని సింహనాదముచేసి పకీలున వానిపై వైవఁగా వాఁడు దానిని కొంచెమైన జంకక గదతీసికొని తటాలున తేరిమీఁదినుండి క్రిందికి దాఁటెను. ఆ పర్వతము చక్రములతో గుఱ్ఱములతోఁ దేరిని నాశము చేసెను.

కం. వెండియును వాలినందనుఁ డొండొక తరుయుక్తభూధ్ర ♦ ముద్ధతి విసరన్
గండలు గ్రక్కుచు పడ్డె,త్స్యండు ధరన్ వాలె గదను♦నూఁతగఁ గొనుచున్.

అర్థములు. తరుయుక్తభూధ్రము = చెట్లతోడి కొండను, ఊఁతగన్ = ఆధారముగ.

తాత్పర్యము

అంతలోఁ బోనీయక యంగదుఁడు చెట్లతోడ నున్న పర్వతమును నొక దానిని విసరి రాక్షసుని మీఁద వైవఁగా వాఁడు దాని తాఁకున నెత్తురు కండలు గ్రక్కుచు భూమిమీఁద తెలివితప్పి గద నాధారముచేసికొని పడెను.

తే. ఊర్పుచును వ్రాలి యొకక్షణం♦బుండి లబ్ధ, సంజ్ఞుఁడై లేచి కదిసిన♦శక్రపౌత్రు
ఱొమ్ములక్షించి బిట్టుగఁ♦గ్రుమ్మటయును, వాలితనయుండు వగ్గదఁ♦బాఱఁజిమ్మె.

అర్థములు. ఊర్పుచును = పెద్ద శ్వాస విడుచుచు, లబ్ధసంజ్ఞుఁడై=స్మృతి పొందినవాఁడై, కదిసిన=సమీపించిన, లక్షించి=గుఱిచూచి.

తాత్పర్యము

ఎగఁబోసికొనుచుఁ గొంచెము సేపు పడియుండి స్మృతి తెచ్చుకొని లేచి తన్ను సమీపించిన యంగదుని ఱొమ్ముగుఱిచూచి గదచేఁ బొడువఁగా నంగదుఁడు దానిని గుంజుకొని దూరముగఁ బాఱవైచెను.

కం. భీమబలాఢ్యులు దెగి ము,ష్టీముష్టిరణంబు సేయ ♦ ఢీకొన నన్యో
న్యామితఘాతములను ను,ద్దామంబగు రక్తధారఁ ♦ దడిసె న్మేనుల్. ౧౧౩౬

అర్థములు. భీమబలాఢ్యులు = భయంకరమైన బలముయొక్క సంపద గలవారు, ముష్టీముష్టిరణంబు=పిడికిళ్ళతో యుద్ధము, పిడికిటఁ గొట్టినవానిని మరల పిడికిట గొట్టుట ముష్టీముష్టిరణము - వ్యతిహారబహువ్రీహి. చూ. మందరము ౭౧౧ ప-కిష్కింధ. అన్యోన్య + అమిత + ఘాతములను = ఒకరినొకరు మితిలేక కొట్టుటచేత, ఉద్దామము = అధికము.

తాత్పర్యము

భయంకరబలముచే నధికులగు నంగద వజ్రదంష్ట్రులు సాహసించి పిడికిళ్ళతో నొకరి నొకరు పలుమారు కొట్టుకొనఁగా నా దెబ్బలచే వారి దేహము నెత్తుటఁ దడిసెను.

కం. అంగారక బుధు లనఁగాఁ, జెంగక రక్షఃప్లవంగ • శేఖరు లలుకన్
భంగముపడక భరంపడి, కంగా రొనరింప సందు • గని ప్లవగుండున్. ౧౧౩౭

అర్థములు. వెంగక = ఓడిపోక, రక్షఃప్లవంగశేఖరులు=రాక్షస వానర శ్రేష్ఠులు, అలుకన్ = కోపముతో, భంగముపడక=ఓడిపోక, భరంపడి = అతి కష్టముతో, కంగారు=యుద్ధము, సందు=అవకాశము.

తాత్పర్యము

రాక్షస వానర శ్రేష్ఠులు అంగారక బుధ గ్రహములవలె వెనుదీయక, యోడిపోక కష్టముపై యుద్ధము చేయునెడఁ గొంచెము సందు దొరకఁగా నంగదుఁడు,

చ. అవిరళపుష్పభారసము • దంచితభూమిరుహంబు నైచినన్
దివిజవిరోధి ఖడ్గనిహతిం • దెగ వ్రేయఁగ జూచి యార్షభం
బవు ఫలకంబు గజ్జియల • నందము మీఱు కృపాణముం గొనెన్
బ్లవగవరుండు దైత్యుఁడు కృ • పాణము డాలును గొంచుఁ దాఁకెనన్. ౧౧౩౮

అర్థములు. అవిరళ=దట్టమైన, పుష్పభార = పూవుల యతిశయముచే, సముదంచిత = ప్రకాశించుచున్న. భూమిరుహంబు = చెట్టును, ఆర్షభము = ఎద్దు చర్మముతోఁ జేయఁబడిన, ఫలకంబు=డాలు, కృపాణము=కత్తి.

తాత్పర్యము

బాగుగ పూచిన చెట్టు నొకదానిని దీసివేయఁగా రాక్షసుఁడు దానిని కత్తితో నఱికివైచెను. అదిచూచి యందే పడియుండిన ఎద్దుచర్మముతోఁ జేయఁబడిన డాలు, గజ్జెలు వేసిన కత్తి నంగదుఁడు తీసికొనఁగా రాక్షసుఁడు నల్లె డాలు, తరవారి తీసికొనెను.

కం. జయకాంక్ష నిద్దఱును ని,ర్దయచిత్తత నేటు నోటు • దాఁటును బలమున్
రయముం జూపుచు నొండొరు, భయపడక యుదగ్రవృత్తిఁ • బడ నడువంగన్.

అర్థములు. నిర్దయచిత్తతన్=దయలేని మనస్సులతో.

తాత్పర్యము స్పష్టము.

ఉ. పోటులగంట్ల నెత్తుటను • బూచిన మోదుగుచెట్లఁబోలి యా
మేటిమగల్ శ్రమం బడక • మేదిని జానుల నూఁది నిల్చు చో
ప్రేటునఁ బాముపోలె నెన • రేగి కపీంద్రుఁడు దాఁటి మీఁదికిన్
బోటనబంతినా నసురు • భూరి శిరంబును ఖడ్గధారచేన్. ౧౧౮౨

అర్థములు. పోటులగంట్ల = దెబ్బలవలన నైన గాయముల, జానుల = మోఁకాళ్ళను, ఊఁది = నేలకుమోపి, ప్రేటునన్ = దెబ్బకొట్టఁగా, ఎసరేఁగి = విజృంభించి, పోటనబంతి=పుట్టచెండు, పోటు+బంతి=సంధియందు వర్ణాగమము.

తాత్పర్యము

పిడికిటి పోటులవలననైన గాయముల వెంటఁగారు నెత్తుటిచేఁ దడిసి పూచిన మోదుగచెట్లవలెనై యా శూరులు మిగులఁ బ్రయాసముతో నేలపై మోఁకాళ్ళూది నిల్చునపుడు దెబ్బతినిన పాము లేచునట్లు తటాలున నంగదుఁడు రాక్షసుని మీఁదికి దూఁకి పుట్టచెండును జిమ్మువానివలె వాని శిరస్సు కత్తిధారచేత.

కం ఖండించుటయున్ రోషో,చ్చండిత గిరగిరను దిరుగు • చక్షులతోడన్
నిండారు నెత్తురులతో, మొండెంబును విడిచి ద్రెళ్ళె మూర్ధము త్రుటిలోన్.

అర్థములు. రోషోచ్చండత = కోపాతిశయముచే.

తాత్పర్యము

నఱుకఁగా కోపాతిశయముచే గిరగిర తిరుగుచున్న కన్నులతో నిండిన నెత్తుటితో మొండెమును విడిచి తల నేలపై నిమిషములోఁ బడెను.

ఉ అంతకుపాలికిం దమబ•లాధిపుఁ డేగిన రక్కసుల్ భయా
క్రాంతమనంబులన్ నగచ•రప్రవరుల్ దఱుమంగ లంకకున్
స్వాంతము పల్లటిల్లఁ జని • రంగట నంగదుఁ డెల్ల వానరుల్
పొంతలఁ గొల్వ నొప్పె సుర • పుంజసమర్చిత శక్రుకైవడిన్. ౧౧౮౩

అర్థములు. అంతకు పాలికిన్ = యమునియొద్దకు, బలాధిపుఁడు = సేనానాయకుఁడు, భయ + ఆక్రాంతమనంబులన్=భయముచే నాక్రమింపఁబడిన మనస్సులచే, నగచర ప్రవరుల్=వానర శ్రేష్ఠులు, స్వాంతము=మనస్సు, పల్లటిల్లన్= తత్తఱ పడఁగా, సురపుంజ సమర్చిత — దేవ సమూహముచేఁ బూజింపఁబడిన, శక్రుకైవడిన్=ఇంద్రునివలె.

తాత్పర్యము

తమ సేనానాయకుఁడు మరణింపఁగా రాక్షసులు భయపడి తమ్ము వానరులు తఱుముకొని రాఁగా మనస్సు తత్తఱపడ లంకలోనికిఁ బరువెత్తిరి. అంతట నంగదుని వానరులెల్ల గౌరవించిరి.

**—• ౫౯-వ సర్గము. అకంపనుఁడు యుద్ధమునకుఁ బోవుట •—**

సీ. వాలిపుత్రునిచేత • వజ్రదంష్ట్రుండు జన్యంబునఁ గూలుట • యాలకించి
యమరారిభర్త ప్ర•హస్తుతో దుర్దమ, శౌర్యధుర్యులను రా•క్షసులఁ గూర్చి

పంపు మకంపనుఁ ♦ బ్రథనార్థ మీతఁడు, సర్వశస్త్రాస్త్ర వి ♦ శారదుండు
సమరసమ్మతుఁడు శా ♦ స్తయుగో ప్తనేతయు,మద్భూతికాముండు ♦ మహితబలుఁడు
తే. ఈతఁడు జయింపఁజాలు న ♦ రేంద్రవాన, రేంద్రుల నటన్న నాతఁ డ ♦ హీనసేన
భీమదర్శనరాక్షస ♦ స్తోమ మొనరఁ, గోలుతలు సేసి యిచ్చె న ♦ కుంఠగతిని.

అర్థములు. జన్యంబునన్ = యుద్ధమందు, దుర్ధమ=అణఁపరాని, శౌర్య ధుర్యులను = శౌర్యాతిశయముగలవారిని, ప్రథనార్థము=యుద్ధముకొఱకు, సమర సమ్మతుండు = యుద్ధమునందుఁ బ్రసిద్ధుఁడు, శాస్త=శత్రువుల శిక్షించువాఁడు, గోప్త=తన సైన్యమును రక్షించువాఁడు, నేత=సేనకునాయకుఁడుగానుండి నడపఁ గలవాఁడు, మత్+భూతి+కాముండు = నా యైశ్వర్యము కోరువాఁడు, మహిత బలుఁడు=గొప్పబలముగలవాఁడు, అహీనసేన=గొప్పదండు, భీమదర్శన=భయము కలిగించు చూపులుగల, కోలుతలు సేసి=యుద్ధమునకు సిద్ధపఱిచి, అకుంఠగతిని = లోపములేని విధముగ.

తాత్పర్యము

అంగదునిచే వజ్రదంష్ట్రుఁడు చచ్చె నని విని రావణుఁడు ప్రహస్తునితో నిట్లనియె. మిగుల శౌర్యవంతు లగు రాక్షసులఁ గూర్చి యుద్ధముకొఱ కీ యకంపనుఁ బంపుము. ఇతఁడు సర్వశస్త్రాస్త్రములు తెలిసినవాఁడు, యుద్ధమునందుఁ బ్రశస్తి గన్నవాఁడు, తన సేనను రక్షించుచుఁ బరులసేనను శిక్షించుచు సేనను నడపఁగల వాఁడు, నామేలు కోరువాఁడు, గొప్పబలము గలవాఁడు, ఇతఁడు రామలక్ష్మణుల సుగ్రీవుని జయింపఁజాలును-అనిన నతఁడు గొప్పసేనను యుద్ధమునకు సిద్ధముచేసి యతన్ని స్వాధీన పఱిచెను.

చ. కలన నిలింపకోటికి న ♦ కంపనుఁ డౌట నకంపనప్రథన్
కెలఁగెడివాఁడు నీరదరు ♦ చిన్ జలదార్భటి నొప్పువాఁడు మే
ల్పసిఁడిబసిండిపోగుల వి ♦ లాసమువాఁడు మహారథంబుపైఁ
బొలిచె సరోజబాంధవుఁడు ♦ పుట్టుమలన్ వెలుగొందుచంద మై. ౧౧౮౫

అర్థములు. నిలింపకోటికిన్ = దేవతా సమూహమునకు, అకంపనుఁడు= చలింపనివాఁడు, అకంపనప్రథన్ = అకంపనుఁ డను కీర్తిని, నీరదరుచిన్=మేఘ కాంతితో, జలదార్భటిన్ = మేఘధ్వనితో, సరోజ బాంధవుఁడు — సూర్యుఁడు, పుట్టుమలన్ = తూర్పుకొండయందు.

తాత్పర్యము

యుద్ధమందు దేవతలైనను గదలింపలేరు కావున అకంపనుఁ డని ప్రసిద్ధి వహించెను. మేఘకాంతి మేఘధ్వని కలవాఁడు. బంగారు పోగుల విలాసము గల వాఁడు.ఇట్టివాఁడు తూర్పుకొండమీఁదసూర్యునివలె రథంబుమీఁదఁగూర్చుండెను.

సీ. ఈరీతి నరుగుచోఁ • దేరిగుఱ్ఱంబులు, నిర్నిమిత్తంబుగ • నేల ౙ్రొగ్గె
డాకన్ను చలియించె • డగ్గుత్తిక జనించె, వదనసీమను విన్నఁ•బాటు దోఁచెఁ
బ్రతికూలవాయువు•భయదమై వీచె దు,ర్దినముగాఁ దోఁచె సు•దినమ యయ్యె
ఖగమృగంబులు నించె • ఖరతరస్వరములు, శార్దూలబలుఁ డవి • సరకుఁగొనక
ఆ. కలని కుత్సహించె • బలలాశిసైన్యంబు, లబ్ధి క్షోభ మొంద • నార్భటింప
నులికి కీశసేన • యుర్వీరుహాద్రుల, సిద్ధపఱచి నిలిచె • యుద్ధమునకు. ౧౧౪౬

అర్థములు. ౙ్రొగ్గెన్ = ౙ్రాలెను, డాకన్ను=ఎడమకన్ను, డగ్గుత్తిక = గొంతు తడఁబడుట, ఖరతరస్వరములు=మిగుల కఠినధ్వనులు, దుర్దినము=మేఘములచేఁ గప్పఁబడిన దినము, సుదినము=ఎండ కాయుచున్న దినము, ధూమ్రాక్షుఁడు యుద్ధమునకు వెలువడినప్పుడు నిశీథమని చెప్పఁబడెను. ఇప్పుడు సుదిన మనుటచే నిది పగటియుద్ధము కావున ఫాల్గుణ బహుళ దశమి యని యేర్పడు చున్నది. శార్దూలబలుఁడు = పులిబలమంత బలము గలవాఁడు, కలనికిన్ = యుద్ధమునకు, బలలాశిసైన్యంబు = రాక్షససేన, అబ్ధి = సముద్రము, క్షోభము = కలఁత, ఉలికి = భయపడి.

తా త్ప ర్య ము

ఈ విధముగఁ బోవునపుడు కారణములేకయే తేరిగుఱ్ఱములు మోఁకాళ్ళమీఁద ముందఱికిఁబడెను. వానికి నెడమకన్నదరెను. మాట తడఁబడెను. ముఖము తెల్లఁబాఱెను. ఎదురుగాలి భయంకరముగ వీచెను. మబ్బులులేని దినమయ్యు మబ్బుక్రమ్మినట్టులుండెను. పక్షులు మృగములు పరుషధ్వను లొనగించెను. వ్యాఘ్రబలుఁడు గావున బలముదంబున వానిని లక్ష్యపెట్టక యుద్ధమునకుఁ బోవు నుత్సాహము గలవాఁడయ్యె. రాక్షస సైన్యంబు సముద్రము కలఁతచెందునట్లు సింహనాదములు చేసెను. దానికి వానరసేన యులికిపడి చెట్లు కొండలు సిద్ధపఱచికొని యుద్ధమునకై సిద్ధపడియుండె.

చ. ఉభయచమూసమూహముల • కుగ్రసమీక మనేక భంగి నై
రభస మొనర్పఁ జెల్లునెడ • రామదశాస్యజయార్థమై కపుల్
బుధపరిపంథులుం దనువు • లీయఁ గడంగి పరస్పరంబు దో
ర్విభవ మొనర్పఁ దాఁచిరి యు • రీణపరాక్రమ ముల్లసిల్లఁగన్. ౧౧౪౭

అర్థములు. ఉభయచమూ సమూహములకున్=రెండుదండుల గుంపునకు, ఉగ్రసమీకము=భయంకర యుద్ధము, రభసము = త్వర, అనేకభంగి = నానా విధములు, రామజయార్థమై + దశాస్య జయార్థమై=రామదశాస్య జయార్థమై = రాముఁడు గెలుచుకొఱకు రావణుఁడు గెలుచుకొఱకు, బుధపరిపంథులు = దేవ విరోధులు, రాక్షసులు-'ఆదితేయాబుధా వోఽస్వప్నా'యని యమరము. తనువులు= దేహములు, క్రమాలంకారము-రామార్థము కపులు-దశాస్యార్థము రాక్షసులు - దోర్విభవము = భుజబల సంపద, తాఁచిరి = కొట్టిరి, ఉరీణ = వంకరగాని.

తాత్పర్యము

రెండు సేనలవారికి భయంకర యుద్ధము నానావిధములుగా జరుగునపుడు రామునకు జయముగోరి వానరులు, రావణునకు గెలుపుకోరి రాక్షసులు తమ దేహములు వదలిపెట్టఁబూని ప్రాణములపై నాశవదలి భుజబలముకొలఁది యొకరి నొకరు పరాక్రమాతిశయమునఁ గొట్టిరి.

సీ. వారల తర్జన•భర్త్సనగర్జలు, బధిరత్వ మొందించె • భటులకెల్ల
నొక్కచో నరుణవ•ర్ణోపమానరజంబు, పదిదిక్కులందును • బ్రాఁకఁదొడఁగె
నొకచోటఁ బదఘట్ట•నోద్ధూతధూళులు, చీఁకుల గావించె • సేనవారి
వాజివర్మంబును • ధ్వజము పతాకయుఁ, దేరను భేదంబు • తెలియరాదు
తే. రూపమొక్కఁడుదోఁప కా•టోపజనిత,వికటసంరావమొక్కండ•వినఁగఁబర్వె
రాక్షసులు కొట్టనాగిరి • రాక్షసులనె, ప్లవగవర్యులు ద్రుంచిరి • ప్లవగవరుల.

అర్థములు. తర్జనభర్త్సన గర్జలు=అదలింపులు బెదరింపులు గల కేకలు, బధిరత్వము = చెవుడు, అరుణవర్ణ = అరుణుని కాంతితో, ఉపమాన = సమానమైన, రజంబు=ధూళి పదఘట్టన = కాలి త్రొక్కుడులచే, ఉద్ధూత = ఎగురఁ గొట్టఁబడిన, ధూళులు = దుమ్ములు, చీఁకులన్=గ్రుడ్డివారిని, వాజివర్మము = ఇది గుఱ్ఱము, ఇది కవచము, ధ్వజము=చిత్రము వ్రాసిన టెక్కెము, పతాక=చిత్తరువు వ్రాయని టెక్కెము, వాజివర్మము = 'ద్వంద్వశ్చ ప్రాణి తూర్యసేనాంగానామ్' పాణిని- ౨-౪-౨. ప్రకారము ఏకవచనము. తోఁపక=కానరాక, ఆటోపజనిత= సంభ్రమమువలనఁ గలిగిన, వికట=భయంకరమగు, సంరావము-ధ్వని.

తాత్పర్యము

వారియొక్క యదలింపుమాటలు బెదరింపుమాటలు సింహనాదములు భటులకుఁ జెవుడు కలిగించెను. ఒక్కచో నెఱ్ఱని దుమ్ము పది దిక్కులందును వ్యాపించెను. ఒక్కచోట పాదముల త్రొక్కుడుచే లేచిన దుమ్ము సేనలవారిని గ్రుడ్డివారిని జేసెను. ఏది గుఱ్ఱమో, యేది కవచమో, యేది ధ్వజమో, యేది పతాకమో, యేది తేరో తెలియదయ్యెను. రూపమేదియుఁ గానరాలేదు. కాని వారి భయంకర ధ్వనులుమాత్రము వినవచ్చుచుండెను. రాక్షసులు రాక్షసులనే కొట్టిరి, వానరులు వానరులనే కొట్టిరి. ఏల ఇట్లు జరిగె నన,

కం. తనవార లెదిరివా రని, మనమున గుర్తింపరాక • మహాంధమునన్
తనవారి నెదిరివారిని, దునిమి రుభయయోధవరులు•దుములపుటనిలోన్.

అర్థములు. మహాంధమునన్ = దట్టమైన చీఁకటియందు, 'విసేత్రేంధ స్త్రిషు ధ్వాంతే క్లీబే'-నా.నా.ర. అంధశబ్దము గ్రుడ్డివానికిఁ జీఁకటికిని పేరు. తుములపుటనిలోన్=దొమ్మియుద్ధమందు.

తాత్పర్యము

దుమ్ము నిండుటచేఁ గ్రమ్మిన దట్టపుఁ జీఁకటియందు వీరు తన వారని వారు శత్రువు లని గుర్తింప సాధ్యము కాని కారణమున వీరు వారు తమవారినే చంపిరి. ఎదుటి వారిని దొమ్మి యుద్ధమందు జంపిరి. చేతికి నెవఁడు దొరికిన వాఁడే శత్రువని చంపిరి.

తే. అస్రధారాప్రవాహంబు • లమిత మగుడు
 ధూమ్రరజము రూపు మాయఁగఁ • గాన వచ్చెఁ
 గుణపశతములుఁ జచ్చిన • గుఱ్ఱములును
 రాసులై నేలఁ వ్రాలిన • వేసడములు. ౧౧౫౦

అర్థములు. అస్రధారా ప్రవాహము=నెత్తుటిధారలవెల్లువ, ధూమ్రరజము=భూమిదుమ్ము, కుణపశతములు=నూర్లకొలఁది పీనుఁగులు; వేసడములు = కంచర గాడిదలు.

తాత్పర్యము

నెత్తురు ప్రవాహముగఁ బాఱుటచే నేల దుమ్మణఁగుట వలన నూర్లకొలఁదులు పీనుఁగులు, చచ్చిన గుఱ్ఱములు, కుప్పలుగా నేలఁబడిన కంచరగాడిదలు కానవచ్చెను.

కం. ద్రుమముల శక్తి శిలాప్రాసముల గదాపరిఘపట్టిసంబులఁ గపియూ
 థము రాక్షసయూథంబును, సమరం బొనరించె నసమ•సాహసలీలన్ ౧౧౫౧

అర్థములు. ద్రుమములన్ = చెట్లచేతను, అసమ = అసమానమైన, సాహస లీలన్ = తెంపుతో.

తాత్పర్యము స్పష్టము.

కం. నఖములఁ బ్లవగులు నొంపని, శిఖముల రాక్షసులు ద్రుంపఁ•జేతులఁ గ్రోతుల్
 ముఖములఁ జింప శితశిలీ ముఖములచేఁ ద్రెంచి రసుర•ముఖ్యులు వానిన్.

అర్థములు. నఖములన్=గోళ్ళచే, ప్లవగులు=వానరులు, విశిఖములన్ = బాణములచేత, శిత=వాఁడియగు, శిలీముఖములచే=బాణములచే.

తాత్పర్యము

గోళ్ళను వానరులు నొప్పించిరి. బాణములచే రాక్షసులు శత్రువులఁ ద్రుంచిరి. వానరులు చేతులచే రాక్షసుల ముఖములు చింపిరి. వానిని కఱకు బాణములచే రాక్షసులు ఖండించిరి.

కం. అప్పు డకంపన చోదిత, మ పలభుక్సమితి గపుల • నడలఁగఁ జేయన్
 గుప్పలు తా ల్గురియించుచుఁ, గప్పిరి వృక్షాటవరులు•గండడఁగంగన్.

అర్థములు. అకంపన చోదిత=అకంపనునిచేఁ బ్రేరింపఁబడిన, పలభుక్ + సమితి = మాంసము దిను రాక్షసుల సమూహము, అడలఁగన్ = ఏడ్చునట్లు, కుప్పలు = కుప్పలుగా, వృక్షాటవరులు = వానరశ్రేష్ఠులు, గండు = పౌరుషము,

తాత్పర్యము

అప్పు డకంపనుఁడు ప్రేరింపఁగా ఆ రాక్షససమూహము వానరులను దుఃఖింపఁజేయఁగా వానరులు కుప్పలుగా తాలు గురియించుచు వారి పౌరుష మడఁగునట్లు కప్పిరి.

కం. చెట్టుల గుట్టల తాలం, గొట్టుచుఁ బైకుతికి భ్రాంతి ♦ గొలుపుచు వారల్
పట్టినయాయుధములబిగి, పట్టున లాగికొని వారి♦వసుధం గూల్చన్. ౧౧౫౪

అర్థములు. బిగిపట్టున — గట్టిగఁ బట్టుటచే, లాగికొని=గుంజుకొని, వాని చేతనే - వారిన్ = రాక్షసులను.

తాత్పర్యము స్పష్టము.

తే. ఇంతలో వారలకు బాస ♦ టెగుడెంచి, నలుఁడు కుముదుండు
మైందుండు ♦ బలియుఁడైన
ద్వివిదుఁడును వృక్షముల నరి♦వీరసమితిఁ, బిన్నపెంటలు చేసిరి♦భీమగతిని. ౧౧౫౫

అర్థములు. బాసట = తోడు, అరివీరసమితిన్ = వీరులను శత్రువుల సమూహమును.

తాత్పర్యము స్పష్టము.

—♦ ౫౬-వ సర్గము. అకంపనుఁడు వానరసేనపైఁ గవియుట ♦—

మ. సమదప్రక్రియ వైరియోధులు భుజా♦సంరంభశుంభద్గతిన్
దమవారిన్ వధియించి మించుటయుఁ గ్రో♦ధస్ఫారతామ్రాక్షుఁడై
విమతప్రాణవినాశకారి ధనువున్ ♦ వేత్రిప్పుచున్ దీవ్ర వే
గమునం దోలుము సారథీ! మన శతాం♦గంబున్ బరుల్ బెగ్గిలన్. ౧౧౫౬

అర్థములు. సమదప్రక్రియన్ = గర్వముతోఁ గూడిన విధముగ, భుజా సంరంభ శుంభద్గతిన్=భుజముల వేగిరపాటుతోఁ బ్రకాశించెడివిధముతో, తమ వారిన్ = రాక్షసులను, సంబంధార్థమున బహువచనము. క్రోధస్ఫారతామ్రాక్షుఁడై = కోపాతిశయముచే నెఱ్ఱనైన కన్నులు గలవాఁడై, విమత = శత్రువుల, ప్రాణవినాశకారి = ప్రాణముల నాశముచేయునది యగు, ధనువున్=వింటిని, శతాంగంబున్ = రథమును.

తాత్పర్యము

గర్వముతోఁ గూడినవిధముగ శత్రుయోధులు భుజబలాటోపముచేఁ దమ వారిని జంపుటచూచి కోపముచేఁ గన్ను లెఱ్ఱచేసి శత్రువుల ప్రాణము దీయఁజాలు ధనుస్సును తీవ్రముగాఁ ద్రిప్పుచు సారథీ! యతి వేగముగా మన తేరిని శత్రువులు భయపడునట్లు తోలుము.

ఉ. అల్లదె కీశనాథు లసు ♦ రాళి బడల్పడఁ ద్రుంచుచున్నవా
రల్లతలంబుఁ జేరఁ జను ♦ మా యట శైలమహీజసాధనుల్

పెల్లుగ నున్నవారు కపి♦వీరులు యుద్ధము వేచి, వారలం
జిల్లులు వాఱఁ ద్రుంపఁ దమి♦నేసెదఁ జూపఱ గుండె దిగ్గనన్. ౧౧౫౮

అర్థములు. అల్లదె = అదిగో, బడల్పడన్ = బాధ పడునట్లు, అల్ల తలంబు = ఆ ప్రదేశము, శైలమహీజసాధనుల్ = కొండలు చెట్లు ఆయుధములుగాఁగలవారు, చిల్లులు వాఱన్ = తొఱ్ఱలు పడునట్లు, తమినేసెదన్=ఆశపడెదను, చూపఱ=చూచువారి యొక్క.

తాత్పర్యము

అదిగో, వానరులు రాక్షసులను బాధపడఁ జంపుచున్నారు. అక్కడకు మన తేరు పోనిమ్ము. అచ్చట చెట్లు గుట్టలు నాయుధములుగా గ్రహించి యుద్ధమునకై కాచి వానర వీరులు విశేషించి యున్నవారు. చూచువార భయపడునట్లు వారి దేహములు తూంట్లుపడఁ జేయఁ గోరిక యగుచున్నది.

చం. అనవుడు సూతుఁ డట్ల తన♦స్యందన ముద్ధతిఁ దోలఁగా నకం
పనుఁడును దీవ్రబాణచయ♦పాతపురస్సరుఁ డౌచు వారిపైఁ
జని నరఘూవితానముల ♦ చందమునన్ బరగించి శస్త్రముల్
వనచరపాళి మూర్తమున ♦ లావఱ తూలఁగ నేసి యార్చెనన్. ౧౧౫౯

అర్థములు. స్యందనము = తేరు, తీవ్రబాణచయపాత = తీక్ష్ణబాణ సమూహములు పడుటను, పురస్సరుఁడు=ముందుగాఁగలవాఁడు, నరఘూవితానముల=తేనెటీఁగల గుంపుల, లావఱ=బలము క్షీణించి.

తాత్పర్యము

ఇట్లు చెప్పఁగా సారథి తేరిని త్వరగాఁ దోలఁగా నకంపనుఁడు తనకంటె ముందు తన తీవ్రబాణములు పోవునట్లుగా వారిపైకిఁ బోవుచు తేనెటీఁగల గుంపు ముసురు కొన్నట్లుగ శస్త్రములను వానరులపైఁ బ్రయోగించి వారిబలము సణఁచి యార్చెను.

క. ఆతనికోల్తలకుం గా, కాతతదరమునను వీఁగు♦నగచరవరులన్
వాతాత్మజుండు గని యా, దైతేయున కెదుట నిలిచె ♦ దర్పమెలర్పన్.

అర్థములు. కోల్తలకున్=ఎదుట నిలిచి యుద్ధము సేయుటకు, కాక=శక్తి లేక, ఆతత దరమునను=విస్తార భీతిచే, వీఁగు = వెనుదీయు.

తాత్పర్యము

అతని యెదుట నిలఁబడి యుద్ధము చేయ శక్తి లేక వెనుకకుఁ బోవు వానర శ్రేష్ఠులఁజూచి హనుమంతుఁ డా రాక్షసుని యెదుట గర్వమతిశయింపఁగానిలిచెను. అకంపనుఁడే ద్వారమునబయలు దేఱివచ్చినదిముందు చెప్పఁబడలేదు. ౧౧౫౯వపద్యమున నలకుముద మైందద్వివిదులు యుద్ధము చేసినట్లు చెప్పఁబడెను. వీరుతూర్పు గవని సరికట్టినవారు. అయినను నొక ద్వారమున నొక రాక్షసుఁడు బయలుదేరినపుడు

తక్కిన ద్వారములఁ గాచు వానరులకుఁ బనియుండదు. కావున నాయకులగు వారెచ్చటఁబనిబడిన నచ్చటికిఁ బోవుచుండి రని తోఁచెడిని.

—♦ హనుమంతునిచే నకంపనుఁడు హతుం డగుట ♦—

కం. హనుమంతుని ప్రాపును గని, వనచర యూథాధినాథ ♦ వర్గము మోదం
బునఁ బొదలి బలము గొని క్రందనము లెసఁగ వైరిసేనఁ ♦ దాఁకెంగినుకన్.

అర్థములు. క్రందనములు = సింహనాదములు.

తాత్పర్యము

హనుమంతుఁడు తోడుపడిన కారణమున నాయనను ఆశ్రయించి వానర యూథములందు శ్రేష్ఠులగువారు సంతోషించి సింహనాదములు చేయుచు వైరుల సేనను నెదిరించెను.

మ. తన ప్రోలం బవమానసూనుఁడు మహీ ♦ ధ్రప్రక్రియన్ నిల్చినన్
జనితామర్షకుఁ డయ్యకంపనుఁడు ప ♦ ర్జన్యుండు ధారావళిన్
మునుఁగం జేయుగతిన్ శరావళులచే ♦ ముంచెం దదాసార మే
పున నార్షభ్యము వాన పై దొరఁగఁ గొ♦మ్ముల్ వంచుచందంబుగన్.

అర్థములు. మహీధ్రప్రక్రియన్ = కొండవలె—జనితామర్షకుఁడు = కోప ముదయించినవాఁడు - పర్జన్యుఁడు = వర్షాధిదేవత — ధారావళిన్ = వర్షధారల గుంపులచే - శరావళులచే = బాణ సమూహములచే - తత్ + ఆసారము = ఆ వానను - ఆర్షభ్యము = ఆఁబోతు.

తాత్పర్యము

తన యెదుటఁ గొండవలె నిలువఁబడిన హనుమంతునిఁ జూచి కోపించి యకంపనుఁడు వానదేవత జడివాన గురియించునట్లు బాణవర్షమాయనపైఁ గురియఁగా వాన చినుకులు తనపైఁ బడఁగా మదించిన కోడె కొమ్ములు ప్రక్కకు వంచినట్లుగ.

కం. శిర మొక్కయోర ప్రాలిచి, సరకు గొనక వానిచక్కి ♦ సమదగజంబుం
బురిడించుచు నుద్రేకిత, నెరవడి జన రక్కసుండు ♦ నివ్వెర గొనుచున్. ౧౧౬-౩

అర్థములు. ఒక్కయోర=ఒకప్రక్కగా, వాని చక్కి=వాఁడున్న చోటికిఁ జక్కఁగా, సమదగజంబున్ = మదపుటేనుఁగును, పురిడించుచున్ = పోలుచు, పురుడు + ఇంచు = ఇత్వంబుగాని యెత్వంబుగాని కూడుచో ననార్యంబయిన యుత్వంబున కిత్వంబగు, సం. వ్యా. క్రియ. ౯౬ సూ. నెరవడిన్ = అధిక వేగముగ, నెరవు + వడి = నెరవడి - యిది యుభయ రేఫములలోఁ జేరినది - నివ్వెర గొనుచున్=భ్రాంతుఁడై.

తాత్పర్యము

తల యొక ప్రక్కఁగా వంచి బాణవర్షము లక్ష్యముసేయక వాఁడుండుచోటికి సరిగా మదపుటేనుఁగువలె నింగుల వేగముతోఁ బోఁగా వాఁడు దిగ్భ్రమగొని.

కం. తొలఁగి చని బాణవర్షము, నిలుపక కురియింప మందు•నీరజహితునిన్
దలఁపించుచు నా హనుమయుఁ, దలఁగక గర్జించి వానిఁ•దఱుముకొని చనెన్.

అర్థములు. నీరజహితునిన్=సూర్యుని, తలపించుచున్=స్మృతికిదెచ్చుచు-పరిపోలుచు.

తాత్పర్యము స్పష్టము.

ఉ. వెంటనె పాఱివచ్చు కపి•వీరునిపై నసురుండు వేగియై
మంటలు గ్రుమ్మరించు శిత•మార్గణముల్ పఱఁగించి నొంచినన్
గంటున సాధనం బెదియుఁ • గైకొనకుంట దలంచి పాఁతుతో
నంటఁగఁ బీఁకి శైల మొక•హస్తమునం గొని బొబ్బ పెట్టుచున్. ౧౧౬౪

అర్థములు. శితమార్గణముల్ =వాఁడి బాణములు, కంటున =పగచే.

తాత్పర్యము

తాను దొలఁగి పోయినను దనవెంటనె పరువెత్తి వచ్చుచున్న వానరుని మీఁద నకంపనుఁడు మిగుల వేగము గలవాఁడై మంటలు చిమ్ముచున్న వాఁడి బాణములు ప్రయోగించి పగపూని నొప్పింపఁగా చేత నేదియు సాధనము లేకుండుట యాలోచించి యొక కొండను పాఁతుతోఁ బీఁకి దాని నొక చేతఁదీసికొని సింహనాదము చేయుచు.

కం. గిఱ్ఱున ద్రిప్పుచు నముచిన్. వజ్రకరుఁడై మున్ను త్రిదశ•పతి దరిమిన యా
క్క్రరణి నకంపనుఁ దఱుమఁగ, సురవైరియు దాని జూచి•సూటి మెఱయఁగన్.

అర్థములు. వజ్రకరుఁడై =వజ్రమును జేత ధరించినవాఁడై, త్రిదశపతి = ఇంద్రుఁడు.

తాత్పర్యము స్పష్టము.

చం. కఱకగు నర్ధచంద్ర•విశిఖంబుల దవ్వననుండియే గిరిం
దుఱుఁ మొనరింపఁ గేసరిత•నూభవుడుం దనకొండ మింటనే
నఱు మయిపోవ గన్గొని ఘు•నం బగు కిన్కను నశ్వకర్ణమున్
బిఱబిఱ వేరుతోఁ బెఱికి•వేగమ యెత్తి హసించి త్రిప్పుచున్. ౧౧౬౬

అర్థములు. కఱకు = పదును - అర్ధచంద్రవిశిఖంబునన్ = అర్ధచంద్రుని యాకారముగల బాణములచే - దవ్వన = దూరమునందు - తుఱుము=పొడి - నఱుము=చూర్ణము-అశ్వకర్ణము=ఇనుమద్దిచెట్టు-హసించి=నవ్వి.

తాత్పర్యము

పదునైన యర్థచంద్రబాణములచే దూరమున నుండియే యా కొండను పొడి చేయఁగా హనుమంతుఁడు తానెత్తినకొండ యాకాశమందే చూర్ణమైపోవుట చూచి మిగులఁగోపించి యొక్క యినుమద్దిచెట్టును వ్రేళ్ళతోఁ బెఱికి నవ్వుచు దానిని గిరగిర ద్రిప్పుచు.

మ. పదఘాతంబుల భూమి కంపిల భటా • శ్వస్యందనవ్యూహమున్
రది సంఘాతము నుగ్గునూచముగ రా • (గ్రస్ఫూర్తిఁ దున్మాడుచున్
బెదరం జాతేఁ గృతాంతుఁ గన్న పగిదిన్ • విద్వేషి సైన్యంబు దు
ర్మదుఁడై చాపకళా ప్రవీణత రహిం • పన్ రాక్షసాధీశుఁడున్.

అర్థములు. పద ఘాతంబులన్ = కాలి దెబ్బలచే-కంపిలన్ = చలింపఁగా-భట-అశ్వ-స్యందన వ్యూహమున్ = భటులయు గుఱ్ఱములయు తేరులయు సమూహమును-రది = ఏనుఁగుల - సంఘాతము = సమూహము - తున్మాడుచున్ = ఖండింపఁగా - కృతాంతున్ = యముని - విద్వేషి సైన్యంబు = వైరుల సేన - దుర్మదుఁడై = చెడ్డ మదము గలవాఁడై, చాపకళా ప్రవీణతన్ = ధనుర్విద్యా పాండిత్యముచే.

తాత్పర్యము

కాలి త్రొక్కుడు దెబ్బల చేతనే భూమి చలించుచుండఁగా భటులను గుఱ్ఱములను రథములను ఏనుఁగులను పొడిపొడిగ ఖండింపఁగా, శత్రువుల సేన యమునిఁ జూచినట్లు భయపడి పరుగెత్తెను. అప్పుడు దుష్టమగు గర్వముగలవాఁడై యకంపనుఁడు తన విలువిద్యయందలి నేర్పు ప్రకాశింపఁగా.

ఉ. సాలము ద్రుంచివైచి శర • జాలవ్రణీకృత దేహుఁ జేసినన్
గాలిసుతుండు నెత్తురులు • గారుశరీరముతో విధూమన
జ్జ్వాలకృశానునట్లు సుమ • సంచయరంజితకింశుకాగముం
బోలి సమగ్రసత్వమున • భూరుహ మన్యము పట్టి త్రిప్పుచున్. ౧౧౬౭

అర్థములు. సాలమున్ = చెట్లను, శరజాల వ్రణీకృత దేహున్ = బాణ సమూహములచే వ్రణముగాఁ జేయఁబడిన శరీరము కలవానిఁగా, విధూమ = పొగ లేని, సజ్వాల = శిఖలతోఁ గూడిన, కృశాను నట్లు = అగ్నివలె, సుమసంచయ = పూలగుంపుచే, రంజిత = ఎఱ్ఱనైన, కింశుకాగమున్ = మోదుగుచెట్టును, సమగ్ర సత్త్వమునన్ = పూర్ణబలమున, బలముకొలఁది, భూరుహము = చెట్టు, అన్యము = వేఱొకటి.

తాత్పర్యము

చెట్టును ఖండించి బాణసమూహముచే గాయపడిన దేహము కలవానిఁగాఁ జేయఁగా హనుమంతుఁడు నెత్తురు కారు దేహముతో పొగలేని శిఖలు గల యగ్నివలె మండుచుఁ బూలచే నెఱ్ఱనైన మోదుగుచెట్టువలెనై బలము కొలఁది వేఱొకచెట్టు పీకి త్రిప్పుచు.

చ. పరులకు దుర్నిరీక్ష్యుఁ డయి • బాధరుషాపరిపూర్ణచిత్తుఁడై
కరముల రెంట బిట్టుగ న • కంపను శీర్షము వ్రయ్య మోదినన్
సురపరిపంథి నేలపయి • సోలెను సీల్గెను దక్కురక్కసుల్
ధరణి వణంకినన్ ద్రుమవి • తానము లట్టులు వ్రాలి దర్వెపై. ౧౧౬౮

అర్థములు. దుర్నిరీక్ష్యుఁడయి = కానరానివాఁడై, బాధరుషాపరిపూర్ణ చిత్తుఁడై=అధిక కోపముతో నిండిన మనస్సుగలవాఁడై, రెండు చేతులతోఁ గట్టిగ నకంపను తల పగులునట్లు కొట్టఁగా ఆ రాక్షసుఁడు నేలపయి పడి చచ్చెను. తక్కిన రాక్షసులు భూకంపమునందు చెట్లవలె నేలపైఁ బడిరి.

తాత్పర్యము

గమనవేగముచే నితరులకుఁ గానరాక అధికకోపముచే నిండిన మనస్సు గలవాఁడై రెండు చేతుల గట్టిగ నకంపను తల వ్రక్కలగునట్లు కొట్టఁగా నా దేవ విరోధి నేలపయి పడిచచ్చెను. తక్కిన రాక్షసులు భూకంపమునఁ జెట్లు నేలఁబడి నట్లు పడిరి.

సీ. మోదరసావేశ•మునఁ గపుల్ దఱుమంగ, సంభ్రాంతచిత్తులై•చావుభీతి
విరిదలల్ దడఁబడు•చరణంబులకు గల్గి, త్రోఁద్రోపులుగఁ బడఁ•ద్రోసికొనుచు
నొండొరులను మీఱి•యుఱికిరి లంకకు, వెనుప్రక్క మఱిమఱి • కనుచునంత
హరిసమూహంబులు•హనుమంతు శ్లాఘించె, నిరుపమబలుఁడవు•నీవ యనుచుఁ
తే. వతఁడు ప్రతివాక్యముల వారి•నాదరించె,మీరు దోడ్పడ నాకేది•మేరయనుచుఁ
బ్లవగులును బొంగి యూపిరి•పట్టునంత,బిగ్గ కేకలు వైచిరి•ప్రియము చెలఁగ.

అర్థములు. మోదరసావేశమునన్ = సంతోషరసముయొక్క యావేశముచే, సంభ్రాంత చిత్తులై=మిగుల భ్రమ చెందిన మనస్సు గలవారై.

తాత్పర్యము

సంతోషరసము తమపై నావేశించుటచేఁ గపులు వెంటఁబడి తఱుమఁగా దిక్కు తెలియక మతిచెడినవారై రాక్షసులు తలలు విరియఁబోసికొని కాళ్లు తడఁబడుచుండ నొకరి నొకరు త్రోసికొనుచు నొకఱిని మీఱి మఱియొకరు వానరులు వచ్చుచున్నారేమో యని భయమునఁ దిరిగి తిరిగి చూచుచు లంకలోనికిఁ బరువెత్తిరి. అప్పుడు వానరులు హనుమంతుని నీవే యసమానబలుఁడ వని పొగడిరి. ఆయనయు మీరు సహాయులై యుండ నాకేది యసాధ్యమని వారలకు బదులు చెప్పి వారల శ్లాఘించెను. వానరులు సంతోషించి యూపిరిపట్టగూడినంత పట్టి గట్టిగాఁ గేకలు వేసిరి.

కం. కొఱకొఱ ప్రాణంబులతో, గుటగుట మను గొంతులోని•గుటకలతో స
త్తఱ నుండిన రాక్షసులన్, బఱ బఱ వెస నీడ్చి పాఱ•వైచిరి కీశుల్. ౧౧౭౧

తాత్పర్యము స్పష్టము.

చ. బలియు నకంపనుం దునిమి•పావని తేజున మీఱె నద్యోదనన్
బలిని నడంచి మించు నల • వామనుభంగిని, రామలక్ష్మణుల్
వలిముఖనేతయున్ దనుజ•వల్లభుఁడున్ దివిజావళుల్ మహా
బలసుతు మేలివాక్యములఁ • బ్రస్తుతి సల్పె ముదంబు పెంపునన్. ౧౧౭౨

అర్థములు. బలియున్=బలవంతుని - వలిముఖనేత = సుగ్రీవుఁడు, దనుజవల్లభుఁడు = విభీషణుఁడు-దివిజావళుల్ - మహాబలసుతున్ - వాయుపుత్రుఁడైన హనుమంతుని-సల్పె నను క్రియకు - రామలక్ష్మణులు - వలిముఖనేత - దనుజవల్లభుఁడు, దివిజావళుల్-అనునవి కర్తృపదములు- ఇందుఁగడపటిది - క్రియకు సమీపమం దుండునది దివిజావళుల్ - అను నమహాదర్థకపదము గావున దానికి ననుసరించి క్రియసల్పెనని ప్రయోగింపఁబడెను. "కర్తలనేకంబు లున్నచోఁ గ్రియకు సమీపకర్తయొక్క లింగవచనంబులగు" - సు. వ్యా. వాక్య. ౩౭.

తాత్పర్యము

బలవంతుఁడై యకంపనుఁ జంపి హనుమంతుఁడు బలిని నణఁగఁద్రొక్కిన త్రివిక్రమునివలెఁ బ్రకాశించెను హనుమంతుఁడు చేసిన మహాకార్యమును రామలక్ష్మణులు సుగ్రీవవిభీషణులు దేవతలు మెచ్చిరి.

—♦ ౫౭-వ సర్గము. రావణుఁడు ప్రహస్తుని యుద్ధమునకుఁ బొమ్మనుట ♦—

సీ. అనిలో నకంపనుం ♦ డంతకాతిథి యగుటఁ, జనుట దశాస్యుండు♦విని రొకింత
దీనుఁడై మంత్రివి♦తానంబుతో మంత,నం బుండి యించుక ♦ నాఁటియుదయ
కాలంబునం బురిఁ ♦ గలయంగ నలువంక, యరిగి సేనలచొప్పు♦నరసి చూచి
కాపు లెస్సై యుంట♦కన్గొని కపిసేన, చుట్టు ముట్టడిగొన్న♦ప ట్టెఱింగి
తే. మన్యుపరిదగ్ధచిత్తుఁడై ♦ జన్యనిపుణు, నంతికస్థుఁ బ్రహస్తుని♦నతఁడు పలుకుఁ
గోట ముట్టడి డింపించు♦ఁబాట యొండు,కలను దక్కఁగ వేఱొండు♦గావరాదు.

అర్థములు. అనిలోన్ = యుద్ధమందు, అంతక + అతిథి = యముని కతిథియయి=చచ్చి, దీనుఁడై = వ్యసన పడినవాఁడై, వితానంబుతోన్ = సమూహముతో, మంతనంబుండి=ఆలోచించి, నలువంక = నాలుగు ప్రక్కల, అచ్చు ద్విగువు, ఏకవచనము, మన్యు=కోపముచే, పరిదగ్ధ చిత్తుఁడై = మిగుల దహింపఁబడిన మనస్సు గలవాఁడై, జన్యనిపుణున్=యుద్ధమందు నేర్పరిని, అంతికస్థున్ = సమీపమందున్న వానిని, కలను = యుద్ధము, నాఁటి యుదయకాలము = అకంపనుఁడు యుద్ధమునకుఁ బోయిన నాఁటి యుదయకాలము, అకంపనుని యుద్ధము పగటి యుద్ధము, రెండవ దినము నుదయమునఁ గాపు సరిగానున్నదో లేదో యని నాలుగు ప్రక్కలు రావణుఁడు పరీక్షించెను. ఇట్లు చేయుచుండ నకంపనుఁడు చచ్చిన వార్త వచ్చెను. అప్పుడు సమీపమందున్న ప్రహస్తునితో నిట్లు చెప్పెను.

తాత్పర్యము

యుద్ధమం దకంపనుఁడు చచ్చినవార్త రావణుఁడు విని కొంచెము వ్యసనగ్రస్తుఁడై మంత్రులతోఁ గొంచె మాలోచించి యానాఁటి యుదయమందు పట్టన మంతయు నాలుగు ప్రక్కలఁబోయి పరీక్షించి కాపు చక్కఁగా నున్నదని చూచి

కపిసేన నగరమును ముట్టడించి యున్న విధము తెలిసికొని కోపముచే దహింపఁబడు చున్న మనస్సు గలవాఁడై యుద్ధమందు సమర్థుఁడును, తన సమీపమందున్న వాఁడును నగు ప్రహస్తుని జూచి యిట్లనియె. ప్రహస్తా! యీకోట ముట్టడి వద లింప వలయు నన్న యుద్ధము తప్ప వేఱొక యుపాయము కానరాదు.

సీ. ఈ మహాభారంబు ♦ నే నొండె ననుజుండు, కుంభకర్ణుండు ని ♦ కుంభుఁ డొండె
సేనాని వగు యోధ ♦ శేఖర ! నీ వొండె, నింద్రజిత్తుం డొండె ♦ నింతగాక
యేవారు చతురులు ♦ మోవఁగఁ జెప్పుమా, దాన నీ వలసిన ♦ దానవాళిఁ
గొని యని కేఁగుము ♦ క్రోఁతులు నీ ధాటి, విన్నంత వెఱఁగొని ♦ విచ్చువారు
తే. బెదరుగొడ్డులు నవినీతు ♦ లదరుగుండె, వారు కీశులు నీ మహా♦ర్భటుల విన్న
సైచువార లే? సింహగ♦ర్జనము విన్న, వారణము లట్టు లూడనిఁ♦బాఁడువారు.

అర్థములు. చతురులు = నేర్పరులు, మోవఁగా = భరింపఁగా, అవి నీతులు = నీతిమాలినవారు, అదరుగుండెవారు = పిఱికివాండ్రు, ఊడనిఁబాడు వారు = పరుగెత్తువారు.

తాత్పర్యము

యుద్ధముచేసి జయించి వానరులఁ దఱుమఁగొట్టినఁగాని ముట్టడి పోదనుట నిజమే. ఇంత కార్యము చేయఁగలవా రెవ రనెదవా? ఇంతటి కార్యభారము నేనో నా తమ్ముఁడు కుంభకర్ణుఁడో వాని కొడుకు నికుంభుఁడో సేనానాయకుఁడవగు నీవో నా కొడుకు ఇంద్రజిత్తో యింతగాక మఱి యెవరు నీభారము మోవ సమర్థులు లేరు. కావున నీవు కావలసినంత సేన దీసికొని యుద్ధమునకుఁ బొమ్ము. నీవు వచ్చుచున్నా వని విన్నంత మాత్రముచేతనే వానరులు పరువెత్తిపోదురు. నీవు యుద్ధము చేయ వలసినపనికూడ నుండదు. ఏలన వానరులు బెదరుగొడ్డులు. నీతి తెలియనివారు. నీపేరు విన్న వారికి గుండె లదరును. పిఱికివారు వారా, నీ కంఠ ధ్వని విని సహింపఁగలవారు? సింహగర్జనము విన్న యేనుఁగులవలెఁ బరువెత్తిపోదురు. ఇవి యిచ్చకాలమాటలో, మాధ్యమో.

తే. సేన లేకున్న నేమొకో♦చేయువారు, రామసౌమిత్రు లెడలంగ ♦ రాజసంబు
దిక్కుగానక వడిచెడి♦దీను లగుచు. నీకు లోఁబడువారలు♦నిశ్చయముగ.

అర్థములు. రాజసంబు వెడలంగ = ప్రభుత్వము తొలఁగిపోఁగా, భటు లుండిన ప్రభుత్వము, వారు పోయిన నదియును బోవును.

తాత్పర్యము స్పష్టము.

చ. మరణము గల్గ నిక్కముగ♦మందిరమం దిపు డూరకుండినన్,
మరణము సందియంబు రణ ♦ మండలి గెల్తుమొ యేమొ కొంతయేన్
దొరకొనినన్ శుభంబె కద ♦ దోర్బలధుర్య! హితంబుఁ బల్కుమీ
మరణము వీట మేలో రణ ♦ మండలమందున మేలో యోధకున్ ? ౧౧౭౬

అర్థములు. దొరకొనిననన్=లభించినను- వీటన్ = ఇంట - యోధకున్ = యుద్ధశూరునకు.

తాత్పర్యము

యుద్ధములో మనమే జయింతు మని యెట్లు నిశ్చయింప వచ్చు నందువా గెలుపు రాకున్న మరణము వచ్చునుగదా! ఆ మరణము నీ వింట నుండిన నేడు గాకున్న నింకఁ గొన్నినాళ్ళకైన వచ్చును గాని రాకపోదు. లేదా శత్రువులు పైపడివచ్చి గొంతు పిసికి చంపినను జంపుదురు. యుద్ధమునకుఁ బోయితిమా మరణము సందేహము. మనమే గెలుతుమో యేమో? గెలుపు నిశ్చయము కానపుడు ఓటమి నిశ్చయము కాదు కదా, కొంత గెలుపు వచ్చినను మేలే కదా, ఓయి బలవంతుఁడా! హితము చెప్పుము. యుద్ధశూరునకు నింట రోగముతోఁ జచ్చుటమేలా? యుద్ధమందుఁ జచ్చుట మేలా?

'యత్రాయుద్ధే ధ్రువో మృత్యు, ర్యుద్ధే జీవితసంశయః
తమేవ కాలం యుద్ధస్య, ప్రవదంతి మనీషిణః ॥

'ఎప్పుడు యుద్ధము చేయకున్నను చావు నిజమో యుద్ధము చేసిన సందేహమో యదియే యుద్ధమునకుఁ దగిన కాలమని బుద్ధిమంతులు చెప్పుదురు? అను వాక్యము స్మరింపనగు.

చ. అనవుడు వాహినీపతి దశాస్యునితో ననుకేంద్రుడు శుక్రునట
ట్లను నిదియెల్లఁ బూర్వమె నమగ్రులు మంత్రులు నేను యోజనం
బొనరిచినార, మేకమతముం గొనకుండుట యెల్ల వారమున్
బని చెడియెన్ వివాదమునఁ బల్కెద నా మత మాలకింపుమీ. ౧౧౭౭

అర్థములు. ఏకమతము=ఒక్క యభిప్రాయము.

తాత్పర్యము

ముట్టడించుటకు యుద్ధము తప్ప వేఱుపాయము లేదని రావణుఁ డన్న మాటకుఁ బ్రత్యుత్తరము చెప్పుచున్నాడు. ఈ ప్రకారము రావణాసురుఁడు చెప్పఁగా అసురరాజుతో శుక్రుఁడు చెప్పినట్లు ప్రహస్తుఁ డిట్లనియె. రాజా! యీ విషయము నేను, మంత్రులు, ముందే యాలోచించినారము. మాలో మాకు వాదములోఁ బని చెడెను గాని యేకాభిప్రాయమునకు వచ్చినవారముగాము. దానివలన నీకు నేను జెప్పలేదు. నేనొకఁడు చెప్పియుండిన విభీషణుగతియే నాకుఁ బ్రాప్తించియుండును గదా! నా యభిప్రాయము చెప్పెద వినుము.

కం. శ్రేయము జానకి నిచ్చుట, చేయవ పో యట్లు రణముసేయుట శుభ మం
చీ యనువున నేఁ జెప్పిన, వైయర్థ్యము గలిగె భేదవాదముచేతన్. ౧౧౭౮

అర్థములు. వైయర్థ్యము = నిష్ప్రయోజకత్వము, వ్యర్థత, భేదవాదము చేతన్=తల కొక యభిప్రాయ మిచ్చుటచే.

తాత్పర్యము

సీతను మరల నిచ్చుట శ్రేయస్కరము. మన మందఱము గలసి యీమాట నీకుఁ జెప్పుదము. అది నీవు వినకపోయిన యుద్ధము చేయుదము, అని నేను మంత్రులతోఁ జెప్పితిని. తక్కినవా రట్లు చెప్పఁగూడదు, యుద్ధమే శ్రేయస్కర మని చెప్పవలయునని వాదించిరి.

యుద్ధమే కూడదు, అందఱము కలసి నిన్ను బలవంతపెట్టియైన సీత నిచ్చు నట్లు చేయవలయునని వాదించినవాఁడు విభీషణుఁడు-సీతనిచ్చుట శ్రేయస్కరమే. అది నీకు రుచింపదేని యుద్ధము పర్యాయముగా నంగీకరింతు మనువారు మఱి కొందఱు తక్కినవారు సంధిమాట చెప్పనేరాదు, యుద్ధమే చేయవలయునని వాదించిరి. ఈవిధముగ నాయాలోచన వ్యర్థమైపోయెను. ఫలమనుభవమునకువచ్చెను.

చ. అది యటులుండ నిమ్ము వివి•ధార్థములన్ బహుమానవాక్యలన్
ముదమున దన్పి యెల్లపు డ•నూనగతిన్ నను సత్కరించి తీ
వద నిది నాకు నీ ఋణము•నంతయు దీర్పఁగ నిట్టివేళ నే
బ్రమకఁగ గోరి డాగుదునె•పార్థివ! యెంతటితీపె ప్రాణముల్ ? ౧౧౯

అర్థములు. ఇట్లు చెప్పుటచేఁ దనకు యుద్ధమునకుఁ బోవ నిష్టము లేదని రావణుఁ డభిప్రాయపడునని తలఁచి దానికిఁ బరిహారము చెప్పుచున్నాఁడు. అది= జరిగిపోయిన ముచ్చటలు. వివిధార్థములన్=అనేకవిధములైన పదార్థములచేతను, ధనములచేతను; బహుమానవాక్యలన్ = గౌరవముతోడి మాటలచేతను తన్పి= తృప్తిపొందించి - అనూనగతిన్=కొఱతలేకుండ-సత్కరించితివి = గౌరవించితివి- అదను = సమయము.

తాత్పర్యము

రాజా ! జరిగిపోయిన ముచ్చటలిపుడేల ? అది యటులుండనీ, అది యిపుడు విచారింపవలసిన సమయముగాదు. ఇప్పుడు నేనది చెప్పిన నాప్రాణమునకు వెఱచి చెప్పుచున్నానని తలంతువు. నా యభిప్రాయ మదికాదు. నీవు నాకుఁ గావలసిన పదార్థములు ధనములు నిచ్చితివి. సగౌరవ వాక్యలచేత నన్నుఁ దృప్తునిఁ జేసితివి. నన్నానావిధముల బహూకరించితివి. ఇదంతయు నీవుచేయుట నేను నీ కక్కఱవేళ నుపయోగపడుదుననియే కదా. అట్టి నీ ఋణమును నేను దీర్చుకొనుట కిది సమ యము. ఇది తప్పఁగొట్టితినేని నీ ఋణము నే నెట్లు తీర్చుకొనఁగలను ? కావున బ్రతుకుమీఁది యాశచేత నేనీ సమయమున డాఁగికొందునా ? ప్రాణములంత తీపా ? కావున నేనట్లు చేయను.

కం. పుత్రకమిత్ర కళత్ర, క్షేత్ర ధనావళుల నాశ•చేయను నీకై
గాత్రము రణసవమున నే,మాత్రము పిఱుసనక వేల్తు•మదినమ్ము వలీ. ౧౨౦

అర్థములు. గాత్రమున్ = దేహమును, రణసవమునన్ = యుద్ధ మను యజ్ఞమున, పిఱుసనక=వెనుకకుఁబోక, వేల్తున్=హోమము చేయుదును.

తాత్పర్యము

నా కొడుకులు, మిత్రులు, భార్యలు, భూములు, ధనములు వీనిని రక్షించు నిమిత్తమై నిన్ను విడువవలయునా? నీ నిమిత్తమై వారి నెల్ల విడువవలయునా? యను ప్రశ్న వచ్చినపుడు నీ నిమిత్తమై వారి నందఱ విడుతును గాని వారి నిమిత్తమై నిన్ను విడువను. యుద్ధ యజ్ఞమునందు నా దేహమును కొంచెమైన వెనుదీయక హోమము సేయుదును. నా మాట నమ్ముము.

ఇచ్చట నొక ధర్మ సందేహము.

ప్రహస్తుఁడు "నీ ధనము నేను తినియున్నాను గనుక నీకై ప్రాణమిచ్చి నీ ఋణము తీర్చుకొనెదనని చెప్పెను. భారతయుద్ధమందు దుర్యోధనుఁడు భీష్మ ద్రోణులను తన పక్షమున యుద్ధమునకు రమ్మని కోరినపుడు "మహారాజా! జను లందఱు ధనదాసులు. ధనమెవ్వరికి దాసిగాదు. నీ ధనము మేము తినియున్నాము, గనుక నీకు మేము కట్టుపడి యున్నాము. నీ పక్షమున యుద్ధము చేసెద" మని చెప్పిరి. అట్లే చేసిరి. కాని తా మధర్మపక్షమున యుద్ధము చేయుచున్నామని వారెఱుఁగుదురు. యుద్ధకాలమందుఁ బ్రతిదినము ధర్మరాజునకు జయము కలుగును గాక యని ధ్యానించియే యుద్ధమునకుఁ బోవుచుండిరి......ప్రహస్తుఁడో రావణుఁ డధర్మియై యున్నవాఁడని తెలిసియు నా విచారము పెట్టుకొనక "వాని ధర్మా ధర్మవిచారము నాకేల? అతఁడు పోషించిన దేహము అతనికిఁ బనిపడినపుడు అతని నిమిత్తమై వినియోగపెట్టుట యతని సేవకుఁడనైన నాకు ధర్మ మని తలఁచి తన ధర్మమును దాను నిర్వహించెను. రాజు చేయు పాపకార్యములకుఁ బ్రజలు సేవకు లుత్తరవాదులు కారు. ఆ పాపము వారి నంటదు. ఇటు చూచిన భీష్మ ద్రోణుల కంటెఁ బ్రహస్తుఁడే యుత్తముఁడని చెప్పవలసియున్నది. అయినను భీష్మ ద్రోణు లధర్మవర్తనులన వలనుపడదు. ప్రభువుల ధనముచే సేవకులు దేహములఁ బోషింతురే కాని యాత్మలఁ బోషింపరు. కావున సేవకుల దేహములు ప్రభువుల సొత్తుగాని యాత్మలుగావు. తమ యాత్మలను దాము ధర్మమార్గమున నుంచుట స్వామి ద్రోహము కాఁజాలదు. ఎవఁడైనను 'ధర్మోజయతు' అనవలయునే కాని 'అధర్మో జయతు' అనరాదు. అట్లననేని యాత్మహాని కలిగించుకొనిన వాఁడగును కావున భీష్మ ద్రోణులు దేహములు చేయఁదగిన కార్యములు దుర్యోధను పక్షమునఁ జేసిరి. ఆత్మలను ధర్మమందే నిలిపిరి. తన కొడు కధర్మమందున్నాఁడని తెలిసియు గాంధారి 'ధర్మోజయతి' యనియెకదా, జయము కలుగ నాశీర్వదింపుమని కోరిన దుర్యోధనుని దీవించెను. కావున భీష్మద్రోణులు చేసినది తప్పుగాదు. 'నాత్మాన మవసాదయేత్' తని కదా భగవద్గీత చెప్పుచున్నది.

అట్లైనచో విభీషణుని చర్య దుష్టమే కదా. విభీషణునకు స్వార్జితములేదు పిత్రార్జితములేదు. సర్వము రావణార్జితమే. రావణదత్తధనమే. కావున భీష్మ ద్రోణులవలె నేల విభీషణుఁడు ప్రవర్తింపరాదు. సమయమున ముఖముఁ దప్పించుటే కాక శత్రువులలోఁ జేరికొనుటచే ద్రోహి యగును గదా! యను సందేహము రాకమానదు, విభీషణ విషయమై యట్లు సందేహింపఁ గారణము లేదు. భీష్మ ద్రోణులు ధర్మాత్ములే యైనను రజోగుణభూయిష్ఠులనుట వారి చర్యవలననే స్పష్టము. శ్రీకృష్ణుఁడు భగవదవతారమూర్తి యని యెఱిఁగియు నాయన నేనుయుద్ధమున నాయుధము పట్టనని చెప్పిన వెంటనే నే నాయనచే నాయుధము పట్టించెదనని భీష్ముఁడు ప్రతిజ్ఞ చేసెను. పూలచేఁ బూజింప వలసిన భగవంతుని బాణములచే నొప్పించెను. తన్నుఁ జంపుటకై చక్రము పూని వచ్చినపుడు ఆయుధము విడువక రమ్మని పిలిచెను. ఇవి సాత్త్వికభక్తుని లక్షణములుగావు. విభీషణుఁడో రాక్షస జాతి యందుఁ బుట్టినను జన్మప్రభృతి సాత్త్వికుఁడు, ధర్మనిష్ఠుఁడు. సీతాదేవిని దెచ్చిన గడియనుండి భీ నీవు వెడలి పొమ్మని రావణుఁ డనువఱకు నయభయముల నెంతెంత చెప్పవలయునో యంతంత చెప్పెను. వ్యర్థమయ్యెను. 'గురోరప్యవలిప్తస్య కార్యాకార్య మజానతః। ఉత్పథం ప్రతిపన్నస్య కార్యం భవతి శాసనమ్' గురువైనను గర్వించి తెలిసి కాని, తెలియక కాని యకార్యము చేసెనేని వానిని దండింపవలయును. లేదా వదలిపెట్టి పోవలయు నను ధర్మశాస్త్రవాక్యము ననుసరించి వదలిపెట్టి పోయెను. సామాన్య ధర్మమునకు విశేషధర్మమునకు విరోధము వచ్చినపుడు విశేషధర్మము గ్రాహ్య మగును గాని సామాన్యధర్మము గ్రాహ్యము గాదు. తన యెదుట స్త్రీమానము దీయుచుండఁ జూచి సహించిన భీష్ముని కంటె, భగవత్పక్షమునకు విరుద్ధ పక్షమున నిలిచి దుష్టులకు సాహాయ్యము చేయఁ బూనిన భీష్మునికంటె విభీషణుఁడే శ్రేష్ఠుఁడు. శత్రుభావమున రావణుఁడు వెడలి పొమ్మనుటచే విభీషణుఁడు పోయెను. భీష్మ ద్రోణుల కట్టి సందర్భములు లేవు.

ఒక విధమునఁ జూచిన దుర్యోధనుని ధనము దాను దినుచున్నానని భీష్ముఁడు చెప్పినది సరియైనది కాదు. ఆ చర్చ యిందనావశ్యకము. ఆ ధర్మ మనుసరించినచో విదురుఁడు ద్రోహియే కదా యగును. 'నజాతు కామాన్నభయాన్నలోభాత్। ధర్మం త్యజేత్ జీవితస్యాపి హేతోః॥' అని యేకారణము చేనైన ధర్మపక్షము వదలరాదు.

### —♦ ప్రహస్తుఁడు యుద్ధమునకు వెడలుట. ♦—

తే. అనుచు సేనాని నిజబలా♦ధ్యక్షులతోడఁ, జటుల సైన్యంబుఁ గొని రమ్య♦క్షణమునఁ లోన
మచ్చి తాశుగవినిహత♦మర్కటాళి, మాంసముల మెక్కు మాంసాద♦మండలంబు.

అర్థములు. సేనాని=సేనానాయకుఁడైన ప్రహస్తుఁడు సర్వ సేనానాయకుఁడు. సేనానాయకుని కంటెఁ గ్రింది నాయకులు బలాధ్యక్షులు, సేనానాయకుఁ

డొకఁడే యుండును, బలాధ్యక్షు లనేకు లుందురు. చటులసైన్యంబు యుద్ధమునకై త్వరపడుచున్న సేనను, మత్=నాయొక్క, శితాశుగ = వాఁడి బాణముల, విని హత=చంపఁబడిన, మర్కటాళిమాంసములన్=వానరుల గుంపుల మాంసమును, మెక్కన్=తినను, మాంసాద=మాంసమును దిను తోఁడేళ్ళు పక్షులు లోనైనవి, మండలము = సమూహము.

తాత్పర్యము

ఈ ప్రకారము రావణునకుఁజెప్పి సర్వసేనానాయకుఁడైన ప్రహస్తుఁడు తన బలాధ్యక్షునిఁజూచి క్షణములో యుద్ధమునకై సిద్ధపడియున్న సేనను దీసికొనిరమ్ము. నా బాణములచేఁ జచ్చినవానరుల మాంసము గృధ్రాదులు తినునుగాక.

తే. అబ్బలాధ్యక్షుఁ డెల్ల నా◆యత్తపఱుపఁ, దిగ్మనానావిధాయుధ◆దీప్త మసుర
బలమతంగజసైంధవా◆కులము నయ్యె,లంకయంతయుఁ ద్రుటిలో భ◆యంకరముగ.

అర్థములు. ఎల్లన్ = సర్వము - ఆయత్తపఱుపన్ = సిద్ధముచేయఁగా - తిగ్మ = తీక్ష్ణములైన - నానావిధాయుధదీప్తము = అనేక విధాయుధములచేఁ బ్రకాశించునది- మతంగజ = ఏనుఁగులు—సైంధవ = గుఱ్ఱములు - వీనిచే - ఆకులము = కలఁత చెందినది.

తాత్పర్యము

ఆ బలాధ్యక్షుఁడు సేన నంతయు సిద్ధము సేయఁగా తీక్ష్ణములై యనేకవిధములైన యాయుధములచేఁ బ్రకాశించు రాక్షస భటులచేతను నేనుఁగులచేతను గుఱ్ఱములచేతను లంక యాకులమయ్యెను.

తే. జాతవేదుని వేల్చిన◆నేతిపొగల, వాసనలచేత బ్రాహ్మణ◆వరుల నర్చ
చేసియర్పించుసుమముల◆శ్రీసుగంధ,ములఘుమాయించెనగరంబు◆మూలమూల.

అర్థములు. జాతవేదుని=అగ్నిని, వేల్చిన=హోమము చేసిన.

తాత్పర్యము

యుద్ధమున జయముఁగోరి యగ్నులయందు నేయి హోమము చేయఁగాఁ బుట్టిన పొగవాసనల చేతను బ్రాహ్మణులఁ బూజించు పూలవాసనల చేతను, చందనముల చేతను లంక మూల మూల ఘుమఘుమ వాసన గొట్టుచుండెను.

కం. హారంబుల బలువివిధా◆కారంబుల, మంత్రితముల◆కలహోద్యమహ
ర్షారంభులు మేను లలం,కారంబులు చేసికొనిరి◆క్రవ్యాదవరుల్. ౧౧౨౪

అర్థములు. హారంబుల = ముత్యాల సరముల చేతను, మంత్రితములన్= మంత్రింపఁబడిన వానిని, కలహోద్యమ=యుద్ధప్రయత్నమందు, హర్షారంభులు = సంతోష ప్రయత్నములు గలవారు, క్రవ్యాదవరుల్ = రాక్షసశ్రేష్ఠులు, క్రవ్యాదులు=మాంసము దినువారు.

## తాత్పర్యము

మంత్రింపఁబడిన పలువిధములైన హారములచే సంతోషముతో యుద్ధప్రయత్నము చేయు రాక్షసవరులు తమ్మలంకరించుకొనిరి.

కం. మైమఱువు దొడిగి కేలను, భామానిత కార్ముకములు॰పట్టి నిజంబౌ
హామిక దశకంఠుఁడు గన, నామోదముతోడ వచ్చి॰రసురవరేణ్యుల్. ౧౧౮౫

అర్థములు. మైమఱువు = కవచము, భా = కాంతిచే, మానిత = గౌరవింపఁబడిన, కార్ముకములు=విండ్లు, హామికన్ =అహంకారముచే.

## తాత్పర్యము

కవచములు తొడిగికొని కాంతులు గల విండ్లను జేతులఁ బట్టుకొని, నిజమైన యహంకారము గల రాక్షసులు రావణుఁడు చూచుచుండఁగా వచ్చిరి.

సీ. సకలాస్త్రశస్త్రసం॰చయసంయుతంబును, బటుతరాజానేయ॰వాహితంబు
రణకళాకుశలసా॰రథిచోదితంబును, నిష్ఠురజలధర॰నిస్వనంబు
ప్రత్యక్షశీతాంశు॰రవిభాసురంబును, హాటకజాల స॰మంచితంబు
భయదదర్వీకర॰ధ్వజమర్ధరంబును, సురథగుప్తిరథాంగ॰శోభితంబు
తే. నన్యవస్త్వపహాసి ప్ర॰భాధికంబు,నైన రథ మెక్కి-రావణు॰నాజ్ఞఁ బూని
శంఖముంమభినిర్ఘోష॰సంకులంబు, నైన సైన్యంబుతోడ సే॰నాని వెడలె.

అర్థములు. సంచయ = సమూహముచే, సంయుతము = కూడినది, పటుతర = మిగుల బలము గల, ఆజానేయ = ఉత్తమ గుఱ్ఱములు, వాహితంబు = మోయునది, రణకళాకుశల=యుద్ధవిద్యయందు నేర్పుగల, సారథి చోదితంబును= సారథిచేఁ దోలఁబడునదియు, నిష్ఠుర జలధర నిస్వనంబు = కఠినమైన మేఘధ్వని గలది, ప్రత్యక్షశీతాంశురవిభాసురంబును = కంటి కెదుట నున్న సూర్యచంద్రులవలెఁ ప్రకాశించునదియు, హాటకజాలసమంచితంబు = బంగారు కిటికీల సమూహముచేఁ ప్రకాశించునది, భయద = భయముకలిగించు, దర్వీకర ధ్వజ మర్ధరంబును=పాము యొక్క ఆకారము వ్రాయఁబడిన ధ్వజమెత్తఁబడినదియు, సురథగుప్తి రథాంగ శోభితంబు = (౧) రథగుప్తి = ఉశివాయి యనెడి చక్రములోని గొట్టము; (౨) రథ రక్షణార్థమై మీఁద వేసిన మంచికప్పు, దీనిచేతను, రథాంగ= చక్రముచేతను, శోభితము = ప్రకాశించునది, అన్యవస్తు + అపహాసి + ప్రభాధికంబు=తేజోవంతములైన యితరవస్తువుల నవ్వుకాంతియొక్క యతిశయము గలది.

## తాత్పర్యము

అన్ని విధములైన శస్త్రములు అస్త్రములతోఁ గూడినదియు మంచి యుత్తమాశ్వములు కట్టఁబడినదియు, యుద్ధమందు నేర్పుగల సారథిచే దోలఁబడునదియు. కఠోరమైన మేఘధ్వని గలదియు సూర్యచంద్రులవలెఁ ప్రకాశించునదియు,బంగారు కిటికీలచేఁ ప్రకాశించునదియు, పాము పడగ యెత్తఁబడినదియు రథగుప్తి

చేతను మంచి చక్రముల చేతను శోభిల్లునదియు తన కాంతిచే నితర వస్తువుల నపహసించునదియు నగు రథమును రావణుని యాజ్ఞప్రకార మెక్కి శంఖములు, భేరులు మ్రోఁగుచుండ ప్రహస్తుఁడు యుద్ధమునకు బయలుదేరెను.

కం. నిర్జరహృద్భేదకముగఁ, బర్జన్యనదోపమాన•బహుళరవములతో
గర్జిల్లుచు భుజశౌర్యా, వర్జితపరిపంథి యాహ•వస్పృహఁ జనియెన్. ౧౧౦౭

అర్థములు. నిర్జరహృత్ + భేదకముగన్ = దేవతల గుండెలు పగులునట్లు, పర్జన్యనదోపమాన = మేఘధ్వనివంటి బహుళరవమును, శంఖ భేరీకాహళ రవములతో, గర్జిల్లుచున్ = సింహనాదము చేయుచు, భుజశౌర్య = బాహుబలముచే, ఆవర్జిత = లోపఱుచుకొనఁబడిన, పరిపంథి = శత్రువులు గలవాఁడు, ఆహవస్పృహన్ = యుద్ధకాంక్షచే.

తాత్పర్యము

భుజబలముచే వశపఱుచుకొనఁబడిన శత్రువులు గల ప్రహస్తుఁడు దేవతల గుండెలు పగులునట్లు మేఘధ్వనివంటి వాద్యధ్వనితో సింహనాదములు చేయుచు యుద్ధమందలి కోరికతో బయలువెడలెను.

—• ప్రహస్తున కపశకునంబు లగపడుట •—

సీ. ఘోరస్వరముల ది•క్కూటముల్ వ్రయ్యంగ, భీమరూపులు మహా•భీమతనులు
ముున్నుగా నడువ న•మున్నతుండు నరాంత,కుండు మహానాద•కుంభహనులు
సచివు లీ నల్వురు•స్వపరివారములతో, బలసి రాఁ జనెఁ దూర్పు•ద్వారమునను
వాని ప్రయాణర•వంబు సేనాక్ష్వేళ,లును లంకలో నున్న • దనుజతతికి
ఆ. గుండె లగలఁ జేసెఁ • గూపెట్టె సర్వభూ,తము లమేఘదివిఁ బ్ర•దక్షిణముగ
రథముఁ జుట్టె పక్షి • రాజులు తిరుగాడె, నదరు లుమిసె వఱదు•లతని కెలన.

అర్థములు. ఘోరస్వరములన్ = భయంకర ధ్వనులచే, దిక్కూటముల్ = దిక్ప్రదేశములు, వ్రయ్యగన్ = పగులఁగా, భీమతనులు = భయంకర దేహములు గలవారు, బలసి = చుట్టుకొని, సేనాక్ష్వేళలు = సేనలవారి సింహనాదములు, అమేఘదివి = మబ్బులేని యాకాశము, అదరులు = నిప్పుల మంటలు, వఱదులు = నక్కలు, కెలన = ప్రక్కన.

తాత్పర్యము

భయంకరములైన వేషములు భయంకరములైన దేహములు గల రాక్షసులు దిక్కులు పగులునట్లు క్రూరముగ ధ్వనించుచు ముందు నడువఁగా సమున్నతుండు, నరాంతకుఁడు, మహానాదుఁడు, కుంభహనుఁడు నను నలుగురు మంత్రులు తమ పరివారములతోఁ జుట్టుకొని రాఁగా తూర్పుద్వారమున బయలు వెడలెను. వాని ప్రయాణ ధ్వనులు సింహనాదములు లంకలో నుండు రాక్షసులకు గుండెలు పగులఁ జేసెను. భూతము లన్నియు ఘోషించెను. మేఘములు లేని యాకాశమందు పక్షులు

రథముచుట్టు తిరిగెను. (మేఘము లావరించినప్పుడు తిరుగుపక్షులు మేఘములు లేకున్నను దిరుగుట యవలక్షణము) నక్క లతని ప్రక్కనే మంటలు గ్రక్కెను.

చ. పరుషముగాఁ బ్రభంజనుఁడు♦వారక వీచె గ్రహాళు లెల్ల నం
బరమునఁ బోరఁగా దొడఁగె ♦ వ్రాలె మహోల్కలు మేఘవారముల్
ఖరతరరావముల్ నినిచె ♦ గ్రద్ధ ధ్వజంబున దక్షిణాస్య మై
యిరుదెస గీఱుకొంచు హరి♦యించె సమస్తము వాని తేజమున్. ౧౧౪౫

అర్థములు. ప్రభంజనుఁడు = వాయువు, వారక = విడువక, మహోల్కలు = పెద్ద కొఱవులు; ఖరతరరావముల్ = మిగులఁ గఠినములైన ధ్వనులు, దక్షిణాస్యమై = దక్షిణముఖమై, ఇరుదెస = రెండుప్రక్కలను.

తాత్పర్యము

హోరుమని యెదురుగాలి విడువక వీచెను, ఆకాశమున గ్రహములు కలహించెను. కొఱవులు రాలెను. మేఘములు కఠినధ్వనులు నించెను. దక్షిణముగ గ్రద్ద వాని ధ్వజముపై వ్రాలి రెండు ప్రక్కల గీఱుకొనుచు వాని తేజము నెల్ల హరించెను.

తే. జాఱిపడెఁ జేతిసెలగోల ♦ సారథికిని
జాఁపకట్టుగఁ బడియెను ♦ సైంధవములు
సమతలమునందు వసుదుర్ల ♦ భము స్వతేజ
మపుడు త్రుటిలోన నమసెఁ బ్ర♦హస్తునకును. ౧౧౫౦

అర్థములు. సెలగోల = కొఱడా, చాఁపకట్టుగ = నేలతో సమముగ, వసుదుర్లభము = అష్టవసువులకు లభింపనిది.

తాత్పర్యము

సారథి చేతఁబట్టుకొనియున్న కొఱడా యూరకయే జాఱి క్రిందఁ బడెను. గుఱ్ఱములు చాఁప పఱచినట్లు నేలతో సమముగ మిట్టపల్లములు లేని చదరపు నేలయందు బడెను. వసువులకును లేని ప్రహస్తుని ముఖకాంతి నిమిషములో నమసెను.

చ. పొగడని యిట్టి దుశ్శకున ♦ ముల్ మదిఁ గొంకక ఖ్యాతపౌరుషుం
డుడుగని తీవ్రవేగమున ♦ నుగ్రగతిం జనుదేరఁ గ్రోతులున్
బుడమి వడంకు ఘోషములు ♦ పుట్టఁగఁ గొండలఁ జెట్లఁ బీకుచున్
నడచిరి వాని నత్తికొని ♦ నాదవిదారిత దిక్సమూహులై. ౧౧౫౧

అర్థములు. పొడగని = చూచి, ఖ్యాతపౌరుషుండు = ప్రసిద్ధికెక్కిన పౌరుషముగలవాఁడు, నాద = కంఠధ్వనిచే, విదారిత = చీల్పఁబడిన, దిక్సమూహులై = దిక్కుల గుంపులు గలవారై.

తాత్పర్యము

ఇటువంటి చెడ్డ శకునములను జూచియు జంకక ప్రసిద్ధికెక్కిన పౌరుషముగల

ప్రహస్తుఁడు మిక్కిలి వేగముతోఁ రాఁగా జూచి వానరులు భూమి యదరునట్లు కేకలు వేయుచు కొండలు చెట్లు పీఁకి తీసికొని సింహనాదములచేఁ బదిదిక్కులు పగులఁజేయుచు నెదురునడచిరి.

ఉ. అంకెలు వైచు కోడెల తెఱంగున నయ్యిరువాఁగు నొండొరున్
బింకము మీఱఁ గన్గొనుచుఁ ॥ బిల్చుచు నొప్పుచు యుద్ధలంపటుల్
గొంకును జంకు లేని తమిఁ గోయని యార్చుచు డాసి రంత ని
శ్శంకము వహ్నిలో మిడుతఁ ॥ జందమునం గపిరాజవాహినిన్. ౧౧౯-౨

అర్థములు. ఇరువాఁగు=రెండుపక్షములవారు, యుద్ధలంపటుల్ = యుద్ధ కాంక్ష గలవారు, నిశ్శంకము=సందేహము భయము లేక.

### తాత్పర్యము

రెండుపక్షములవారు యుద్ధమందుఁ గోర్కెగలవారై అంకెలువైచు కోడెలవలె నొకరినొకరు పౌరుషముతోఁ జూచుచుఁ, బిల్చుచు, హుంకరించుచు, జంకు గొంకు లేక సమీపించిరి. అప్పుడు భయములేనివాఁడై ప్రహస్తుఁడు మంటలో దూఁకు మిడుతవలె వానరసేనను.

## —॥ ౫౮-వ సర్గము. ప్రహస్తసేనలు వానరులతోఁ బోరుట ॥—

కం. కుమతి ప్రహస్తుఁడు గెలువం, దమకపడుచుఁ జొచ్చె నిట్లు ॥ తతభీమగతిన్
దిమసేనలపై నడరెడు, తమిచనఁ గని రామవిభుఁడు ॥ దరహాసముతోన్.

అర్థములు. కుమతి = కుత్సితమనస్సు గలవాఁడు, తనశక్తి యెదిరిశక్తి యాలోచింపనివాఁడగుటచే నిట్లు చెప్పఁబడెను. తమకపడుచున్ = త్వరపడుచు, దరహాసముతోన్=చిఱునవ్వుతో, రామచంద్రమూర్తి గొప్ప బలము కలవాఁడు కావున బలశాలి యగు శత్రువును జూచినపుడు అలక్ష్యభావముచే దరహాసము గలిగెను.

రామచంద్రమూర్తి యుత్తరపు గవని యెదుట నుండువాఁడుగదా; తూర్పు గవని యొద్దనుండు ప్రహస్తు నెట్లుచూడఁగలిగెను? రెండుస్థలములకు విస్తార దూరముగలదు. వంపు కలదుకదా యను సందేహము కలుగవచ్చును. ఉత్తరపు దిశ గాచినాఁడనిన ఉత్తరపువైపు అంతయునని గ్రహింపవలెనుగాని వాకిటి కెదురుగ నొక్కచోటనే కూర్చుండి యుండెనని యర్థము సేయరాదు. ఉత్తరపువైపున తూర్పుకొననుండి పడమటివైపువఱకు సంచరించుచుండెను అని గ్రహింపవలయును. కావుననే హనుమంతుఁడు అకంపనుని జంపఁగలిగినది చూడఁగలిగెను. అట్లే యిపుడు నుత్తరపార్శ్వమునఁ దూర్పుకొనకు వచ్చియుండుటచే ప్రహస్తునిఁ జూడఁ గలిగెను. పూర్వవ్యాఖ్యలందుఁ 'గని' యనుటకు నమ్మకముగా 'విని' యని వ్రాసి యున్నారు.

తాత్పర్యము

మతిమాలిన ప్రహస్తుఁడు శత్రువుల గెలువవలయు నని తొందరపడుచుఁ బ్రవేశించెను. ఇట్లు తన సేనలమీఁద భయంకరముగాఁ బడుచున్న యతనిఁజూచి రామచంద్రమూర్తి చిఱునవ్వుతో.

కం. పలుకు విభీషణుతోడన్, బలితపుబలములు భజింప•బలు పగు మేనన్
గలనికి వచ్చినవాఁ డా,బలియుఁ డెవం డనఁగ నతఁడు•వచియించె నిటుల్.

తాత్పర్యము

విభీషణుతో నిట్లనియె. బలిష్ఠమైన సేనలతో బలిసిన దేహముతో యుద్ధమునకు వచ్చిన యీ బలశాలి యెవ్వఁ డనిన నతఁ డిట్టు లనెను.

ఉ. ఈతఁడె రావణాసురుని•యొంతయు నమ్మినజోదు శూరుఁడున్
ఖ్యాతపరాక్రముండు మహి•తాస్త్రవిదుండు సమస్తవాహినీ
నేత త్రిభాగ సైన్యయుత•నిష్ఠురకర్ముఁడు వీర్యవంతుఁడున్
వీతభయుండు రామనృప•వీవర! పేరఁ బ్రహస్తుఁ డం చనన్. ౧౯౫

అర్థములు. జోదు = బంటు, యోధశబ్దభవము, సమస్త వాహినీనేత = సమస్తసేనకు నధిపతి, త్రిభాగ సైన్యయుతుఁడు=రావణాసురుని సేనలో మూఁడవ వంతు సేన యితని వశమున నుండును. తక్కిన రెండు భాగములు పై విచారణ యుంచుకొని యుండును. నిష్ఠుర కర్ముఁడు=కఠిన కార్యములు చేయువాఁడు, వీర్యవంతుఁడు=బలవంతుఁడు, 'వీర్యంబలే ప్రభావేచ' యని యమరము - వీత భయుండు = భయములేనివాఁడు.

తాత్పర్యము

వీఁడె రావణాసురుని నమ్మినబంటు. శౌర్యము గలవాఁడు. పరాక్రమమందుఁ బ్రసిద్ధుఁడు. గొప్ప యస్త్రములు దెలిసినవాఁడు. సర్వసేనాధిపతి. లంక లోని సేనలో మూఁడవవంతుసేన యితని స్వాధీనమం దుండును. కఠిన కార్యములు చేయువాఁడు. బలశాలి. యుద్ధమునందు భయ మెఱుఁగనివాఁడు. రామచంద్రా! వీని పేరు ప్రహస్తుఁడు.

శా. ఈలో వాఁడు నదత్సురారియుతుఁ డై • యెంతే రుషం బ్రస్ఫుట
త్స్వేళాజాలవిభిన్నదిక్కుహరుఁడై • శేయంచుఁ బైవచ్చినన్
గోలాంగూలచయంబు భూమిరుహముల్ • గొండ ల్వావం గొంచు న
ద్వేలక్ష్మి ప్రకటిన్ నమీర్ష్యను గ్రుధాం•ధీభూతచేతస్కులై. ౧౯౬

అర్థములు. నదత్ =ధ్వనించుచున్న, సురారియుతుఁడై = రాక్షసులతోఁ గూడినవాఁడై,ఎంతే=ఎంతేని వనిశబ్దమునకు హల్లు పరం బగునపుడు అంత్యవర్ణము లోపించును."ఎం దే డెందము కంపగించు"నని పెద్దన-అచ్చుపరమైనపుడు నివర్ణము మీఁది స్వరము లోపించును. ఇది కవి యేగాని ప్రమత్రపకృతికముగాదు. "ననుఁ

దగివొదు నతిథింగా, మనంబునఁ దలంచి నీవు మన్నించెదవే, నిని వచ్చెదనీపాలికి-" భా. కర్ణ. ౨-౨౭౬-ఇత్యాది ప్రయోగంబులందు ఏనియును, దానిలో 'యు' లోపించి ఏనిను అని మిగిలి, ఇత్వము మీఁదిది గావున ఏనిని యయ్యె నని యెఱుంగునది. ఇది యర్థ విశేషంబున వచ్చిన సముచ్చయము................ రుషస్=కోపముతో, ప్రస్ఫుట=విస్పష్టమైన, క్ష్వేళాజాల=సింహనాద సమూహములచే, విభిన్న = మిక్కిలి భేదింపఁబడిన, దిక్కుహరుఁడై = దిక్కుల యందలి గుహలు కలవాఁడై, (౨) దిక్కు రంధ్రములు గలవాఁడై, సమీర్ష్యను=మిగులఁ గోపముచే, క్రుధా=కోపముచే, అంధీభూత చేతస్కు=ఏమియుఁ దోఁపని మనస్సు గలదై, ఉద్వేలక్షిప్రగతిన్=అధికమైన వేగముతోఁ గూడిన గమనముతో.

తా త్ప ర్య ము

ఇంతలోఁ బ్రహస్తుఁడు ధ్వనించు రాక్షసులతోఁ గూడినవాఁడై మిగుల రోష ముతో స్పష్టమైన సింహనాదములచే దిగ్గుహలు పగులఁ జీల్చుచు జేయుని తమ మీఁదికి రాఁగా కొండ్రముచ్చుల గుంపులు చెట్లు కొండలు త్వరగాఁ దీసికొని మిగుల వేగముతో నీర్ష్యాతిశయముతో కోపముచే దేహములు దెలియనివారై.

కం. ఎదురుకొనెన్ శూలంబులు గదలున్ రోఁకండ్లు శక్తి ♦ ఖడ్గాశుగముల్
గుదియలుబరిసలుబరుచులు, మొదలగు కైదువులు మెఱయ ♦ మొగిరక్కసులున్,

• అర్థములు. కైదువులు = ఆయుధములు, బరిస = ఇనుపకట్లగుదియ బరుచులు = ఈఁటెలు, వి-బరిచి, రూ. బరిచీ.

తా త్ప ర్య ము స్పష్టము.

ఉ. తాఁకిరి వారువారు బల ♦ దర్పము లొప్పఁగ తాలవానయున్
వీఁకను బాణవర్షమును ♦ బెన్జడిగాఁ గురియింపఁ దద్ధతిన్
మూఁకలు మూఁక లై యసుర ♦ ముఖ్యులు వానరులున్ వ్యథార్తులై
కూఁకలు వెట్టుచు న్నలఁగి ♦ కూలిరి భిన్నశిరఃప్రతీకు లై. ౧౧౯౭

అర్థములు. తత్+హతిన్ = ఆ దెబ్బచే, భిన్నశిరఃప్రతీకులై = పగిలిన తలలు, విఱిగిన అవయవములు గలవారై.

తా త్ప ర్య ము స్పష్టము.

సీ. కాలాయసంబు లౌ ♦ శూలాయుధంబుల, గుదులుగాఁ గ్రుచ్చిరి ♦ క్రూరవృత్తిఁ
బరిఘాతనంబులఁ ♦ బ్రతిఘాతముల నిచ్చి, ప్రతిఘాతనముఁ జల్పి ♦ రతులరీతి
గండ్రగొడ్డలి వ్రేట్లఁ ♦ గండలు వగిలించి, గం డడఁగించి రు ♦ ద్దండ భంగి
నొత్తి పైపడి త్రొక్కి ♦ కుత్తుక బిగఁబట్టి, యూర్పోవకుండఁగ ♦ నొత్తిరించి
తే. రసురవర్యులు క్రోఁతుల ♦ నగచరాళి యంప పోటుల హృదయమ్ము ♦ లగిలి ఖడ్గ
ధారలను రెండునై శూల ♦ వారనిహతిఁ, గృత్తపార్శ్వకమై యప్డు ♦ గెడసి చనియె.

అర్థములు. కాలాయసంబులు = ఉక్కుతోఁ జేయఁబడిన, గుదులుగాన్ = వరుసలుగా, పరిఘాతనంబులన్ = ఇనుపకట్ల గుదియలచే, ప్రతిఘాతములన్ = మారు దెబ్బలను, ప్రతిఘాతనము = చంపుట, గండు = పౌరుషము, ఊర్పునుండఁగన్ = ఊపిరాడకుండ, ఒత్తరించిరి = త్రొక్కించిరి, అంపపోటులన్ = అమ్ముల దెబ్బలచే, అగిలి = పగిలి, కృత్త = చీల్పఁబడిన, పార్శ్వకమై = ప్రక్కలుగలదై, కెడసి = పడి.

తాత్పర్యము

ఉక్కుశూలములచే రాక్షసులు వానరులను క్రూరులై గుదులుగాఁ గ్రుచ్చిరి. ఒక్క శూలమునకే ఏడుగు రారుగురిని గ్రుచ్చిరి. వానరులు కొట్టిన దెబ్బలకు బదులుగ నినుపకట్లగుదియలతోఁ గొట్టి చంపిరి. గండ్రగొడ్డలి దెబ్బలచేఁ గండలు పగుల జీల్చి వానరుల గర్వ మడగించి రాక్షసులు వానరులపై బడి త్రొక్కి గొంతు బిగఁగట్టి యూపిరాడకుండఁ ద్రొక్కించిరి. అప్పుడు వానరులు బాణముల దెబ్బలకు ఱొమ్ములు పగిలి ఖడ్గముల దెబ్బలచే రెండుగాఁ జీలి శూలముల పోటులచే ప్రక్కలు నఱకఁబడి పడిపోయిరి.

ఉ. అజ్జగడంబునం గపులు • హామికఁ గొండలుఁ జెట్లు ఱువ్వినన్
బజ్జలు నూరుఁబిండులును • బచ్చడులుం జెనుముద్దలున్ మఱిన్
గుజ్జులు నైరి రాక్షసులు • గూలిరి వ్రీలిరి పీటతాటమై
నజ్జగ నైరి వజ్జఱి వి • నాశనముం జెందిరి ప్రమంది రంజఱున్. ౧౨౦౦

అర్థములు. అజ్జగడంబునన్ = ఆ యుద్ధమందు, హామికన్ = అహంకారముతో, పీటతాటమై = తాలుమాత్రమై, నజ్జగన్ = తునుకలు తునుకలుగా, వజ్జఱి = ఉపాయము తెలియక.

తాత్పర్యము స్పష్టము.

సీ. ఫెటాత్కారకలిత చ • పేటఘాతకములచే, బొక్కినోళ్లైనట్టి • రక్కసులును
బిడుగుల కెనవచ్చు • పిడికిళ్ళపోటుల, గ్రుడ్లూడి గ్రుడ్లయి • కూలువారు
సిగఁ బట్టి తల వంచి • చేకొల్ది గ్రుద్దిన భోక్కున నెత్తురు • గ్రక్కువారు
నిరుగాలు బిగఁబట్టి • గిరగిర మని త్రిప్పి, వీచివైచిన యముఁ • జూచువారు
తే. నుఱికి కలకగు కోఁతులఁ • గఱచి కోళ్ళఁ, జెఱికి వారల ఖండాల • నఱికివైవ
బిఱుసుఁ జెడి గర్వముడిగిర • తత్తిలి వెఱచి, యఱచిప ఱచిరి మడసిరి • యెఱచిదిండ్లు.

అర్థములు. ఫెటాత్కారకలిత = ఫెట్ అను ధ్వనితోఁ గూడిన, చపేటఘాతములచే = అఱచేతి చెంపదెబ్బలచే, బొక్కినోళ్లు = పండ్లు రాలిపోయిన నోళ్లు, గ్రుడ్లు = కంటిగ్రుడ్లు - గ్రుడ్డివాండ్రు, ఇరుగాలు = రెండుకాళ్లు, ద్విగువు ఏకవచనము, వారల ఖండాల = వారు ధరించిన కత్తులచే, ఎఱచిదిండ్లు = మాంసము దినువారు, రాక్షసులు.

తాత్పర్యము స్పష్టము.

శా. బాహాస్ఫాలన మాచరించుచును భీం•భద్భైరవాకారులున్
సాహంకార వివృత్త నేత్రు లయి ర•క్షః కీశసైన్యాళి హే
మాహేమీలు ఘటాఘటీ ల్గడఁగి సిం•హవ్యూహసంరంభు లై
బాహాబాహిని మల్లసంగర కళా•ప్రావీణ్య మేపారఁగన్. ౧౨౦౨

అర్థములు. బాహాస్ఫాలనము = భుజములు తట్టుట, భీంభత్ + భైరవా కారులున్ = భయంకరముగాఁ బ్రకాశించు నాకారములు గలవారును, సాహంకార వివృత్త నేత్రులును = కోపము కూడికచేఁ దిరుగుడు వడుచున్న కన్నులు గల వారు, రక్షః + కీశ + సైన్యాళి = రాక్షసులయు, వానరులయు సేనా సమూహము, హేమాహేమీలు, ఘటాఘటీలు = ఎంత కార్యమైన సాధించువారు, సింహవ్యూహ సంరంభులై = సింహముల గుంపుయొక్క పూనిక గలవారై, బాహాబాహిని = చేతులు చేతులు కలసి చేయు యుద్ధమున, మల్లసంగర కళాప్రావీణ్యము = మల్ల యుద్ధ విద్యయందలి నేర్పు, జెట్టీల కొట్లాటకు మల్లయుద్ధ మని పేరు.

తాత్పర్యము

రెట్ట లరచేతులతోఁ దట్టుకొనుచు భయంకరరూపులై యహంకారముచే గ్రుడ్లు గిరగిర ద్రిప్పుచు రాక్షసులందు వానరులందు మిగుల సమర్థులగు వారు పూని సింహములవంటి ప్రయత్నముతో చేతులు చేతులు కలసిన జెట్టిపోరునందలి తమ నేర్పు విస్తరింపఁగా.

కం. పోరునెడ వారి పటుగ•ర్జారవములు క్రందనములు•జయనపర క్ష్వే
ళారభటుల్ దీనుల దుః•ఖారావము లధిక మయ్యె•నా సమయమునన్. ౧౨౦౩

అర్థములు. పటుగర్జారవములు = దృఢమైన పెద్ద ధ్వనులు, క్రందనములు = పిలుపులు, జయనపర = జయించుటయందాసక్తి గలవారి, క్ష్వేళారభటుల్ = సింహ నాదములు, దీనుల దుఃఖారావములు = దెబ్బలు దిని బాధపడువారి యేడుపుధ్వనులు.

తాత్పర్యము

యుద్ధముసేయు సమయమున వారల పెడబొబ్బలు, పిలుపులు, జయకాంక్ష గలవారి సింహనాదములు, గాయములచే బాధపడువారి యేడ్పులు విస్తరించెను.

సీ. అంతకోపమ కుంభ•హనుసమున్నతసరాం, తకమహానాదులు•దర్ప మొనరఁ
బొంగి వచ్చెడి కీశ•పుంగవవార్ధికిఁ, జెలియలి కట్టలై•నిలువరింపఁ
గొండపేటును ద్వివి•దుండు వైచిన దాన, నంతకుఁ గొల్చె న•రాంతకుండు
దుర్ముఖుం డొక మహా•ద్రుమముఁ జివ్వన వైవ, నుర్విపైఁ గూలె న•మున్నతుండు

తే. ప్రస్తుతుండు మహానాదు•సరభసముగ, బండతోఁ దాఁకనాతండు•దండిచేతఁ
దారకరము క్షభూరుహ•తాడనమునఁ, గుంభినీధరమనఁ గూలెఁ•గుంభహనుఁడు.

అర్థములు. అంతక + ఉపమ = యమునితో సమానులైన, కీశపుంగవ వార్ధికిన్ = వానరశ్రేష్ఠు లను సముద్రమునకు, అంతకుఁ గొల్చెన్ = చచ్చెను, ప్రస్త

సుతుఁడు=జాంబవంతుఁడు, తాఁకన్ = కొట్టఁగా, దండిన్ = యముని, తారకర ముక్త=తారుని చేతితో వేయఁబడిన, భూరుహ తాడనమునన్ = చెట్టుదెబ్బచే, కుంభినీధరము=కొండ.

తాత్పర్యము

యమునితో సమానులగు కుంభహనుఁడు నమున్నతుఁడు నరాంతకుఁడు మహానాదుఁ డను వారలు పొంగివచ్చుచున్న వానరులను సముద్రమునకుఁ జెలియలి కట్టలై నిలువరింపఁగా ద్వివిదుం డొక కొండపేటు వైచిన దానితో నరాంతకుఁడు చచ్చెను. దుర్ముఖుఁ డను వాఁ డొక పెద్దచెట్టు వేయగా నది తగిలి నమున్నతుఁడు చచ్చెను. జాంబవంతుఁడు మహానాదుపై నొక బండ వేయఁగా వాఁడు చచ్చెను. తారుఁడు చెట్టు నొకదాని వైవఁగా కుంభహనుఁడు కొండవలె నేలఁబడెను.

— ప్రహస్తుఁడు కపుల వధించుట —

ఉ. అద్రిచరక్రియం గని ప్ర•హస్తుఁడు కార్ముక హస్తుఁ డై లయో
న్నిద్రపయోధి చందమున • నిర్జరభీకరుఁ డట్టి పొంగుచున్
రౌద్రరసంబు మూర్తిగొను•రాణ లయం బొనరించుభంగి న
క్షుద్రజవంబునం బఱపెఁ • గ్రోఁతులు భీతులుగా శతాంగమున్. ౧౨౦౫

అర్థములు. అద్రిచరక్రియన్ = వానరులు చేసిన కార్యమును, కార్ముక హస్తుఁడై=చేత విల్లుగలవాఁడై, లయోన్నిద్ర పయోధి చందమున = ప్రలయ కాలమందు హెచ్చరికగల సముద్రమువలె, నిర్జర భీకరుఁడు=దేవతలకు భయము కలిగించువాఁడు, మూర్తిగొను రాణన్=ఆకారము గొన్న విధముగ, లయంబు= నాశము, అక్షుద్ర=అల్పముగాని, జవంబునన్=వేగమున, శతాంగము=తేరిని.

తాత్పర్యము

వానరులు చేసిన తన మంత్రులఁ జంపుట యను కార్యమును జూచి దేవ భయంకరుఁడగు ప్రహస్తుఁడు చేత వింటిని ధరించి ప్రలయ కాలమునఁ బొంగు సముద్రమువలెఁ బొంగి రౌద్రరసము ఆకారముగొన్న విధమున, సర్వము నాశము చేయువానివలెఁ దన తేరిని వానరులపై మిగుల వేగముగఁ బఱపెను.

మ. ప్లవగాంభోనిధి మందరాయితరథ•వ్యాపారపారీణుఁ డా
దివిజారాతిరణంబు కల్పసమమై • దీపింపఁ దత్సాగరా
రవముంబోలెఁ జమూనినాదము కఠో•రస్ఫారనారాచపా
తవినిర్భిన్నవలీముఖాంగ వికళ•ద్రక్తంబు నీరంబుగన్. ౧౨౦౬

అర్థములు. ప్లవగాంభోనిధి=వానరులను సముద్రమునకు, మందరాయిత= మందరపర్వతమువలె నైన, రథ = తేరియొక్క, వ్యాపార పారీణుఁడు = కార్యమునందు సామర్థ్యము గలవాఁడు, కల్పసమమై=ప్రలయముతో సమానమై, తత్+సాగరారవమున్ = అప్పటి సముద్రధ్వనిని, చమూనినాదము = సేనలధ్వని,

కఠోర=కఠినములు, స్ఫార = అధికములు నగు, నారాచ = బాణముల, పాత = పడుటచే, వినిర్భిన్న = మిక్కిలి భేదింపఁబడిన, వలీముఖాంగ=వానరుల దేహము నుండి, విగళత్=కాఱుచున్న, రక్తంబు=నెత్తురు, నీరంబుగన్=నీళ్ళుగ.

తాత్పర్యము

వానరు లను సముద్రమునకుఁ దన తేరు మందరమువలెఁ జేసి చరించు నా రాక్షసుని యుద్ధము ప్రళయమువలెఁ దోఁచెను. ఆ కాలమందలి సముద్రఘోషము వలె సేనాభటుల ధ్వని యుండెను. కఠిన బాణములచేఁ దెగిన దేహము గల వానరుల నెత్తురు ఆ సముద్రమందలి జలమై యుండెను.

తే. దానికిని నీడఁబోవక • తరుచరాళి, జన్య మొనరించి రాక్షస•సంఘములను
బిలుకుమార్పఁగ నుభయసే•నలమహీధ్ర,సమశరీరంబ లొప్పె భీ•మముగ నపుడు.

అర్థములు. ఈడఁబోవక = వెనుదీయక, తరుచరాళి = వానరుల గుంపు, జన్యము=యుద్ధము, పిలుకుమార్పంగన్=చంపఁగా, మహీధ్రసమ శరీరంబులు = పర్వతములవంటి దేహములు.

తాత్పర్యము స్పష్టము.

కం. దైతేయ కీశరక్త, స్రోతస్వినిచేతఁ దడిసి • క్షోణి రహించెన్
స్ఫీతగతిన్ మాధవవే,ళాతత సుమయుక్త కింశు•కాకృతి దోఁపన్. ౧-౨౦౮

అర్థములు. దైతేయ=రాక్షసుల యొక్కయు, కీశ=వానరులయొక్కయు, రక్తస్రోతస్వినిచేత=నెత్తుటియేటిచేత, మాధవవేళా=వసంతసమయమున, ఆతత = విస్తారమైన, సుమయుక్త=పూలచేఁగూడిన, కింశుకాకృతిన్=మోదుగులవలె.

తాత్పర్యము

వానరులయు, రాక్షసులయు నెత్తుటి యేటిచేఁదడిసి భూమి వసంతసమయమున నిండారఁ బూచిన మోదుగువలె నుండెను.

సీ. కూలినవీరుల • కోటులు దరులుగా, విఱిగిన కైదువుల్ • వృక్షములుగఁ
గీలాలజాలంబు • కీలాలచయముగాఁ, గారిజంబున బ్లీహ•మార బురద
ప్రేవుల ప్రోవులు • శైవలవితతిగాఁ, గాలు సేతులతుండ్లు • మీలు గాఁగ
గాత్రాంగనివహముల్ •కడిమిడిపట్లుగాఁ, జెనుగ్రద్ద గుమి యంచ•పిండుగాఁగ

తే. మలయు రాపులు లుయ్యాల•పులుఁగులుగను
మెదడు నురువుగ నేడ్పులు • నదములుగను
గాపురుషదుస్తరము యమ•కంధిగతిక
మాజిభూమయి నిమ్నగ • యపుడు పాఱె. ౧-౨౦౯

అర్థములు. దరులు = ఒడ్డులు, కైదువుల్ = ఆయుధములు, కీలాల జాలంబు=నెత్తుటి సమూహము, కీలాలచయముగాన్=నీళ్ళవంకగా, కారిజంబున= కడుపులోని నీరుతిత్తి క్రింద నుండెడి మాంసఖండ విశేషము, యకృత్తు ( Liver )

ప్లీహము (Spleen) కడుపులో నెడమ ప్రక్కనుండు మాంసఖండ విశేషము, శైవల వితతి = పాచిసమూహము, ఝాలు = చేపలు, గాత్రాంగనిహముల్ = దేహము లందలి యవయవ సమూహము. కడిమిడి పట్లుగా = పచ్చికపట్లుగా, రాపుల్లు = ఒక్కవిధమైనగ్రద్ద, ఉయ్యేలపులుగు = సారసపక్షులుగా, నదములు గను=పటిప్రవాహ శబ్దములుగను, కాపురుష దుస్తరము=పిఱికి పందలచేఁ దాఁట రానిది, యమకంధి గతికము = యముఁడను సముద్రమును జేరఁబోవునది, ఆజిభూమయి = యుద్ధభూమియు నెడి, సార్థకమయు దంతయు, నిమ్నగ=నది, వ్యస్త సావయవరూపకము=యమకంధిగతిక మనుచో సమస్తరూపకము.

తాత్పర్యము

యుద్ధభూమిని నేఱుగా వర్ణించుచున్నాఁడు. ఆయేటికి యుద్ధమందు జచ్చిన వీరుల గుంపులు యిావలి యావలి యొడ్డులు, విఱిగిన యాయుధములు వృక్షములు, నెత్తురే నీళ్ళు, కారిజము ప్లీహము బురద, ప్రేవులరాసులు ప్రాఁచిగుంపు, కాళ్ళు చేతుల తునుకలు (వ్రేళ్ళు మొదలైనవి చేపలు, దేహమునందలి యవయవములు పచ్చిక పట్లు, గ్రద్దలు హంసములు, రాపులుగులే సారసములు, మెదడు నురుగు, పడ్పులు ఏఱు పాఱు ధ్వని, ఈ నదిని బిఱికివారు దాఁటలేరు.

కం. శారదవేళను హంసక, సారసచయ సేవితంబు ♦ శైవలినివలెన్
  ధీరులు, వానర రాక్షస, వీరులు తన్నదిఁ దరించి ♦ వెలసిరి బలిమిన్. ౧౩౧౦

అర్థములు. శారదవేళను = శరత్కాలసమయమున, హంసక=హంసల చేతను, సారసచయ = బెగ్గురుల గుంపులచేతను, సేవితంబు = సేవింపఁబడినది, కూడినది, శైవలిని = నది.

తాత్పర్యము

ధీరులగువారు శరత్కాలమందు హంస సారసములతోఁ గూడిన నదిని దాఁటునట్లు వానర రాక్షసవీరులు నదిని దాఁటిరి.

కం. పాదరజోవిధ్వస్తము, మేదురరక్తాభ జల స♦మేతము సరసిన్
  సాదరముగ నీఁదిన మద, వేదండము లనఁగ వారు ♦ వెలిఁగిరి రక్తిన్. ౧౩౧౧

అర్థములు. పాదరజోవిధ్వస్తము = అడుగుల దుమ్ముచేఁ బాడుచేయఁబడినది, మేదుర = దట్టమైన, రక్తాభ=నెత్తుటితో సమానమైన, జల=నీటితో, సమేతము = కూడినది, సరసిన్ = కొలనిని, మదవేదండము=మదపుటేనుఁగు, రక్తిన్ = ఎఱ్ఱని కాంతిచే.

తాత్పర్యము

కాలి దుమ్ముచేఁ బాడుచేయఁబడినదియు, అధికమైన నెత్తుటివంటి జలముగలదియు నగు కొలనిని నీఁదిన మదపుటేనుఁగులవలె వారెఱ్ఱని కాంతిచే వెలసిరి.

## —• నీలుఁడు ప్రహస్తుని వధించుట •—

ఉ. ఎందును నడ్డు లేక తను • నెవ్వఁడు మార్కొనువాఁడు లేక యా
నస్కందనధాత్రిలోఁ దనదు • స్యందనముం బఱపించి మీఁదమీఁ
దం దనుఁ జూచి క్రోఁతులు య • థాయథ లై పరువెత్త నబ్ధిలో
నం దిరుగాడు పెన్గొఱ య • నన్ విహరించు నిశాటు నీలుఁడున్. ౧౨౧౨

అర్థములు. ఆస్కందనధాత్రిలో = యుద్ధభూమిలో, యథాయథలై = చెల్లాచెదరై, పెన్గొఱ=పెద్ద కొఱమీను, నిశాటున్=రాక్షసుని.

తాత్పర్యము

యుద్ధభూమియందు నెందును నడ్డములేక యెదిరించువాఁడును లేక, తన తేరిని దోలి తన్నుఁజూచి క్రోఁతులు పోయినదే పోకగాఁ బరువెత్తగా సముద్రములోఁ బెద్ద కొఱచేపవలెఁ దిరుగు రాక్షసుని జూచి నీలుఁడు.

చ. కనుఁగవ కెంపుపెంపు గొనఁ • గాంచి సమంచితవేగుఁ డై వియ
జ్జనిత మహాబలుండు ఘన•జాలముపైఁ బడురీతి నాఁగినన్
దినమణి భాసమానరథ•తీవ్రజవోద్ధతి చాపనైపుణం
బును మెఱయంగ వానిపయి • మొక్కలుఁ డై పడి యేపు చూపుచున్.

అర్థములు. వియత్+జనిత మహాబలుండు=ఆకాశమునఁ బుట్టినవాయువు, ఘనజాలముపై = మేఘసమూహముపై, ఆఁగినన్ = అడ్డగింపఁగా, దినమణి = సూర్యునివలె, భాసమాన = ప్రకాశించు, రథ = తేరి యొక్క, తీవ్రజవోద్ధతి = అధిక వేగాతిశయము, చాపనైపుణంబు=విలువిద్యనేర్పు, మొక్కలుఁడై=శూరుఁడై.

తాత్పర్యము

తన్ను లెక్కచేసి చూచి మిగుల వేగము గలవాఁడై ఆకాశమునందుఁ బుట్టిన మహావాయువు మేఘములపై పడినట్టులు ప్రహస్తుని నడ్డగింపఁగా సూర్యుని వలెఁ బ్రకాశించు రథముయొక్క వేగాతిశయము విలువిద్యనేర్పు మెఱయఁగఁ బ్రహస్తుఁడు శూరుఁడై వానిపై పడి తన పరాక్రమము చూపుచు.

శా. హుంకారస్ఫుటనాదుఁ డై దితిభవ•వ్యూహంబు మెచ్చన్ ధను
ష్టంకారం బొనరించుచున్ నిశితకాం•డంబుల్ మెయిం గ్రుచ్చి సా
హంకారోద్ధతి నార్భటించె, నవి కీ • శాధ్యక్షు మేనిన్ నిరా
తంకప్రక్రియఁ జించి చొచ్చె ధరణిం • దద్రక్తసిక్తంబులై. ౧౨౧౪

అర్థములు. హుంకారస్ఫుట నాదుఁడై = హుమ్మని స్పష్టమైన ధ్వనికలవాఁడై, నిశితకాండంబుల్=పదునగు బాణములు, క్రుచ్చి=నాటి, ఆర్భటించెన్ = సింహనాదము చేసెను, కీశాధ్యక్షు మేనిన్ = వానరపతియగు నీలుని దేహమును నిరాంతక ప్రక్రియ=అడ్డములేని విధముగ, తద్రక్త సిక్తంబులై = ఆ నెత్తుటిలోఁ దడిసినవై.

తాత్పర్యము

హుంకార ధ్వనిం చేయుచు రాక్షసులు తన్ను మెచ్చునట్లు వింటిని టంకారము మీటుచు పదునగు బాణములను నీలుని దేహమందుఁ గ్రుచ్చి యహంకారాతిశయముచే సింహనాదము చేసెను. ఆ బాణములు వానరపతి దేహమునందు నడ్డము లేక ప్రవేశించి చించి యానెత్తుటితోఁ దడిసి భూమిలోఁ దూఱెను.

ఉ. వెండియు నాప్రహస్తుఁ డట•వీచరుఁ జెంతలఁ జేరనీక యు
ద్దండశరప్రకాండముల • దారుణవాహిని మీఁదఁ గొల్పనీ
లుండును సాలమొండు త్రుటి•లోఁ గొని తానెదు రేఁది పోయి దో
శ్చండిమ శూరవర్యుఁడు ని•శాచరుపై నొకదెబ్బ దీసినన్. ౧౭౧౫

అర్థములు. అటవీచరున్=వానరుని, నీలుని, ఉద్దండ శరప్రకాండముల= అధికమైన శ్రేష్ఠములైన బాణముల, దారుణవాహిని=భయంకర నదిని, సాలము= చెట్టు, దోశ్చండిమ=భుజబలాతిశయముచే.

తాత్పర్యము

అంతతోఁ బోక ప్రహస్తుఁడు వానరుని దగ్గఱఁ జేరనీక విశేషముగ బాణశ్రేష్ఠములను భయంకర నదిని వలెని మీఁద, బ్రవహింపఁజేయఁగా నీలుఁడు చెట్టొక్కటి నిమిషములో పీకికొని యానదికి నెదురేఁది పోయి భుజబలము కొలఁది రాక్షసుని నొకదెబ్బకొట్టెను.

కం. క్ష్వేళాబధిరిత దిగ్గజ, జాలుండై రాక్షసుండు • శరధారాక
ల్లోలిని నీరంధ్రంబుగ, నీలుపయిం బఱప నతఁడు • నిశ్చేష్టుండై. ౧౭౧౬

అర్థములు. క్ష్వేళా = సింహనాదముచే, బధిరిత=చెవుడుగా చేయఁబడిన, దిగ్గజ జాలుండై = దిక్కులందలి యేనుఁగుల గుంపులు గలవాఁడై, శరధారా కల్లోలిని = బాణపరంపర యను నదిని, నీరంధ్రంబుగన్ = సందు లేకుండునట్లు, నిశ్చేష్టుండై = చేష్ట లుడిగినవాఁడై.

తాత్పర్యము

దిగ్గజములకుఁ జెవుడు పట్టునట్లు సింహనాదము చేయుచు ప్రహస్తుఁడు బాణపరంపరానదిని సందులేకుండునట్లు నీలునిపై బఱగింపగాఁ నతిడేమియుఁ జేయలేనివాఁడై.

శా. వారింపం దరియింపరామిని గపి•వ్యాఘ్రుంబు క్షోణిన్ శర
ద్ధారాపాతమునన్ వృషంబువలె నే•త్రద్వంద్వమున్ మోడ్చి దో
స్సారం బాతఁగ నిల్చియుండి యవకా•శం బబ్బ వృక్షాహతిన్
ధీరగ్రామణి చిత్తవేగ రథవీ•తిస్తోమముం గూల్చుచున్. ౧౭౧౭

అర్థములు. వారింపన్ = అడ్డగించుటకు, తరియింపన్ = దాఁటుటకు, రామిని=సాధ్యము కాకుండుటచే, కపివ్యాఘ్రుంబు=వానర శ్రేష్ఠుఁడు, క్షోణిన్ = భూమియందు, శరత్=శరత్కాలమందలి, ధారాపాతమునన్=వర్ష ధారలు పడు

టచే, ముందు వానకాలమందలి ప్రవాహ మని చెప్పి యిప్పుడు శరత్కాల మందలి వాన యని చెప్పుటచే క్రమముగ వేగము తగ్గిన దని సూచన. వృషంబు వలెన్ = ఎద్దువలె, దోస్సారంబు=భుజబలము, ఊఁతగన్ = ఆధారముగ, అవ కాశంబు=సందు, వృక్షాహతిన్=చెట్టుదెబ్బచే,ధీరగ్రామణి=ధీరులందు శ్రేష్ఠుఁడు, చిత్తవేగ = మనోవేగముగల, రథవీతిస్తోమమును = రథమునకు గట్టిన గుఱ్ఱముల సమూహమును, కూల్చుచున్ = చంపుచు.

తాత్పర్యము

మీఁదఁ జెప్పిన బాణవదిని నిలుపుటకుఁగాని దాటుటకుఁగాని సాధ్యము గాకుండుటచే నీలుఁడు భూమిమీఁద శరత్కాల వర్షమును నెద్దువలె సైరించి రెండుకన్నులు మూసికొని భుజబలము ఆధారముగ నిలిచియుండి సందు దొరకఁగా చెట్టుతోఁ గొట్టి మనోవేగమునఁ బోవు తేరి గుఱ్ఱాలఁ జంపుచు.

ఉ. పైఁబడి వాని కార్ముకముఁ ♦ బట్టి దృఢంబుగ నీడ్చి వైచి యా
టోపమునన్ నదించుచుఁ ద ♦ టుక్కున దానిని ద్రుంచివైచినన్
జాపము లేమి రక్కసుఁడు ♦ స్యందనసంస్థితసాధనాళిలోఁ
జేపడినట్టి రోఁకలిని ♦ జేకొని భూమికిఁ దాఁటెఁ జివ్వునన్. ౧౨౧౫

అర్థములు. కార్ముకము=విల్లు, ఆటోపమునన్ = సంభ్రమముతో, నదించుచు = అఱచుచు, స్యందన సంస్థిత = తేరియందుంచిన సాధనాళిలో=ఆయుధముల గుంపులో, చేపడినట్టి=లభించిన=చేతికి దొరికిన.

తాత్పర్యము

వానిపై పడి గట్టిగ విల్లుపట్టుకొని యీడ్చి సంభ్రమముతో కేకలు వేయుచు దానినివిఱిచి వేయఁగా విల్లులేమిచే రాక్షసుఁడు తేరి యందున్న యాయుధములలో చేతికి దొరకిన రోఁకలిని దీసికొని భూమిమీఁదఁ జటాలున దుమికెను.

కం. రోఁకలి ద్రిప్పుచుఁ దన్నుం, దాఁకెడు రక్కసునిఁ గాంచి ♦ తడఁబడ కేమిన్
వీఁకను నీలుఁ డెదుర్కొని,యాఁకట్టెన్ బాహుబలర♦మాధికుఁ డగుచున్.

అర్థములు. తడఁబడక = చలింపక, ఆఁకట్టెన్ = అడ్డగించెను, బాహుబలరమాధికుఁడు = భుజబల సంపత్తిచే నధికుఁడై.

తాత్పర్యము

రోఁకలి ద్రిప్పుచు తనపైకి వచ్చుచున్న రాక్షసుని జూచి నీలుఁడు తత్తఱ నొందక బలశాలియై యెదుర్కొని భుజబలసంపత్తిచే నతని రోఁకలి ద్రిప్పకుండ నడ్డగించెను. చేతులు చేతులు గలసినపుడు రోఁకలి యేమి పని చేయఁగలదు ?

ఉ. ఇద్దఱు వాహినీపతులు ♦ నిద్దఱు జాతవిరోధు లిద్దఱున్
గద్దఱికాండ్రు రిద్దఱును ♦ గాఢజవాన్వితు లొం డొకండు పె

న్నుద్ధులు నోలమాసగొన • కోటమిచెందక యోహటింప కా
పద్దశ నొంద కేపఱక • పాయక లోఁగక ప్రసుక్కి కాత్మలన్. ౧౨౨౦

అర్థములు. వాహినీ పతులు=సేనానాయకులు, జాతవిరోధులు=విరోధ భావము గలవారు, గర్జితకాండ్రు=ధైర్యశాలులు, గాఢ జవాన్వితులు = మిక్కిలి వేగముతోఁ గూడినవారు, ఉద్దులు=సమానులు, ఓలమాసగొనక = మఱుఁగుపడు పోక, ఓటమిచెందక = ఓడిపోక, ఓహటింపక = వెనుదీయక, అపద్దశనొందక= కీడుచెందక, ఏపు+అఱక=పరాక్రమముతగ్గక, పాయక=తొలఁగిపోక, లోఁగక= లోపడక, ప్రసుక్కక = నొచ్చుకొనక.

తాత్పర్యము

ఇద్దఱు సేనానాయకులు, ఇద్దఱు విరోధభావము గలవారు, ఇద్దరు ధీరులు, ఇద్దరు వేగవంతులు, ఒకని, కొకఁడు మిక్కిలి సమానులు. వీరు మఱుఁగుపడు పోక యెదురు నిలచి యోడిపోక, వెనుదీయక, కీడుచెందక, పరాక్రమము తగ్గక, తొలఁగిపోక, లోపడక, మనస్సులందు నొప్పిచెందక.

సీ. మత్తకుంజరముల•మాడ్కిని బోరుచో, నెత్తుట మేనులు • జొత్తిలంగ
నసమును గోరుచుఁ • బసమెయిఁ గేరుచు, మసలక తారుచు • మండలగతిఁ
గోలలఁ గొలుకుచు • గోళ్ళను జెఱుకుచుఁ, గత్తుల పఱకుచు • గండుమీఱి
డాసినఁ గొట్టుచుఁ • బాసినఁ బట్టుచుఁ, దూసినఁ దిట్టుచు • దోరగిల్లి
ఆ. లేచి కవియు చిట్లు • లీలమై రాక్షస,ప్లవగసైన్యపతులు • బలము మెఱసి
వృత్రహరులరీతిఁ•బిఱు దివియక యాత్మ, రోస ముజ్జగింప•కేసరేఁగి. ౧౨౨౧

అర్థములు. కుంజరములమాడ్కి = ఏనుఁగులవలె, జొత్తిలంగన్ = ఎఱ్ఱ బాఱఁగా, అసము = కీర్తి, కేరుచున్=విజృంభించుచు, మసలక = ఆలస్యము లేక, తారుచున్=సమీపించుచు, మండలగతి=గుండ్రముగాఁ దిరుగుచు, దూసినన్ = వెనుకకుఁబోఁగా, తొరగిల్లి=వ్రాలి, ఉజ్జగింపక=వదలక, ఏసరేఁగి=విజృంభించి.

తాత్పర్యము

మదపు టేనుఁగులవలె పోరాడుచో నెత్తుట దేహము లెఱ్ఱఁబాఱగా, కీర్తిని గోరుచు సత్తువకొలఁది విజృంభించుచు ఆలస్యము లేక మండలాకారముగ సమీపించుచు కోలలఁ గొఱకుచు, గోళ్ళచేఁ జెఱుకుచుఁ, గత్తుల పఱకుచు, దగ్గఱకువచ్చినఁ గొట్టుచు, దూరముపోయినఁ బైపడి పట్టుచు, తొలఁగిపోయినఁ దిట్టుచు, వంగుచు లేచి, పైపడుచు నీప్రకారము రాక్షస వానర సేనానాయకులు బలము ప్రకాశింపఁ జేసి వృత్రుఁడు ఇంద్రుఁడు యుద్ధముచేసినట్లు వెనుకంజ పెట్టక మనస్సులో రోషము విడువక విజృంభించి.

సీ. కొమ్ముటేనుంగుల • కొమరుల ఢీకొని, హుమ్మని తాఁకుదు • రొక్కమాటు
తగరులవడువున • దవ్వు దవ్వుగ వీఁగి, యురువడిఁ దగులుదు • రొక్కమాటు

కోడిపుంజులరీతిఁ ♦ గూడి చుట్టుచు దాఁటు, లుగ్రత దాఁటుదు♦రొక్కమాటు
దందశూకము లనఁ♦గ్రిందు మీఁ దగుచును, నుర్విని బోరలుదు♦రొక్కమాటు
తే. ఆమటాఁబోతులట్లు సిం♦హములకరణి
వ్యాఘ్రములభంగిఁ బోరుచు ♦ నసమబలులు
నజితు లాహవవిక్రాంతి♦విజయు లుండ
దితిజపరివృఢుఁ డొక్కింత ♦ తెలఁపిఁ గాంచి. ౫౨

అర్థములు. తగరులు = పొట్టేళ్ళు, దందశూకములు=పాములు, ఆమటాఁబోతులు = మదము పట్టిన కోడెలు, అజితులు = జయింపఁబడని వారు, ఆహవవిక్రాంతివిజయులు=యుద్ధమునందలి పరాక్రమమందు గెలుపుకొన్న వారు, దితిజపరివృఢుఁడు=రాక్షస శ్రేష్ఠుఁడు, తెలఁపి=సందు.

తాత్పర్యము స్పష్టము.

కం. తటుకున ముసలంబును గొని, పటుజవగతిఁ గీశవీరు♦ఫాలము నడిచెన్
జొట జొట నెత్తురు గాఱఁగ, ద్రుటి నీలుఁడు విసరి చిమ్మెఁ♦దోరపుఁ జెట్టున్.

అర్థములు. పటుజవగతిన్=మిగుల వేగముతోడి గమనముతో, ఫాలము=నొసలు.

తాత్పర్యము

ప్రహస్తుఁడు తటాలున రోఁకలి తీసికొని నీలుని నొసటిపైఁ గొట్టఁగా నెత్తురు జొట జొట గాఱఁగా నిమిషమందే నీలుఁడు చెట్టువిసరి ప్రహస్తునిపైఁ గొట్టెను.

చ. మిసుగక దాని కేమి మిసి♦మింతుఁడు గాక ప్రహస్తుఁ డుగ్రుఁడై
ముసలము రెండు కేలఁ గొని ♦ మొగ్గలపుంబస మీఁది కెత్తి రా
గసిబిసిపాటు లేక ప్లవ♦గప్రవరేణ్యుఁడు దవ్వు దాఁటి పే
ర్వెస నొకగుండు జివ్వనను ♦ వీచి శిరంబున మొత్తె సూటిగన్. ౫౩-౫౪

అర్థములు. మిసుగక = కదలక, మిసిమింతుఁడు = శ్రమనొందినవాఁడు, మొగ్గలపుంబస = అధిక బలముతో, గసిబిసిపాటు=కలఁత, పేర్వెసన్ = మిగుల వేగముతో

తాత్పర్యము

ప్రహస్తుఁడు దానికేమి కదలక శ్రమపడక రెండుచేతుల రోఁకలి మీఁదికి యెత్తుకొని యధిక బలమున నీలుని తల పగుల కొట్టుటకై రాఁగా నీలుఁడు తటాలున దూరముగ దూఁకి మిగుల వేగముతో నొక గుండు తీసికొని జివ్వున వాని తల గుఱిచూచి కొట్టెను.

కం. ఆ రాతి తాఁకునను దే,వారాతిశిరంబు పగిలి ♦ యఱవఱలుగ నై
ధారిణిఁ బడె లగుడంబున ప్ర,హారంబునఁ బగులు కుంభ ♦ మన నిమిషమునన్.

అర్థములు. దేవారాతి = దేవతలకు విరోధి యొక్క, అఱవఱలు=తునకలు, లగుడంబు=దుడ్డుకఱ్ఱ యొక్క, ప్రహారంబునన్=దెబ్బచేత.

### తాత్పర్యము

ఆ రాతి దెబ్బచే ప్రహస్తుని తల దుడ్డుకఱ్ఱతోఁ గొట్టిన మట్టికుండవలెఁ దునకలై నిమిషములో నేలఁబడెను.

కం. మూలము నఱికినఁ గుజ మన, వ్రాలె నతఁడు నేలపై శిరంబున మేనన్
 జాలుగొనెన్ సెలయేఱుల, పోలిక నెత్తురులు భీమముగ నవ్వేళన్. ౧-౨-౨౬

అర్థములు. మూలము = వేరు, కుజము = చెట్టు, జాలుగొనెన్ = ప్రవహించెను, భీమముగన్=భయంకరముగ.

### తాత్పర్యము

వేరు నఱికిన చెట్టువలె నతఁడు నేలపైఁబడెను. తలనుండి దేహమునుండి నెత్తురు సెలయేఱువలెఁ బ్రవహించెను.

మ. తమసేనాపతి యిట్లు ద్రెళ్లఁగ నపేతప్రీతిచిత్తుల్ నిరు
 ద్యములున్ దీనులునై నిశాచరులు ప్రత్యయ్యం గట్ట నీరంబునా
 సమరక్షోణిని వీడి లంకకును త్రాసం బొత్తఁగాఁ బాఱి యా
 యమరద్వేషి నృపాలుశాలఁ జని మాటాడంగ లేకేమియున్. ౧-౨-౨౭

అర్థములు. అపేత ప్రీతి చిత్తుల్=సంతోషము పోయిన మనస్సులుగలవారు, నిరుద్యముల్=యుద్ధ ప్రయత్నము లేనివారు, దీనులు=దుఃఖముగలవారు, కట్ట త్రెయ్యన్ = కట్టతెగఁగా, త్రాసంబు = భయము, అమరద్వేషినృపాలుశాలన్ = రావణుఁడున్న సభకు.

### తాత్పర్యము

తమ సేనాపతి యిట్లు చావఁగా సంతోషము చెడినవారై యే యత్నము లేనివారై దుఃఖించుచు రాక్షసులు యుద్ధభూమి విడిచి కట్టతెగిన నీళ్ళుపోవునట్లు భయపాటుతోఁ బరువెత్తి రావణుఁడున్న సభకుఁబోయి యేమి చెప్పుటకు నోరురాక.

తే. ధ్యానమూకత్వమునఁ దెల్విఁ దప్పినట్లు, మహితశోకార్ణవంబున మున్ఁగినాదు
 వెఱ్ఱిచూపులు చూచుచు వెడలు బాష్పధార లొలుకఁగ నేమియు నేరరైరి.

అర్థములు. ధ్యానమూకత్వమునన్=ధ్యానముచే మాటలాడనేరక, మహితశోకార్ణవంబునన్=గొప్పశోకసముద్రమందు, మున్గినలు=మునిఁగినవారు.

### తాత్పర్యము స్పష్టము.

కం. అద్భుతగతి గపివంశ, ప్రోద్భవుఁ డిటు వైరిఁ జంపి భుజబలమున సం
 యద్భూమి వెలిఁగెఁ గీశులు, ముద్భావముతోడఁ బొగడ మొనసినరక్తిన్.

అర్థములు. కపివంశప్రోద్భవుఁడు = వానర వంశమునఁ బుట్టినవాఁడు నీలుఁడు, సంయత్ + భూమిన్=యుద్ధభూమియందు, ముద్భావముతోడ=సంతోషచిత్తములతోడ.

తాత్పర్యము

వానరశ్రేష్ఠుఁడగు నీలుఁడు ఆశ్చర్యకరమైన విధముగ భుజబలమున వైరిని జంపి యుద్ధభూమిని బ్రకాశించెను. వానరులు సంతోషముతో నతనిని బొగడిరి.

కం. రాముఁడు మెచ్చెను మే లని, సౌమిత్రియు మిగుల నతని ♦ శ్లాఘించెన్ శా
ఖామృగసేనానియు నమి, తామోదము జెందె దశరథాత్మజు కృపకున్.

అర్థములు. శాఖామృగ సేనాని = వానర సేనానాయకుఁడు, నీలుఁడు.

తాత్పర్యము

రామలక్ష్మణులు నీలుని మిగుల శ్లాఘించిరి. వారి దయకు నీలుఁడును మిగుల సంతోషించెను.

—♦ ౫౯-వ సర్గము. రావణుఁడు తొలిసారి యుద్ధమునకు వెడలుట ♦—

సీ. హతశేషసైన్యంబు♦లంతయు వినిపింప, విని రావణుఁడు క్రోధ♦వివశుఁ డగుచు
శోకార్దితుం డయి ♦ సురల సంబోధించు, వృద్ధశ్రవసురీతి ♦ నిట్టు లనియె
నాకపబలనాశు ♦ నా చమూపాలునిఁ, గపు లటే చంపిరి ♦ కదనసీమ
సానుయాత్రంబుగ ♦ సహాయుగజంబుగ, నింక నుపేక్షింప ♦ హితవు గాదు

ఆ. ఔర! యెంతవింత♦యుగ చరులా రాక్షసులను జంపువారు♦చూతుఁ గాక
నేన పోయి వారి ♦ నిర్మూలితులఁజేసి, జయముఁ గొందు స్థిరయ♦శంబుఁగందు.

• అర్థములు. హతశేషసైన్యంబులు = చంపఁబడఁగా మిగిలిన సేనలు, క్రోధవివశుఁడు = కోపముచే దేహము తెలియనివాఁడు; శోకార్దితుఁడు = శోకముచేఁ బీడింపఁబడినవాఁడు. వృద్ధశ్రవసురీతి=ఇంద్రునివలె, 'వృద్ధశ్రవాః సునాసీరః పురుహూతః పురందరః' అమరము. నాకపబలనాశున్=ఇంద్రుని బలమును నాశము చేసినవాని-నాచమూపాలుని=సేనానాయకుని "ధ్వజినీ వాహినీ సేనా పృతనానీకినీ చమూః వరూథినీ బలం సైన్యంచక్రం చానీక మస్త్రియాం" అమరము. ఇవి సేనకు సమష్టిపర్యాయపదములైనను పరస్పరభేదము కలదు.

"ఏకేభైకరథాత్ర్యశ్వా పత్తిః పంచపదాతికా" ఒక యేనుఁగు ఒక రథము మూఁడు గుఱ్ఱములు ఏవురు కాలిబంట్లు గలసేన పత్తి యనబడును. మూఁడు పత్తులు సేనాముఖము, మూఁడు సేనాముఖములు గుల్మము,మూఁడు గుల్మములు ఒక గణము, మూఁడు గణము లొక వాహిని, మూఁడు వాహిను లొక పృతన, మూఁడు పృతన లొకచమువు, మూఁడు చమువు లొక యనీకిని, పది యనీకినులు ఒక యక్షౌహిణి.

| | ఏనుఁగులు | రథములు | గుఱ్ఱములు | కాలిబంట్లు |
|---|---|---|---|---|
| సేనాముఖము | ౩ | ౩ | ౯ | ౧౫ |
| గుల్మము | ౯ | ౯ | ౨౭ | ౪౫ |
| గణము | ౨౭ | ౨౭ | ౮౧ | ౧౩౫ |

| | | | | |
|---|---|---|---|---|
| వాహిని | ౮౧ | ౮౧ | ౨౪౩ | ౪౦౫ |
| పృతన | ౨౪౩ | ౨౪౩ | ౭౨౯ | ౧౨౧౫ |
| చముపు | ౭౨౯ | ౭౨౯ | ౨౧౮౭ | ౩౬౪౫ |
| అనీకిని | ౨౧౮౭ | ౨౧౮౭౦ | ౬౫౬౧ | ౧౦౯౩౫ |
| అక్షౌహిణి | ౨౧౮౭౦ | ౨౧౮౭౦ | ౬౫౬౧౦ | ౧౦౯౩౫౦ |

గుఱ్ఱముల సంఖ్యయందుఁ దేరికిఁ గట్టిన గుఱ్ఱములు చేరవు. పదాతి సంఖ్యయందు ఏనుఁగులమీఁద గుఱ్ఱములమీఁదరథములమీఁదనుఁడు మనుష్యులు చేరరు.

కపులచే=కపులా? ఆశ్చర్యమును దెలుపును. దేవతలను జయించిన వానిని క్రోఁతులు చంపుట యాశ్చర్యకరము కదా, సానుయాత్రంబుగన్ = వెంటవచ్చిన కాలిబంట్లతోను, సహాయగజంబుగన్=గుఱ్ఱములతోను ఏనుఁగులతోను, నిర్మూలితులు=నిర్మూలము చేయఁబడినవారు, పేరు కూడ లేకుండఁ జేయుట నిర్మూలము చేయుట.

## తాత్పర్యము

ప్రహస్తుని వెంటఁబోయి చావఁగా మిగిలిన సేన జరిగిన వృత్తాంతమంతయుఁ దెలుపఁగా విని రావణుఁడు పరాభవము వలనఁ గలిగిన కోపముచే దేహము తెలియనివాఁడై జయించి వచ్చునని తాను నమ్మిన తనకు ముఖ్యుఁడు ఇష్టుఁడునై యున్నవాఁడు చచ్చె నను శోకముచేఁ బీడింపఁబడినవాఁడై దేవతల సంబోధించు నింద్రునివలె రాక్షసులతో నిట్లనియె, స్వర్గమునకు నధిపతియైన యింద్రుని బలము నాశనము చేసినవాని, నా సేనకు నాయకుఁడైన వానిని భటులతో, నేనుఁగులతో, గుఱ్ఱములతో యుద్ధమందు వానరులా చంపిరి!! ఔరా! యింక నూరకుండ రాదు. ఆహా యేమి వింత! క్రోఁతులా రాక్షసులను చంపుచున్నవి! అవి యెట్టి క్రోఁతులో !! చూచెదనుగాక. నేనేపోయి వారిపేరు లేకుండఁ జేసి జయము కీర్తి పొందుదునుగాక.

> 'అప్సు ప్లవంతే పాషాణాః మానుషా ఘ్నంతి రాక్షసాన్
> వానరాః కర్మ కుర్వంతి కాలస్య కుటిలాగతిః ॥'

నీళ్ళలో మునిఁగి పోవలసిన ఱాలు తేలుచున్నవి. రాక్షసుల కాహారమైన మనుష్యులు రాక్షసులను జంపుచున్నారు. క్రోఁతులు పనిచేయుచున్నవి! కాలగతి ఎంత వంకర యయ్యెను అని రావణుఁ డేడ్చెనని యొక చాటువు గలదు.

ఇంతవఱకుఁ బ్రభువగు తాను బ్రత్యక్షముగ యుద్ధమునకుఁ బోక పరులచే వానరుల జయింపఁజూచెను. ఎంతటి బలవంతులు పోయినను బోయిన వారదే పోక గాని మరల వచ్చినవారు లేరు. ఎవరిని బంపిన నిఁక నిదేగతి యని తెలఁచియుఁ దానింటఁ గదలక కూర్చుండి యితరులఁ జంపించుచున్నాఁడని నింద రాకుండుటకును రాక్షసుల కుత్సాహము కలిగించుటకును దానే బయలుదేఱఁ దలఁచెను.

ఉ. ఏఁడుర నన్నుఁ దాఁకి మని ♦ యేగెడివాఁ డికఁ జూతుఁడీ వనున్
మూఁడిచి వైచెదం గపిస♦మాజముఁ గానను గారుచిచ్చు నాఁ
జూఁడెద రామలక్ష్మణులఁ ♦ జొక్కపు ములుకులఁ, నింతచేసినన్
దూఁడరిపుర్వులన్ వరులఁ ♦ ద్రుంతును గాకిఁక నే సహింతునే ? ౧౨౩౨

అర్థములు. మని = బ్రదికి, కానను = అడవిని, చూఁడెదన్ = కాల్చెదను, తూఁడరి పుర్వులను = చెడుపురుగులను, తుంట+అరి = తుంటరి, ఇది తూఁటరియై రూపాంతరమున తూఁడరి యయ్యెను, వికృతి హ్రస్వంబులకు ననునాసికములు పరములగుచో రూపాంతరంబున హ్రస్వంబునకు దీర్ఘంబును ననునాసికస్థానంబున నర్ధబిందువు నగు. సు. వ్యా. సంజ్ఞ ౩౨. ఈ పద్యమునందలి, మూఁడు = మండు, చూఁడు=చుండు, ఈ సూత్రప్రకారమైన రూపంబులే.

తాత్పర్యము

ఎవ్వఁడురా నన్ను యుద్ధమందు నెదిరించి బ్రతికి పోపువాఁడు? ఇంతవరకు నీ యల్పకార్యమునకు మనము పోవలెనా యని యుపేక్షించి యుంటిని. ఇఁక నుపేక్షింప రాదు. ఇఁక నే నెట్టివాఁడనో చూడుఁడు. అడవినిగారుచిచ్చు గాల్చినట్లు కోతి గుంపును గాల్చివైచెదను. చక్కని బాణములచేత రామలక్ష్మణుల శుష్కింపఁ జేసెదను. దహించెదను. చెడపురుగులను ఇఁక నేను సహింతునా ?

చ. అని జ్వలనప్రకాశ మగు ♦ స్యందనమున్ హయరాజియుక్తమున్
ఘనమణిదీప్యమానమును ♦ గ్రద్దన నెక్కి మృదంగ భేరికా
నినదము శంఖరావమును ♦ నిస్తులరాక్షససింహనాదముల్
జనశుభ వాక్యము ల్వెలయ ♦ సంగరకుర్దనలిప్సుఁ డై చనెన్. ౧౨౩౩

అర్థములు. జ్వలనప్రకాశము = అగ్ని కాంతిగలది, స్యందనమున్ = తేరిని, హయరాజియుక్తమున్ = గుఱ్ఱపు సమూహములతో గూడినది, ఘనమణి దీప్యమానమును = గొప్ప రత్నములచే బ్రకాశించునది, మృదంగ భేరికానినదము = మద్దెలయు నగారాలయు ధ్వని, సంగర కుర్దన లిప్సుఁడై = యుద్ధక్రీడయం దాసక్తి గలవాఁడై పోయెను.

తాత్పర్యము

ఈ ప్రకారము పౌరుషములు పలికి యగ్నివలె వెలుఁగుచు పెక్కు గుఱ్ఱములు కట్టఁబడి గొప్ప రత్నములచేఁ బ్రకాశించు రథమును వేగముగ నెక్కి మద్దెలలయు నగారాలయు శంఖములయు ధ్వనులును రాక్షసుల సింహనాదములు ప్రజల యాశీర్వచన వాక్యములు విస్తరించుచుండ యుద్ధమను నాటయందుఁ గోరిక గలవాఁడై పోయెను.

తే. అద్రిజలదాభరూపమూం ♦ సాదనులును, నగ్నినంది ప్తలోచను ♦ లనుగమించి
రానిశాచరరాజేంద్రు♦నసురనాథు, రుద్రుభూతముల్ వెనుకొను♦మాద్రిఁదోఁచు.

అర్థములు. అద్రి జలదాభ = కఠినత్వమున కొండలతో, సంకోచ వికా సాదుల యనుకూలత మేఘములతో సమానమయిన-రూప = ఆకారముగల- మాంసాదనులును=మాంసభక్షకు లగు రాక్షసులును-అగ్ని సందీప్తలోచనులు = అగ్నివలె మండుచున్న కన్నులు గలవారును - అనుగమించిరి = వెంటఁబోయిరి. అసురనాథుఁడగు రుద్రున్-భూతిముల్ = పిశాచములు - రావణునకు రుద్రునకు రాక్షసులకు పిశాచములకు నుపమానములు - ఉభయత్ర అసురనాథత్వము - తమోగుణము భయంకరరూపము సమము. రుద్రుఁడు తమోగుణవంతుఁ డని శ్రుతిస్మృతి పురాణ ప్రసిద్ధి కావున నీ యుపమానము చెప్పఁబడెను. "యోహవా అస్యతామసోంశసోఽసౌరుద్రః" అని మైత్రాయణీయోపనిషత్తు నందుఁ గలదు. కావుననే భాగవతమందు ముముక్షువులు భయంకరరూపులగు భూతనాథుల వదలి సాత్త్వికుఁడగు విష్ణువును ధ్యానింతురని చెప్పఁబడెను.

తాత్పర్యము

కఠినత్వమునఁ గొండలతోను, అనుకూలత కొలఁది దేహమును పెంచుట తగ్గించుట కలవారగుటచే మేఘములను బోలియున్నవారును అగ్నివలె మండు చున్న కన్నులు గలవారును నగు రాక్షసులు అసురనాథుఁడైన రుద్రుని వెంటఁ బిశాచములు పోవునట్లు రావణు వెంటఁబోయిరి.

తే. రావణుండిట్లు వాహినీ•రాజి గొలువఁ, బురము వెలువడ చని కాంచె•భూజశైల
హస్త మర్ణవజలదర•వాన్వితంబు, దృష్టిభీకర మైన క•పీంద్రసేన. ౧.౨౯౫

అర్థములు. వాహినీరాజి=సేనా సమూహము, భూజశైల హస్తము=చెట్లు కొండలు చేతఁగలది. అర్ణవ జలద రవాన్వితము=సముద్రము యొక్క మేఘముల యొక్క ధ్వనివంటి ధ్వనితోఁ గూడినది. దృష్టి భీకరము = చూచుటకు భయంకర మైనది, కపీంద్రసేన=వానరశ్రేష్ఠుల సైన్యము.

తాత్పర్యము

సేనాసమూహము సేవింపఁగా నిట్లు రావణుఁడు పురము విడిచి బయలుదేఱి పోయి చెట్లు కొండలు చేతుల ధరించి సముద్రమేఘములవలె ధ్వనించుచుఁ జూడ భయంకరమైన వానరసేనను జూచెను.

ఉ. వ్యాలధవోపమానభుజుఁ • డద్రిచరేంద్ర సమన్వితుండు సు
శ్రీలలితుండు రాముఁడు వి•శృంఖలమై నమిత ప్రచండ మై
యాలముఁ గోరివచ్చు నసు•రాధిప సైన్యముఁ జూచి శస్త్ర వి
ద్యాలసితాగ్రగణ్యు సుగు•ణాఢ్యు విభీషణుఁ గాంచి యిట్లనన్. ౧.౨౯౬

అర్థములు. వ్యాలధవ = పాములకు రాజగు శేషునితో, ఉపమాన = సరిపోలు, భుజుఁడు=చేతులు గలవాఁడు, ఇట్లు చెప్పుటచే యుద్ధోత్సాహంబున బాహువులు పెరుఁగుచున్నవని భావము. 'మూఁపులు మూఁడగున్ రిపు సమూ

హాముఁ గన్నపుడే కిరీటికిన్' అని కలదుకదా, వీరలక్షణము. అద్రిచరేంద్ర సమన్వితుండు = సుగ్రీవునితోఁ గూడియుండువాఁడు, ఇట్లు చెప్పుటచే వచ్చుచున్న వాఁడు రావణుఁడని యెఱిఁగి రామలక్ష్మణ రక్షణార్థము రావణునితో యుద్ధము చేయఁగోరి సుగ్రీవుఁడు వానర ప్రముఖులతో వచ్చి రాముని జుట్టుకొని యున్నారని భావము. సుశ్రీలలితుండు=మన పరాక్రమము చూపదగిన కాలము వచ్చెఁగదా యను సంతోషముచేఁ గలిగిన ముఖశోభచే మనోహరుఁడు, రాముఁడు=ఇట్టి వీరరసముతోఁ గూడియున్నను మనోహరుఁడుగా గానవచ్చువాఁడు-విశ్శృంఖలమై = అడ్డములేనిదై; సమితిప్రచండమై= మిగులమిక్కిలి కోపముగలదై, ఆలమున్ = యుద్ధమును, శస్త్రవిద్యాలసితాగ్రగణ్యుల్ = శస్త్రవిద్యచేఁ బ్రకాశించువారిలో శ్రేష్ఠుని, ఇట్లనుటచే విభీషణుఁడును గద సారించి యుద్ధసన్నద్ధుఁడై యుండెనని సూచితము, సుగుణాఢ్యు=స్వామిసేవ చేయవలయునను మంచి గుణసంపత్తి గలవానిని.

తాత్పర్యము

ఆదిశేషునితో సమానమైన భుజములు గలవాఁడును, వానర నాయకునితోఁ గూడినవాఁడును, మంచి ముఖకాంతి గలవాఁడును, నగు రామచంద్రమూర్తి అడ్డములేక మిక్కిలి కోపముగలదై యుద్ధముగోరివచ్చు రావణు సైన్యముఁ జూచి శస్త్రవిద్యయందు మొదటివాఁడును సద్గుణములు గలవాఁడును నగు విభీషణునిఁ జూచి యిట్లనియె.

శా. నానాకేతుకదంబజుష్టమును నానాప్రాసశూలాది సం
  తానాభీలము దిగ్గజోపమమహాదంతావళాన్వీతమున్
  నానాయోధవితానభీమ మయి సైన్యం బొప్పె నక్షోభ్యమై;
 దానిన్ నా కెఱుఁగంగఁ జెప్పు మసురేంద్రా యద్ది యెవ్వారిదో. ౧౩౮

అర్థములు. నానాకేతు కదంబజుష్టము = అనేక ధ్వజ సమూహములతో గూడినది, నానాప్రాసశూలాది సంతానాభీలము = అనేకవిధములైన ప్రాసములు శూలములు వీని సమూహముచే భయంకరమైనది, దిగ్గజోపమ = దిక్కులయందుండు నేనుఁగులతో సమానములైన,మహాదంతావళాన్వీతమున్=పెద్ద యేనుఁగులతోఁగూడినది, నానాయోధవితానభీమము = అనేక యుద్ధభటుల సమూహముతో భయంకరమైనది, అక్షోభ్యము=కలతపెట్టరానిది, అసురేంద్రా యనుటచే వీరు నీ జాతివారే గనుక నీకుఁ దెలిసియుండునని భావము.

తాత్పర్యము

పెక్కువిధముల ధ్వజములతోఁ గూడినదియు పెక్కువిధము లయిన ప్రాసశూలాది సాధనములతోఁ గూడి భయంకరమైనదియు దిక్కులయందుండు నేనుఁగులతో సమానమైనదియు నగు నీ సేన కలఁచరానిదై యున్నది. ఇది యెవరి సేనయో నాకుఁ దెలియఁజెప్పుము.

## —♦ విభీషణుఁడు శ్రీరామునకు రాక్షసవీరుల నిరూపించి చెప్పుట ♦—

కం. అపుడు విభీషణుం డా, వనజాయతలోచనునకుఁ ♦ బంక్తిముఖుని వా
హిని నిట్లని విశదంబుగ, వినిచెం దత్సేనఁ గలుగు ♦ వీరులతోడన్. ౧౩౮

అర్థములు. వనజాయతలోచనునకున్ = తామరలవలె దీర్ఘములయిన కన్నులు గలవానికిని, ఔత్సుక్యముచేఁ జూచుటచే విచ్చిన కన్నులు పెద్దవయ్యె నని భావము, వాహిని=సేన, వినిచెన్=వినిపించెను.

తాత్పర్యము స్పష్టము.

మ. కరటిస్కంధగతుండు పూర్వగిరిశృం ♦ గభ్రాజమానాబ్జమి
త్రరుచిస్ఫీతముఖుండు శౌర్యఖని దో ♦ ర్దర్ప ప్రథాశాలి దు
ర్ధరతేజుండు స్వభారసంచలిత వే ♦ దండోత్తమాంగుండు భూ
వరచంద్రా! యతఁడే యకంపనుఁడు దే ♦ వద్వేషిరాట్పుత్రుఁడున్. ౧౩౯

అర్థములు. కరటిస్కంధ గతుండు=ఏనుఁగు మూఁపునందుఁ గూర్చున్న వాఁడు, పూర్వగిరి శృంగ=తూర్పుపర్వతము శిఖరముమీఁద, భ్రాజమాన=ప్రకాశించు, అబ్జమిత్ర = సూర్యునివంటి, రుచిస్ఫీతముఖుండు = కాంతిచే నతిశయించిన ముఖము గలవాఁడు, శౌర్యఖని=పరాక్రమమునకు గని - దోర్దర్ప ప్రథాశాలి = భుజబల గర్వంబునఁ గీర్తికన్నవాఁడు, దుర్ధరతేజుండు = సహింపరాని తేజస్సు గలవాఁడు—స్వభార=తన బరువుచే- సంచలిత = కదలుచున్న - వేదండోత్తమాంగుండు = ఏనుఁగు శిరస్సుగలవాఁడు — దేవద్వేషిరాట్ + పుత్రుఁడున్ = రావణాసురుని కొడుకు.

తాత్పర్యము

ఏనుఁగు మెడపైఁ గూర్చున్నవాఁడు తూర్పుకొండమీఁద సూర్యుని కాంతి వంటి కాంతిగల ముఖము గలవాఁడు—శౌర్యమునకు గని-భుజబలము గలవాఁడని కీర్తిచేఁ బ్రకాశించువాఁడు, శత్రువులకు సహింపరాని తేజస్సు గలవాఁడు- తన బరువును మోయలేక తల కదలించు నేనుఁగు గలవాఁడు. రామచంద్రా! వాఁడే రావణాసురుని కొడుకగు నకంపనుఁడు.

శా. జంభారాతిశరాసనద్యుతిలస ♦ చ్చాపంబుఁ దాఁ ద్రిప్పుచున్
గుంభిద్వేషిపతాకమా రథమునం ♦ గూర్చుండి ప్రాచీదిశా
కుంభింబోలి వివృత్తదంష్ట్రుఁ డయి ని ♦ క్కుల్ మీఱువాఁడే చుమీ
జంభారిస్మయహారి యింద్రజి వరా ♦ జయ్యుండు ధాత్రీశ్వరా! ౧౪౦

అర్థములు. జంభారాతి = ఇంద్రుని, శరాసన = వింటియొక్క, ద్యుతి= కాంతిచే, లసత్ =ప్రకాశించు, చాపంబున్ = వింటిని, కుంభిద్వేషిపతాకము = ఏనుఁగు విరోధియగు సింహధ్వజము, ఔ = కల, ప్రాచీదిశాకుంభిన్ = తూర్పు దిక్కునందలి ఐరావతమును, వివృత్తదంష్ట్రుఁడయి=గుండ్రని కోఱలు గలవాఁడై,

జంభారిస్మయహారి = ఇంద్రుని గర్వ మణచినవాఁడు, వరాజయ్యుండు=బ్రహ్మవరములచే జయింపరానివాఁడు, ఇంద్రజి=ఇంద్రజిత్తనువాఁడు.

తాత్పర్యము

ఇంద్రధనుస్సు కాంతిగల వింటిని ద్రిప్పుచు సింహధ్వజము గల రథమునం దున్నవాఁడై, యైరావతము దంతములవంటి గుండ్రని దంతములు గలవాఁడై యుండువాఁడే, బ్రహ్మవరముచే జయింపరానివాఁడై యింద్రుని గర్వ మణఁచిన యింద్రజిత్తనువాఁడు.

చ. అతిరథసింహుఁ డుత్తమశ•రాసనటంకరణోగ్రుఁ డస్త మన్
క్షితిధరమున్ మహేంద్రమును • నిస్తులవింధ్యముఁ బోలువాఁడు దా
నతిపరివృద్ధకాయుఁడు శ•తాంగగతుండు సమీకమం దనా
హతుఁ డతికాయనాముఁడు మ•హాద్భుతకర్ముఁడు మానవేశ్వరా. ౧౨౪౧

అర్థములు. అతిరథసింహుఁడు=అతిరథులందు శ్రేష్ఠుఁడు,(౨) అతిరథుఁడును సింహమునైన వాఁడతిరథసింహుఁడు. వేయి గుఱ్ఱములు కట్టిన గొప్ప రథము గలవాఁడు అతిరథుఁడు. అతివీరుఁడు = సింహుఁడు, ఇంద్రజిత్తు మాయాబలముచే వీరుఁడు. వీఁడు మాయ లేకయు వానికంటెను వీరుఁడు. ఉత్తమ శరాసన = శ్రేష్ఠమైన వింటియొక్క, టంకరణ=టంటమ్మని ప్రమోగించు, ఉగ్రుఁడు = భయంకరుఁడు, అస్తమన్ క్షితిధరము=సూర్యుడస్తమించుకొండ, మహేంద్రము= మహేంద్ర పర్వతము, నిస్తుల=అసమానమైన, వింధ్యమును=వింధ్యపర్వతమును పోలువాఁడు, అస్తపర్వత మనుటచే ఇతరుల తేజము నణఁచు శక్తియు, మహేంద్ర సామ్యముచేత నత్యున్నతత్వమును సూచితము. అతిపరివృద్ధకాయుఁడు = మిగుల వృద్ధిపొందిన దేహము గలవాఁడు, శతాంగగతుండు = రథమునం దున్నవాఁడు, సమీకమందు = యుద్ధమందు, అనాహతుఁడు = కొట్టఁబడనివాఁడు, అతికాయనాముఁడు = అతికాయుఁడను పేరుగలవాఁడు, మహాద్భుతకర్ముఁడు = యుద్ధమందాశ్చర్యకరములైన కార్యములు చేయువాఁడు, మానవేశ్వరా!=రాజా.

తాత్పర్యము

వేయిగుఱ్ఱములు గట్టిన తేరు గలవాఁడు, అతివీరుఁడు, శ్రేష్ఠమైన ధనుస్సు మీటుచుండువాఁడు, అస్త్రాది మహేంద్ర వింధ్యశైలములను బోలువాఁడు-మిగులఁ బెద్దదగు దేహముగలవాఁడు, రథముమీఁదనుండువాఁడు, యుద్ధమందు జయింపఁబడనివాఁడు, యుద్ధమందు మిగులనద్భుతమగు సాహస కార్యములు చేయువాఁడు, వీని పేరు అతికాయుఁడు.

శా. బాలార్క ప్రతిమానలోచనుఁడు ఖా • న్వర్ఘంటికానిస్వనా
ఖీలానేకపవాహనుండు నిజవి • ద్విడ్భీతిసంధాత వీ

రాళీ ప్రాగ్రసరుండు భూరిఖరనిర్హ్రాదుండు రామావనీ
పాలా! వాఁడు మహోదరుం డనెడు దేవద్వేషి వీక్షింపుమా. ౧౨౮౨

అర్థములు. బాలార్క ప్రతిమాన = లేత సూర్యునితో సమానమైన, లోచనుఁడు = కన్నులు గలవాఁడు, భాస్వత్ = ప్రకాశించు, ఘంటికా నిస్వన= ఘంటానాదముచే, అఖీల=భయంకరమైన, అనేకపవాహనుండు = ఏనుఁగు వాహనము గలవాఁడు, తొండముతో నోటితో రెంటను నీళ్ళు త్రాగును గనుక నేనుఁగునకు అనేకప మని ద్విపమనిపేరు నిజవిద్విట్ =తన శత్రువులకు, భీతి సంధాత = భయము గలిగించు వాఁడు, వీర + ఆళీ = వీరుల సమూహ మందు, ప్రాగ్రసరుండు = శ్రేష్ఠుఁడు, భూరి = గొప్పదగు ఖర = పరుషమగు, నిర్హ్రాదుండు = సింహనాదము గలవాఁడు, రామావనీపాలా=రామరాజా, దేవద్వేషి=రాక్షసుడు, దేవతలకు శత్రువు.

తాత్పర్యము

ఉదయించుచున్న సూర్యునివంటి కన్నులు గలవాఁడు, గంటలు మ్రోగుచున్న యేనుఁగు నెక్కినవాఁడు, తన శత్రువులకు భయము గలిగించువాఁడు, వీరులందు శ్రేష్ఠుఁడు, పెద్ద పరుషపుధ్వని కలవాఁడు వాఁడే రామచంద్రా! మహోదరుఁ డను పేరుగల రాక్షసుఁడు.

శా. సాయాహ్నాభ్రగిరిప్రకాశవిలసజ్జాంబూనదాలంక్రియా
స్ఫాయత్సైంధవయానుఁడై ధగధగజ్జ్వాలావళీసద్ధగాం
గేయావిష్కృతముష్టి కుంతవరముం గీలించి కేలన్ రణ
వ్యాయామాస్థను వచ్చు నాతఁడు పిశాచాఖ్యుండు సీతాధిపా! ౧౨౮౩

అర్థములు. సాయాహ్న = సాయంకాలమందలి, అభ్ర = మేఘముతో గూడిన, గిరి=కొండయొక్క, ప్రకాశ=కాంతితో, విలసత్ =ప్రకాశించు, జాంబూనద=బంగారుతో చేయబడిన, అలంక్రియా=ఆభరణములచే, స్ఫాయత్ =ప్రకాశించు, సైంధవయానుఁడై =గుఱ్ఱమును వాహనముగా గలవాఁడై, ధగధగజ్జ్వాలావళీ=ధగధగ మను కాంతి సమూహముచే-సద్ధ=కూడినదై, గాంగేయ = బంగారుచే-ఆవిష్కృత=వి స్తరింపఁబడిన = ముష్టి = పిడికిలిపట్టుగల - కుంతవరమున్= కుంతమను నుత్తమాయుధమును - రణవ్యాయామాస్థను=యుద్ధ పరిశ్రమ మందలి కోరికచే-పిశాచాఖ్యుండు = పిశాచుఁ డను పేరు గలవాఁడు - సీతాధిపా = ఇది సీతను స్మృతికిఁ దెచ్చుటచే రోషము కలిగించుటకై చెప్పిన మాట.

తాత్పర్యము

సాయంకాలమందలి మేఘమును దన మీఁదఁగల కొండ కాంతివంటి కాంతిచే బ్రకాశించు బంగారు సొమ్ములు గల గుఱ్ఱముపై నెక్కినవాఁడును, ధగధగ మను కాంతులు గల బంగారు సొమ్ములు విస్తారముగాఁగల పిడికిలిపట్టుగల కుంత మను

నాయుధము చేతఁ గలవాఁడును, రణపరిశ్రమమం దభిలాష గలవాఁడై వచ్చు వాఁడే సీతానాథా! పిశాచుఁ డనువాఁడు.

ఉ. కింకరవజ్రవేగ మని • కీర్తిత మైన వృషంబు నెక్కి ని
శ్శంకమతిన్ క్షణప్రభల • జాలము లీనెడి శాతశూలమున్
బింకము మీఱఁ బట్టి యతి• వేగమునం జనుదెంచువాఁడు పు
ణ్యాంక, రఘూత్తమా! త్రిశిరుఁ • డ న్బలియుండు జగత్ప్రసిద్ధుఁడున్.

అర్థములు. కింకర = సేవకునివలెఁ జేయఁబడిన; వజ్రవేగ = వజ్రము యొక్క వేగముగల, వజ్రవేగమునకంటె నతిశయించిన వేగము గలదని భావము. వృషంబు = ఎద్దు, క్షణప్రభల=మెఱుపుల, జాలము=సమూహము, శాత శూలమున్=వాడియగు శూలమును, పుణ్యాంక=పుణ్యమే భూషణముగా గలవాఁడా.

తాత్పర్యము

వజ్రవేగమునకంటె మిక్కిలి వేగముగల యెద్దునెక్కి నిర్భయమైన మనస్సుతో మెఱుపుల కాంతులు గలిగించు వాఁడి శూలమును జేతఁబట్టుకొని మిక్కిలి వేగముతో వచ్చుచున్నవాఁడు త్రిశిరుఁ డను బలశాలి, లోకములందుఁ బ్రసిద్ధుఁడు.

ఉ. కుండలిరాజకేతనుఁడు • కుంభుఁడు వ్యూఢసుజాతపీనవ
క్షుం డమృతాశనోత్కరని•షూదనదక్షుఁడు తాలతుల్యకో
దండవిధూననుండు భృశ•దారుణకార్ముకటంక్రియావిరా
వుండు ప్రచండవిక్రముఁడు • భూమిసుతారమణీమనోహరా! ౧౨౦౫

అర్థములు. కుండలి రాజకేతనుఁడు = సర్పరాజు గుర్తుగల ధ్వజము గలవాఁడు, వ్యూఢ=విశాలమును, సుజాత=అందమైనదియు, పీన=బలిసిన, వక్షుండు=ఱొమ్ముగలవాఁడు, అమృతాశన = అమృతము నాహారముగాఁగల దేవతల, ఉత్కర=సమూహమును, నిషూదన = చంపుటయందు, దక్షుఁడు = సమర్థుఁడు, తాలతుల్య=తాటిచెట్టుతో సమానమైన, కోదండ విధూననుండు=వింటిని త్రిప్పుచున్నవాఁడు, భృశదారుణ=మిక్కిలి భయంకరమైన కార్ముక టంక్రియా విరావుండు=వింటి టంకారధ్వని గలవాఁడు, ప్రచండ విక్రముఁడు=మిగుల తీక్ష్ణమైన పరాక్రమము గలవాఁడు, భూమి సుతా రమణీ మనోహరా=జానకీవల్లభా.

తాత్పర్యము

సర్పరాజు గుర్తుగల ధ్వజముగలవాఁడు, విశాలమై అందమై బలిసిన ఱొమ్ము గలవాఁడు, దేవతా సమూహములఁ జంపుటయందు సమర్థుఁడు, తాటిచెట్టు వంటి వింటిని త్రిప్పువాఁడు, మిగుల భయంకరమైన వింటి టంకారధ్వని గలవాఁడు, అతి తీవ్రమైన పరాక్రమము గలవాఁడు. వీఁడె కుంభుఁ డనెడివాఁడు.

ఉ. అతనిసోదరుం డతిభ•యంకరరూపుఁడు దైత్యవాహినీ
కేతనభూతుఁ డుగ్రరణ•కేళ్యవిచింతిత ఘోరకర్ముఁడున్

ఖ్యాతబలుండు రత్నమయ • హాటకజుష్టవిధూమదీప్తిమా
లాతతసంజ్వలత్పరిఘ • హస్తుఁడు రామ ! నికుంభుఁ డాఖ్యచేన్. ౧౨౮

అర్థములు. దైత్యవాహినీ = రాక్షససేనకు, కేతనభూతుఁడు = ధ్వజము వంటివాఁడు. ఉగ్రరణకేళీ=భయంకర యుద్ధక్రీడయందు, అవిచింతిత = చింతింప రాని, ఘోరకర్ముఁడున్=భయంకరకార్యము గలవాఁడు, ఖ్యాతబలుండు=ప్రసిద్ధి కెక్కిన బలము గలవాఁడు, రత్నమయ = రత్నములతో నిండిన, హాటక = బంగారుతో, జుష్ట=కూడినదియు, విధూమ=పొగలేని, దీప్తిమాలా=కాంతివరుసలు గల, ఆతత=విస్తారమైన, సంజ్వలత్=మండుచున్న. పరిఘహస్తుఁడు=ఇనుపకట్లగుదియ చేతియందుఁగలవాఁడు, ఆఖ్యచే=పేరుచే, నికుంభుఁడు.

తాత్పర్యము

ఆ కుంభుని తోడఁబుట్టినవాఁడు (వీ రిరువురు కుంభకర్ణుని కొడుకులు) మిగుల భయము గలిగించు రూపము గలవాఁడు, రాక్షససేనయందు శ్రేష్ఠుఁడు, భయంకర యుద్ధములందు సహింపరాని ఘోరకార్యములు చేయువాఁడు, బలవంతుఁడని ప్రసిద్ధి గన్నవాఁడు, మణులు చెక్కిన బంగారుతోఁ గూడి పొగలేని కాంతి జ్వాలలచేఁ బ్రకాశించు నినుపకట్ల గుదియ కలవాఁడు, వాఁడే నికుంభుఁ డను పేరుగలవాఁడు.

ఉ. చాపకృపాణ కాండముఖ • సాధనసంచయ భాసమాన మై
దీపితహవ్యవాహన స • దృక్షము వ్యోమచలత్పతాకమౌ
శ్రీ పరిణద్ధ ఘోటక వి • శిష్ట శతాంగముపై నుదగ్ర మౌ
రూపున నున్నవాఁడు నగ • రూఢసుయోధి నరాంతకుండగున్. ౧౨౯

అర్థములు. చాప=విల్లు, కృపాణ = కత్తి, కాండ = బాణము, ముఖ = మొదలైన, సాధన సంచయ = ఆయుధ సమూహముతో, భాసమానమై=ప్రకాశించునదియై, దీపిత = మండుచున్న హవ్యవాహ = అగ్నిహోత్రముతో, సదృక్షము = సమానమై, వ్యోమ = ఆకాశమందు, చలత్ = కదలుచున్న, పతాకము=ధ్వజముకలది, శ్రీపరిణద్ధ = కాంతిచేఁ గూడిన, ఘోటక విశిష్ట = గుఱ్ఱములతోఁ గూడిన, శతాంగముపై =తేరిమీఁద, నగరూఢ సుయోధి=పర్వతములతో ప్రసిద్ధముగా యుద్ధముచేయువాఁడు, తనతో యుద్ధము చేయఁగలవారు లేకుండుటచే తన బలము పర్వతములపై జూపువాఁడనుట.

తాత్పర్యము

విండ్లు కత్తులు బాణములు లోనగు సాధన సమూహములచేఁ బ్రకాశించునదియై మండుచున్న యగ్నితో సమానమై యాకాశము నెగురుచున్న ధ్వజము గలదై కాంతులతోఁ గూడిన గుఱ్ఱములు కట్టఁబడిన తేరిమీఁద భయంకరమైన రూపమున నుండువాఁడు పర్వతములతో యుద్ధము చేయువాఁడు నరాంతకుఁడను వాఁడు.

సీ. నానావిధాకార•నాగేంద్ర శార్దూల, పీతిమృగోష్ట్రాస్య•భూతచయము
బలసి రా రుద్రుని•భాతి వెలుంగుచు, సూక్ష్మశలాకంబు • సుందరంబు
సోమసంకాశంబు • శుభ్రాతపత్రంబు, రహిమీఱ మకుటంబు • రాణ దనరఁ
దళతళలాడంగఁ • జలకుండలంబులు, ప్రాలేయధరవింధ్య•పర్వతములఁ
ఆ. బోలు భీమతనుఁడు • పురుహూతసమవర్తి, దర్పహంత యపర•తపనమూర్తి
నాకలోకమంది•రార్తిఘటకకీర్తి, సదయ! యతఁడె యసుర•చక్రవర్తి. ౧౨౩౪

అర్థములు. నానావిధాకార = అనేక విధములైన రూపములు గల, నాగేంద్ర=ఏనుఁగులయు, శార్దూల =పులులయు, పీతి = గుఱ్ఱములయు, మృగ = జింకలయు, ఉష్ట్రి=ఒంటెలయు, ఆస్య=ముఖములు గల, భూతచయము=పిశాచ సమూహము, బలసి = చుట్టుకొని, రాన్ = రాఁగా, రుద్రుని భాతి = రుద్రుని వలె, సూక్ష్మశలాకంబు=సన్నని కమ్ములుగలది, సోమసంకాశంబు=చంద్రునితో సమానమైనది, శుభ్రాతపత్రము = తెల్లని గొడుగు, మకుటంబు = కిరీటము, చల కుండలంబులు = కదలుచున్న చెవిపోగులు, ప్రాలేయధర = మంచుగొండతోను, వింధ్యపర్వతములు=వింధ్యపర్వతములతోను,పోలు=సరియగుచున్న, భీమతనుఁడు= భయంకర దేహము గలవాఁడు, పురుహూత=ఇంద్రుని యొక్కయు, సమవర్తి= యముని యొక్కయు—దర్పహంత=గర్వమును అణఁచినవాఁడు-అపర తపనమూర్తి= రెండవ సూర్యుఁడు - నాగలోకమందిర = స్వర్గలోక మిల్లుగాఁ గల దేవతలకు - ఆర్తిఘటక=దుఃఖము గలిగించువాఁడను - కీర్తి = ప్రసిద్ధి గలవాఁడు - అసుర చక్రవర్తి = రాక్షస సార్వభౌముఁడు = రావణుఁడు.

తాత్పర్యము

౨౩౪ వ పద్యమునందుఁ జెప్పఁబడిన రుద్రోపమాన మిందు విస్తరింపఁ బడుచున్నది. నానావిధములైన యాకారములు ఏనుఁగు-పులి-గుఱ్ఱము-జింక - ఒంటె వీని ముఖములుగల పిశాచములు కొలిచి రాఁగా రుద్రునివలె వెలుంగుచు సన్నని కమ్ములు కలిగి యుండమై చంద్రునివంటిదైన తెల్లని గొడుగు ప్రకాశింపఁగా కిరీట మొప్పుచుండ చెవుల పోగులు తళతళమని మెఱయుచుండ హిమ వంతము వింధ్యముఁబోలు భయంకర దేహముగలవాఁడు, ఇంద్రియముల గర్వ మణఁచినవాఁడు. రెండవ సూర్యుని వంటివాఁడు, దేవతలను దుఃఖపెట్టినవాఁడు దయాశీల! వాఁడె రాక్షసరాజు రావణుఁడు.

—• శ్రీరాముఁడు రావణుఁ జూచి యాశ్చర్యపడుట. •—

కం. శ్రీరాముఁ డా నుడు ల్విని, యారా తేజంబు! పటుప•రాక్రమ మరరే!!
సూరుఁడు కరములచే వలె, నీ రావణుఁ డమరె దుర్ని•రీక్షుండగుచున్.

అర్థములు. సూరుఁడు=సూర్యుఁడు,కరములచే=కిరీటములచే,దుర్నిరీక్షుఁడు= చూడ సాధ్యముకానివాఁడు.

తాత్పర్యము స్పష్టము.

కం. దేవతలయందు నేనియు, దేవారులయందు నిట్టి ♦ తేజోయుతరూ
పే వేళ వినఁగఁబడెనే, యీ వీరునిదీప్తి కలుగ ♦ దిల నెవ్వరికిన్. ౧౨౫౦

అర్థములు. దేవారులయందు = దైత్యదానవులయందు నేని.

తాత్పర్యము స్పష్టము.

కం. అందఱును శైలతుల్యులు, నందఱు నగయోధు లంద ♦ ఱాయుధధరులున్
మందేతరతేజులు వీ,నిం దిరు లయి కొలిచి వచ్చు ♦ నిశిచరవీరుల్. ౧౨౫౧

అర్థములు. శైలతుల్యులు=పర్వతములతో సమానులు, నగయోధులు = పర్వతములవంటి శూరులు, మందేతరతేజులు=తీక్ష్ణమైన తేజస్సు గలవారు, తిరులయి=ధీరులయి, నిశిచరవీరుల్=రాక్షసవీరులు.

తాత్పర్యము స్పష్టము.

కం. భీమపరాక్రమముం దే,జోఽమితవిగ్రహము తీక్ష్ణ ♦ మగు బహుభూత
స్తోమము గొలువఁగ నీతం, డా మార్తండాత్మజాతు♦నట్లు వెలింగెన్.

అర్థములు. తేజోఽమితవిగ్రహము=అపరిమిత తేజస్సుగల యాకారము, ఆ మార్తండాత్మజాతునట్లు=ఆ సూర్యుని కొడుకగు యమునివలె.

తాత్పర్యము స్పష్టము.

కం. ఈపగిది దైవవశమున, నీపాపాత్ముఁడు నాదు ♦ దృష్టిపథంబున్
బ్రాపించె వీనిపై సీ,తాపహరణజనితరోష ♦ మంతయు విడుతున్. ౧౨౫౩

అర్థములు. దైవవశమునన్ = అదృష్టకారణమున, సీతాపహరణ జనిత రోషము=సీతను హరించుటవలనఁ గలిగిన కోపము.

తాత్పర్యము

ఈ విధముగ నదృష్టవశమున నీ పాపపు మనస్సు గలవాఁడు నాకుఁ గాన వచ్చెను. వీని మీఁద సీతాదేవిని వీఁడు హరించుటచేఁ గలిగిన కోపమంతయు విడుతును.

కం. అని రామచంద్రుఁ డంతట, ధనువుం గొని యెక్కు పెట్టి ♦ దారుణశరమున్
దొన నుండి దూసికైకొని, యనుజునితో నిలిచె సంగ♦రార్పితమతి యై.

అర్థములు. దొననుండి = అమ్ముల పొదినుండి, సంగరార్పిత మతియై = యుద్ధమునం దుంచఁబడిన మనస్సుగలవాఁడై.

తాత్పర్యము

అని చెప్పి రామచంద్రమూర్తి విల్లు తీసికొని యెక్కుపెట్టి తీక్ష్ణమైన బాణమును పొదినుండి దూసి తీసికొని యుద్ధమందు మనస్సునిలిపి తమ్మునితో నిలఁబడెను.

సీ. అసురాధినాయకుం ♦ డనుచరులను బల్కె, నరుగుఁడు మీ రెల్ల ♦ మరలి పురికి
ద్వారచర్యాగృహా♦వారగోపురముల, నిలువుఁడు మదిలోన ♦ నళుకు లేక

యెల్లరు నిటవచ్చు • టెఱిఁగినచో వన,చారులు తమ కిదే • సమయ మనుచు
శూన్యపట్టనమును•జొచ్చి ధ్వంసముఁ జేసి, పాడు చేయఁగఁ బూను•వారు నుండు
ఆ. పొం డటంచుఁ బంపి • దంభముగం దంత, నర్ణవంబుఁ జొచ్చు • నమితరూప
ఝషముపోలెఁ గీశ•సైన్యసాగరమును, బ్రచ్చి కొనుచుఁ జొచ్చెఁ•గచ్చుమెఱసి.

అర్థములు. ద్వారచర్యాగృహ వార గోపురములన్=ప్రాకారము వాకిటను పురమునందును గట్టఁబడిన యిండ్ల వాకిండ్లయందు. అభుకు = భయము, శూన్యపట్టనము = కాపాడఁదగిన వీరులు లేని పట్టనము, అర్ణవంబు = సముద్రము, ఝషము=చేఁప, బ్రచ్చికొనుచున్=చీల్చుచు, కచ్చు=గర్వము.

తాత్పర్యము

రావణుఁడు తనతోడ వచ్చిన వారి నందఱను జూచి యిట్లనియె. మీరందఱు మరలిపొండు. కోట గవనుల యొద్ద యిండ్ల యొద్ద గృహగోపురములందు కావలి యుండుఁడు. భయపడవలదు. అందఱు నిచ్చటికి వచ్చినారనిన వార్త వానరు లెఱిఁగిరా తమ కిదే సమయమని శూరులు లేని పట్టనమునఁ బ్రవేశించి యంతయు నాశముచేసి పాడుచేయ యత్నింతురు. కావునఁ బొండు అని చెప్పి యా గొప్ప శూరుఁడు సముద్రములోఁ బెద్దచేఁప బ్రవేశించినట్లు వానరసేనను రెండుగాఁ బగుల దీసికొనుచు గర్వముతోఁ బ్రవేశించెను.

—• రావణుఁడు సుగ్రీవాదులతోఁ బోరుట •—

శా. సాహంకారకఠోరనాదదళితా•శాకుడ్యభాగుండు నై
యాహోపూరుషికం బ్రదీప్తవిశిఖే•ష్వాసుండు నా రాక్షస
వ్యూహాధీశ్వరుఁ జూచి సూర్యసుతుఁడుం • బ్రోద్యన్మహారోషుఁ డై
బాహాటోపవిజృంభమాణుఁ డగుచుం • బైవైచె శైలాగ్రమున్. ౧౩౫౬

అర్థములు. సాహంకార = అహంకారముతోఁ గూడిన, కఠోర=పరుష మైన, నాద = ధ్వనిచే, దళిత = చీల్చఁబడిన, ఆశాకుడ్యభాగుండు = దిక్కుల గోడల యందలి భాగము గలవాఁడు, ఇది లోకాలోక పర్వతమో బ్రహ్మాండ కర్పరమో కావచ్చును. అతిశయోక్త్యలంకారము, ఆహోపూరుషికన్=అహో పురుషికయే, ఆహోపురుషిక, స్వార్థకప్రత్యయాంతము. 'అహోయం పురుష ఇతి బుద్ధి రాహో పూరుషిక' యని వ్యుత్పత్తి. తాను గొప్పవాఁడనను గర్వముచే నని యర్థము, ప్రదీప్త విశిఖేష్వాసుండు=మండుచున్న బాణములు గల విల్లుగల వాఁడు, రాక్షస వ్యూహాధీశ్వరున్=రాక్షస సమూహమునకు రాజు, ప్రోద్యన్మహా రోషుఁడై = విశేషముగఁ బట్టుచున్న గొప్ప కోపము గలవాఁడై, బాహాటోప విజృంభమాణుఁడు = భుజబల సంభ్రమము యొక్క యతిశయము గలవాఁడు, శైలాగ్రమున్ = కొండశిఖరమును.

తాత్పర్యము

అహంకారముతోఁ గూడిన నిష్ఠురమైన కంఠనాదముచే దిక్కులు పగులఁ జేయుచు నాకంటె గొప్పవాఁ డెవఁడను గర్వముతో మండుచున్న బాణములు విల్లు గలవాఁడైన రావణుని జూచి మిక్కిలి కోపించినవాఁడై సుగ్రీవుఁడు భుజబలము వేగము నతిశయింపఁ జేసినవాఁడై కొండశిఖర మెత్తి వానిపై వైచెను.

ఉ. వానరరాజముక్త కుజ • వారసమంచితసానుయుక్తని
స్స్వన భయంకరాద్రి తన•పై పరుదెంచుట గాంచి రుక్మపుం
ఖానుపమానవేగవిశి • ఖావళిఁ జాపకళాప్రవీణుఁ డా
దానవభర్త యేసె శత•ధా వికలంబయి నేల రాలఁగన్. ౧౨౫౭

అర్థములు. వానర రాజముక్త=సుగ్రీవునిచే వేయఁబడిన, కుజవార సమంచిత = చెట్లసమూహములతోఁ బ్రకాశించు, సానుయుక్త = చఱులతో గూడిన, నిస్స్వన = ధ్వనిచే, భయంకర = భయము గలిగించు, అద్రి = కొండ, రుక్మపుంఖ = బంగారు పింజలు గలిగి, అనుపమాన వేగ=అసమాన వేగముగల. విశిఖావళిన్=బాణసమూహమును, చాపకళాప్రవీణుఁడు = విల్లువిద్యయందు నేర్పరి, శతధావికలంబులు = నూఱు తునుకలై.

తాత్పర్యము

సుగ్రీవుఁడు వేసిన చెట్లతోఁగూడిన చఱులుగల కొండ తనమీఁదికి రాఁగాఁ జూచి విలువిద్యయందు నేర్పుగల రావణుఁడు బంగారు పింజలు మిక్కిలి వేగము గల బాణములచే దానిని నూఱు తునుకలుగాఁ నేలఁ బడఁగొట్టెను.

ఉ. ఏసియు వానరేంద్రు వధి•యింపఁగ గోరి సరోషచిత్తుఁడై
వాసవసాధనోపమ మ•వారితమారుతతుల్య వేగమున్
భాసురశాతమార్గణముఁ • బావకతేజము గాఢముష్టి నా
యాసురభర్త వైచె హృద•యాంతరదేశము నాట సూటిగన్. ౧౨౫౮

అర్థములు. వాసవసాధనోపమము = వజ్రముతో సమానమైనది, అవారిత = వారింపరానిది, మారుత తుల్యవేగము=వాయువేగముతో సమానమగు వేగముగలది, విశేషణోభయపదకర్మధారయసమాసము. భాసుర = కాంతిగల, శాతమార్గణము = వాఁడిగల బాణము, పావక తేజము = అగ్ని తేజస్సువంటి తేజస్సుగలది, గాఢముష్టి=దృఢమైన పిడికిట, హృదయాంతరదేశము = ఱొమ్ము లోపలి భాగము.

తాత్పర్యము

అట్లు వేసియు సుగ్రీవుని జంపఁదలఁచి రావణుఁడు కోపముతోఁగూడిన మనస్సు గలవాఁడై వజ్రాయుధముతో సమానమైనదియు వారింపరానిదియు వాయు వేగము

గలదియు నగు బాణమును దృఢముష్టిని లాగి రొమ్ములోపల నాటునట్లు గురి చూచి వైచెను.

తే. షణ్ముఖప్రేరితం బైన♦శక్తి క్రౌంచ, పర్వతము నుచ్చిపోయిన ♦ పగిది గాఁగ
దశముఖవిముక్త దారుణ♦విశిఖ మపుడు, వేఁడివెలుఁగులదొరపట్టిఁ♦గాఁడిపాఱె.

అర్థములు. షణ్ముఖ ప్రేరితము=కుమారస్వామిచేఁ బ్రయోగింపఁబడినది, శక్తి=శక్తి యను నాయుధము, ఉచ్చిపోయిన=తూటిపోయిన, దశముఖవిముక్త=రావణుచే విడువఁబడిన, దారుణవిశిఖము = తీక్ష్ణబాణము, వేఁడి వెలుఁగుల దొర పట్టి=సూర్యపుత్రుని, కాఁడి=నాటి, పాఱెన్=ఆవల వెడలిపోయెను.

తాత్పర్యము

ఆఱు తలలు కుమారస్వామి వేసిన శక్తి యను నాయుధము క్రౌంచ పర్వతమును భేదించి యీవలనుండి యావలకు వెడలి పోయినట్లు పదితలలవాఁడు వేసిన బాణము సుగ్రీవు రొమ్మున నీ ప్రక్క నాటి యా ప్రక్క వెడలి పోయెను.

రామచంద్రమూర్తి వాలి ధరించిన హారమునకు భయపడి చాటుగ నుండి కొట్టెనని కొందఱు చెప్పెడిమాట సరిగాదనియు నది దూరమందుండు వారి నేమియుఁ జేయఁజాలదనియు మందరము కిష్కింధాకాండయందు చెప్పబడెను. దాని కిదే ప్రమాణము. సుగ్రీవుఁ డిప్పు డా హారము ధరించియున్నాఁడు. అది యతనిని రక్షింపఁ జాలనిది కాదయ్యెను. రావణుని బాణమునందు సుగ్రీవుని జంపునంత శక్తి లేకుండెను. కాన సుగ్రీవుఁడు మూర్ఛపోయెను. రామబాణమందు వాలిని జంపు శక్తి యుండెను. కావున నీ హారమునకు వెఱచి రాముఁడు చాటుననుండి వాలిని గొట్టెననుట సరిగాదు.

కం. ఆ సాయక వేదనచే వానరపతిసుతుఁడు కూఁల ♦ వైచుచుఁ బడినన్
మానసర మగు సంతసమున, నాసురసైన్యంబు లట్ట ♦ హాసము సేసెన్.

అర్థములు. సాయక వేదనచే = బాణము వలనఁ గలిగిన బాధచే, మానసము=అధికము, అట్టహాసము=పెద్దనవ్వు.

తాత్పర్యము

ఆ బాణము వలని బాధచే సుగ్రీవుఁడు కూఁలవైచి నేలఁబడఁగా మిగుల సంతోషించి రాక్షస సైన్యము పెద్దగా నవ్వెను.

సీ. శాఖామృగేంద్రుని ♦ చందంబుఁ గనుగొని, తీవ్రవేగమున జో ♦ తిర్ముఖుండు
గవయగవాక్షులు ♦ ప్లవగర్షభుం డైన, ఋషభుఁడు నభుఁడు న ♦ హీధరాళిఁ
దాల్చి సుదంష్ట్రిం డు♦దముఁ డొడ్డ మేను, పెంచి రావణుమీఁద ♦ వినరివైన
వింశతి బాహుండు ♦ వివిధఖగంబుల, నేలఁ దూలఁగ సేసి ♦ నిశితబాణ

తే. జాలముల వారి తనువుల♦జల్లెడలను, బోలె నొనరింప వారలు♦భూమిఁ బడిరి
పంక్తివదనుండు నెదిరించు♦వారు లేక, మూఁకపైఁబడి నుఱుమాడె♦పీఁకవెఱసి.

తాత్పర్యము

వానరప్రభువిధము జూచి మిక్కిలి వేగముతో జ్యోతిర్ముఖుఁడు గవయ గవాక్షులు ఋషభుఁడు ననువారు సుషేణుఁడు తమకుఁ దోడు రాగా దేహములు పెంచి చెట్లను రావణుమీఁద విసరివైవఁగా రావణుఁడు నానాబాణముల వానిని నేలఁ బడఁగొట్టి పదునైన బాణముల వారి దేహములను జల్లెడలవలెఁ జిల్లులుపడఁ గొట్టగా వారు భూమిపై బడిరి. అప్పుడు తన్నెదిరించువారు లేక గుంపుమీఁద బడి వానరులను నాశముచేసెను.

చ. నగచరవీరవర్గము న॥నర్గళ మార్గణవృష్టిఁ జేతిబ
ల్బిగు వెనఁగంగ ముంప నతి॥భీతిని గోఁతులు జాతదుఃఖులై
నగ చెడి పాఱి దీనజన॥వత్సలు లోకశరణ్యు రామునిన్
మొగి శరణంబు వేఁడ నృప॥ముఖ్యుఁడు వారల భీతి మాన్పుచున్. ౧.౩౬.౨

అర్థములు. నగచరవర్గమున్ = వానరవీరుల సమూహమును. అనర్గళ = అడ్డములేని, మార్గణవృష్టిన్ = బాణవర్షముచే, నగచెడి = ఏమిచేయుటకుఁ దోఁపక, దీనజనవత్సలున్ = ఆర్తులగువారియందు దయ గలవానిని, లోకశరణ్యున్ = లోకముల కన్నిటికి రక్షకుఁడగువానిని.

తాత్పర్యము

వానరవీరులను నడ్డములేక బాణవర్షముచేఁ దనచేతి బలముకొలఁది ముంచగా వారు భయపడి దుఃఖితులై యేమిచేయుటకు నాలోచనపోక పరువెత్తి, బాధపడు వారియందు దయగలవాఁడును, సర్వలోకరక్షకుఁడగు రామచంద్రమూర్తిని రక్షింపు మని ప్రార్థింపఁగా నాయన వారికి భయపడవలదని చెప్పి.

—॥ లక్ష్మణుఁడు రావణుతోఁ బోర శ్రీరామాజ్ఞఁ గొనుట ॥—

కం. కరుణాపరుఁడు మహాత్ముఁడు, గురుతరచాపంబుఁ గేలఁ ॥ గొని రావణుపై
నరుగఁగ లక్ష్మణుఁ డిట్లనుఁ, బరమార్థంబైన సూక్తిఁ॥ బ్రాంజలి యగుచున్.

అర్థములు. కరుణాపరుఁడు = కరుణయే పరమగుణముగాఁ గలవాఁడు, రామచంద్రునియం దనేక కల్యాణగుణము లున్నను అన్నిటికంటె దయాగుణమును గొప్పగా ననుష్ఠించువాఁడు, (౨) కరుణా+అపరుఁడు = కరుణకు నన్యము గాని వాఁడు, అనఁగా ఆయనయే కరుణ, కరుణయే యాయన, అనఁగా మూర్తీభవించిన దయయగువాఁడు, ఇతరుల దుఃఖమును జూచి సహింపలేకుండుటయేకదా దయ, మహాత్ముఁడు = గొప్ప మనస్సు, గొప్ప స్వభావము గలవాఁడు. కావుననే వారు శరణనఁగానే విల్లందుకొనెను. కేలఁగొని = చేతఁ దానే తీసికొని, యుద్ధకార్యము లేనప్పుడు విల్లు లక్ష్మణునొద్ద నుండును. 'చాప మానయ సౌమిత్రే' లక్ష్మణా! విల్లు దెమ్మని యడుగుట ఆయన యిచ్చుట యింతలో కాలము వృథాహరణ మగునని తలంచి తానే వింటిని గ్రహించెనని భావము. ఇది శరణాగత రక్షణ మందలి

త్వరను సూచించుచున్నది. ప్రాంజలి=చేతులు జోడించి నమస్కరించిన వాఁడు, అట్లు రావణు మీఁదికిఁ బోవువాఁడు లక్ష్మణుఁడు దగ్గమువచ్చి చేతులు జోడింపఁ గానే నిలిచె నని భావము. రామచంద్రమూర్తి కింకరకైంకర్యమును గ్రహించును గాని నిరాకరింపఁడని భావము. ఇది కాయిక కైంకర్యముఁ దెలుపును. ఇఁక వాచా కైంకర్యమును దెలుపుచున్నాఁడు. పరమార్థంబైన సూక్తిన్ = పరమ ప్రయోజనము గల మంచిమాట, అనఁగా నుపచారార్థము చెప్పినమాటగాదు. పరమార్థమైనను వ్యర్థపుమాటగాదని భావము. ఎవరికిఁ బరమప్రయోజనము? ఇరువురకును, శరణాగతి ఫలించుట కింకరునకుఁ బ్రయోజనము. శరణాగతి ఫలింపఁ జేయుట శరణ్యునకు బ్రయోజనము. "Mercy blesses him that gives and him that takes" Shakespeare.

తాత్పర్యము

దయయే పరమగుణముగాఁ గలవాఁడును దానిని వినియోగించు గొప్ప మనస్సు గొప్పస్వభావము గలవాఁడు నగు రామచంద్రమూర్తి మిగుల గొప్ప దగు విల్లు చేతఁ దీసికొని రావణుని మీఁదికి బోవుచుండ, లక్ష్మణుఁ డడ్డమువచ్చి చేతులు మోడ్చి పరమ ప్రయోజన కరమైన మంచి మాట యిట్లు చెప్పెను.

కం. దేవరలే కృతముఖు లీ,రావణు దురితాత్ముఁ జంప • రణమున నైనన్
నే వధియించెద నీచుం, దేవా నా కానతిమ్ము • నెమ్మి నటన్నన్. ౧.౨౬౮

అర్థములు. దేవరలే = పూజ్యార్థమున బహువచనము, కృతముఖులు = మిక్కిలి సమర్థులు, దురితాత్మ=పరస్త్రీ హరణ మను మహాపాపము చేసినవానిని, నెమ్మిన్=సంతోషముతో, ఆనతిమ్ము=అనుజ్ఞనిమ్ము, నా యనుజ్ఞయేల? నీవే పోరాదా యందువేమో? నేను దాసుఁడను. నీ యాజ్ఞలేక యేదియుఁ జేయరాదు. అట్లు చేసితి నేని స్వతంత్రవృత్తి గలవాఁడ నగుదును. దానివలన నాకు స్వరూప హాని సంభవించును. కావున నీ యాజ్ఞ గోరెదను అని భావము.

తాత్పర్యము

దేవరవారే యీ మహాపాపిని రావణుని యుద్ధమునఁ జంప మిగుల సమర్థులు. అయినను నేను వీనిఁ జంపఁగోరెదను. సంతోషముతో దేవా! నాకనుజ్ఞ నిమ్ము.

ఉ. రాముఁడు సత్యనిస్తుల ప • రాక్రముఁ డిట్లనుఁ బొమ్ము లక్ష్మణా!
యేమఱుబోకుమీ కలన • నీ యసురేశ్వరుఁ డాహవైకవి
ద్యామహితాసమద్రవిణుఁ • డద్భుత వీర్యుఁడు మూఁడులోకముల్
హామిక నెత్తి క్రుద్ధుఁ డగు • నాతని గ్రేలిని వంపలే వనిన్. ౧౨౬౯

అర్థములు. సత్యనిస్తుల పరాక్రముఁడు = సత్యమే సమానములేని పరాక్రమముగఁ గలవాఁడు. (౨) సత్యము అసమానమునైన పరాక్రమము గలవాఁడు, కలనన్ = యుద్ధమందు, ఆహవైకవిద్యా = కేవల యుద్ధవిద్యయందు, మహిత =

గొప్పదై, అసమ=సమానములేనిదైన, ద్రవిణుఁడు = పరాక్రమము గలవాఁడు, ద్రవిణంగేహే-విత్తే-స్వర్ణే-పరాక్రమే - నానా. ర. అద్భుత వీర్యుఁడు = ఆశ్చర్యకరమైన బలము గలవాఁడు, హేమిక= గర్వముచే, ఎత్తి=దండెత్తి.

తాత్పర్యము

ఇట్లు లక్ష్మణుఁడు ప్రార్థింపఁగా సత్యమై యసమానమైన పరాక్రమము గల రామచంద్రమూర్తి యిట్లనియె. లక్ష్మణా! యుద్ధమునకుఁ బొమ్ము. యుద్ధమందు నాత్మరక్షణమం దేమఱకవుసుమా. ఏలన యీ రాక్షసరాజు యుద్ధమే ప్రధాన విద్యగా నుంచుకొనిన గొప్పదియు నసమానమగు పరాక్రమముగలవాఁడు. ఆశ్చర్యకరమైన బలము గలవాఁడు. అహంకారముచే మూఁడు లోకములవారు వీనిపై దండెత్తినను వీఁడు కోపించెనేని వీని ద్రేలిని వంపలేరు. ఇఁక నేమి జయింపఁ గలరు?

కం. కను మాతని ఛిద్రంబులు, కను నీ లోపములు వానిఁ • గనఁబడకుండ నిన్
ధనువునఁ గన్నుల హెచ్చరికను రక్ష యొనర్చికొనుచుఁ•గడఁగుము పోరన్.

అర్థములు. ఛిద్రంబులు=రంధ్రములు, లోపములు.

తాత్పర్యము

యుద్ధము సేయుటయందు వానియందుఁ గొన్ని లోపము లున్నవి. వానిని నీవు తెలిసికో- నీయందుఁ గలవి నీవు తెలిసికొనుము. కాని వానికిఁ గనఁబడనీయకుము. వింటిచేతఁ గంటిచేత రెంట నిన్ను నీవు కాపాడుకొనుచు యుద్ధము చేయ యత్నింపుము.

కం. నావుడు సౌమిత్రియు నీ, తావిభునిం గౌఁగిలించి • తత్పదముల స
ద్భావమున ద్రెుక్కి యుద్ధము,పై వేడుక నరిగెఁ గిన్నె•వరులు నుతింపన్.

తాత్పర్యము స్పష్టము.

మ. ధరణీశాత్మజుఁ డేగి కన్గొనియె ను•ద్యద్భీమకాండాసనున్
బరమాశీవిషతుల్య మార్గణ కదం•బచ్ఛాదితాత్మీయవా
నరసేనానివహున్ దశాస్యు శితకాం•డవ్రాతనిర్భిన్నగా
త్రరవాక్రాంతదిశాంతు రక్తనయనాం•తస్ఫీతవక్త్రాబ్జుఁడై. ౧౨౭౦

అర్థములు. ఉద్యత్ భీమకాండాసనున్ = ఎత్తఁబడిన భయంకరమైన విల్లు గలవానిని, పరమ=శ్రేష్ఠములైన, ఆశీవిష = పాములతో, తుల్య = సమానములైన, మార్గణ కదంబ=బాణసమూహముచే, ఛాదిత = కప్పఁబడిన, ఆత్మీయ = తన, వానరసేనా నివహున్=వానర సైన్య సమూహము గలవానిని, దశాస్యున్= రావణుని, శితకాండవ్రాత = వాఁడిములుకుల సమూహముచేత, నిర్భిన్న = భేదింపఁబడిన, గాత్ర=దేహములుగల వారియొక్క, రవ = ధ్వనిచే, ఆక్రాంత = ఆక్రమింపఁబడిన, దిశాంతున్ = దిక్కుల కొనలుగలవానిని, రక్తనయనాంత

స్ఫీత+వక్త్రాబ్జుఁడై=ఎఱ్ఱని కనుఁగొనలచేఁ బ్రకాశించు ముఖకమలము గలవాఁడై, కన్గొనియెను.

తాత్పర్యము

ఇట్లు లక్ష్మణుఁడు పోయి యెత్తఁబడిన భయంకరమైన విల్లు గలవాఁడును, గొప్ప సర్పములవంటి బాణములచేఁ గప్పఁబడిన తమ వానరసేన గలవాఁడును, వాఁడి బాణములచే భేదింపఁబడిన దేహములు గలవారి యేడ్పుధ్వనిచే నాక్రమింపఁబడిన దిక్కుల కొనలు గలవాఁడును నగు రావణుని ఎఱ్ఱనగు కన్నులు గల ముఖకమలము గలవాఁడై చూచెను.

## —• రావణ హనుమంతుల యుద్ధము •—

కం. కరికరబాహుఁడు లక్ష్మణుఁ, డరుదెంచుట గాంచి యడ్డ • మరిగి బలువిడిన్
మరుదాత్మభవుఁడు తోఁకం, బరుశరములఁ జెదర నడిచి • పటుకోపమునన్.

అర్థములు. కరికరబాహుఁడు = ఏనుఁగు తొండములవంటి చేతులు గలవాఁడు, బలువిడిన్=బలమైన పరాక్రమముతో, మరుత్+ఆత్మభవుఁడు = వాయుకుమారుఁడు,హనుమంతుఁడు, పరుశరములన్=శత్రువుని బాణములను,అడిచి=కొట్టి.

తాత్పర్యము

ఏనుఁగు తొండములవంటి చేతులు గల లక్ష్మణుఁడు యుద్ధమునకు వచ్చుట హనుమంతుఁడు చూచి దాసుఁడగు నే నుండఁగా స్వాములు ముందుగా రావచ్చునా యని రావణునకు లక్ష్మణునకు నడ్డముగ దూఁకి రావణుఁడు వేయు బాణములను తోఁకతోఁ దన్నుఁ దాఁకకుండఁ జెదరఁగొట్టుచు మిగుల కోపము గలవాఁడై.

ఉ. రావణు తేరిపై కుటికి • గ్రద్దన దక్షిణ బాహువెత్తి ర
క్షోవరుఁ డాత్మ జెగ్గిలఁగ • క్రూరపుఁ జూపులఁ జూచు చిట్లనున్
రావణ! నాగయక్ష సుర•రాక్షస దానవ పక్షిజాతిచేఁ
జావక యుందు గాక కపి•సంఘముచే మృతి నీకుఁ దప్పునే? ౧౨౦

అర్థములు. గ్రద్దన = వేగముగ, దక్షిణ బాహువు = కుడిచేయి, జెగ్గిలఁగన్ = భయపడునట్లు,

తాత్పర్యము

రావణు తేరిపైకి దుమికి వేగముగ కుడిచేయెత్తి రావణుఁడు బెదరునట్లు క్రూరపుఁ జూపుల నతనిని జూచుచు నిట్లనియె. రావణా! నీవు నాగులు యక్షులు దేవతలు రాక్షసులు దానవులు పక్షులు వీనిచేఁ జావక యుండినను దువుగాక, వానరులచే నీకుఁ జావుదప్పునా? వారివలనఁ జావులేకుండ నీకు బ్రహ్మవరము లేదుకదా.

మ. ఇదె నాదక్షిణబాహువుం గనుము రో•రీ! పంచశాఖాన్వితం
బిది నీ యిన్నిదినాలు కాచు నసు లీ•ప్డే దేహమందుండి వే
చెదరం గొట్టఁగ నెత్తితిం, దిరుఁడ వై•చేకొమ్మ్మి, నా రావణుం
డుదితక్రోధుఁడు రక్తనేత్రుఁ డయి వా•యుప్రోద్భవుం దీరతన్. ౧౨౧

అర్థములు. పంచశాఖాన్వితంబు=ఐదు వ్రేళ్ళతోఁ గూడినది, తిరుఁడవై= చలింపనివాఁడవై, ఉదితక్రోధుఁడు=పుట్టిన కోపము గలవాఁడు, వాయుప్రోద్భవున్=వాయుకుమారుని.

తాత్పర్యము

ఓరీ! ఇదిగో నా కుడిచేయి చూడుము. ఐదు వ్రేళ్ళతోఁ గూడినది. ఇన్ని దినాలుగా నీవు నీ దేహమందుఁ గాపాడుచుండిన ప్రాణమును నిప్పుడే చెదరఁగఁ గొట్ట నెత్తినాడను. ధీరుఁడవై చలింపక నిలిచి కైకొమ్ము. అని హనుమంతుఁ డనఁగా రావణుఁడు కోపించి యెఱ్ఱని కన్నులు గలవాఁడై యాంజనేయునితో ధైర్యముతో నిట్లనెను.

మ. అనియెం జూచెదఁ గాక నీ కడిమి కీ ♦ శా! కొట్టుమీ వేగన
న్ననుమానింపక పొందుమీ యశము నే ♦ నా వెన్క నీశౌర్యముం
గని నిన్నుం బరిమార్తు నన్న మును ♦ సంగ్రామంబునన్ మద్భుజన్
మనమం దక్షుని సంస్మరించుకొని య ♦ స్మచ్ఛౌర్య మూహింపుమీ. ౧౨౭

అర్థములు. నీ కడిమి=నీబలము, అస్మత్=నా, శౌర్యము=పరాక్రమము.

తాత్పర్యము

వానరా! నీ బల మే మాత్రమో చూచెదను. కొట్టుము. రావణు నంతటి వానిని హనుమంతుఁడు కొట్టె ననుకీర్తి సంపాదింపుము. నీవు కొట్టిన వెనుక నీ శౌర్య మేమాత్రమో చూచి నిన్నుఁ జంపెదను. అనిన నోరీ నా శౌర్య మెట్టిదో నా చేతఁ జచ్చిన నీ కొడుకును దలఁచుకొని యూహింపుము.

చ. అనవుడు శౌర్యదర్పమహి ♦ మాన్వితుఁడౌ నసురేంద్రుఁ డా మరు
త్తనయునురంబు గాఢతల ♦ తాడనపీడితమున్ ఘటింపఁగా
హనుమయుఁ దత్ప్రహారజని ♦ తాధిక బాధను నార నార కొ
య్యనఁ జలియించి యూఁగి నిమి♦షార్ధమునన్ మఱి స్థైర్య మూనుచున్.

అర్థములు. శౌర్యదర్ప మహిమాన్వితుఁడు = శౌర్యము వలనఁ గలిగిన గర్వముయొక్క గొప్ప తనముచేఁ గూడిన వాఁడు. గాఢతల = గట్టిదియగు నఱచేతి, తాడన = దెబ్బచేత, పీడితమున్ = బాధింపఁబడినది, తత్ =ఆ, ప్రహార = దెబ్బచేత, జనిత=పుట్టిన, అధిక బాధను = అతిశయమైన బాధచే, నారనారను = పలుమాఱు, మీఁదమీఁద, నిమిషార్ధమునన్ = అరనిమిషమున.

తాత్పర్యము

ఇట్లు చెప్పఁగా శౌర్యమువలనఁ గలిగిన విశేష గర్వముగల రావణుఁడు హనుమంతుని గట్టిగ నఱచేతఁగొట్టి బాధింపఁగా నా దెబ్బకు హనుమంతుఁడు మిగుల బాధ చెంది యరనిమిషము ముందు వెనుకకుఁ బలుమాఱూఁగి మరల తెప్పిఱిల్లుకొని.

కం. తీంౘ్రదం బగుకోపంబునఁ, జంౘ్రడల నిప్పుకలఁ బోలు ♦ చక్షుల నసురన్
గాంౘ్రడించుమోమునన్ వెస, గోంౘ్రడించుచుఁ బాణి నొక్క ♦ గ్రుద్దుం గ్రుద్దెన్.

అర్థములు. చంౘ్రడల = చంౘ్రడకట్టెల, నిప్పుకలు = నిప్పులు, చంౘ్రడ నిప్పుల వేఁడిమి యెక్కువ కణకణలాడుచు దీర్ఘకాలముండును. తీంౘ్రదము=ప్రచండము, గాంౘ్రడించు = ఉబ్బు, ఇక్కడ కోపముచే నుబ్బు, గోంౘ్రడించుచున్ = ధ్వనించుచు, పాణి = అఱచేత, వాఁడు చేతితోఁ గొట్టుటచేఁ దాను చేతితోఁ గొట్టెను.

తాత్పర్యము స్పష్టము.

కం. ఆ కపివర్యుని పోటున, నాకంపించెను సురారి ♦ యధికవ్యథచే
భూకంపంబున గిరి యనఁ, బ్రాకటగతి వచ్చెఁబోవు ♦ ప్రాణంబులతోన్.

అర్థములు. ఆకంపించెను=దేహమంతయు మిగుల వణఁకెను.

తాత్పర్యము స్పష్టము.

కం. హనుమత్కరతలతాడన,మున గాసింబడిన యసుర ♦ ముఖ్యునిఁ గని కా
ననచరఖచరమునీంౘ్రదులు, మనములు భృశహర్ష వార్ధి ♦ మగ్నంబులుగన్.

అర్థములు. హనుమత్ = హనుమంతుని యొక్క, కరతలతాడనమునన్ = చేతి దెబ్బచేత, కాననచర = వానరులు, ఖచర = దేవతలు, మనములు = మనస్సులు, భృశహర్ష=మిగుల సంతోషమనెడి, వార్ధిన్=సముద్రమందు, మగ్నంబులుగన్=మునిఁగి పోగా.

తాత్పర్యము

హనుమంతుని చేతిదెబ్బకు మిగుల బాధపడిన రావణుఁ జూచి వానరులు, దేవతలు, మునులు మిగుల సంతోషించిరి.

కం. కొండాడిరి రావణుఁడుం, గొండొకవడిఁ దెప్పిఱిల్లి ♦ కొని మేల్ మేల్ మా
ర్తుండవ యౌదువు మెచ్చితి, దండిమగఁడ వన్నఁ బవన ♦ తనయుఁడు పలికెన్.

అర్థములు. కొండాడిరి = స్తోత్రము చేసిరి, కొండొకవడిన్=కొంతసేపటికి, మార్తుఁడవు=శత్రుఁడవు, దండిమగఁడవు=మిగుల శూరుఁడవు.

తాత్పర్యము స్పష్టము

ఉ. ఏటికి నన్ను మెచ్చెద వి ♦ సీయది యేమిటిపోటు రావణా!
కాటికిఁ బోక తక్కితివి ♦ కాల్పను మద్భుజ శౌర్యసారముల్
పోటుల తారతమ్యమును ♦ బోల నెఱుంగని మూఢ! నన్ను నీ
మా ఱెది గ్రుద్దుమీ పిదప ♦ మద్దృఢముష్టిని నిన్నుఁ గూల్చెదన్. ౧౨౭

అర్థములు. ఇసీ = ఛీ, కాటికిఁబోక = చావక.

తాత్పర్యము

ఏల నన్ను మెచ్చెదవు? ఛీ రావణా! యిది యేమిపోటు? నీవు చావక బ్రదికి

యున్నావే ఏల నా భుజబలము కాల్పనా? ఓరి మూఢుఁడా! నీవు పోటుల యందుఁగల హెచ్చుతక్కువ లెఱుంగవు. ఏదీ నీ భుజబలముకొలఁది నీవు గ్రుద్దుము. ఆవల నా భుజబలముకొలఁది నేను గ్రుద్దెదను. అప్పుడు నా పోటుశక్తి చూడ గలవు. నీవు చావనే చచ్చెదవు.

ఉ. నావుడుఁ గ్రోధరక్తనయ♦నంబుల మండుచు శక్తి యంతయున్
వావిరిఁ బూని పెన్గడఁక ♦ వాయుతనూజునురంబు దక్షిణం
బౌ వరముష్టిఁ దాఁచినఁ ద♦దాహతి నాతఁడు దద్దరింపఁగా
రావణుఁ డింతలో నుఱికి ♦ క్రచ్చఱ నీలునిఁ దాఁకె యీసునన్. ౧౨౯

అర్థములు. క్రోధరక్తనయనంబులన్=కోపముచే నెఱ్ఱనైన కన్నుల, పెను కడఁక=దృఢప్రయత్నముతో, తదాహతిన్ = ఆ దెబ్బచే, దద్దరింపఁగా = తబ్బి బ్బులు పడఁగా, ఉఱికి=పరువెత్తి, ఈసునన్ = కోపముతో.

తాత్పర్యము

అని చెప్పఁగా రావణుఁడు కోపముచే గన్ను లెఱ్ఱచేసి మండిపడుచు తన శక్తి యంతయుఁ బూని హనుమంతుని ఱొమ్మును కుడిచేతి పిడికిటఁ గొట్టెను. ఆ దెబ్బచే హనుమంతుఁడు తబ్బిబ్బు లాడుచుండఁగా దెబ్బతిల్లినఁ జంపునని భయపడి వేగముగా నీలునిమీఁదికిఁ బోయెను.

## —♦ రావణుఁడు నీలునితో యుద్ధము చేయుట ♦—

శా. ఘోరాశీవిషతుల్యముల్ నిశితముల్ ♦ క్రూరంబులున్ మర్మసం
వారచ్ఛేదనదక్షముల్ భయదముల్ ♦ బాణంబు లత్యుద్ధతిన్
ధీరున్ నీలుని ముంప నాతఁడు మహా♦ధీరాగ్రముం గెల ర
క్షోరాజన్యునిమీఁద వైచెను; మరు♦త్సూనుండు నీలో స్మృతిన్. ౧౩౦

అర్థములు. ఘోరఆశీవిషతుల్యముల్ = భయంకరములైన సర్పములతో సమానములు, నిశితముల్ = పదునైనవి, క్రూరంబుల్ = కఠినములైనవి, మర్మ సంవార=ఆయువుపట్టులను, ఛేదనదక్షముల్ = ఛేదించు సామర్థ్యముగలవి, భయ దముల్ = భయంకరములైనవి, అత్యుద్ధతిన్ = మిగుల గర్వముతో, మహాధీరా గ్రమున్ = గొప్ప పర్వతశిఖరమును, రక్షోరాజన్యునిమీఁద = రాక్షస రాజు మీఁద, మరుత్+సూనుండు = హనుమంతుఁడు, స్మృతిన్ = తెలివిని.

తాత్పర్యము

భయంకరములైన పాములతో సమానములు, పదునైనవి, క్రూరములైనవి, ఊపిరిపట్టుల ఛేదింపగలవి, భయము కలిగించునవి యగు బాణములచే ధైర్యశాలి యగు నీలునిముంప నతఁడు పెద్ద పర్వతశిఖరమును రావణుమీఁద వైచెను. ఇంతలో హనుమంతుఁడు స్మృతిగలవాఁడై.

కం. కని నీలునితోఁ బెనఁగెడి దనుజేంద్రునిఁ జూచి యహహ ♦ తప్పెం దప్పెన్
జనరాదు గాక పగతుం, డనిసేయఁగ నన్యుతోడ♦నని చింతించెన్. ౧౨౮౧

అర్థములు. పగతుఁడు=విరోధి, అని=యుద్ధము.

తాత్పర్యము

నీలునితో యుద్ధముచేయు రావణునిఁజూచి యాహా సమయము తప్పెను గదా! పగవాఁడు మఱియొకనితో యుద్ధము సేయునపుడు నేను బోవుట మర్యాద గాదని తలఁచి యూరకుండెను.

ఉ. నీలవిముక్త శృంగమును ♦ నిష్ఠురమార్గణసప్తకంబునన్
నేలను దునకలై తొరఁగ ♦ నిర్జరవైరి ఘటింప నాతఁడున్
గాలకృశానుఁబోలి యధి♦కంబగు రోషముతోడ మండుచున్
సాలధవాశ్వకర్ణకర♦సాలతమాలజటిద్రుమాదులన్. ౧౨౮౨

అర్థములు. నీలవిముక్తశృంగమును =నీలునిచే విడువఁబడిన శిఖరమును, నిష్ఠురమార్గణ సప్తకంబునన్ = కఠినములైన యేడు బాణములచే, తొరఁగన్= పడఁగా, కాలకృశానుబోలి =ప్రలయాగ్నివలె, సాల = మద్ది, ధవ=చండ్ర, అశ్వకర్ణక = ఇనుమద్ది, రసాల = మామిడి, తమాల = చీఁకటిమ్రాను, జటి = మఱ్ఱి, ద్రుమాదులన్=చెట్లు మొదలైనవానిని.

తాత్పర్యము

నీలుఁడు వైచిన శిఖరమును రావణుఁ డేడు బాణంబులఁ దునకలై నేల, బడఁగొట్టఁగా నతఁడు ప్రలయకాలాగ్నివలెఁ గోపముచే మండిపడుచు మద్ది, చండ్ర లోనగు వృక్షంబులను.

ఉ. వారక పైపయిం గురియ ♦ వానిని జెక్కులు ముక్కలై పడన్
నారసముల్ గుముల్ రయము♦నం బరఁగించియు నంతఁబోక య
వ్వీరునిపైఁ గలంబచయ ♦ వృష్టి నిరంతరమై పడంగ లే
ఖారి నిగుడ్చ వానరుఁడు ♦ హ్రస్వముగా ఘటియించి రూపమున్. ౧౨౮౩

అర్థములు. వారక = నిలువక, నారసముల్=బాణములు, కలంబచయ వృష్టి = బాణసమూహవర్షము, నిరంతరమై=సందులేక, లేఖారి = దేవవిరోధి, రావణుఁడు,నిగుడ్చన్=ప్రయోగింపఁగా.హ్రస్వముగాన్=కుఱుచగా=చిన్నదిగా.

తాత్పర్యము

విడువక మీఁదమీఁద గురియఁగా వానిని తునకలు తునకలుగాఁ బడునట్లు బాణములు గుంపులు గుంపులుగాఁ ద్వరగా బ్రయోగించియు నంతతో వదలక వానిపై సందులేక బాణవర్షము గురియింపఁగా నీలుఁడు తనరూపమును చిన్నదిగాఁ జేసి.

చ. ఎగసి ధ్వజంబుపైఁ బడఁగ ♦ నెందుర పోయెద వంచు వానిపై
ఖగముల నైచు లోన హరి ♦ గర్జల నించుచు వింటికొప్పుపై
నొగపయిఁ గేతనంబుపయి ♦ నొవ్వడరంగఁ గిరీటసీమపై
వగచెడి సైంధవాళిపయి ♦ వానికరంబులపై శిరంబుపై. ౧౨౭౭

అర్థములు. ఖగములన్ = బాణములను, గర్జలన్ = సింహనాదముల, వింటి కొప్పుపై=వింటి కొనపై, నొవ్వడరంగన్=నొప్పికలుగునట్లు, వగచెడి = బలము చెడిన, సైంధవాళిపయి = గుఱ్ఱములపంక్తిమీఁద.

తాత్పర్యము

ఎగిరి ధ్వజంబు మీఁదఁ బడఁగా నతఁడు తప్పించుకొని పోవుచున్నాఁడని తలఁచి రావణుఁ డెందురా పోయెద వని బాణములు వేయులోపల నీలుఁడు సింహనాదములు చేయుచు వింటి కొనమీఁదను తేరి కాఁడిమీఁదను ధ్వజము మీఁదను వానికిఁ దలనొప్పి పుట్టునట్లు కిరీటము మీఁదను గుఱ్ఱముల మీఁదను రావణునిచేతుల మీఁదను తలమీఁదను.

కం. ఇక్కడ నక్కడ నక్కడ, నిక్కడనుకు లాఘవమున ♦ నెగురుచుఁ గపి పే
రక్కజపు స్లాఘవమున, నొక్కింతయు గుఱికి చిక్క♦కుద్ధతి మెఱసెన్.

అర్థములు. పేరక్కజపున్=మిగుల నాశ్చర్యకరమైన.

తాత్పర్యము స్పష్టము.

కం. ఆతని జవలాఘవముల, కాతతవిస్మయము నొంది♦రనిలాత్మజుఁడున్
సీతానాథుంను సుమి, త్రాతనయుఁడు సంప్రమోద♦తత్పరమతులై ౧౨౭౮

అర్థములు. జవలాఘవములకున్=వేగమునకు లాఘవమునకు, అనిలాత్మజుఁడు = హనుమంతుఁడుకూడ, ఇట్లనుటచే తాను వాయుపుత్రుఁడు, గావున వాయువువలె వేగము లాఘవము గలవాఁడనని హనుమంతుఁడు తలఁచి యుండెను. అట్టి వానికిఁ గూడ నీలుని జవలాఘవములు ఆశ్చర్యకరము లయినవి. సంప్రమోద తత్పరమతులై=మిక్కిలి సంతోషించిన మనస్సులు గలవారై.

తాత్పర్యము

ఆ నీలుని వేగమునకు లగువునకు మిగుల సంతోషించినవారై రామలక్ష్మణులును హనుమంతుఁడును మిగుల నాశ్చర్యపడిరి.

కం. వానరలాఘవ విస్మితుఁ, డా నరభోజనుఁడు పావ ♦ కాస్త్రము వింటన్
బూనికపినేయఁ గడఁగియు, వాని యునికిఁ దెలియ లేక♦ భ్రమ గొని యుండెన్.

అర్థములు. వానరలాఘవవిస్మితుఁడు = నీలుని లగువుచే నాశ్చర్యపడిన వాఁడు, నరభోజనుఁడు=మనుష్యులఁ దినువాఁడు, రావణుఁడు, పావకాస్త్రము = ఆగ్నేయాస్త్రము.

తాత్పర్యము స్పష్టము.

కం. వికలస్వాంతంబునఁ గడుఁ దికమిక గొను వసురనేత ♦ దృష్టించి కపుల్
ప్రకటార్భటుల న్నించిరి, మెక మెక పాటునను ముదము♦మిగులఁగ నంతన్.

అర్థములు. వికలస్వాంతంబునన్ = కలవరపాటు చెందిన మనస్సుతో, కడున్=మిక్కిలి, తికమిక గొను=కలఁత చెందు, మెక మెక పాటునను=విజృంభణముచే.

తాత్పర్యము స్పష్టము.

కం. నీలునిగంతులకుం గపి,జాలము రంతులకు వసుర♦నత్తమడెంతే
వ్యాలోలమనస్కుం డయి, తూలుచు నేమియును దిక్కు♦దోఁపక యుండెన్.

అర్థములు. రంతులకు = కేకలకు, వ్యాలోల = మిక్కిలి చలించిన, మనస్కుండై=మనస్సు గలవాఁడై, తూలుచున్=చలించుచు.

తాత్పర్యము స్పష్టము.

చ. కలవరపాటు దేఱి దశ♦కంఠుఁడు కేతనసంస్థు నీలునిన్
దెలిసి కపీ! లఘుత్వమునఁ ♦ దేఱినమేటివి, మాయ చేతఁ బె
క్కులు నిజరూపముల్ నెఱపఁ ♦ గూడితి నీ యనలాస్త్ర మేసెదన్
దెలియుము, నీకు శక్తి గల ♦ దేనియుఁ బ్రాణముఁ గాచుకొ మ్మికన్.

అర్థములు. కేతన సంస్థున్ = ధ్వజమునందున్న వానిని, మాయచేత = అత్యద్భుతమై ఆశ్చర్యకరమైన శక్తిచే, ఇట్టి శక్తికే మాయ యని పేరు. ఇచ్చట నీలుఁడు ఇంద్రజాల మహేంద్రజాల విద్య లేమియుఁ గనఁబఱుపలేదు. స్వశక్తి చేతనే యిట్లు గంతులు పెట్టెను.

తాత్పర్యము

కలఁత దేఱి రావణుఁడు స్వస్థచిత్తుఁడై ధ్వజమందున్న నీలునిఁజూచి వానరుఁడా లఘువునందు బాగుగ నాఱితేఱినాఁడవు. నీ యద్భుతశక్తిచే పెక్కురూపములు గనఁబఱచితివి. ఇదిగో నీ యాగ్నేయాస్త్రము వేసెదను. నీకు శక్తి యుండెనా ప్రాణము కాచుకొనుము.

కం. నీ వెంత యెగురు లాడిన, జీవముతో విడువ నిన్ను ♦ సిద్ధం బని యా
పావకబాణము వైచెను, బావకసుతుమీఁదఁ బంక్తి♦వదనుం డలుకన్.

తాత్పర్యము స్పష్టము.

చ. తతభయదానలాస్త్రమునఁ ♦ దాడితుఁడై పరిదహ్యమానుఁడై
స్మృతిరహితుండు నై యొఱిగ ♦ మేదిని నీలుఁడు జాను లూఁతగాఁ
బితృసుమహానుభావమున ♦ స్వీయబలంబునఁ దేఱిచే నసు
చ్యుతిఁ గనఁ డయ్యె నంత బల♦సూదనగర్వహరుం డహంకృతిన్. ౧౨౯-౨

అర్థములు. తతభయద=మిగుల భయముకలిగించు, అనలాస్త్రమునన్ = ఆగ్నేయాస్త్రమున, తాడితుఁడై = కొట్టఁబడినవాఁడై, పరిదహ్యమానుఁడై =

మిగుల కాల్పఁబడువాఁడై, స్మృతిరహితుండునై=తెలివితప్పినవాఁడై,జానులు=మోఁకాళ్ళు, పితృసుమహానుభావమున = అతని తండ్రియైన యగ్నిహోత్రుని మహిమచేత, తన కొడుకుకావున నగ్ని విశేషముగ బాధింపలేదు. స్వీయబలంబున=స్వశక్తిచేత, తేజుచే=తేజస్సుచే, అసుచ్యుతి=ప్రాణముపోవుట, బలసూదన=ఇంద్రునియొక్క, గర్వహరుండు=పోగరణఁచినవాఁడు, రావణుఁడు.

### తాత్పర్యము

మిగుల భయంకరమైన యాగ్నేయాస్త్రముచే గొట్టఁబడి కాల్పఁబడిన వాఁడై తెలివితప్పినవాఁడై మోఁకాళ్ళు నేలయూని నీలుఁడు పడెను గాని తండ్రి మహిమచేతను తన బలము తేజస్సుచేతను జచ్చినవాఁడుకాఁడు. అంతట రావణుఁడహంకారముతో

### —• రావణ లక్ష్మణ సంవాదము •—

చ. ముదిరము మ్రోయునట్లు రథ•ముం బఱపించుచుఁ గేరి లక్ష్మణుం
గదిసి గుణధ్వనుల్ చెలఁగ,• గ్రచ్చఱ నడ్డము వచ్చువారలన్
గుదియఁగఁ జేయుచుండఁ గని•కూళ నిశాచర! బక్క క్రోఁతులన్
మదమునఁ జంపు టంత విస•మానవు గర్మమె శూరధర్మమే. ౧౭౯౩

అర్థములు. ముదిరము=మేఘము, 'ఘనజీమూత ముదిరం జలము' క్కని యమరము, కేరి=విజృంభించి, కుదియఁగన్=అణఁగునట్లు, విసుమానపుఁగర్మమే=ఆశ్చర్యకరమైన కార్యమా? శూరధర్మమే=శూరులకు న్యాయ్యమా?

### తాత్పర్యము

మేఘము మ్రోఁగునట్లు రథధ్వని కలుగఁగాఁ దోలించుచు విజృంభించి లక్ష్మణుఁజేరి వింటి యల్లెత్రాటిధ్వనులు విస్తరింపఁగా నాయన కడ్డమువచ్చు వానరులణఁగునట్లు చేయుచుండఁజూచి యోరి క్రూరరాక్షసుఁడా! బలవంతుఁడనని గర్వముచే బక్క క్రోఁతులను జంపుట యాశ్చర్యకరకార్యమా? శూరులకు ధర్మమా ?

కం. ముదముద లేక కీశుల, నదవదపడఁ జేసి యడరి•నంతనె చనెనా
గొదగొద రా రమ్మిఁక నే, నదమద మొనరింతు నీదు•స్మయ మసురేంద్రా!

అర్థములు. ముదముద = జంకు, అదవదపడన్ = కలఁత చెందునట్లు, గొదగొద=పగ, నదమద మొనరింతు=నాశము చేయుదును, స్మయము=గర్వము.

### తాత్పర్యము

క్రోఁతుల నెట్లు చంపుదునా యను జంకులేక యీ వానరులను కలఁతపడఁ జేసినంతనే నీకు మాకుఁగల విరోధము పోవునా? ఇటురమ్ము. నీ గర్వము నాశము చేసెదను.

కం. అనవుడు నాతని వాక్యం,బును నుగ్రము పూర్ణఘో•షమును నగు మౌర్వీ
నినదంబును విని కినుకన్,దనుజాగ్రణియను సుమిత్ర•తనయునితోడన్. ౧౭౯౫

అర్థములు. ఉగ్రము=తీవ్రమైనది, పూర్ణఘోషము = నిండుధ్వని గలది, మార్గణనివహంబును=అస్త్రశ్రేణి ప్రయోగమును, కినుకన్=కోపముచే.

తా త్ప ర్య ము స్పష్టము.

ఉ. ఎంతటిభాగ్య మార వసు♦శేంద్రసుతా! విపరీతబుద్ధి వై
యంతకు నంతికంబుఁ జన ♦ నాత్మఁ దలంచియె వచ్చినాఁడ, వా
కింత మదీయదృష్టిపథ ♦ మిఱ్ఱ్యెడఁ బాయకు, నాదుబాణముల్
సుంతయు జాగు లేక యమ♦లోకముఁ జేరఁగఁ బుచ్చు నిన్ననన్. ౧౩౯౬

అర్థములు. అంతకు = యమునియొక్క, అంతికంబు=సమీపము, దృష్టిపథము=చూపుమార్గము, సుంతయున్=కొంచెమైనను, జాగు=ఆలస్యము.

తా త్ప ర్య ము

రాజకుమారా! ఏమి నా యదృష్టము. యముని సమీపమునకుఁ బోవఁ దలంచి కాఁబోలు విపరీతబుద్ధివై వచ్చితివి. కొంచెమునేపు నాకుఁ గానరాక తొలఁగి పోకుము. నా బాణములు కొంచెమైన యాలస్యములేక నీ కోరిక ప్రకారము యమలోకమునకుఁ బంపును అనఁగా.

ఉ. వేపున బొబ్బరిల్లు వసు♦శేంద్రుని వృత్తసితాగ్రదంష్ట్రినిన్
భూపతివర్యపుత్త్రుఁ డొక♦పోకకుఁ గైకొన కిట్లు పల్కెనో
పాపజనాగ్రగణ్య! యిటు♦వగ్గలు గొట్టెద వేల నీకు నీ
వే? పరమప్రభావు లిటు♦ప్రేలరు కాఱులు మున్ను మున్నుగన్. ౧౩౯౭

అర్థములు. వేపునన్ = బలముచే, బొబ్బరిల్లు=బొబ్బలుపెట్టు, గట్టిగా నఱచు, వృత్త=గుండ్రములై, సితాగ్ర = తెల్లనగు కొనలు గల, దంష్ట్రినిన్= కోఱలుగలవానిని, పాపజనాగ్రగణ్య = పాపాత్ములలో మొదటివాఁడా! వగ్గలు కొట్టెదు=పౌరుషములు పలికెదు, ప్రజ్ఞాశబ్దభవము వగ్గ, కాఱులు=వ్యర్థపుమాటలు.

తా త్ప ర్య ము

బలముకొలఁది గట్టిగా నఱచుచున్న వానిని గుండ్రని తెల్లని కొనలుగల కోఱలు గలవానిని లక్ష్మణుఁడు పోకమాత్రమైన లక్ష్యము చేయక యిట్లనియె. పాపాత్ములలో మొదటివాఁడా! ఏల నీకు నీవే యూరక పౌరుషములు పలికెదవు? గొప్ప మహిమగలవారు వ్యర్థపుమాటలు కార్యముచేయుటకు ముందుగా వదరరు.

చ. ఎఱుఁగనివాఁడఁ గాను వసు♦శేంద్ర! భవద్బలముం బ్రతాపమున్
గొఱలు పరాక్రమం బెఱిఁగి ♦ కోరి రణం బరుదెంచినాఁడఁ గ్ర
చ్చఱ శరచాపపాణి నయి ♦ సాధనముల్ కయి నుండ నిట్టి వ
ల్లఅవుల నేమికార్య మగు ♦ నాలము సేయఁగ రమ్ము నాపుడున్. ౧౩౯౮

అర్థములు. కొఱలు = ప్రకాశించు, క్రచ్చఱన్ = శీఘ్రముగ, వల్లఅవులు = వ్యర్థభాషణములు, ఆలము = యుద్ధము.

తాత్పర్యము

రాక్షసరాజా! యేనాఁడు దండకారణ్యములో సీతాదేవి యొంటరిగా నుండఁగా నీవు దొంగసన్న్యాసివై వచ్చి దొంగిలించి తెచ్చితివో యానాఁడే నీ బలము, ప్రతాపము, శౌర్యము అన్ని తెలిసికొంటిని. ఇప్పుడు నీవు చెప్పఁ బనిలేదు. తెలిసియే యిటువంటి శూరుఁడవు గనుక నీతో యుద్ధముచేయ చేతు లందు విల్లు బాణములు ధరించి వచ్చితిని. ఆయుధములు చేతనుండ నేల యూరక వదరెదవు? రమ్ము. యుద్ధము సేయుము అనఁగా.

—♦ రావణ లక్ష్మణుల యుద్ధము ♦—

ఉ. క్రోధపరీత చిత్తుఁ డయి ♦ క్రూరసుపుంఖకలంబసప్తకం
బేధిత వేగముం బఱప ♦ నింతలు నింతలు చేసె వాని దు
స్సాధపరాక్రముండు నర ♦ సత్తముఁ డుజ్జ్వలరుక్మపుంఖ ము
త్సేధము శాతధార మగు ♦ తీవ్రపృషత్కసముత్కరంబునన్. ౧౦౯౯

అర్థములు. క్రోధపరీతచిత్తుఁడు = కోపముచే చుట్టుకొనిన మనస్సుగల వాఁడు, క్రూర - సుపుంఖ - కలంబ - సప్తకంబును = మంచి పింజలుగలిగిన యేడు బాణములను, ఏధిత వేగమున్ = వృద్ధిచెందు వేగముగలవి, దుస్సాధపరాక్రముండు = సాధింపరాని పరాక్రమము గలవాఁడు, ఉజ్జ్వల = ప్రకాశించు, రుక్మపుంఖ = బంగారు పింజగలది, ఉత్సేధము = పొడవైనవి, శాతధారము = పదునైన యంచు గలది, తీవ్ర = వేగముగల, పృషత్క = బాణముల, సముత్కరంబునన్ = సమూహముచే.

తాత్పర్యము

క్రోధముచేఁ జుట్టుకొనఁబడిన మనస్సుగలవాఁడై రావణుఁడు మంచి పింజలు గల యేడు బాణములను మిగుల వేగముగ వేయఁగా నసాధ్య పరాక్రముఁ డగు లక్ష్మణుఁడు వానిని బంగారు పింజ గలిగి పొడవై పదునైన బాణసమూహములచే తునుకలు తునుకలుగా పడఁగొట్టెను.

సీ. సౌమిత్రి నిర్ముక్త ♦ శాతాశుగంబుల,చే దశబాణముల్ ♦ ఛిద్రుప లగుచు
నిర్ముక్తఫణులట్లు♦నేలఁ దొరంగినఁ, దామ్రలోచనుఁ డయి♦దశముఖుండు
వెండియుఁ గురియించెఁ♦గాండప్రకాండ ప్ర,కాండంబులను మెండు♦దండిగాఁగఁ
దద్బాణవర్షంబు♦దశరథసుతుఁడును, గర్ణిభల్లక్షుర ♦ కాండములను

తే. నర్ధచంద్రశరంబుల♦నన్ని యంద, యంద తునుమాడి కలఁగక ♦ యంద నిలిచె
నన్నిశరములఁ దానేయ♦నన్ని వితథ,ములుగనొనరించులక్ష్మణు♦బలముఁ జూచి.

అర్థములు. నిర్ముక్త = విడువఁబడిన, శాత = పదునైన, అశుగములచేన్ = బాణములచే, ఛిద్రుపలు = తునుకలు, ఇందు 'ఛి' లఘువేకాని గురువుకాదు. నిర్ముక్త = కుబుసము విడిచిన, ఫణులట్లు = పాములవలె, తొరంగినన్ = పడఁగా, కాండ ప్రకాండ ప్రకాండములను = శ్రేష్ఠములైన బాణముల సమూహములను

కర్ణి = బాణవిశేషము, భల్ల = బల్లెములవంటి, క్షుర = మంగలికత్తులవంటి, కాండంబులను = బాణములను, వితథములు = వ్యర్థములు.

'నకూటై రాయుధైర్హన్యాత్ యుద్ధ్యమానో రణే రిపూన్
నకర్ణిభి ర్నాపి దిగ్ధై ర్నాగ్నిజ్వలిత తేజనైః' మను—౭-౯౦

లోపల కత్తియుండి పైకిఁ గఱ్ఱవలెఁ గానవచ్చు నాయుధములతోఁ గాని, కర్ణి యాకారము గల బాణములచేఁ గాని విషము పూసిన యాయుధములతోఁ గాని నిప్పులోఁ గాల్చి వేఁడిచేసిన బాణములచేఁ గాని యుద్ధమందు శత్రువును గొట్టరాదు. ఇట్లు మనుస్మృతి చెప్పుచుండ లక్ష్మణుఁడు కర్ణి బాణములు ప్రయోగింప వచ్చునా ?

సమాధానము :—శత్రువులను గొట్టి చంపుటయందు వాని నుపయోగింప రాదని స్మృతి చెప్పుచున్నది. లక్ష్మణుఁడు శత్రువు వేసిన బాణములు తన్నుఁ దగులకుండఁ దప్పించుకొనుటకై వానిని ఖండించెను గాని రావణుని వానితోఁ గొట్టలేదు.

తాత్పర్యము

లక్ష్మణుఁడు వేసిన వాఁడిబాణముచేఁ దన బాణములు తునుకలు తునుకలై కుబుసము విడిచిన పామువలె నేలఁబడుటచూచి కన్ను లెఱ్ఱచేసి రావణుఁడు మఱియు శ్రేష్ఠములైన బాణసమూహములను లక్ష్మణునిపై దండిగాఁ గురియించెను. లక్ష్మణుఁడును ఆ బాణములను కర్ణికలచేతను బల్లెములు, మంగలికత్తులు పోలిన బాణముల చేతను అర్ధచంద్రబాణముల చేతను అన్నిటిని వచ్చుట వచ్చుటనే విల్లువెడలి రాఁగానే ఖండించి కలఁకలిలేక నిలిచెను. ఈ ప్రకారము దా నెన్ని శరములు వేసినను అన్నిటిని వ్యర్థములుగఁ జేయు లక్ష్మణుని బలము చూచి.

ఉ. అబ్బుర మంది యయ్యసఘు◆హస్తలఘుత్వపటుత్వలక్ష్మికిన్
బొబ్బన వెండియుం గురిసె ◆ ఘోరశరంబుల వాని నెల్ల బె
న్నిబ్బరమూని లక్ష్మణుఁడు ◆ నేలను గూలఁగ నేసి వీని పై
న్గబ్బితనం బడంచి వడిఁ ◆ గాలునిఁ గూర్చెద నంచు నెంచుచున్. ౧౩౦౧

అర్థములు. అబ్బురము=ఆశ్చర్యము, అపూర్వశబ్దభవము, హస్తలఘుత్వపటుత్వ లక్ష్మికిన్=చేతిలాఘవ సంపత్తికి, బలసంపత్తికి, గబ్బితనంబు=గర్వము, పెను+నిబ్బరము = పెన్నిబ్బరము, మిక్కిలి మనోదార్ఢ్యము, నిర్భర శబ్దభవము నిబ్బరము.

తాత్పర్యము

ఆ పుణ్యాత్ముని చేతి లాఘవము క్రమముగాఁ దగ్గక యతిశయించు చుండుటకు నాశ్చర్యపడి యాలస్యము చేయక మఱియును భయంకరములైన బాణములను

గురిసెను. లక్ష్మణుఁడు మనోదార్ఢ్యము యొక్క యతిశయము గలవాఁడై వాని నెల్లను నేలఁబడఁగొట్టి వీని గర్వము నణఁచి వీనిని వధించెద నని యాలోచించుచు.

శా. దంభోళి ప్రతిమానదండనిభ శాత ♦ క్రూర బాణాళి సం
రంభం బొప్పఁగ వింటఁగూర్చి హుత భు ♦ గ్రశ్మిచ్ఛటల్ గ్రక్కు త
చ్ఛుంభ ద్వేగితతిన్ నిగిడ్చె నల ర ♦ క్షోనాథు పై దర్పవి
స్రంభుం డాతఁడు వానిఁ ద్రుంచి మఱి వి ♦ శ్వస్రష్టృ దత్తంబులన్. ౧౩౦౨

అర్థములు. దంభోళిప్రతిమాన=వజ్రాయుధముతో సమానమైన, దండనిభ = యమదండము పోలిన, శాత = పదునైన, క్రూర, బాణాళి = బాణ పంక్తిని, హుతభుక్ = అగ్నియొక్క, రశ్మిచ్ఛటల్ = జ్వాలల సమూహములు, తత్ = ఆ, శుంభత్ = ప్రకాశించు, వేగితతిన్ = వేగముగల బాణముల సమూహములను, దర్ప విస్రంభుండు = నమ్మకమైన దర్పము గలవాఁడు, విశ్వ స్రష్టృదత్తంబులన్=బ్రహ్మయిచ్చినవానిని, పై పద్యముతో నన్వయము.

తాత్పర్యము

వాఁడిమియందు వజ్రాయుధముతోను క్రౌర్యమందు యమదండముతోను సమానమైన బాణపంక్తిని వేగముగ వింటఁగూర్చి యగ్నిమంటలు వెలువరించు చున్న యా శీఘ్రగమనము గల బాణములను రావణునిపైఁ బ్రయోగించెను. తన బలగర్వమునందు నమ్మకముగలవాఁడు వానినిఁ ద్రుంచి మఱియును బ్రహ్మయిచ్చిన,

శా. కల్పోపర్బుధతుల్యకాంతి శరపుం ♦ గంబుల్ లలాటస్థలిన్
గొల్పెన్ గాఢముగా సుమిత్రసుతుఁడుం ♦ గ్రూరాస్త్రసంతానజా
తాల్పావ్యవ్యథ సంచలించి శిథిలం ♦ బౌ చాపముం బట్టి పె
న్మెల్పారం బ్రతిలబ్ధసంజ్ఞుఁ డయి ఖం ♦ డించెం దదిష్వాసమున్. ౧౩౦౩

అర్థములు. కల్ప = ప్రలయకాలమందలి, ఉపర్బుధ = అగ్నిహోత్ర ముతో, 'బర్హిశ్శుష్మా కృష్ణవర్త్మా శోచిష్కేశ ఉపర్బుధః' అని యమరము. తుల్య = సమానమైన, కాంతి = ప్రకాశము గల, శరపుంగంబులన్ = బాణ సమూహములను, లలాటస్థలిన్=నొసట, కొల్పెన్ = నాటనేసెను, క్రూరాస్త్ర సంతానజాత = క్రూరాస్త్ర సమూహమువలనఁ గలిగిన, అల్పావ్యవ్యథ=గొప్ప బాధచే, సంచలించి=వణఁకి, శిథిలంబు=జాఱిపోవుచున్న, పెన్మెల్పారన్=మిక్కిలి హెచ్చరికతో - ప్రతిలబ్ధ సంజ్ఞుఁడయి=తెలివినొందినవాఁడై, తత్=ఆరావణుని, ఇష్వాసమున్=వింటిని, ఖండించెన్=నఱకెను.

తాత్పర్యము

ప్రలయకాలాగ్నితో సమానమైన కాంతిగల బాణసమూహములను నొసట దృఢముగా నాటునట్లు వేసెను. లక్ష్మణుఁడా క్రూర బాణసమూహమువలనఁగలిగిన

విశేష బాధచే వణఁకి జాఱిపోవు వింటిని హెచ్చరికతోఁ బట్టుకొని స్మృతి తెచ్చుకొని వానివింటిని ఖండించెను.

శా. తుండెల్ చేసి నిరంకుశత్వరను దై♦త్యున్ మూఁడు బాణంబులన్
గుండెల్ వ్రయ్యఁగ నాటఁగా నతఁడు గ♦ద్గో లొంది తబ్బిబ్బునై
ఖండీభూతశరాసనుండు భృశర♦క్తక్లిన్న గాత్రుండు మే
దోండవ్యాప్తతనుం డసంజ్ఞఁ డయి కృచ్ఛ్రాప్తస్మృతిం దెంపునన్. ౧౩౦౪

అర్థములు. నిరంకుశత్వరను=అడ్డములేని వేగముచే, గద్గోలొంది = కలవరపడి, ఖండీభూత శరాసనుండు = తునకలుగాఁ జేయఁబడిన విల్లుగలవాఁడు, భృశరక్తక్లిన్న గాత్రుఁడు = విశేషముగ నెత్తుటఁ దడిసిన దేహము గలవాఁడు, మేదస్+అండ=మాంసపు ముద్దచే, వ్యాప్తతనుండు = వ్యాపింపఁబడిన దేహము గలవాఁడు, అసంజ్ఞుఁడయి=స్మృతి తప్పినవాఁడై, కృచ్ఛ్రాప్తస్మృతిన్=కష్టము మీఁద పొందఁబడిన స్మృతిగలవాఁడై, తెంపునన్ = సాహసముచే, 'మేద వపా వసా' అమరము. హృదయమందుండు మాంసమునకు మేదస్సని పేరు.

తాత్పర్యము

ఇట్లు తుంటలుగాఁజేసి యడ్డములేని త్వరనువాఁడు మరల విల్లెత్తుకొననీయకుండునంత వేగముగ రావణుని మూఁడు బాణములచే గుండెలు పగులునట్లు నాటఁగా వాఁడు దిగ్భ్రమచెంది తబ్బిబ్బై విల్లువిఱిగినవాఁడు విశేషముగ నెత్తుటఁ దడిసినవాఁడు గుండెలలోని మాంసపుముద్దలచేత వ్యాపింపఁబడిన దేహముగలవాఁడై స్మృతి తప్పి యతికష్టముపైన మరల స్మృతి తెచ్చుకొని సాహసించి వేఱొక విల్లెత్తి యెక్కుపెట్టు లోపలఁ జంపునని భయపడి.

ఉ. తోయజగర్భుఁ డిచ్చిన వి♦ధూమ కృశానునిభం బమోఘ మ
త్యాయతశక్తి శక్తి యను ♦ నాయుధముం గపికోటి బెగ్గిలన్
జే యని వీచి వైవఁ గని ♦ నిష్ఠురవహ్నిసదృక్శరంబులన్
దాయక యుండఁ గొట్టెను ♦ దాఱక యయ్యెది భీమనాకృతిన్. ౧౩౦౫

అర్థములు. తోయజగర్భుఁడు=బ్రహ్మ, విధూమ = పొగలేని, కృశానునిభంబు = అగ్నితో సమానము, అమోఘము = వ్యర్థము పోనిది, అత్యాయత శక్తి=మిక్కిలి విస్తారమైన శక్తిగలది యగు, బెగ్గిలన్ = భయపడఁగా, నిష్ఠుర = కఠినములైన, వహ్నిసదృక్=అగ్నితో సమానమైన, శరంబులన్=బాణములను, దాయక యుండన్=సమీపమున కది రాకుండునట్లు, తాఱక = నిలువక, భీమనాకృతిన్ = భయంకరాకారముతో.

తాత్పర్యము

బ్రహ్మదేవుఁ డిచ్చిన పొగలేని యగ్ని సమానమైనదియు, వ్యర్థము పోనిదియు, మిగుల విస్తారమైన శక్తిగలదియు నగుశక్తి యను నాయుధమును క్రోఁతులు

భయపడుచుండఁగా జేయని విసరివైవఁగా జూచి లక్ష్మణుఁడు కఠినములైన యగ్ని సమానములైన బాణములచే నది దగ్గఱకు రాకుండఁ గొట్టెనుగాని యది యమోఘమైనది కావున నిలువక భయంకరముగా.

—♦ మూర్ఛిల్లిన లక్ష్మణు రావణుఁ డెత్తఁ బ్రయత్నించుట. ♦—

చ. సరభసవృత్తి వచ్చి సువి♦శాలభుజాంతర సీమ నాటినన్
గురుతరశక్తి శాలి రఘు♦కుంజరుఁ డుజ్జ్వలగాత్రుఁడై ధరం
దొరఁగెను సొమ్మసిల్లుచును ♦ దూర్ణమ వింశతిబాహుఁ డా మహా
పురుషుని నెత్తికొం చరుగ ♦ బుద్ధిఁ దలంచి కరాళి నెత్తఁగన్. ౧౩౦౬

అర్థములు. సరభసవృత్తిన్ = త్వరతోఁ గూడిన వ్యాపారముతో, సువిశాల = మిక్కిలి వెడల్పుగల, భుజాంతరసీమ = ఱొమ్మునందు, గురుతరశక్తిశాలి = మిక్కిలి గొప్ప శక్తిగలవాఁడు, దీనివలన బ్రహ్మయిచ్చిన శక్తికంటె లక్ష్మణుశక్తి మిగుల గొప్పదని భావము. అట్టులుండి యేల పడెననిన బ్రహ్మను గౌరవించుటకే యని తెలియునది. ఇది ముందు స్పష్టపడును. ఉజ్జ్వలగాత్రుఁడై = ప్రకాశించు దేహము గలవాఁడై, చావుదెబ్బ తగిలినపుడు దేహము కాంతి విహీనము గావలయునుగాని ప్రకాశింపదు. ఇట్లు ప్రకాశించుటకు హేతువు వైష్ణవ తేజము విశేషముగ నావహించుటయే యని యెఱుఁగవగు. సొమ్మసిల్లుచును = మూర్ఛపోయినట్లు, దొరఁగెను = వ్రాలెను, తూర్ణమ = శీఘ్రముగ, వింశతిబాహుఁడు=ఇరువదిచేతులు గలవాఁడు, ఇట్లు చెప్పుటచే నిపుడు వాఁ డిరువది చేతులతో నుండెనని సూచన, కరాళిన్ = చేతుల సమూహముతో.

తాత్పర్యము

శీఘ్రముగ వచ్చి మిగుల వెడల్పయిన ఱొమ్మున నాటఁగా మిగుల గొప్ప శక్తిగల లక్ష్మణుఁడు ప్రకాశించు శరీరముగలవాఁడై సొమ్మసిల్లినట్లు నేల వ్రాలెను. అదిచూచి రావణుఁడు ఆ మహాపురుషుని నెత్తికొనిపోవ నిరువదిచేతుల నెత్తఁగా దలఁచి.

రావణుని యీ ప్రయత్నమున కుద్దేశ్యమేమి ?

(౧) ఇంద్రజిత్తు నాగపాశముల బంధించి చంపినపుడు మరల బ్రదికి లేచిరి. ఇప్పు డూరక విడిచిన లక్ష్మణుఁడు మరల లేచునేమో ? కావున సముద్రములో నిప్పుడే మూర్ఛనుండఁగనే పాఱవేయవలయునని యొక యుద్దేశ్యము. అట్లు చేసిన రాముఁడు సహాయహీనుఁడై యుద్ధము చాలించుకొనునని యతని తలంపు.

(౨) లంకకెత్తుకొనిపోయి చెఱయం దుంచి యొకవేళ బ్రదికినను మరల రానీయక కట్టివేసి రామునకుఁ దెలిపిన లక్ష్మణుని విడిపించుకొనుటకై సీతను వదలుకొనెదను, లక్ష్మణు విడిపింపుమని రాముఁడు సంధికై రావచ్చునని కాని, నీవు సంధికి వచ్చెదవా లక్ష్మణుని జంపుదునాయని రాముని బెదరింపవచ్చునని కాని యుద్దేశ్యము.

ఉ. మానితశక్తి మేరువును • మందరముం దుహినాచలంబు ద్యో
యానచరాన్వితం బగు స•మస్తజగంబును గేల నెత్త నౌ
దానవభర్త యాభరతు • తమ్ముఁ గదల్పఁగ నేరఁ డయ్యె బల్
పూనికఁ బంగటించి పెక • వ్రుల్విగియించియు నీలకర్చియున్. ౧౩౦౭

అర్థములు. మానితశక్తిన్ = గౌరవింపఁ బడిన బలముచే, తుహినాచలంబు=హిమవత్పర్వతము. ద్యోయానచరాన్వితంబు = దేవతలతోఁ గూడినది యగు, ఎత్తనౌ=ఎత్తఁగాఁగల, భరతు తమ్మున్ = భరతుని తమ్ముని, కదలింప లేనివాఁడు భరతుని యన్ననేమి జయింపఁ గలఁడు, రావణున కీమాత్రమైనఁ దోఁచినదికాదు. పంగటించి=కాళ్ళడమెడముగా నుంచి, ఈలకర్చియున్=ప్రాణములు బిగపట్టియు, మేరువును = సర్వపర్వతములలో శ్రేష్ఠమైన మేరుపర్వతమునైనను రావణుఁ డెత్తఁగలఁడు, రావణున కోడిపోయి యూడిగముచేయు వాయు దేవుఁడు మేరువు నోడించి దానిశిఖరము దెచ్చి పాఱవేయఁగా నదికదా లంక యయ్యెను. ఇఁక రావణుఁడు మేరు నెత్తుట యసాధ్యముకాదు. మందరమెత్తుటయు నసాధ్యముకాదు. రావణున కోడిపోయిన దేవతలే మందర మెత్తినపుడు దానిని రావణుఁ డెత్తుట యసాధ్యకార్యముగాదు. హిమవంతమును రావణుఁ డెత్తుట యసాధ్యకార్యము గాదు. ఏలన:— ధైర్యేణ హిమవా నివ' యని కదలకుండు వానిలో గొప్పదగు హిమవత్పర్వతమును నెత్తఁగలఁడు. శివుఁ డుండు కైలాసము. హిమవంతములోనిదే కదా. దానిని సమూలముగా నెత్తి కదిలించిన వాఁడు హిమవంతము నెత్తలేఁడా ? సమస్త జగంబును = పూర్వము హిరణ్యాక్షుఁడు భూమినంతయుఁ బ్రాణికోట్లతో నెత్తికొనిపోలేదా ? వాఁడేకదా వీఁడు ! ద్యోయానచరులు=దేవతలందఱు రావణు కోడుకొనకు నోడిపోయిన వారేకదా ! కావున సమస్త భూమినెత్తుటయు నసాధ్యముకాదు. ఎట్లెత్తుట? కేలన్ = ఒకచేత. ఇంతయు నొకచేతితో నెత్తఁగలవాఁడు, దానవభర్త = దుష్టరాక్షసులకు వీఁడు భర్తయైన కారణముచేతనే లక్ష్మణు నెత్తఁజాలఁ డయ్యెను. భరతు తమ్ముని = రాముని తమ్ముని తమ్ముని కదల్పఁగ, ఎత్తుటకుఁగాదు, కదలించుటకైనను నేరఁ డయ్యెను. ఇఁక నెత్తుట యెక్కడిది? మోసికొనిపోవుట యెక్కడిది?

వగలఱ కప్రకంప్యుఁడని చెప్పఁబడుటచే రావణుఁడు లక్ష్మణుని గదలింప లేకుండుట చూచి మఱికొందరు రాక్షసులుకూడ వానికి సహాయపడిరని తెలియ నగు. ఇందఱు కదలించినను లక్ష్మణుఁడు కదలిన వాఁడు కాఁడు.

మేరుమందరహిమవంతములతోడి సమస్త ప్రపంచమునకన్న మూర్ఛపోయిన లక్ష్మణుఁడు భార మయ్యెనని భావము.

ప్రతిక్రియచేయక, స్వాధీనత చెడినట్లున్న లక్ష్మణు నొకనిని రావణుఁడు కదలింప నేరఁడయ్యెఁగదా ! మేలుకనియున్న రాముని లక్ష్మణునికూడ విరాధుఁ

డెత్తుకొని పోఁగలిగెను? అది వారై యంగీకరించిన కార్యము. హనుమంతుఁడు రామలక్ష్మణుల నిరువుర నెత్తికొని సుగ్రీవునొద్దకుఁ బోలేదా? రావణుఁడు సీతాదేవి నెత్తికొని పోఁగలుగుటకు నామె విరుద్ధభావము సూచింపక వానికొంప ధ్వంసముచేయ లంకకుఁబోవ సమ్మతించుట చేతనే యని యెఱుఁగవలె.

తాత్పర్యము

గౌరవింపదగిన శక్తిచే మేరువును మందరమును హిమవంతమును దేవతలతోడి ప్రపంచము నొకచేత నెత్తఁగలవాఁడు రాక్షసరాజా భరతుని తమ్ముని దృఢప్రయత్నముచేసి కాఁకృ వంగవాఁచి పెదవులు బిగించి ప్రాణములు బిగఁబట్టినను గదలించుటకును సమర్థుఁడు కాఁడయ్యె.

లక్ష్మణుఁ డింత భారమగుటకుఁ గారణ మేమన.

ఆ. వనజభవునిశక్తి • వక్షంబు నాటంగ, నిట్టి దట్టి దనుచు • నెన్నరాని
విబుధవినుత మైన•విష్ణ్వంశభూతమౌ, స్వస్వరూప మతఁడు•సంస్మరించె. ౧౨౦౦

అర్థములు. వనజభవునిశక్తి = బ్రహ్మశక్తి, విబుధవినుతము = దేవతలచే స్తోత్రము చేయఁబడినది, విష్ణ్వంశభూతము=విష్ణువున భాగమైన, స్వస్వరూపము=తనస్వరూపము, సంస్మరించె=తలఁచెను.

బ్రహ్మశక్తి యమోఘమని చెప్పఁబడెనే, ఇప్పుడది వ్యర్థమైనట్లేకదా, యనిన నమోఘమైన వజ్రాయుధమును నగౌరవింప రాదని గరుత్మంతుఁడు తన యీఁకనొకటి వీనికి యిచ్చి గౌరవించి పంపినట్లు లమోఘమైన బ్రహ్మశక్తిని లక్ష్మణుఁడు మూర్ఛ నటించి గౌరవించెను. వనజభవుని శక్తి యిట్టిదట్టి దనుచుఁ జెప్ప సాధ్యమైనది. నీలవ నతఁడు ప్రాకృత మండలములోఁ జేరినవాఁడు, బ్రహ్మ కమలమందుఁ బుట్టినవాఁడు. (వనజభవుఁడుకదా). ఆకమలము నీళ్ళయందుఁ బుట్టినది. ఆనీటికయన మైనవాఁడు. దానిని దొలుత సృజించినవాఁడు (అపఏవ ససర్జాదౌ) నారాయణుఁడు. అట్టివాని యంశము లక్ష్మణుఁడు. ఇట్టి వానిని బ్రహ్మశక్తి యేమి చేయఁగలదు? విష్ణుశక్తి యిట్టిదని బ్రహ్మకే తెలియ సాధ్యము కానపుడు తక్కిన వారిమాట యేల? ఇట్టి దట్టి దనుచు నెన్నరాని యనుటచే దాని లక్షణము నెఱుఁగ బ్రహ్మాదులకు సాధ్యముగాదు. అయినను వారు చేయఁగల దేమన, విబుధవినుతము. ఆయన చేసిన కార్యములు స్తోత్రము చేయఁగలరు. అంత కెక్కువ వారికిని దెలియదు. ఒకఁ డొక కోటిరూకలు దానము చేసినపుడు దానిని బ్రశంసింప వచ్చునే కాని వానియొద్ద నట్టివెన్ని యున్నవో యెవ్వఁడెఱుఁగును?

స్మరించె ననిన—మఱచిన దానిని జ్ఞప్తికిఁ దెచ్చుకొనుట స్మరించుట. ఇది స్మరించుట కాదు. సంస్మరించుట. విస్మరణ మెన్నఁడు లేదు. సమ్మను నుపసర్గ స్మరణమందున్న దానినే విశేషముగ స్మరించెనని తెలుపుచున్నది. ఇట్లు లవతారమూర్తిత్వము చెప్పఁబడెను. స్మరణమందున్న దానిని మరల స్మరించుటయేమి?

భగవంతుఁ డంతర్యామిగా నన్ని పదార్థములు దున్నను బ్రహ్మాదులందుఁ దన తేజస్సును విశేషముగఁ బ్రవేశ పెట్టినట్లు పదార్థములం దన్నిట వేఁడిమి (యగ్ని యున్నను సూర్యచంద్రాగ్నులందు విశేషించి యున్నట్లు) ఇతర వేళల లక్ష్మణుని మనస్సు ఇతర కార్యములందును వర్తించుచుండెను. ఇప్పు డట్లు కాక స్వస్వరూప చింతయందే యుండెననుట. దాని వలనఁ గొత్తగా వచ్చినది యేదియు లేదు.

ఓయి! యిచ్చట 'సోహమ్' నేనే యతఁడని స్మరించెనని యేల చెప్పరా దనిన సోహ మనుటకు నది ముఖ్యార్థమునఁ గాదు. అది యెట్లులుండినను ఇచ్చట విష్ణ్వంశభూతము స్వస్వరూపమని చెప్పఁబడెను గాని విష్ణువగు స్వస్వరూపమని చెప్పఁబడ లేదు. కావున నా యర్థము పొసఁగదు. విష్ణ్వంశ మనఁగా విష్ణువున నొక భాగము. బాలకాండమున నవతారఘట్టము చూచునది. బాల. ౫౦౩ పద్యము లక్ష్మణుఁ డాది శేషుఁడు కదా!

ఓయి విష్ణుతేజము నిరవయవముగదా! దానియందు భాగము అంశ మెక్కడిది? సత్యము. ఇచ్చట నంశమనునది స్వరూపముచే భాగమని గ్రహింపరాదు. తారతమ్యము గుణావిర్భావ మందుచున్నది. పరవాసుదేవునందు నాఱుగుణములు సంపూర్ణముగ నున్నవి. తక్కిన ముగ్గురయందు రెండు రెండు పూర్ణముగాను దక్కినవి కొంచె కొంచెముగా నున్నవి. పూర్ణావతారములందు జ్ఞానబలములు పూర్ణముగా నుండును. తక్కినవి కొంత కొంత యుండును. కావున నంశమని చెప్పుదురు గాని స్వరూప విభాగమును బట్టి కాదు.

'ఆమోదే భువనే ప్రమోద ఉత సమ్మోదేచ సంకర్షణం
ప్రద్యుమ్నంచ తథానిరుద్ధ మపి తాన్ సంహారసృష్టిస్థితీః
కుర్వాణాన్ మతిముఖ్య షడ్గుణవరైర్యుక్తాం స్త్రియుగ్మాత్మకై
ర్వ్యూహాధిష్ఠిత వాసుదేవ మపి తం క్షీరాబ్ధినాథం భజే.
గుణైషడ్భిస్త్వేతైః ప్రథమతరమూర్తిస్తవ బభౌ
తతస్తిస్రస్తేషాం త్రియుగయుగళైర్హి త్రిభి రభూః
వ్యవస్థాయాం చైషాం నను వరద సావిష్కృతి వశాత్
భవాన్ సర్వత్రైవ త్వగణిత మహా మంగళగుణః.
అనునవి ప్రమాణములు.

కొందఱు లక్ష్మణుఁడు పూర్వమింత బరువులేఁడనియు, తన స్వస్వరూపము స్మరించుటచే నింత బరువయ్యె నందురు. కొందఱు తనకు వచ్చిన యాపద తీర్చుకొనుటకై విష్ణువును స్మరించెనందురు. కొందఱు ఇతఁడు విష్ణువు నంశమైనను తద్భావన యతనికి సదా యున్నచో మనుష్యభావన నడవనేరదనియు అది లేనిచో రావణ వధాదులు జరుగవనియుఁ గాఁబట్టి యతఁడు సదా మనుష్యభావనతో నుండెననియుఁ గొందఱందురు. వీనిలో నొక్కదానికైనను నిలువఁ గాళ్ళు లేవు. వీని కాధారమైన

శబ్దముగాని భావముగాని లేదు. అంతయు వారి వారి స్వకపోలకల్పితము లగు నూహలు కావున గ్రంథస్థవాక్యములే ప్రమాణములు.

రామలక్ష్మణులు మనుష్యు లను భావన రావణున కుండవలెను. గాని రామలక్ష్మణుల కుండవలసిన పనిలేదు. కావున వాని కాతత్త్వము తెలియరాకుండ నటించిరి. నాటక ప్రదర్శన మందు వలెనని యెఱుంగునది. రసానుభవము సభ్యులకే కాని పాత్రములకుఁగాదు. లక్ష్మణుఁడే రామచంద్రమూర్తితో 'కిమాత్మానం మహాత్మాన మాత్మానం నావబుధ్యసే' యని రెండుమార్లు చెప్పెను. ఇది స్వరూప విస్మృతి గలవాఁడు చెప్పెడి మాటలా ?

తాత్పర్యము

బ్రహ్మశక్తి తన వక్షమున నాటఁగ నింతమాత్రమైనది అట్టి విధమైనదని చెప్పసాధ్యము కానిదియు దేవతలచే స్తోత్రము చేయఁబడినదియు విష్ణువున భాగమైనదియు నగు తన స్వరూపమును లక్ష్మణుఁడు సంస్మరించెను.

ఉ. మానక వైష్ణవాంశ మటు॰మానుష దేహ సమాస్థితంబుగా
దానవదర్పనాశకు న॰దారబలాఢ్యు సుమిత్ర పట్టి న
ద్దానవనాయకుండు భుజ॰దండములన్ బిగఁబట్టియున్ రవం
తేనియు నెత్తఁజాలక క॰హీం బెనఁగాడుచు నుండె నింతలోన్. ౧౩౯

అర్థములు. మానక = వదలక, వైష్ణవాంశమనుటచే, ఈశబ్దము వైష్ణవాంశము లక్ష్మణునం దిదివఱకు లేక యిప్పుడు వచ్చినది కాదనియు సర్వావస్థల సర్వకాలముల విడువక యుండునదే యనియుఁ దెలుపుచున్నది.

మానుష దేహ సమాస్థితంబుగాన్ = మనుష్య దేహమువంటి దేహమునం దుండుటచే. గజయాన యన్నపుడు గజగమనమువంటి గమనము గలదని భావమే కాని యేనుఁగువలె నాలుగు కాళ్ళ నడుచునది యని యర్థము కాదు. ఇక్కడ నట్లులే మనుష్యాకారసమానాకార మని గ్రహింపవలయును. అటుగాక మనుష్య దేహమందు వైష్ణవాంశము ప్రవేశించెననిన నది పరశురామాద్యవతారములవలె ఆవేశావతారము లగును గాని పూర్ణావతారము గానేరదు. రామావతారము పూర్ణావతారమని రామాయణమందే కాక యితర ప్రమాణములందును గలదు.

సర్వవ్యాపకుఁడైన భగవంతుఁడు తానొక యవతార మెత్తవలయు ననిన నొక శరీరములో నున్న జీవునిపైఁ దన సర్వశక్తిత్వముచేఁ దన గుణావిర్భావమును గావించి యతఁడు భగవదవతారముగాఁ గనఁబడఁ జేయును. ఆయవతార ప్రయోజనము నెఱవేఱిన పిమ్మట దానియందలి భగవద్గుణావిర్భావము తొలఁగును. అర్జున పరశురామాదులందువలె. ఇది ఇనుపగుండు నిప్పులో వేసినఁ దత్కాలమున నిప్పువలెఁ బనిచేయునట్లు దీనినే యావేశావతారమందురు.

ఇట్లుగాక యింకొక యవతారము గలదు. భగవంతుఁ డీలోకమున మనుష్య

రూపమున నవతరింపఁ దలఁచుకొననేని యప్రాకృతమైన పంచోపనిషత్తులను వస్తువులను బ్రకృతి మండలము లోనికి రప్పించి దానిచే మనుష్యులవంటి యాకార మేర్పఱచి యందుఁ దాను బూర్వమే వ్యాపించియున్నను నాశరీరమూలకముగాఁ దన గుణంబుల నన్నిటినో కొన్నిటినో యావిర్భవింపఁజేయును. ఇందు జీవునిపై గుణవ్యాప్తిలేదు. ప్రాకృత శరీరములందే జీవునిపై గుణావిర్భావము. పూర్ణావతారములందు శరీరాకారము మనుష్యాద్యాకారములవలెనుండును. గాన మనుష్యాద్యవతారము లందుము. ఈరామావతార మిట్టిది. ఈ శరీరములకు పంచోపనిషన్మయశరీరము లని పేరు. దానవ దర్పనాశకున్ = రాక్షసుల గర్వము నాశము చేయువానిని, ఉదార బలాఢ్యున్=గొప్పబల సంపత్తి గలవానిని, సుమిత్ర పట్టి= సుమిత్రబిడ్డఁ డని పేరొందిన వానిని, భుజదండములన్ = ఇరువదిచేతులతోను.

తాత్పర్యము

ఏ వేళల నే దశల వదలక వైష్ణవాంశమైన తేజస్సు మనుష్య సమానాకారము నందుండుటచే రాక్షసగర్వనాశకుఁడును, గొప్ప బల సంపత్తి గలవాఁడునగు లక్ష్మణుని రాక్షసరాజు ఇరువదిచేతుల బిగఁబట్టియు నెకొంచెమైనను నెత్తఁజాలక ప్రతిష్ఠకై యవమానము వచ్చునేయని విడిచి పోలేక పెనఁగాడుచు నుండెను. ఇంతలో.

**-• హనుమంతుఁడు రావణుఁదన్ని లక్ష్మణు నెత్తికొని శ్రీరామునొద్దకుఁ బోవుట •-**

ఉ. ఘరువున వచ్చి వాయుజుఁడు • వజ్రనిభం బగుముష్టి బొమ్మునం
బురుతరశక్తి గ్రుద్దుటయు • మోములఁ గన్నుల వీనులందు నె
త్తురు లురలంగ దిక్కుదియుఁ • దోపక చేష్టలు దక్కి పోలి తా
నరదములోనఁ గూలఁబడి • నైనను గానఁడు పూర్వ సుస్థితిన్. ౧౧౬

అర్థములు. వజ్రనిభంబు = వజ్రాయుధముతో సమానమైన, ముష్టిన్ = పిడికిట, పురుతరశక్తిన్=మిగుల గొప్పదగు శక్తిచే, మోములన్=ముఖములందు పదిముఖములందలి భావము. వీనులందున్=చెవులందు, ఉరలంగన్ = బయలు వెడలఁగ, అరదములోనఁ గూలఁబడి యనుటచే హనుమంతునిఁ జూడఁగానే రథ మెక్కఁబోయెనని సూచన, పూర్వసుస్థితిన్=మునుపుండిన స్వస్థావస్థను, తేరిలోఁ గూలఁబడి నాఁడనుటచేఁ దే రెక్కు సమయంబున గ్రుద్దినాఁడనియు నా దెబ్బదిని తేరిలోఁ బడిపోయినాఁడే కాని కూర్చుండుటకు శక్తిలేనివాఁడయ్యె నని భావము.

తాత్పర్యము

హనుమంతుఁడు ఘరువెత్తుచు వచ్చి వజ్రముతో సమానమైన పిడికిటఁ దన శక్తికొలఁది బొమ్ముపై గ్రుద్దఁగా (దీనివలన వంగి లక్ష్మణుఁ గదలించుచున్న రావణుఁడు హనుమంతుని రాక చూచి నిలఁబడి తేరెక్కఁబోయెనని సూచన) నిరువది నోళ్ళఁ గన్నులఁ, జెవుల నెత్తురు బయలు వెడలఁగా దిక్కుదెలియక కాళ్లు చేతులు

కదలించుట మాని మూర్ఛపోయి తన రథములోఁ గూలఁబడినను మునుపటి స్వస్థావస్థ చెందినవాఁడు కాఁడు. హనుమంతుఁ డప్పటి కసి యిప్పుడు తీర్చుకొనెను.

ఆ. అతుల శౌర్యధుర్యు • నరసాపు వచ్చిన, పంక్తివదనుఁ జూచి • ప్లవగతతులు
ఋషులు వాసవాది•ఋభువితానంబులు, నెలమిఁ బొంగి కేక•లిడిరి యంత.

అర్థములు. అరసాపు వచ్చిన=మూర్ఛపోయిన, వాసవాది = ఇంద్రుఁడు మొదలుగాఁగల, ఋభువితానంబులు = దేవతా సమూహములు, ఎలమిన్ = సంతోషముచే.

తాత్పర్యము

అసమానమైన శౌర్యాతిశయము గలిగి మూర్ఛపోయి పడిన దశకంఠుని జూచి వానరులు ఋషులు ఇంద్రుఁడు మొదలగు దేవతలు సంతోషముచే నుప్పొంగి కేకలు వేసిరి. ఆ పిమ్మట.

తే. రావణశరార్దితుని సుమి•త్రాతనూజు, ననఘతేజస్వియైన వా•తాత్మజుండు
బాహువుల నెత్తికొనిచని • స్నేహగరిమ, రామచంద్రుని యంతిక•సీమ నిలిపె.

అర్థములు. రావణశరార్దితుని = రావణు బాణముచేఁ బీడింపఁబడిన వానిని, అనఘ తేజస్వి=పాపరహితమైన తేజస్సుగలవాఁడు, దీనివలన రావణుఁడు పాపపుఁదేజస్సు గలవాఁడని సూచన, స్నేహగరిమన్ = స్నేహాతిశయముచే, అంతికసీమన్ = సమీపప్రదేశమందు.

తాత్పర్యము

రావణు బాణముచేఁ బీడింపఁబడిన లక్ష్మణుని పాపసంపర్కము లేక తేజస్సు గల హనుమంతుఁడు స్నేహాతిశయముచే దన చేతుల నెత్తికొనిపోయి రామునొద్ద నుంచెను.

తే. పవనతనయుండు సుహృదుండు•పరమభక్తి, గలుగువాఁడును నగుట
ల•క్ష్మణుఁడు పగఱ
కప్రకంప్యుండు నయ్యు వ•నాటునకును, దేలికగ నయ్యె నంత నా•కీరవర్య.

అర్థములు. సుహృదుండు=హితముఁగోరి హితముచేయువాఁడు, అంతేకాదు. పరమభక్తిగలుగువాఁడు=విశేషభక్తిగలుగువాఁడు, అవకాలమం దెవ్వఁడైన క్రొత్తవాఁడైనను హితము చేయవచ్చును. అది తాత్కాలికప్రీతి. ఇది యట్టిది కాదు. పరమభక్తి...'పరానురక్తిరీశ్వరే' 'సా పరమప్రేమరూపా' 'స్నేహపూర్వమనుధ్యానం భక్తిరిత్యభిధీయతే' యన్నట్లు నిరంతరమైన పరమానురాగము. అదియు నీశ్వరబుద్ధితో. పగఱ = శత్రువులకు, పగవారు = పగఱు, ఇది బహువచనరూపము. ఇట్లు చెప్పుటచే రావణునకు లక్ష్మణు నెత్తుటయందు మఱికొందఱు తోడుపడిరని సూచన. వనాటునకును=అడవియందుఁ దిరుగువానికిని, ఇట్లు చెప్పుటచే భగవత్ప్రీతికి భక్తియే కారణమనియు జాతి, ధనైశ్వర్యాదులు కావనియు

భావము, తేలికగ నయ్యెన్=వాస్తవముగ స్మృతి తప్పిపడిన వాఁడొకనికిఁ దేలికగను మఱియొకనికి భారముగను దానుగనగు శక్తి, తెలివి, కలవాఁడు కాఁజాలఁడు కావున నిది మూర్ఛానటనమెకాని నిజమైన మూర్ఛకాదు. బ్రహ్మశక్తి నగౌరవింపరాదు గావున దానిని సమ్మానింప నాగపాశబంధములందు వలె నీ మూర్ఛ మాయామనుష్యనటనమే. అప్రకంప్యుఁడు = కదలింపరాని వాఁడు, ధీరవర్యున్=ధైర్యము గలవారిలో శ్రేష్ఠుని, ఇట్లు లక్ష్మణుఁడు భక్తునకుఁ దేలికయగుట విరోధికి బరువగుట చెప్పుటచే నాయన కాయవస్థయందును జ్ఞానబలములను నేకొంతయుఁ గలుగ లేదనుట స్పష్టము. ఇచ్చట సంపూర్ణజ్ఞాన బలములు చెప్పుటచే స్థలాంతరములందు రామలక్ష్మణులు నజ్ఞానులవలెను దుర్బలులవలె వర్తించిరనుట నటనమనియు మనుష్యభావనానిర్వాహార్థ మనియు నెఱుంగనగును.

తాత్పర్యము

హనుమంతుఁడు హితము కోరువాఁడును బరమభక్తి కలవాఁడు కావున లక్ష్మణుఁడు శత్రువులకుఁ గదలింపరాని వాఁడైనను భక్తి గలవానికి నడవియందు దిరుగు క్రోఁతికి తేలికగా నయ్యెను.

కం. దుర్జయుఁ డగు లక్ష్మణుని వి,సర్జించి విధాతృశక్తి • చయ్యనఁ జనియెన్
• నిర్జరకంటకు చేరికి, వర్జితశల్యుండు తేఱి • బడలిక దీఱన్. ౧౨౨

అర్థములు. దుర్జయుఁడు = జయింపరానివాఁడు, ఇట్లనుటచే లక్ష్మణుని శక్తి తనశక్తికంటె మించిన దనియు నతనిని దానేమియుఁ జేయఁజాలనని యది తెలిసికొనెనని భావము, విసర్జించి = వదలి, విధాతృశక్తి = బ్రహ్మశక్తి, నిర్జర కంటకు = రావణుని యొక్క, వర్జిత శల్యుఁడు = వదలి పెట్టఁబడిన మేకు వంటి బాణము గలవాఁడు, తేఱి=మూర్ఛ విడిచి.

తాత్పర్యము

లక్ష్మణుఁడు తనకు జయింపరాని వాఁడని తెలిసికొని బ్రహ్మశర మతనిని వదలి రావణు చేరి మీఁదికిఁ బోయెను. బాణము వదలిపోఁగా లక్ష్మణుఁడు మూర్ఛ చాలించి లేచి తెప్పరిల్లుకొని బడలిక క్షయింపఁగా.

తే. మనములోపల స్మరియించు • కొనుచు నుండె, విష్ణు నవిచింత్య మైనట్టి • స్వీయభాగ
మంత సురవైరి తెప్పిఱి • యాశుగములఁ గార్ముకంబును ధరియించి • కడఁగెననికి.

తాత్పర్యము

లక్ష్మణుఁడు మనస్సులోఁ దన విష్ణుని యచింత్యమైన భాగమును స్మరించు చుండెను. ఇంతలో రావణుఁడు లేచి విల్లుబాణముల ధరించి యుద్ధమునకుఁ బ్రయత్నించెను.